# విజయవిహారం

డిసెంబరు 2001 | యువతరం మాసపత్రిక | రూ.15













ఉపాధి ప్రత్యామ్నాయాలు
హ్యూమరాలజీ
వ్యక్తిత్వ వికాసం
కంప్యూటర్ క్లాస్‌రూమ్
బంగ్లా హిందువుల రక్త కన్నీరు
ఆడవేషంలో కేడీ చీటర్








# పర్సనల్ బట్లర్

అస్సాం మాజీమంత్రి ఒకాయన మంత్రి పదవి పోయాక తన స్వంత ఊర్లో సెటిలైపోయారు.

ఒక రోజు ఆయన రోడ్డు మీద వెళ్తుంటే గౌహతిలో తాను మంత్రిగా ఉన్న రోజుల్లో తన గెస్ట్‌హౌస్‌లో పర్సనల్ బట్లర్‌గా పనిచేసిన వ్యక్తి కనిపించి, ఏదైనా ఉద్యోగం ఇప్పించమని వేడుకున్నాడు.

మాజీమంత్రిగారి మనసు కరిగి "సరే నువ్వు మళ్ళీ నా పర్సనల్ బట్లర్‌గా జాయినవ్వు. అప్పుడు ఆ రోజుల్లో ఏమేం పనులు చేసేవాడివో ఇప్పుడూ అదే డ్యూటీ చెయ్యి" అని అనుమతించారు. "రేపు ఉదయమే నా ఇంటికి వచ్చి సరిగ్గా 8 గంటలకి నన్ను నిద్రలేపడంతో నీ డ్యూటీ ప్రారంభమౌతుంది" అని అనుజ్ఞ ఇచ్చారు.

బట్లర్ సరిగ్గా 8 గంటలకి ముందే మాజీమంత్రి గారి ఇంటికి చేరుకున్నాడు. తిన్నగా ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి, మాజీమంత్రి గారిని తట్టి కుదిపి సరిగ్గా 8 గంటలకి ఆయన్ని నిద్రనించి మేలుకొలిపాడు.

ఆ తర్వాత మాజీమంత్రిగారి పక్కనే పడుకున్న ఆయన భార్యని ఈడ్చి చెంపమీద కొట్టి నిద్రలేపి "ఇక చాల్లే వెళ్ళు ముండా, నీ డబ్బులు 200 రు. ఆ డ్రాయర్ సొరుగులో ఉంటాయి తీసుకో" అని గద్దించాడు.

# జీవితకాలం





జార్జిబుష్‌కి దేవుడ్ని కలిసే అవకాశం వచ్చింది.

"దేవుడా బిన్‌లాడెన్ బందీ కావడాన్ని నేను నా కళ్ళారా ఎప్పుడు చూడగలను?" అని అడిగారు జార్జి బుష్.

"అది నీ జీవితకాలంలో ఎన్నటికీ చూడలేవు" అన్నాడు దేవుడు.

జార్జిబుష్ కళ్ళొత్తుకుంటూ వెళ్ళిపోయారు.

అనంతరం బిన్‌లాడెన్ దేవుణ్ణి కలిశాడు.

"దేవుడా అమెరికా నాశనం కావడాన్ని నా కళ్ళారా ఎప్పుడు చూడగలను?" అని లాడెన్ ప్రశ్నించాడు.

"అది నీ జీవితకాలంలో ఎన్నటికీ చూడలేవు" అని దేవుడు చెపితే బిన్‌లాడెన్ కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

అనంతరం ముషారఫ్ దేవుడ్ని కలిసి "దేవుడా, కాశ్మీర్ పాకిస్తాన్‌లో కలిసిపోవడం నా కళ్ళారా ఎపుడు చూడగలను?" అని ప్రశ్నించారు.

"అది నీ జీవిత కాలంలో ఎన్నటికీ చూడలేవు" అని దేముడు చెపితే, ముషారఫ్ కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయారు.

చివర్న చంద్రబాబు దేవుడ్ని కలిశారు. "దేవుడా నా హయాంలో

**ఈ జోకులన్నీ సరదాకి. కేవలం నవ్వుకోడానికి. వీళ్ళ మీదో వాళ్ళ మీదో జోకేస్తే జనం నవ్వరు సరికదా, నవ్విపోతారు. అదే జోకుకి జయలలితనో, చంద్రబాబునో, వాజ్‌పాయ్‌నో, అద్వానీనో జతకలిపితే చక్కగా పేలుతుంది. కనుక మనసారా నవ్వుకోడానికి తప్ప ఎవరి మనసూనొప్పించడం మా ఉద్దేశంకాదు. సో ఇట్సాల్ జస్ట్ ఫర్ ఫన్.**

**డోన్ట్ మిస్టేక్ అజ్..... - ఎడిటర్**

## విజయవిహారం హ్యూమర్

# నెలరోజులు



టెర్రరిజంపై యుద్ధంలో వ్యూహాలను చర్చించేందుకు వాషింగ్‌టన్‌లో విదేశాంగ మంత్రుల స్థాయిలో సమావేశం జరిగింది. అమెరికా విదేశాంగ మంత్రి కలిన్ పావెల్, భారత విదేశాంగ మంత్రి జశ్వంత్ సింగ్, పాక్ విదేశాంగ మంత్రి అబ్దుల్ సత్తార్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశం 10 నిముషాలు సాగకుండానే - ఆ ప్రాంతంపై టెర్రరిస్టులు కొద్దిసేపట్లో జీవాయుధాలను ప్రయోగించబోతున్నారనే సమాచారాన్ని సైనికాధికారులు తెచ్చారు.

భద్రత కోసం మంత్రులు ముగ్గుర్నీ అక్కడి భూగర్భ రహస్య బంకర్లకి తరలించాలని నిర్ణయం జరిగింది. ఈ బంకర్లలో కనీసం నెలరోజులు దాగి ఉండాల్సివస్తుందని పరిస్థితులు చక్కబడ్డాక మళ్ళీ బయటికి రావడం వీలవుతుందని నేతలు ముగ్గురికీ చెప్పారు.

నెలరోజులు ఉండేందుకు అవసరమైన ఆహార పానీయాలు బంకర్లలో ముందే సిద్ధంగా ఉన్నాయి.

అదనంగా ఆ నేతలకి మరేదైనా అవసరం అవుతుందేమోనని అధికారులు కనుక్కున్నారు.

తనకి 100 ప్యాక్‌ల మటన్ బ్రెడ్డులు కావాలని కలిన్ పావెల్ చెప్పారు.

తనకి 100 క్రేట్ల బ్లాక్ లేబిల్ విస్కీ కావాలని జశ్వంత్‌సింగ్ అడిగారు.

తనకి 100 కార్టన్‌ల విల్స్ సిగరెట్లు కావాలని అబ్దుల్ సత్తార్ చెప్పారు.

అధికారులు అవన్నీ అమర్చాక నేతలు బంకర్లలో ప్రవేశించారు.

అనుమానించిన విధంగానే నెలరోజులు ముగ్గురు నేతలూ బంకర్లలోనే గడపాల్సి వచ్చింది. సైన్యం బయోమాస్క్‌లు ధరించి జీవాయుధాలను నిర్వీర్యం చేసేందుకు పోరాడి సఫలీకృతమైంది.

నెలరోజుల తర్వాత బంకర్ బయటికి వచ్చినపుడు కలిన్ పావెల్ - ఫ్రెష్‌గా కనిపించారు. జశ్వంత్‌సింగ్ కూడా ఉల్లాసంగానే ఉన్నారు.

అబ్దుల్ సత్తార్ మాత్రం కాస్త చిరచిరలాడుతూ ఉన్నారు. ఆయన బయటికి రాగానే అధికారుల దగ్గరికి వచ్చి 'ఎవరి దగ్గరైనా కాస్త అగ్గిపెట్టె ఉందా?' అని అడిగారు.

# కారణం

ఒకసారి కాంగ్రెస్ పార్టీ అఖిల భారత ప్రతినిధి వర్గం కాశ్మీరు లోయలో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వెళ్ళింది. ఆ బృందంలో మాజీ ప్రధాని పి.వి. కూడా ఉన్నారు.

హఠాత్తుగా ఈ బృందాన్ని కాశ్మీర్ తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు.

తాము కిడ్నాప్ చేసింది అధికార పక్ష బృందాన్ని కాదని ప్రతిపక్ష బృందాన్నని తెలిశాక వీళ్ళని వదిలెయ్యాలని తీవ్రవాదులు నిర్ణయించుకున్నారు.

"మిమ్మల్ని క్షేమంగా విడిచి పెడతాం. కానీ ఒక్క షరతు - మీలో ప్రతి ఒక్కరూ ఒక్కో జోక్ చెప్పాలి. ఆ జోక్ ఇక్కడున్న అందరికీ నవ్వు తెప్పించాలి. ఇక్కడున్న వాళ్ళలో ఒక్కళ్ళకి నవ్వురాకపోయినా ఆ జోక్ చెప్పినతన్ని కాల్చేస్తాం, అదే షరతు" అన్నాడు తీవ్రవాద నాయకుడు.

మొదట ఒక పంజాబీ కాంగ్రెస్ నేత జోక్ చెప్పడం ప్రారంభించాడు "ఒక

### కవర్‌స్టోరీ అద్భుతం

మామూలుగా మ్యాగజైన్‌లు ఆయా నెలల్లో జరిగిన సంఘటనలను యధాతథంగా ప్రచురించటమో లేదా పాత సంఘటనలను విశ్లేషించటమో, ఎక్స్‌పోజ్ చేసి పాఠకులకు అందించటం వరకే పరిమితమవుతాయి. కాని "విజయవిహారం" నవంబర్ సంచికలో "ముఖ్యమంత్రి ఎంత భద్రం" అనే కవర్ స్టోరీ "స్కోరింగ్ ఐటం"లా చాలా అద్భుతంగా ఉంది. పోలీసు భద్రతా వ్యవస్థ లోపాలపై దిన పత్రికలే కవర్ చేయలేని ఈ రోజుల్లో ఎంతో ధైర్యసాహసాలకోర్చి పూర్తిస్థాయిలో పరిశోధనాత్మక వ్యాసం ప్రచురించిన 'విజయవిహారం' బృందానికి అభినందనలు. "ప్రజలచేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రికి భద్రతా ఏర్పాట్లలోగల లోపాలను వెలుగులోకి తెచ్చి ఆ లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దాలని" చేసిన మీ ప్రయత్నానికి పూర్తి మద్దతు ప్రకటించేవారిలో నేను ఒకడిని.

- వి. సత్యనారాయణ (జర్నలిస్టు), రంగారెడ్డి జిల్లా

### అభినందనలు

మీ పత్రికలో పనిచేసే ప్రతి ఒక్కరికీ నా అభినందనలు. మంచి మంచి ఆర్టికల్స్‌లో, జోక్స్‌లో ఆసాంతం చదివేటట్లు పత్రికను తీర్చిదిద్దగలిగినందుకు వజ్రాలవంటి రచయితలను, వాస్తవ దృక్పథంతో ఆలోచించే శక్తి వున్న వ్యక్తులను పట్టుకుని వారిలో వున్న ఆలోచనా విధానాన్ని, శక్తిని వడిసిపట్టి వారి ప్రతిభను వెలికితీసి పత్రికను ఒక చక్కని ఒరవడిలో అందరూ మెచ్చే విధంగా, ఆసక్తితో చదివి, పత్రిక మళ్ళీ ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూసే విధంగా తీర్చిదిద్దగలిగినందుకు మీకు నా ప్రత్యేక అభినందనలు. పత్రిక చదివిన ప్రతీవాళ్ళు "ఏంటండీ ఇది మాసపత్రిక - కానీసం పక్షపత్రికన్నా కాదా? అని అడుగుతున్నారు. యిలాంటి నిద్రావస్థలో వున్న వ్యక్తులను తట్టి లేపి వాస్తవ పరిస్థితి 'ఇదీ' అని అర్థమయేటట్లు చేయటానికి పత్రికాపరంగా మీరు చేస్తున్న కృషి అద్భుతం. మీ పత్రికలో ముఖ్యంగా "గెలుపుకెరటాలు" మాకు చాలా నచ్చిన ఆర్టికల్. నిరాశ, నిస్పృహలతో నీరసించిపోయే యువతకి మీరు గెలుపుకెరటాల ద్వారా వెన్నుతట్టి వారికి కృషి పట్టుదల ద్వారా సాధించే విజయాలను వివరించే టానిక్ లాగా పనిచేస్తోంది. అధికార మత్తు, మతం మత్తు, భక్తి మత్తు, ఉగ్రవాదం మత్తు ఇవన్నీ సమాజాన్ని, వ్యక్తులను ఎంత రాక్షసంగా, వివేచనా రహితంగా తయారు చేస్తున్నాయో ప్రతీ అంశం ఎంతో బుజువు చేస్తున్నాయి. ఈ పత్రిక కలకాలం విజయవంతంగా సాగాలని మనసారా కోరుకుంటున్నాను. "కిరీటం ధరించినపుడు శిరస్సుకు కొంత అసౌకర్యం తప్పదు, పైగా మీరు ధరించింది ముళ్ళ కిరీటం. చాలా ఇబ్బంది పెడుతుంది. కానీ ఏసుక్రీస్తు లాగా కొంత మంచి జరగాలి అంటే కొంత బాధ భరించాలి కదా! తప్పదు. మీ వెనక మీ అభిమానులు, నిజాయితీ, నిర్భయం వున్నంత వరకూ విజయం మీకే!

- సుశీల దశథరామ్ పింగళి, నందిగామ

### నవ్యంగా సాగిన నవంబర్ సంచిక

విజయవిహారం - నవంబర్ 2001 సంచికలో కవర్ స్టోరీ కథనం ముఖ్యమంత్రి ఎంత భద్రం? సి.ఎం. యొక్క సెక్యూరిటీ లోటుపాట్లపై 'విజయవిహారం ఫోకస్'ను ప్రత్యక్షంగా ఫోటోల ద్వారా వివరణాత్మకంగా వివరించినందుకు రచయితకు, ప్రచురించిన విజయవిహారంకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే 'ఛీ... ఛీ... అవార్డుల పరువు తీస్తున్నారు' వ్యాసంలో అనేక నిజాలు వెలుగులోకి వచ్చాయి. విగ్రహాల స్మగ్లింగ్ ముఠాలపై విజయవిహారం స్పెషల్ రిపోర్ట్ చోరీకి గురైన విగ్రహాలను సైతం ఫోటోల ద్వారా పాఠకలోకానికి అందించడం బాగుంది. "ఆమె భర్త ఒక మృగం" హబీబ్ ఖాన్ చేసే ఆగత్యాలు, హత్యాచారాలు, ఆరాచకాలు, చివరికి కన్నకూతురని కూడా చూడక తప్పతాగి అత్యాచారం చేయడం ఇవ్వన్నీ భరించలేని స్థితిలో జహీనాబీ అతన్ని చీరకొంగుతో ఉరిబిగించి చంపడం: హత్యాపథకాన్ని రూపొందించడం శవాన్ని బెడ్‌రూంలో నుండి వంటగదిలోకి మార్చి గొయ్యితవ్వి అందులో పాతిపెట్టి రాళ్ళను అమర్చి ప్లాస్టింగ్ చేసి వంట చేసుకోవడం..... షాకింగ్ ఉన్నాయి. 'ఎన్‌కౌంటర్' దశరథరామ్ గారిపై విప్లవాత్మక వ్యాసం విప్లవధోరణిలో చైతన్యంగా సాగింది. 'కంప్యూటర్ క్లాస్‌రూమ్' బావుంది. 'కరెంట్ ఎఫైర్స్' విజ్ఞానదాయకంగా సాగింది. హ్యూమర్‌స్ప్రెడ్, హ్యూమరాలజీ వినోదంగా సాగాయి. 'ఆధ్యాత్మిక సామ్రాజ్యంలో అంతుచిక్కని మిస్టరీ హత్యలు, అదృశ్యాలు' బురిడీబాబా గూర్చి వివరించిన చంద్రకౌంన్‌గార్కి కృతజ్ఞతలు. 'దునియా'లో ఒరిస్సాలో వింత చాలా వింతనే ఉంది. 'దేవుడా రక్షించు! అనే దేవాంగ పిల్లి' బి.వి.రమణగారి వ్యాసం, సాఫీగా సాగింది. 'గెలుపుకెరటాలు'లో ప్రతి గెలుపు అలరించాయి. కాశ్మీర్‌లో గద్వాల తెలుగుతేజం 'నాగేంద్ర' మరణానికి మూలం దేశభక్తి, దేశసేవ అని చెప్పడానికి గెలుపుకెరటమే నిదర్శనలు. అందుకే ఏ పత్రిక అందించని ఇంత అపారమైన వివిధ వార్తావిశేషాలు అందిస్తున్న ఏకైక పత్రిక విజయవిహారం. అందుకే వి.వి. సైజును చిన్నదిగా మార్చండి. ఎడిటర్‌గారు ఈ పత్రికను ఇలాగే నిరంతరం కొనసాగించండి. - కంచం సారంగపాణి (కళాభారత్), మందమర్రి,

### ముఖ్యమంత్రి ఎంత భద్రం?

క్రమం తప్పకుండా ప్రతినెల మేము చదివే మీ(మా) ధమ్ములున్న ఏకైక 'ప్రజల పత్రిక' 'విజయవిహారా'నికి నా నమస్కారములు.

'ముఖ్యమంత్రి ఎంత భద్రం?' నన్ను చాలా ఆకర్షించింది. అన్ని ఫీచర్స్ బాగానే వున్నాయి. కానీ ముఖ్యంగా సీ.ఎం. గారిపై పెట్టిన దృష్టి చాలా ఆకర్షించింది. ఆ మాత్రం 'ఇంటలి జెన్స్' లేకుండా, అంతపెద్ద చదువు (ఐ.పి.ఎస్., ఐ.ఏ.ఎస్.) చదివిన వారికి ఈ చిన్న విషయాలపై అవగాహన లేకుండా పోవటం గమనార్హం. వారి దృష్టి ఇలాంటివాటిపై బహుశా వుండదేమో...? కాని మీరు చూపించిన దారులు ఖచ్చితంగా వారికి అవసరమే కాకపోతే వారు ఆ విషయాన్ని పట్టించుకుంటారాని...? అయితే ఆసక్తికరమైన అంశం ఏమిటంటే గత (అక్టోబర్ 2001) సంచికలో పిడబ్ల్యుజి 'భారతక్క' ఇంటర్వ్యూ తర్వాత వెంటనే అదే అంశంపై ఇంత 'పర్టికులర్'గా రాయడం నిజంగా 'అనంచిన్ని వెంకటేశ్వర రావు మరియు ఈశ్వరానంద'లు అభినందనీయులు.




అలాగే "బ్లాక్‌మెయిలర్ జార్జిభాయ్ - కుర్చీ కోసం వాజ్‌పాయ్" అని ఇద్దరు మిత్రుల కథ (వివరాలు) చాలా చక్కటి విషయాలను మీరు 'కోట్' చేసి వాటిని కళ్ళకు కట్టే విధంగా రాశారు. హవ్వ... ఇది సిగ్గు... సిగ్గు... 'భాయ్-పాయ్' సాహెబ్స్.

పాలించే వాళ్ళు దద్దమ్మలు అయితే 'కీర్తిచక్ర' అపకీర్తి పాలు కాకపోతే ఎలా మరి...?

'వ్యక్తిత్వ వికాసం' గూర్చి మీరు చెప్పినవి అద్భుతం.

మరియు ఆధ్యాత్మిక సామ్రాజ్యంలో

# లెక్కల్లేవు... అడిగేవారూ లేరు

# రూ.3800 కోట్ల ప్రజాధనం హాం..ఫట్

చాలు.... మళ్ళీ రాజకీయాలెందుకు...? వచ్చిన డబ్బుతో ఖుషీగా కాలం వెళ్ళబుచ్చవచ్చు' - ఇదే పద్ధతిలో జెడ్.పి.లో జరిగిన అవకతవకలు అన్నీ ఇన్నీ కావు. ఏ జెడ్.పి.ని తీసుకున్నా కోట్ల రూపాయల్లోనే ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి అందిన తాజా సమాచారం మేరకు కనీసం రూ.208.16 కోట్ల మేరకు అవినీతి జరిగిందని తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం నోరు మెదపటం లేదు. జెడ్.పి. పరిధిలో జరిగిన భవన నిర్మాణం, తదితర విషయాలకు సంబంధించి కొన్నిచోట్ల రికార్డులు గల్లంతయినట్లు సమాచారం. ఒక ఛైర్మన్ ఏకంగా కొన్ని రికార్డులు స్వయంగా ధ్వంసం చేసినట్లు అధికారులు కనుగొన్నారు. ఇక వాహనాల రిపేరు, అద్దెకు సంబంధించి కూడ భారీ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

## 'వాణిజ్యం' లో వాటాలే... వాటాలు...

వాణిజ్య పన్నుల శాఖకి సంబంధించి - పన్నుల వసూళ్ళలోని అవకతవకలు గత రెండేళ్ళుగా కాస్త అదుపులోకి వచ్చినట్టు అనిపిస్తున్నా... గతకాలపు లెక్కలు ఇంకా ఒక కొలిక్కి రాలేదని - ఓ మంత్రి స్వయంగా చెప్పటం విశేషం. చెక్‌పోస్టు వద్ద నుంచి పన్నుల వసూళ్ళవరకు ఎంత వసూలు చేశారో.... ఎవరెవరికి ఎంత ముట్టిందో.... వేలు, లక్షలు కాదు, కోట్లల్లో కూడా చెప్పటం సాధ్యం కాని పరిస్థితి. జిల్లాలో ఏ మంత్రి కార్యక్రమం జరిగినా (అది వ్యక్తిగతమైనా, పార్టీదైనా, ప్రభుత్వ కార్యక్రమమైనా) ఈ శాఖ వారిదే 'ఖర్చుల బాధ్యత' అని చెప్పుకుంటున్నారు. ఈ శాఖలో (అసలు-నకిలీ) రశీదులకు గత 22 ఏళ్ళుగా లెక్కలు లేవు. దినపత్రికలు ఎంత ఘోషించినా అది అప్పటివరకే పరిమితం. వాణిజ్యశాఖ అధికారులే స్వయంగా నకిలీ రశీదులు సృష్టించిన విషయాలు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

నకిలీ 'సి' ఫారాల విషయంలో నల్గొండ జిల్లా 'కోదాడ'లో రూ.20 కోట్ల కుంభకోణం జరిగిన విషయాన్ని అధికారులు

## నిజమే : ఆర్థిక మంత్రి యనమల



పరిస్థితి అంతకంటే దారుణం కదా?

- అవును, కార్పొరేషన్‌లు పుట్టిన దగ్గర్నుంచి ఆడిట్ జరగలేదు. ఇప్పుడు ఎకౌంటబిలిటి ఫిక్స్ చేస్తున్నాం. ప్రస్తుత ఆడిటింగ్ బాగానే వుంది.

❑ గత 15 ఏళ్ళుగా అసెంబ్లీలో ఆడిట్ ప్రవేశపెట్టలేదు కదా? ఈ సారైనా....

- తప్పకుండా ప్రవేశ పెట్టాలనుకుంటున్నాం. జనవరి లేదా మార్చిలో కావచ్చు.

❑ ప్రతిపక్షాలు కూడా ఈ విషయంలో నోరు మెదిపినట్లు లేదు?

- రిపోర్టులు పెట్టిన తరువాత శాసనసభ్యులు ఎవ్వరూ చూడరు. చూసి ఎగ్జామిన్ చేయాలి. అసెంబ్లీ డ్యూటీ వుంది. కమిటీ రివ్యూ చేసేటప్పుడు కూడా డిపార్టు ఆడిట్ అయిందా? లేదా అని వారు (ప్రతిపక్షాలు) కూడా పర్యవేక్షిం చాలి? అప్పుడు ప్రభుత్వానికి, అధికారులకు భయం కూడా వుంటుంది. అందరూ ప్రభుత్వానికి, అధికారులకు భయంకూడా వుంటుంది. అందరూ నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితమే సమస్య.

❑ దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందా?

- చాలామంది చనిపోయారు. కొందరు రిటైర్ అయ్యారు. ఇప్పుడు కొనసాగుతున్న వారికి సర్ చార్జీ నోటీసులు ఇచ్చాం. దీనికి ఎవరు బాధ్యులు అనే విషయంపై విచారణ జరుగుతోంది. కొంత కలెక్షన్ కూడా అవుతుంది. అవినీతికి పాల్పడ్డ వారిపై శాఖాపరమైన చర్యలు తప్పక తీసుకుంటాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు.

తెలిసినా.... బయటకు పొక్కి, విచారణ జరిగినా.... దాన్ని సైతం పక్కదారి పట్టించారు. ఎట్టకేలకు ఆ శాఖ మంత్రి జాగర్లమూడి పద్మావతి జోక్యంతో 20 కోట్ల కుంభకోణం 'కేసు'గా మారింది.

ఈ శాఖలో రూ.250 కోట్లకు సంబంధ ఆడిట్ అభ్యంతరాలు వచ్చాయి. అసలు అక్రమాలు అంతకు ఎన్నో రెట్లు వుంటాయనే విమర్శలకు అధికారులు వివరణ ఇవ్వలేకపోతున్నారు.

## చెక్‌పోస్ట్ అవినీతి నిరూపిస్తా : మంత్రి పడాల

రాష్ట్ర సరిహద్దుల్లోని భోరజ్ చెక్‌పోస్టు సిబ్బంది అవినీతిని నిరూపిస్తానని రాష్ట్ర చేనేత, జౌళిశాఖమంత్రి పడాల భూమన్న గత ఏడాది డిసెంబర్ 3న చేసిన ఛాలెంజ్‌కి ఎవ్వరూ నేటి వరకు స్పందించలేదు. స్వయాన మంత్రే లక్షలాది రూపాయల అవినీతి జరిగిందని,అది నిరూపించలేకపోతే రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేసి చెబుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు.

## సాగునీటి సంఘాల్లో కొట్టుకుపోయిన రూ.100 కోట్లు

రాష్ట్రంలో సాగునీటి సౌకర్యం కలిగిన కోటీ ఏడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 10,292 సాగునీటి సంఘాలను, 174 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 1997 జూన్ 17 ఆయకట్టు దారులకు ఓటుహక్కు కల్పించి ఎన్నికలు నిర్వహించింది. ఫలితాలు అధికారపార్టీకి అనుకూలంగా వచ్చాయి. దానితో ఆ సంఘాలకి నిధుల కేటాయింపూ పెరిగింది. 1998లో మరమ్మత్తుల కోసం రూ.107 కోట్లు, 1999లో రూ.300 కోట్లు, 2000లో రూ.45 కోట్లు ప్రభుత్వం మంజూరుచేసింది. మొదటి మూడేళ్ళలో రూ.452 కోట్ల విలువైన పనులు జరిగాయి. వీటిలో రూ.100.06 కోట్లకు లెక్కలు లేవు. రూ.70 కోట్లు స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు వాటా రూపంలో అందుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. 44 సంఘాలపై బహిరంగ విమర్శలు రాగా, 26 సంఘాలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చింది.

## ఇరిగేషన్‌లో ఇష్టారాజ్యం

ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం వెచ్చించిన వేలాది కోట్ల రూపాయలలో కనీసం రూ. 300.16 కోట్ల రూపాయలకు ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తమవు తున్నాయి. ఏ ప్రాజెక్టు పని కూడా నిర్దేశించిన సమయానికి పూర్తికావడం లేదు. నిర్మాణంలో నిర్ణీత స్థాయిలో ఇనుము, సిమెంట్, కంకర వినియోగిం చడం లేదని విజిలెన్సు అధికారులు గుర్తించారు. కొన్ని ప్రాంతాలలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలపైనే ఆరోపణలు వచ్చాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వ్యయం మొదట అనుకున్న దానికన్న మూడురెట్లు ఎక్కువ అయినా ఇంకా పనులు కొన'సాగు'తున్నాయి.

ప్రతి నీటి ప్రాజెక్టులో కోట్లాది రూపాయలకు లెక్కలు తేలకపోవడం 'సహజం' అయిపోయింది. మంత్రులకీ వాటాలు ముడుతున్నాయన్న ఆరోపణలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి.

## 'వైద్యోనారాయణో... 300 కోట్లు హరీ'

ఇకపోతే- వైద్యశాఖ విషయం... ఇక్కడ ఉన్నంత అవినీతి రోగం ఎక్కడాలేదు. ఈ శాఖ ఆడిట్‌లో 10,642 అభ్యంతరాలు వచ్చాయి. రూ.300.18 కోట్లకు లెక్కలు తేలాల్సివుంది.

ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొనుగోలు నుంచి బ్యాండేజి క్లాత్, పేషంట్‌కు వేసే గ్రీన్ క్లాత్, ఫినాయిల్, సిరంజ్, ఆపరేషన్ల సామాన్లు, ఇతర విలువైన సామాన్ల కొను'గోలుమాల్'లు జరిగాయి. ప్రతి జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనుంచి మొదలుకొని, పెద్ద హాస్పటల్స్ వరకు ఈ అవినీతి జబ్బు పట్టి పీడిస్తోంది. ఆసుపత్రి భవన నిర్మాణంలో సయితం అవినీతే. ఓ ఉన్నతాధికారిపై ఏ.సి.బి. దాడులు జరిగినా వెలుగులోకి రాకుండా జాగ్రత్త పడ్డ సంఘటన ఈ శాఖదే! 3,812 పైగా రికార్డులు గల్లంతయినట్లు తెలుస్తోంది.

## హైవే రోడ్లపై దారితప్పిన నిధులు

రోడ్ల భవనాల శాఖలో రూ.406 కోట్లకు లెక్కలు లేవు. గత 12 ఏళ్ళుగా ఆడిట్ అభ్యంతరాలకు సైతం అందని మరో రూ.700 కోట్ల లెక్కల్లో లొసుగులు ఉన్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు.

రాష్ట్రంలో 1438 కి.మీ. రోడ్డును విస్తరించడానికి, మరో 1800 కి.మీ. రహదారుల మెయింటెనెన్స్‌కు ఎ.పి. హైవే ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ఇందుకోసం రూ.1724 కోట్లు వెచ్చించారు. నిర్దేశిత ప్రమాణాలకు భిన్నంగా రోడ్డు మందం కాస్త తగ్గించి వేస్తే కాంట్రాక్టర్‌కు కి.మీ.కు రూ.4 నుంచి 5 కోట్లు లాభం వస్తుంది. ఇదే పద్ధతిని కనీసం 980 కి.మీ. వరకు అమలు పరిచి సుమారు రూ.320 కోట్లు దారి మళ్ళించగలిగారు.

ఇది ఇలా ఉండగా- నాణ్యతలేని 71 రోడ్డు రోలర్లను ఖమ్మం, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదావరి జిల్లాలో ఎ.సి.బి వారు 'సీజ్' చేశారు. రూ.8 లక్షల విలువచేసే రోడ్డు రోలరును రూ.3 లక్షలకే కొనుగోలు చేసి రోడ్డు పనులకు ఉపయోగించటంతో ఏ.సి.బి. రంగంలోకి దిగి చర్యలు చేపట్టింది. నాణ్యత లేకుండా రోడ్లు వేసిన సంఘటనలలో కొందరు అధికారులు దగ్గరుండి తూతూ మంత్రంగా 'ఆడిట్' అయిందనిపించిన సంఘటనలు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

## అటవీశాఖలో అసలుకే ఎసరు...

అటవీశాఖలో ఏదైనా జరగవచ్చు. ఎంతటి ఘనకార్యమైనా చేయవచ్చనే దృక్పథం కనిపిస్తోంది. పర్మిట్లు లేకుండ ఎంత కలప తరలిపోతుందో లెక్కేలేదు. లెక్కలే లేనివాటికి ఆడిట్ ఎక్కడ? అటవీశాఖకు చేరాల్సిన నిధులు పెద్దఎత్తున పక్కదారిపట్టాయని విజిలెన్సు విభాగంలో నమోదయిన 76 కేసుల్లో స్పష్టం అవుతోంది. వీటిల్లో సుమారు రూ.106.22 కోట్లుకు గత 20 ఏళ్ళుగా లెక్కలు రికార్డులు లేవని తెలుస్తోంది. అటవీశాఖ భూఆక్రమణ కేసులో ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే నేరుగా కేసును ఎదుర్కోవటం గమనార్హం. 30 ఏళ్ళుగా వందలాది కోట్ల రూపాయల విలువైన కలప అక్రమరవాణా జరిగిపోయింది.అవినీతి కేసులో దొరికిన ప్రతి ఉద్యోగి ఇంట లక్షలరూపాయల విలువైన కలప సామాగ్రి ఉన్నట్లు రికార్డులు చెబుతున్న సాక్ష్యాలను ప్రభుత్వం కాదనగలదా.?

## గుడిని, గుడిలో లింగాన్ని...

ఇక దేవాదాయ శాఖ... ఈ శాఖలోని అస్తవ్యస్త విధానాలు,అనాలోచిత వైఖరులు, ఆలస్యంగా మేల్కొనే ధోరణులు.... అధికార పార్టీకి చెందిన వారే దేవాలయ కమిటీలో సభ్యులు... వెరసి కనీసం రూ.303 కోట్ల మేరకు నిధులు 'అదృశ్యం'. హుండీ లెక్కల నుంచి తలనీలాల వరకు ఎవరికి తోచినంత వారు 'ప్రసాదం'లాగా ఆరగించారు. దేవాలయ భూముల లీజు, దేవాలయ ఆస్తులపై నిఘా లేక అన్యాక్రాంతం అయిన ఆస్తులు ఇలా దేవాలయాల విషయంలో గత 30 ఏళ్ళుగా రికార్డులు లేవు. రికార్డులు లేని చోట ఆడిట్ జరపటం....'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరడం' లాంటిదే. గత మూడేళ్ళుగా మంత్రి తనిఖీల ద్వారా పరిస్థితి కొంత మెరుగు పడ్డప్పటికి అవినీతి ఎంత మాత్రం తగ్గలేదని అధికార వర్గాలే స్పష్టం చేస్తున్నాయి. 4,082 ఆడిట్ అభ్యంతరాలు ప్రస్తుతానికి ప్రభుత్వానికి వచ్చి చేరాయి.

## విశ్వవిద్యాలయాలలో 'తినురా' వేమా...!

అక్షరజ్ఞానం ఉంటే సామాజికంగా ఉత్పన్నమయ్యే సమస్యలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావించి నిధులిచ్చింది.

తెలివి కాస్తా.... అతి తెలివిగా మారిపోయింది. యూనివర్శిటి పరిధిలో ఏం చేసినా అడిగేవారెవ్వరూ ఉండరన్న లక్ష్యంతో ఏకంగా రూ.425.20 కోట్లు తినేశారు. ఇంకా ఎన్ని కోట్లు తిన్నారో లెక్కలు తేలాల్సి వుంది. ప్రభుత్వం జరుగుతున్న దారుణమైన అవినీతి గురించి తెల్సుకొని నిధుల కోత విధించింది. అయినా జరుగుతున్న తంతు మారలేదు. సరికదా.... తమ తప్పొప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి సంబంధిత అధికారులు కొందరు రికార్డులు గల్లంతుచేసిన సంఘటనలు 'విజయవిహారం' దృష్టికి వచ్చాయి. తెలుగు యూనివర్సిటీలో ఒకరు ఏకంగా ఎఫ్.డి.ఆర్‌లను మార్చి, విదేశీ ప్రయాణాలకు ఆ డబ్బు ఖర్చు చేసినట్లు ప్రాథమిక విచారణలో అధికారులు గుర్తించారు.

## ఇదో పెద్ద 'గ్రంథం'

నాడు స్వాతంత్ర్య పోరాట భావాలను వ్యాప్తిచేసిన వేదికలు నేడు కొన్ని అవినీతికి నిలయాలుగా, మరికొన్ని నిస్తేజంగా మారిపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులకు లెక్కలు చెప్పలేక, కొత్తగా నిధులు లేక 676 గ్రామీణ గ్రంథాలయాలు పనిచేయడం లేదు.

రాష్ట్రవ్యాప్తంగా 2,512 గ్రంథాలయాలు ఉండగా 1836 మాత్రమే పనిచేస్తున్నాయి. ఎన్ని దినపత్రికలు కొంటున్నారు? ఎన్ని గ్రంథాలు, పుస్తకాలు కొనుగోలుచేశారు? ఎన్ని పుస్తకాలు, గ్రంథాలు ప్రస్తుతం ఉన్నాయి? అద్దెలు ఎంత చెల్లిస్తున్నారు? అనే లెక్కలకు 30 ఏళ్ళుగా రికార్డులు లేవు. గల్లంతయిన ఫైళ్ళే 2,547 ఉండగా 2,536 ఆడిట్ అభ్యంతరాలు ప్రస్తుతానికి వెలుగులోకి వచ్చాయి. ఇంకా వెలుగు చూడాల్సింది ఎంతో వుంది. వీటి ప్రకారం రూ.182.42 కోట్లకు లెక్కలు కావాలి.

## రూ.60 కోట్ల అక్రమాలకు 'సహకారం'

రాష్ట్రవ్యాప్తంగా 55 వేల సహకార సంఘాలలో 41,589 సంఘాలకు ఆడిటింగ్ జరగాలని నిర్ణయించగా 27,868 సంఘాలకు మాత్రమే ఇప్పటివరకు ఆడిటింగ్ జరిగింది. ఇంకా 13,721 సంఘాలకు 93 నుంచి ఆడిటింగ్ జరగాల్సి వుంది.

2,546 సంఘాల్లో రూ.33.38 కోట్ల మేరకు అవకతవకలు, 2071 సంఘాల్లో రూ.24.70 కోట్లకు దుర్వినియోగం జరిగింది. మొత్తం 60 కోట్ల పైచిలుకే అవినీతి జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. 15 డి.సి.సి.బి.లు 2,178 పి.ఎ.సి.ఎస్.ల ఆడిటింగ్ జరగలేదు. అయితే ఆడిటింగ్ జరిగినట్లు చెబుతున్న సంఘాల్లో 928 సంఘాలకు సర్టిఫికెట్లు లభించలేదు. ఈ సంఘాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం భావిస్తుంది.




# చిక్కిన ప్రతివాడిని నేరస్థుడిని చేసే పోటో

అబ్దుల్ మసూద్ అనే కరడుగట్టిన టెర్రరిస్టును పట్టుకోవడానికి సాయుధ దళాలవారు ఎంతో సాహసం, దీక్ష ప్రదర్శించారు ప్రాణాలకు తెగించారు. కాని కాందహార్‌కు భారత విమానాన్ని తరలించి అతన్ని విడిపించుకుని పోయారు. ఎందుకంటే మూడేళ్లు దాటినా అతన్ని విచారించడంగానీ నేరాన్ని రుజువు చేయడం గానీ చేయలేకపోయారు. విమానాన్ని హైజాక్ చేయడం వల్ల వత్తిడులకు లొంగవలసిరావడం వరకు సరే. కాని నేరం రుజువు చేయలేకపోవడం హైజాకర్ల తప్పు కాదు కదా. అప్పుడు బలీయమయిన టెర్రరిస్టు నిరోధక చట్టం టాడా అమలులో ఉంది. అయినా ఉపయోగం లేదు.

* * *

ఇప్పుడు కేంద్రం మరో టెర్రరిస్టు నిరోధక ఆర్డినెన్సు తెచ్చింది. అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒప్పందం ప్రకారం సభ్యదేశాలు కొన్ని పౌరహక్కులను భంగం చేసే శాసనాలను చేయడానికి వీల్లేదు. కాని పోటో ఆ హక్కులను ధ్వంసం చేస్తున్నది. క్రిమినల్ లాలో కొత్త న్యాయసూత్రాలను రచిస్తున్న ఈ చట్టంలో ఉన్న అసలు భయానకమయిన సెక్షన్లు ఇవి. సెక్షన్ 3(8): టెర్రరిస్టు చర్యను నిరోధించడానికి గానీ లేక నిందితుడిని పట్టుకోవడానికి గానీ ఉపయోగపడే సమాచారాన్ని కలిగి ఉన్న వ్యక్తులు అడిగిన అధికారులకు ఆచరణకు సాధ్యమయినంత తొందరగా చెప్పకపోతే ఏడాది పాటు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండు రకాల శిక్షలకు గురవుతారు. అయితే నిందితుడి తరవున వాదించే వకీలుకు చెప్పిన సమాచారం మాత్రం ఆయన వెల్లడించలేదని శిక్షించడానికి వీల్లేదు.

ఈ మినహాయింపు లేకపోతే వకీళ్లను కూడా జైల్లో తోసేందుకు వీలయ్యేది. పోలీసుల ప్రకారం ఎవరి దగ్గరయినా కావలసిన సమాచారం ఉందని భావిస్తే ఆ సమాచారం ఇవ్వలేదన్న నెపంతో జర్నలిస్టునయినా మరెవరినైనా ఏడాది శిక్షపడే ఈ నేరం కింద విచారణ చేయవచ్చు. అంతేకాదు. ఈ చట్టం కింద బెయిల్ దొరకడం కష్టం. విచారణ ఖైదీగా చాలాకాలం వారు జైల్లోనే గడపవలసి ఉంటుంది. ఒకవేళ సమాచారం చెప్పినా, వీలయినంత తొందరగా చెప్పలేదని కావాలని ఆలస్యం చేసాడని కూడా క్రిమినల్ కేసులో ఇరికించవచ్చు. తన దగ్గర పోలీసులకు అవసరమయిన సమాచారం ఉందని తాను అనుకోలేదని రుజువు చేయడం వారికి గగనమవుతుంది.

నిందితుడిని పట్టుకున్న తరువాత అతను నేరాంగీకారం చేయాలని పోలీసులు పట్టుబడతారు. అయితే అటువంటి నేరాంగీకార ప్రకటన చేసేముందు, నిందితుడు ఎటువంటి సమాచారమూ ఇవ్వనవసరం లేదని, మౌనంగా ఉండవచ్చునని పోలీసులు వారికి చెప్పితీరాలని ఆ తరువాత అతను నేరం ఒప్పుకుంటేనే ఆ ప్రకటనను వినియోగించవచ్చునని పోటో చెప్తున్నది. మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉంది గానీ, కేవలం సమాచారం తెలిసిన అమాయకుడికి, లేదా జర్నలిస్టుకి లేదన్నమాట.

* * *

సెక్షన్ 3(8) ద్వారా అమాయకులను దెబ్బ తీసేందుకు దక్కిన అధికారం చాలదన్నట్టు, సెక్షన్ 14 మరో భయంకరమయిన అధికారం ఇస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కానీ, స్థానిక సంస్థల అధికారులు కానీ, కంపనీ అధికారులు గానీ, ఏ సంస్థ లేదా సంఘం, వ్యవస్థకు చెందిన వారుగానీ లేదా ఏ వ్యక్తిగానీ ఈ ఆర్డినెన్సుకు ఉపయోగపడే, సంబంధించిన సమాచారం కలిగి ఉండి కూడా ఇవ్వడానికి నిరాకరిస్తే లేదా తప్పుడు సమాచారం ఇస్తే వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. ఈ సెక్షన్ ప్రకారం అధికారులు కూడా తప్పించుకోలేరు. బహుశా మన ఐఏఎస్ అధికారులకు, ఇతర పాలనాధికారులకు, కంపెనీలవారికి ఈ విషయం ఇంకా తెలిసి ఉండదు. లేకపోతే వారు కూడా అభ్యంతరం తెలపవల్సిన సెక్షన్ ఇది. ఒకవేళ టెర్రరిస్టులకు బెదిరి కొంత సొమ్ము ముట్టజెప్పినవారు ఆ సమాచారం పోలీసులకు చెప్పకపోతే



లేదా తప్పుడు సమాచారం చెప్తే ఈ సెక్షన్ కింద నేరస్తులు కావచ్చు. ఇతర వ్యక్తులను కంపెనీలను అధికారులను కూడా గజగజ వణికించడానికి ఈ సెక్షన్ చాలు. టెర్రరిస్టు చర్యలను నివారించడానికి లేదా బాధ్యులను బంధించడానికి పనికి వచ్చే సమాచారం ఇవ్వనందుకు సెక్షన్ 3(8) ఏడాది జైలు శిక్ష విధిస్తే, ఆర్డినెన్సుకు సంబంధించిన ఏ సమాచారమయినా ఇవ్వనందుకు మూడేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. ఏ వ్యక్తి అయినా అని కూడా అన్నారు కనుక ఇది ఇంకా భయంకరమయిన అధికారాలను ఇస్తున్నది. ఇందులో మరో తిరకాసు కూడా ఉంది. ఈ సెక్షన్ నిందితులను సత్వర విచారణ ద్వారా శిక్షించవచ్చు. అంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కొన్ని నేరాలను సమ్మరీ ట్రయల్ (సత్వర విచారణ) చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ విధానంలో నిందితుడికి కావలసినంత వ్యవధి, రక్షణలు దొరకవు. కోడ్ ప్రకారం మూడునెలల కన్న ఎక్కువ శిక్ష వేసే నేరాలను సత్వర విచారణ చేయకూడదు. కాని పోటోకు ఈ సెక్షన్ వర్తించదని సెక్షన్ 14లో రాసుకున్నారు. అంటే మూడు సంవత్సరాల శిక్ష వేసే నేరాన్ని కూడా సత్వర విచారణ చేసేందుకు అనుమతిస్తున్నది. ఇది దుర్వినియోగానికి అనుకూలమయిన మరో ప్రమాదకర సెక్షన్.

* * *

మీడియా మీద సెన్సార్‌షిప్ లేదు కానీ, సెక్షన్ 37 ఏ సంభాషణనైనా టాప్‌చేసే అవకాశం అధికారం ఇస్తున్నది. ఎస్పి స్థాయి అధికారి, కాంపిటెంట్ అధికారి అనుమతితో టెలిఫోన్ లేదా సెల్‌ఫోన్, తదితర సమాచార ఇంటర్‌సెప్ట్ చేసి టాప్ చేయవచ్చు. మొదట 17 రోజులకు పరిమితమయిన ఈ టాపింగ్, మొత్తం 60 రోజులదాకా సాగించవచ్చు. టాపింగ్ ద్వారా తెలిసిన సమాచారాన్ని వెల్లడించవలసిన అవసరం లేదని, కాని ఈ సమాచారాన్ని సాక్ష్యంగా కోర్టులో ప్రవేశపెట్టవచ్చునని కూడా ఈ చట్టం చెప్తున్నది. ఒకవేళ ఈ సమాచారాన్ని తెలుసుకుని ఎవరయినా వెల్లడిస్తే, వారికి ఏడాది జైలు జరిమానా (వేయి నుంచి 50 వేల రూపాయల వరకు) విధించవచ్చు. సెక్షన్ 14, 37 సాధారణ క్రిమినల్ న్యాయశాస్త్రానికి విరుద్ధమయినవి. పోలీసులకు విశ్వసనీయత లేదని సాధారణ నియమాలు చెప్తున్నాయి. కాని ఈ చట్టం ప్రకారం వారికి కొత్తగా విశ్వసనీయత వచ్చిందని, కనుక వారికి ఇచ్చిన నేరాంగీకార ప్రకటన చెల్లుతుందని అనుకోవాలి. ఈ నేరాంగీకార ప్రకటనను మెజిస్ట్రేటు ఒప్పుకుని సంతకం చేయాలి. ఆయన కోర్టు ముందు వీలయినంత త్వరగా నిందితుడిని హాజరు పరచాలి. ఇవి రక్షణల వలె కనిపిస్తాయి. కాని ఇదంతా సాయు ధులకు అను కూలంగా మాత్రమే వారి విచక్షణాధికారాన్ని బట్టి ఉంటుంది. అదే విధంగా తప్పుడు విచారణను దురుద్దేశ పూర్వకంగా చేపట్టిన అధికారి నుంచి నష్టపరిహారం వసూలు చేయవచ్చునని ఈ చట్టం చెప్తున్నది. ఎంత, ఏ దశలో, ఏ కోర్టులో వసూలు చేయాలో వివరాలు లేవు.



ఒక పోలీసు అధికారి దురుద్దేశపూర్వకంగా ఇరికించాడని రుజువు చేయడం సామాన్య పౌరుడికి సాధ్యం కాదు.

* * *

సెక్షన్ 51, నిందితుడి తరఫున వాదించడానికి,పోలీసు విచారణ సమయంలో పక్కన ఉండడానికి లాయర్‌ను పిలుచు కోవచ్చునని చెప్తున్నది. కాని ఈ సెక్షన్ నిందితుడి విచారణ కొనసాగిన ప్రతి సమయంలోనూ అతని లాయర్‌కు ఉండే హక్కు కల్పించదు అని స్పష్టంగా పేర్కొన్నారు. అంటే లాయర్ లేని సమయంలో ఇంటరాగేట్ చేసే అధికారం వారికి ఉందన్నమాట. ఒకవైపు రక్షణ కల్పించినట్టే చేసి మరో వైపు లాగేసుకున్నారు. సెక్షన్ 48(2) ప్రకారం నిందితుడిని ప్రశ్నించడానికి అధికారులకు లభించే కాలం 120 రోజులదాకా సాగవచ్చు. ఈ కాలంలో నిందితులకు బెయిల్ దొరికే అవకాశం లేదు. కోడ్‌కు సంబంధించిన సాధారణ నియమం సెక్షన్ 167 కింద 120 రోజులపాటు బెయిల్ దొరకదన్నమాట. సెక్షన్ 52 ప్రకారం నిందితుడు ఆయుధాలతో దొరికితే అతనే నేరస్తుడని భావించే వీలుంది. భావన కాకుండా, నిందితుడి వద్ద ఆయుధాలున్నా, పేలుడు పదార్థాలు ఉన్నా, మారణాయుధాలున్నా అతను నేరస్తుడని కోర్టు తప్పనిసరిగా నిర్ధారించాలని సెక్షన్ 4 చెప్తున్నది. ఈ నేరానికి శిక్ష యావజ్జీవ కారాగారం, పదిలక్షల జరిమానా.

* * *

సెక్షన్ 27 - నిందితుడి రక్తం నమూనా, ఉమ్మి, వీర్యం, వెంట్రుకలు, గొంతు, కాలి అడుగుల గుర్తులు, ఫోటోలు తీసుకునే అధికారం ఇచ్చింది. నిందితుడు అందుకు అంగీకరించకపోతే అతను నేరస్తుడని భావించాలని చెప్తుంది. వ్యక్తి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా అతని శరీరంలో భాగాలను, ద్రవాలను, గుర్తులను బలవంతంగా తీసుకోకూడదని రాజ్యాంగం, సాధారణ క్రిమినల్ నియమాలు చెప్తున్నాయి. వాటిని సేకరించే బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. అవి ఇచ్చితీరాలని, ఇవ్వకపోతే నేరస్తులు కావాలని ఈ సెక్షన్ చెప్తున్నది. తనకు వ్యతిరేకంగా పనిచేసే సాక్ష్యం చెప్పకుండా నిరాకరించే హక్కు మౌనంగా ఉండే హక్కు ఉందని అది ప్రాథమిక హక్కు అని రాజ్యాంగం ఆర్టికల్ 20(3) చెప్తున్నది. తన శరీర వస్తువుల నమూనాలు ఇస్తే వాటిని అతనికి వ్యతిరేకంగా వాడే అవకాశం ఉంది. అందుకు వీలు కల్పించే ఈ సెక్షన్ రాజ్యాంగం ఆర్టికల్ 20(3)కు విరుద్ధం.

* * *

ఎఫ్‌ఐఆర్ దాఖలు అయిన తరువాత పదిరోజులలోగా డిజిపి ఆమోదించకపోతే, 30 రోజులలోగా సమీక్షా సంఘం సమీక్షించాలి. సమీక్షా సంఘం ఆమోదించకపోతే నేరారోపణ ఉపసంహరించుకోవాలి. సమీక్షా సంఘానికి హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షత వహిస్తారు. కాని సంఘంలో అధికారులే ఎక్కువ కనుక వారి మెజారిటీ ముందు న్యాయమూర్తి నిర్ణయం పనిచేస్తుందా అని అనుమానించవలసిందే. రెవ్యూ కమిటీ ముందు బందీ తరపున వాదించే అవకాశం లేకపోవడం మరో అన్యాయం. అసలు విచారణ ఖైదీల బందీ గురించి న్యాయస్థానం సమీక్షించాలి. ఈ చట్టం ప్రకారం ఆ అవకాశం లేదు. ఇది మరో అంతర్జాతీయ ఒప్పందం ఉల్లంఘన.

సెక్షన్ 30 ప్రకారం బెదిరింపులకు గురయ్యే సాక్షి పేరు బయటపెట్టే అవసరం లేదు. ఎవరయినా ఆ పేరు వెల్లడిస్తే ఏడాది జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా. 29(5) కింద నిందితుడు హాజరు లేకపోయినా సాక్షిని విచారించవచ్చు. బహిరంగవిచారణ అనే ప్రాథమిక హక్కుకు ఈ నియమాలు విరుద్ధం. విచారణకు ముందే నిందితుల ఆస్తిపాస్తులను స్వాధీనం చేసుకునే అధికారాన్ని సెక్షన్ 6 కల్పిస్తున్నది. ఇది కూడా సాధారణ ఆస్తి హక్కు భంగపరచడమే.

సాధారణ నేర న్యాయసూత్రాలకు, పౌరహక్కుల అంతర్జాతీయ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉండడమే గాకుండా, దుర్వినియోగానికి అవకాశం కలిగిస్తుందీ చట్టం. సామాన్యుడు పొరబాటున ఈ వలలో పోలీసులకుచిక్కితే చాలు నేరస్తుడుగా రుజువుకావడానికి ఎన్నో ఆస్కారాలున్నాయి ●

### పదమూడేళ్ళకే మ్యూజిక్ ఆల్బమ్ రిలీజ్ చేసిన యంగెస్ట్ పాప్‌స్టార్, కర్ణాటక కళారత్న అవార్డు గ్రహీత

# నేహా నాగ్‌పాల్




ఈ అమ్మాయి వయసు కేవలం పదమూడేళ్లే... చదువేమో బెంగుళూరులోని జైన్ రెసిడెన్షియల్ స్కూల్లో ఎనిమిదో క్లాసు...

కాని ఇంత చిన్న వయసులోనే స్వంతంగా ఓ మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేసి యంగెస్ట్ పాప్ స్టార్‌గా పెద్ద పేరే సంపాదించుకుంది. 'టాలెంటెడ్ యంగ్ ఆర్టిస్టు'గా కర్నాటక కళారత్న పురస్కారాన్ని కూడా అందుకుంది.

తానో పెద్ద సింగర్‌ని కావాలన్నది నేహా కల... కాని ఆమె ఎవరిదగ్గరా, ఎలాంటి శిక్షణ పొందలేదు. చిన్నప్పటినించీ మ్యూజిక్ చానెళ్లు చూడ్డమంటే ఆమెకు పిచ్చి. అస్తమానం ప్రఖ్యాత పాప్‌స్టార్ల షోలు టీవీలో చూస్తూ, గొంతు కలుపుతూ... రిథమ్‌ను పట్టేసేది. అలా ఏ పాటనైనా అద్భుతంగా పాడడం చూసి తలితండ్రులు ఆమెను ప్రోత్సహించారు. వెంటనే నేహా మ్యూజిక్ కంపెనీ వారికి తన టాలెంట్ గురించి చెప్పడానికి- ఒక డెమో టేప్‌ను తయారు చేసింది. అది లక్కీగా- యువ, వర్ధమాన కళాకారులను ప్రోత్సహించే ప్రఖ్యాత మ్యూజిక్ కంపెనీ 'హ్యాట్ మ్యూజిక్ ఇంటర్నేషనల్' దృష్టిలో పడింది. నేహాను లండన్ పిలిపించారు. ఆమె ప్రతిభను గుర్తించి ప్రముఖ పాప్ కళాకారుడు జానీ కాసనవా దగ్గర శిక్షణ ఇప్పించారు. కొన్ని నెలల ట్రైనింగ్ తర్వాత నేహా 'ఇఫ్ ఐ కుడ్ డ్రీమ్' పేరిట ఓ ఆల్బమ్ రూపొందించింది. బాలే, మ్యూజిక్, డాన్స్, పాప్ సంగీతం... ఇలా అన్నింటినీ మిక్స్ చేసిన ఈ ఆల్బమ్ అద్భుతంగా వుందని ప్రశంసలు కురిశాయి. చదువుకోసం బెంగుళూరు తిరిగి వచ్చిన 13 ఏళ్ల నేహా- ఇప్పుడు రెండవ ఆల్బమ్ కోసం ఏదైనా ప్రముఖ కంపెనీతో భారీ ఒప్పందాన్ని కుదుర్చుకోగలనన్న ధీమాతో వుంది. పాప్ సూపర్ స్టార్ మడొన్నా స్థాయికి చేరాలన్నది ఆమె కల. పాప్ గొడవలో పడి చదువుకు స్వస్తి చెప్పే ప్రసక్తి లేదంటున్న నేహా కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతానంటోంది●



# పగలు నాయకుడు రాత్రి హంతకుడు

శ్రీకాకుళం జిల్లా, కొత్తూరుకు చెందిన బసవరాంబాబు పేరుకే రాజకీయనాయకుడు. తన కార్యకలాపాలకు అడ్డువచ్చేవారిని ఒక పథకం ప్రకారం కర్కశంగా కత్తులతో పొడిచి, తుపాకీతో కాల్చి చంపాడు. అలా ఒకరిని కాదు, ఇద్దరిని కాదు ఏకంగా ఎనిమిది మందిని అతి దారుణంగా తన ముఠాతో కల్సి చంపాడు. మరో ఎనిమిది మందిపై హత్యాయత్నం చేశాడు. కిడ్నాపులైతే లెక్కేలేదు. తన నేరచరిత్రతో ఉత్తరాది రాష్ట్రాలకు ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్ పోలీసులకు రాంబాబు గత 22 ఏళ్ళుగా అనేక స్థాయిల్లో సవాళ్ళు విసిరాడు.

వివిధ రాష్ట్రాల్లో 24 అరెస్టు వారెంట్లున్న రాంబాబు తెరపైన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఖరగ్‌పూర్ శాఖ ప్రధాన కార్యదర్శి కాగా, తెరవెనుక కరుడుగట్టిన నరహంతకుడు.

* * *

బసవ రాంబాబు తన 15వ ఏట కొత్తూరు నుంచి ఉపాధి కోసం బెంగాల్ చేరాడు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆకాంక్షతో చిన్నచిన్న దొంగతనాలకు అలవాటయ్యాడు. 1979లో మధురాకాటి రైల్వేస్క్రాప్ యార్డులో ఇనుము దొంగతనం చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. దీంతో రాంబాబు తాను చేసే ఏ దొంగతనమైనా పోలీసులకు అనుమానం రాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ఒక పథకం ప్రకారం నేరాలు చేయడానికి అలవాటు పడ్డాడు. రాంబాబు నేరజీవితం అనేక మలుపులు తిరిగి స్థానిక "దాదా"గా మారాడు. తన నేరచరిత్రను కప్పి పుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అండ చూసుకున్నాడు. ఆ పార్టీ నేతలతో కలిసి విందులకు హాజరయ్యేవాడు. కాలక్రమేణ హంగు, ఆర్భాటం వచ్చి చేరాయి.

1991లో తనకు "పండా"లో వ్యాపారపరంగా అడ్డుగా వచ్చిన రాంకిషన్‌ను దారుణంగా పొడిచి చంపాడు. అక్కడ తన నేరచరిత్ర బయటపడకూడదని జంషెడ్‌పూర్ వెళ్ళాడు. ఈ సమయంలో కోలకత్తాలోని నేరస్తుల ముఠాలతో సంబంధాలు కలిశాయి. వాటితో కూడా పొసగక ఏకంగా తానొక ముఠాను ఏర్పాటు చేసుకోవాలని భావించాడు. అయితే అక్కడి వారిని నమ్మలేక మన రాష్ట్రంలోని కొద్దిమంది నిరుద్యోగ యువకులను చేరదీసి సొంతంగా ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. ఇదే క్రమంలో రైల్వే కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి రాంబాబు తన వ్యాపార ప్రత్యర్థులను బెదిరించేవాడు. లేదంటే కిడ్నాప్..... వినకుంటే హత్య ఇలా ఒకవైపు నేర చరిత్రను పెంచుకుంటూనే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరి ఖరగ్‌పూర్ ప్రధాన కార్యదర్శిగా ఎదిగాడు. ముఠా కార్యకలాపాలను ఢిల్లీ వరకు విస్తరించగలిగాడు.

## సంచలనం కలిగించిన మాజీ ఎం.పి. కొడుకుల హత్యలు

ఈ సమయంలో రాంబాబుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అది అక్కడి తృణమూల్ కాంగ్రెస్ మాజీ పార్లమెంటు సభ్యుడు నారాయణ చౌబే కుమారులైన మానస చౌబే, గౌతం చౌబేల నుంచి వ్యాపార ప్రతిఘటన ఎదురైంది. చాలా సార్లు ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి.

సమస్యలతో విసుగెత్తిన రాంబాబు 1999లో మానస చౌబేని దారుణంగా నరికిచంపాడు. అయినా కూడా వ్యాపార ప్రతిఘటనలు తప్పక పోవడంతో మాజీ ఎం.పీ. రెండవ కుమారుడైన గౌతం చౌబేను ఈ ఏడాది సెప్టెంబర్ 11న హత్య చేశాడు. ఈ హత్యతో పశ్చిమబెంగాల్ పోలీసు వ్యవస్థ ఒక్కసారిగా ఉలికిపడింది. అప్పటికే రాంబాబు హత్యల జాబితా 8కి చేరింది. రాంబాబు కోసం 14 ప్రత్యేక బృందాలు దేశవ్యాప్తంగా వేట ప్రారంభించాయి.

రాంబాబు రాష్ట్రానికి వచ్చి తలదాచు కున్నాడనే సమాచారంతో ఖరగ్‌పూర్ ఎస్.పి. (ఆపరేషన్స్) శ్రీనివాస్ తన బృందంతో విమానంలో స్వయంగా రాష్ట్రానికి వచ్చాడంటే రాంబాబు హత్యలకు బెంగాల్ రాష్ట్రం ఎంతగా హడలిపోయిందో తెలుస్తుంది.

ఎట్టకేలకు హైద్రాబాద్, అమీర్‌పేటలోని మైత్రివనం వద్ద ముఠాలోని ఎస్.బాలరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కూకట్‌పల్లిలో వేర్వేరు ఇళ్ళల్లో తలదాచుకున్న రాంబాబు, అతని సోదరుడు శ్రీనివాస్, కనకరావు, చిన్నరాంబాబు, రాంనరేష్ ఠాకూర్ అలియాస్ సంజయ్‌లను నవంబరు 2న జాయింట్ పోలీసు కమీషనర్ కెప్టెన్ రత్నారెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఆర్.నగర్ సి.ఐ. చక్రపాణి, ఎస్.ఐ.సుధీర్, పశ్చిమ బెంగాల్ పోలీసు బృందాలు అరెస్టు చేశాయి. వీరిలో ఒక రాంబాబు తప్ప మిగతా వారందరూ 27 ఏళ్ళ లోపు వారుకావడం గమనార్హం. అరెస్టయిన వారిని ఐదవ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వారిని మరునటి రోజు ఉదయం ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో పటిష్టమైన బందోబస్తు మధ్య ఖరగ్‌పూర్ తరలించారు.



# అమ్మో... ఆడవేషంలో కేడీ చీటర్

భక్తులలో ఉన్న బలహీనతలను ఆసరాగా చేసుకుని లక్షలు సంపాదించాలనే లక్ష్యంతో అందంగా ఆడవేషం అలంకరించుకొని ముచ్చటగా మూడేళ్ళ నుంచి మోసం చేస్తున్న ఓ ఘరానా మోసగాడి ఉదంతమిది.

* * *

1992 వరకు గుంటూరులోని పట్నం బజారులో అనేక దుకాణాల్లో మూడ వందలకు గుమస్తాగా కొల్లిపాకల శంకరావు (రాజేష్) పనిచేసేవాడు. ఇతగాడి బాధల భరించలేక భార్య విడిచిపెట్టింది. ఇక ఎలాంటి బాదరబందీ లేకపోవడంతో గుమస్తాగిరీ గుడ్‌బై చెప్పి చిన్న, చిన్న మేజిక్కులు నేర్చుకున్నాడు.

ఆశోక్‌నగర్‌లోని ఒక అపార్టుమెంటుని స్థావరంగా చేసుకొని అమ్మవారి పూజలు చేస్తానంటూ తనను తాను అమ్మవారి అవతారంగా ప్రచారం చేసుకుంటూ మోసాలకు దిగాడు. ఇందులో భాగంగా తాను నేర్చుకున్న మేజిక్కుల ద్వారా లాకెట్లు, రూపాయి కాసులు, చిన్నచిన్న విగ్రహాలు అమ్మవారి ప్రసాదంగా అనుగ్రహిస్తూ భారీగానే ఆస్తుల సమకూర్చుకున్నాడు.




అనంచిన్ని వెంకటేశ్వరరావు
విజయవిహారం ప్రత్యేక ప్రతినిధి

### ఆడవేషంతో భక్తి నాటకం రక్తి :

గతంలో గుమస్తాగా పనిచేయడంతో 'వ్యాపారవర్గాల్లో భక్తి పరులెవరు' అనే కోణంలో మొదట వివరాలు సేకరించి, వారిని ఒక పథకం ప్రకారం తన వద్దకు రప్పించుకునేవాడు. తొలుత మామూలు దుస్తుల్లో తనను పరిచయం చేసుకొని పూజగదిలోకి ప్రవేశిస్తాడు. కొద్దిసేపట్లోనే పట్టుచీరను కట్టుకుని బంగారునగలను అలంకరించుకుని అభినవ దేవతగా దర్శనమిచ్చేవాడు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టేటప్పుడు వాటినుంచి బంగారు గాజులు, చిన్న విగ్రహాలు, వెండికాసులు చాలా చాకచక్యంగా బయటకు తీసి నైపుణ్యం ప్రదర్శించేవాడు.



అనంతరం పూజలు చేస్తే ఉన్న శని అంతా తొలగిపోతుందని తన మాటలతో నమ్మించేవాడు. ఇంతలోనే అతనికి అమ్మవారి పూనకం వస్తుంది. ఆ పూనకంలో భక్తుల ఆర్థిక స్థోమతను బట్టి 11, 16 నుంచి 21, 116 రూపాయల వరకు అమ్మవారికి ముడుపులు కట్టాలని కోరతాడు. ఆరు నెలల తరువాత కట్టిన ముడుపులలో ఉన్న సొమ్ము ఒకేసారి పదింతలౌతుందని నమ్మబలుకు తాడు. ఈ పూజా తతంగం నడుస్తుండగానే హస్తలాఘవంతో ముడుపుల కట్టలో ఉన్న సొమ్మును దొంగిలించి అందులో లాటరీ నోట్లకట్లను అనుమానం రానివిధంగా అమర్చేవాడు. పూజాద్రవ్యాలు చల్లిన ఆ ముడుపులను భక్తులకు అందిస్తూ "ఆరునెలల లోపు ఆ ముడుపుల కట్టను విప్పితే ఇంటికి శని పడుతుంది, హఠాత్తుగా కుటుంబ సభ్యులు మరణిస్తారు" అని ఆధ్యాత్మిక బోధనతో బెదిరించేవాడు. ఇలా గత మూడేళ్ళుగా అనేక జాగ్రత్తలు తీసుకుంటూ భక్తుల అమాయకత్వాన్ని, బలహీనతలను తన అవసరాలకనుగుణంగా మార్చుకొని విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఖ్యాతి గుంటూరు జిల్లానుంచి ప్రకాశం జిల్లా వరకు వ్యాపించింది. అంచెలంచెల రాబడితో ఇంట్లో ఏ.సి.మిషన్, ఏయిర్ కూలర్లు, కలర్ టి.వి. ఫ్రిజ్, వాషింగ్ మిషన్ తదితర అధునిక గృహోపకరణాల వచ్చి చేరాయి.

ఇంతలోనే అమరావతికి చెందిన చందోలు వెంకటసత్యనారాయణ ఈ మోసగాడి వలలో చిక్కి లక్షల రూపాయలు మోసపోయాడు. అతని ఫిర్యాదు మేరకు నవంబరు 9న పట్టాభిపురం ఎస్.ఐ. రాఘవరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ళు ప్రసాద్, రాజు, సాంబశివరావు, ఎల్లారావులు మోసగాడు శంకరరావు నివసిస్తున్న అపార్టుమెంట్‌పై దాడి జరిపి శంకరరావు (37)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 2.40 లక్షల నగదు, 15 వేలు విలువచేసే బంగారు ఆభరణాలు, అధునాతన గృహోపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### నమ్మారు కాబట్టే మోసం చేశాను:

పోలీసులు శంకరరావును అరెస్టు చేసిన తరువాత జిల్లా ఎడిషనల్ ఎస్.పి. ఏ.ఆర్. శ్రీనివాస్ జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మోసగాడి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.... తన హస్త వాసి బాగుంటుందని ప్రజలు నమ్మటం వల్లనే తేలిగ్గా మోసం చేశానని, ఈ తరహా మోసాలు తాను బాపట్లలో ఎక్కువగా చేశానని చెప్పాడు.

# కాలా యమహా ముఠా పట్టుబడింది!

సందీప్ కతారియా సినీ పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించి ప్రేమఖైదీ, సర్పయాగం, అల్లరి ప్రేమికుడు చిత్రాలలో విలనీ బృందంలో ఒకరిగా నటిస్తూ... చివరకు నిజజీవితంలో ఓ హంతక ముఠా నాయకుడిగా, నరహంతకుడిగా మారిన వైనం ఇది.

* * *

మూడేళ్ళపాటుహైద్రాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో హత్యలు చేస్తూ, దారిదోపిడీలు చేస్తూ సందీప్ ముఠా పోలీసులకు సవాల్‌గా మారింది.

క్యాష్ బ్యాగ్‌తో ఎవరైనా బ్యాంకుల వద్ద, రిజిస్ట్రేషన్ ఆఫీసుల వద్ద, ప్రముఖ వ్యాపార కూడళ్ళ వద్ద డబ్బుతో ఉన్న వారిని మోటారు బైకులపై వచ్చి కాల్పులు జరిపి కాని, కత్తులతో పొడిచి కాని సొత్తు దొంగిలించుకెళ్ళడం వారి హాబీగా మారింది. డబ్బు దగ్గరుంటే ప్రాణాలుపోయినట్లేనని ప్రజలు భావించి వణికిపోయారు. ఇలా ఒక నెల రోజుల్లోనే ఐదు వేర్వేరు సంఘటనల్లో 6,05,400 సొత్తును దోపిడి చేసి వ్యాపార వర్గాల కంటికి కునుకు లేకుండా చేశారు.

1997లో డబ్బు సంపాదనకోసం స్నేహితుడైన శశితో కల్సి రాంగోపాల్ పేటలో తొలి దోపిడి చేసిన సందీప్ కతారియా అతి తక్కువ కాలంలోనే ఢిల్లీ స్మగ్లర్లతో చేతులు కలిపాడు. అక్కడ పసిపిల్లల కిడ్నాపర్ అయిన ప్రకాశ్ శుక్లా అనుచరుడు, బంధువు అయిన వినయ్ కుమార్ శుక్లాతో స్నేహం కుదిరింది. వీరిద్దరికీ అనేక కరుడుగట్టిన నేరాలతో సంబంధాలు కలిగిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ సికిందర్ అలీ తోడయ్యాడు. వీరి నేర విస్తరణలో బీహార్‌కు చెందిన మోహన్ పళ్వార్, ఢిల్లీకి చెందిన పూల్‌సింగ్, శ్యాంసింగ్ హంతక సోదరులతో పరిచయమేర్పడింది. వీరందరూ కల్సి హైద్రాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో కల్సికట్టుగా దోపిడీలు చేయాలని, అందుకు అడ్డుతగిలిన వారిని నిర్దాక్షిణ్యంగా చంపేయాలని నిర్ణయించుకున్నారు. వీరి పథకాల అమలుకు సందీప్ కతారియా తనతోపాటు కల్సి సినిమాల్లో పనిచేస్తున్న భగత్‌సింగ్ కుమారుడు సంగ్రామ్ సింగ్ సహాయం తీసుకున్నారు. ఇతనితోపాటు స్థానికులైన వెంకటేశ్, శ్యామ్, దేవిదాస్‌ను కూడా కలుపుకొని ఒక హంతకముఠాను ఏర్పాటు చేసుకున్నాడు.

సందీప్ కతారియా దోపిడీకి, హత్యలు చేయడానికి అవసరమైన నాటు తుపాకులు, తూటాలు తీసుకొచ్చాడు.

వీరు దోపిడీ చేసే ప్రతిసారీ నల్లని రంగులో ఉండే 'యమహా' మోటారు సైకళ్ళను ఉపయోగించేవారు. దీంతో ఈ ముఠాకు 'కాలా యమహా' ముఠాగా పోలీసు రికార్డులకెక్కిపోయింది.

ఈ ముఠా 4 హత్యలు, 10 హత్యా యత్నాలు, 4 దోపిడీలు, 2 దొంగతనాలు, 3 వాహన దొంగతనాలు చేశాయి.

వరుస దోపిడీలతో పోలీసులకు తలనొప్పిగా ఒక విధంగా వీరిని పట్టుకోవడం ప్రతిష్ఠాత్మకంగా మారడంతో హైద్రాబాద్ నగర పోలీసు కమీషనర్ పేర్వారం రాములు ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ హంతకముఠాను పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసులు గతంలో ఈ తరహాలో జరిగిన నేరాలు - వాటిలో పాల్గొన్న నేరస్థుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించడం ప్రారంభించారు. రాంగోపాల్ పేట ప్రాంతంలో మూడేళ్ళ క్రితం ఇదే తరహాలో జరిగిన ఒక నేరంలో ప్రధాన నిందితుడైన సందీప్ కతారియా గత కొద్దికాలంగా జల్సా జీవితం గడుపుతున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్సు ఇన్స్‌పెక్టర్ బి. ధనుంజయ్ నేతృత్వంలోని అననయ్య, సుధాకర్, బ్రహ్మం, దినేష్, పురుషోత్తంలతో కూడి బృందం గుడిమల్కాపూర్ ప్రాంతంలోని శారదానగర్‌లో ఒక అపార్టుమెంట్‌లో ఉన్నట్లు తెలుసుకొని దాడిచేశారు. ఈ దాడిలో సందీప్ కతారియాతో పాటు మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు జేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి ఒక లక్షా రెండు వేల నగదు, నాలుగు 8 ఎం.ఎం. రైఫిళ్ళు, 14 బుల్లెట్లు, నాలుగు పిడికత్తులు, రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు.





విజయవిహారం ప్రతినెలా మొదటివారం మిమ్మల్ని నమ్మకంగా చేరే ఒక మార్గం - మీరు పత్రిక చందాదారులుగా చేరడమే!

# ఉత్తరాంధ్ర గురించి

# ఉత్తుత్తి మాటలు ఇంకెన్నాళ్ళు?



'ఉత్తరానా మొదలు దత్తమండలమంత తెలంగాణ ప్రాంతముతో కలిసిమెలిసుండాలి' అన్న వేములపల్లి శ్రీకృష్ణ గీతం పాదాన్ని సువిశాల విశాలాంధ్ర వాసులందరూ తమ జాతిగీతంగా గుండె లోతుల్లోంచి ముక్తకంఠంతో ఆలపించే పరిస్థితి నేడు కరవయ్యింది.

దశాబ్దాల వివక్ష సాక్షిగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ తమ వెనుకబాటు తనం వెనుకగల వెన్నుపోటేవరివి అని వెతుక్కుంటున్న తరుణమిది. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలన్నిటిలోనూ తమ వెనుకబాటుతనాన్ని చివరకు గుర్తించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. ఇలా జరగడానికి కారణం, అనేక విలక్షణతలున్నప్పటికీ తమ ప్రాంత ఉనికినే అనామకం చేశారని ఇటీవలే ఈ ప్రాంత వాసులు తెలుసుకుంటున్నారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల సమైక్య సంస్కృతి, నైసర్గిక సారూప్యత, భాష, ఆచార వ్యవహారాల ప్రత్యేక ప్రతిపత్తి ఈనాటి వరకూ కోస్తా ఆంధ్ర పేరిట పరాయీకరణ, వివక్షలకు లోనవుతున్నాయి. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో కలుపుకుని కోస్తాగా పిలవడాన్ని అలవాటు చెయ్యడం వెనుక నిర్దిష్ట రాజకీయ తంత్రం ఉన్నట్టు ఇటీవలనే ఉత్తరాంధ్రులు గుర్తించారు. సేద్యపునీటి పథకాల మూలంగా సిరిసంపదలను దొరకబుచ్చుకున్న కోస్తా జిల్లాలతో ఉత్తరాంధ్రను కలిపేయడం యాదృచ్ఛికం కాదనీ ఇటీవల ఉత్తరాంధ్రులు గుర్తించారు. దీనికి సాక్ష్యంగా దశాబ్దాలపాటు పాలకుల నిర్లక్ష్య మూలాలను కళ్లకు కట్టేట్టు చూపుతున్నారు.

ఉత్తరాంధ్ర నుంచి పడమటి వైపునకు ప్రవహించే పీలేరు, శబరి నదులు రాష్ట్రంలోనే అతి పెద్దనది అయిన గోదావరికి అశేష జలధారలందిస్తున్నాయన్నది రాష్ట్రమంతా నమ్మవలసిన విజం. గోదావరిలో సంవత్సరం పొడుగునా పారే 2,500 టి.ఎం.సి. నీటిలో 60 శాతం నీటిని శబరి, పీలేరు నదులందిస్తున్నాయి. అయినప్పటికీ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం గోదావరిపై ఒక్క నీటిపారుదల పథకం కూడా ఏర్పాటు కాలేదు. ఈ సందర్భంలో రాష్ట్రంలోని ప్రధాన నదులైన కృష్ణా, గోదావరీ నదుల నీటి వినియోగాన్ని విశ్లేషించడం ఎంతైనా అవసరం. గోదావరి కేచ్‌మెంట్ ప్రాంతం 3.1 లక్షల చదరపు కిలోమీటర్లు, నదిలోకి 119 క్యూబిక్ కిలోమీటర్ల నీరు వస్తుంది. కృష్ణా నది కేచ్‌మెంట్ ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లు, పారే నీరు 68 క్యూబిక్ కిలోమీటర్లు. అయితే కృష్ణా నది నీరు అధికశాతం వినియోగమవుతుండగా గోదావరి నదీ జలాలను 13 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నారు. సముద్రంలోనికి గోదావరి నుంచి 2,200 టి.ఎం.సి. నీరు పోతోంది. ఏనాడో కాటన్ దొర కట్టిన ధవళేశ్వరం ఆనకట్ట మినహా గోదావరిపై ప్రాజెక్టు లేదు. రామపాద సాగర్ ప్రాజెక్ట్‌గా 1941లో ముందుకు వచ్చిన ప్రతిపాదన కాలగర్భంలో కలిసిపోయింది.

విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పడిన తరువాత, కర్మాగారానికి నీరందించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై పడ్డంవల్ల 1978లో పోలవరం ప్రాజెక్ట్ రూపకల్పన జరిగింది. దీని ద్వారా 366 టి.ఎం.సి.ల గోదావరి నీరు వినియోగించ వచ్చనీ, 720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని, ఏడు లక్షల 20 వేల ఎకరాలకు నీరందించడం, విశాఖ పరిసర ప్రాంత పరిశ్రమలకు 23.44 టి.ఎం.సి.ల నీరు అందించవచ్చని ప్రతిపాదించారు. ఐతే షరామామూలుగా రాజకీయ వివక్షలో భాగంగానో, నిర్లక్ష్యం ఫలితంగానో ప్రాజెక్ట్ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సుమారు 11 నదులున్నాయి. వీటిలో వంశధార ఒక్కటే జీవనదిగా చెప్పవచ్చు. సాలీనా ఉత్తరాంధ్రలో వంద సెంటీమీటర్ల వర్షం కురుస్తుంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇది హెచ్చుశాతమే. కానీ వివరాల్లోకి వెళితే ఈ వర్షపాతం అంతా ఏటా సంభవించే 2-3 తుఫానుల్లో కురుస్తుంది. ఏడాదిలో మిగతా సమయమంతా పొలాలు బీడుపడాల్సిన పరిస్థితి.

ఉత్తరాంధ్రలో 70 శాతం ప్రజల జీవనాధారం వ్యవసాయం. ఐతే సాంప్రదాయ చోళ్లసాగు దాదాపు అంతరించిపోగా, బియ్యం సంస్కృతికి అనివార్యంగా అలవాటు పడ్డ ప్రాంతంలో నీటి వనరులు కరువవడంతో బీడుపడ్డ పొలాలను తెగనమ్ముకొని జీతగాళ్లుగా, కూలీలుగా వలసపోవడం నిరంతరంగా సాగుతోంది. ఈ ప్రాంత పొలాలను తక్కువ ధరకు చేజిక్కించుకున్న ఉత్తరాంధ్రేతరులు డబ్బు సంచులను కుమ్మరిస్తూ నవీన నీటిపారుదల సౌకర్యాలను వినియోగించుకుంటూ తోటసేద్యాన్ని వాణిజ్య సేద్యాన్ని పెంపొందించి ప్రాంత భూమిపైనే కాదు, భుక్తిపైనే కాదు, మొత్తం సంస్కృతిపై ప్రభావం చూపుతున్నారు.

ఒక విషాద వైపరీత్యం ఏమిటంటే 'కోస్తా' ఆంధ్ర ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో ఊడ్పులు, కోతలు సమయంలో పనులకోసం దేబిరించేది ఉత్తరాంధ్ర రైతు కూలీలే. అటు పూరీ నుంచి, భువనేశ్వర్, రాయపూర్, భోజ్‌పూర్, జగదల్‌పూర్లలో ఉత్తరాంధ్ర వాసులు రిక్షావాలాలుగా, కూలీలుగా భృతి వెదుక్కొంటున్నారు. తమ ప్రాంత వ్యవసాయం పరాయీకరణకు గురికాగా పిడికెడు మెతుకుల కోసం ఉత్తరాంధ్రులు అన్నార్తులుగా వలసలు పోతున్నారు.



శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని విశాల అటవీప్రాంతంలోని అనేక గ్రామాలకు నేటికీ రక్షిత మంచినీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేదన్నది వాస్తవం. వర్షాలొస్తే ఏజన్సీలో వ్యాధులు ప్రబలి ఎందరో చనిపోతున్నా, వారి అపరిశుభ్రతే ఇందుకు కారణంగా చూపుతున్నారు. ఏటా విజయనగరం జిల్లాలోని అనేక ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తుంటారు. అనేక సహజ వనరులున్న ఈ ప్రాంతంలో ఈ పరిస్థితి ప్రకృతి సిద్ధమా అని ప్రశ్నిస్తే కానే కాదు మానవ నిర్మితమన్నది స్పష్టమవుతుంది.

ఉత్తరాంధ్రలో అత్యధికంగా అభివృద్ధి చెందిన విశాఖ నగరం ఈ ప్రాంత వాసులకు మొండి చెయ్యే చూపుతోంది. ఒక పక్క సముద్రం, మూడు పక్కల కొండలతో లోయలా ఉండే విశాఖ నగరంలో ప్రస్తుతం ఏనాటి నుంచో నగరంలో ఉండే స్థానికులు కొండవాలు ప్రాంతాల్లో ఇరుకు కూపాల్లో జీవనం సాగిస్తున్నారు.

సిరులొలికే సిరిపురం వంటి సకల సౌకర్యాల నగర ప్రాంతంలో స్థానికేతరులు వాణిజ్య, విద్యా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆశీమెట్టగా పిలిచే ఒకనాటి ప్రాంతం ప్రస్తుతం కోస్తా కార్పొరేట్ విద్యా కార్ఖానాల ఎస్టేట్‌గా మారిపోయింది. విశాఖలోని ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు ఎటూ స్థానికులకు లేవు. విచిత్రమేమంటే నగరంలోని భారీ పరిశ్రమల్లో కాంట్రాక్టులు కైవసం చేసుకుంటున్నది స్థానికేతరులే. ఇక్కడి భారీ టెండర్లూ స్థానికేతరులకే స్వంతమవుతున్నాయి. ఉత్తరాంధ్రలోని బారువ నుంచి పాయకరావు పేట వరకూ గల భారీ తీరప్రాంతంలోని సాంప్రదాయ మత్స్యకారులు భారీ ట్రాలర్లు, మెకనైజ్డ్ బోట్ల స్థానికేతర యాజమాన్యాలతో పోటీ పడలేక వృత్తిని వదిలి, ఇతరత్రా కూలిపనులకు తరలిపోతున్నారు.

ఈ ప్రాంతం మొత్తానికి విద్యా కేంద్రంగా విశాఖలోని ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ఏర్పాటయితే ప్రస్తుతం దాన్ని కూడా అటు అధ్యాపకపరంగా, విద్యాపరంగా స్థానికేతరులు హస్తగతం చేసుకున్నారు. ఈ పరిణామానికి అసలు కారణం ఉత్తరాంధ్రను జోన్ వన్ కింద పరిగణించడం వల్ల గతంలో ఈ ప్రాంతానికి చెందిన యువతీయువకులు, ఇంజనీర్లు, డాక్టర్లు తదితర వృత్తివిద్యల్లో రాణించగలిగారు. ఈ జోన్ అవకాశాన్ని చాపకింద నీరులా రెండో కంటికి తెలియకుండా తప్పించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని విశాల అటవీప్రాంతంలోని అనేక గ్రామాలకు నేటికీ రక్షిత మంచినీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేదన్నది వాస్తవం. వర్షాలొస్తే ఏజన్సీలో వ్యాధులు ప్రబలి ఎందరో చనిపోతున్నా, వారి అపరిశుభ్రతే ఇందుకు కారణంగా చూపుతున్నారు. ఏటా విజయనగరం జిల్లాలోని అనేక ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తుంటారు. అనేక సహజ వనరులున్న ఈ ప్రాంతంలో ఈ పరస్థితి ప్రకృతి సిద్ధమా అని ప్రశ్నిస్తే కానే కాదు మానవ నిర్మితమన్నది స్పష్టమవుతుంది.

వివక్షకూ, పరాయీకరణకూ ఆలవాలమైన ఉత్తరాంధ్ర ప్రజానీకంలో వెనుకబాటుతనంపై చర్చ మొదలయ్యింది. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచీ నేటి వరకూ 'కోస్తా' ఆంధ్ర నుంచి ఏడుగురు, తెలంగాణా నుంచి ఐదుగురు, రాయలసీమ నుంచి నలుగురు ముఖ్యమంత్రులయ్యారనీ, కాని ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఒక్కరూ ముఖ్యమంత్రి కాలేదని ఇందుకు కారణాలేంటని సహేతుక సమాధానాలను కోరుతూ సందేహాలు మొలుస్తున్నాయి. ఉత్తరాంధ్ర నుంచి ప్రస్తుతం ఎన్నికైన 37 మంది శాసన సభ్యుల్లో 31 మంది తెలుగు దేశం పార్టీకి చెందినవారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యుల్లో ఆరుగురు తెలుగుదేశం పార్టీకి చెందినవారు. ఉత్తరాంధ్రలోని నాలుగు శాసన సభ నియోజకవర్గాల ప్రతినిధులు స్థానికేతరులు.

ఇద్దరు లోక్‌సభ సభ్యులు, ఒక రాజ్య సభసభ్యుడు స్థానికేతరులు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రగతికి అవసరమయ్యే ప్రాజెక్టుల సాధనలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఇటీవల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు విశాఖలో జరిగిన తెలుగుదేశం మహానాడులో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యను తీసుకురాని వైనాన్ని మంచి ఉదాహరణగా స్థానికులు చూపుతున్నారు.

ఉత్తరాంధ్ర ప్రాంతంలోని కొందరు బుద్ధిజీవులు, మేధావులలో 1990లోనే ఉత్తరాంధ్ర సంరక్షణ సమితి ఏర్పడింది. అనంతరం ఉత్తరాంధ్ర జలసాధన సమితి, ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వంటి సంస్థలు ఈ ప్రాంత వెనుకబాటుతనం వెనుక ఉన్న కారణాలను వెదికి నలుగురిలోనూ చర్చకు పెడుతున్నారు. భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకోసం జరిగిన పెద్దమనుషుల ఒప్పందంలో పాల్గొన్న గౌతు లచ్చన్న ఇటీవల ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిధిగా విచ్చేసి ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణాలు వివరించడం ఒక పెద్ద పరిణామాత్మక మార్పుకు, ఈ ప్రాంత ప్రజల ఆవేదనకూ ప్రతీకగా చెప్పవచ్చు.

గోదావరిలో సంవత్సరం పొడుగునా పారే 2,500 టి.ఎం.సి. నీటిలో 60 శాతం నీటిని శబరి, పీలేరు నదులందిస్తు న్నాయి. అయినప్పటికీ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం గోదావరిపై ఒక్క నీటిపారుదల పథకం కూడా ఏర్పాటు కాలేదు.

ఉత్తరాంధ్ర ప్రాంత సహజ వనరుల సక్రమ వినియోగానికి ప్రాజెక్టులు చేపట్టాలని, ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో కోటా పద్ధతిపై స్థానికులకు ఉపాధి కల్పించాలని, ఉత్తరాంధ్ర ప్రాంతంలోని అన్ని నదులనూ అనుసంధాన పరిచి వ్యవసాయానికి వినియోగించాలని ఈ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు. విద్య, ఉద్యోగాల్లో జోన్ స్థాయి రిజర్వేషన్ అమలుచేయాలని, గోదావరి జలాలను బాహుదా నది వరకూ తీసుకురావాలని, శ్రీమంతుల వలసను అరికట్టి ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసి, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు పరచాలని ఉతరాంధ్రులు కోరుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర సమగ్ర సమాంతరాభివృద్ధిని ఇకపై విస్మరిస్తే వెనుకబాటుతనం చైతన్యం ఎన్నికల్లో ప్రతిఫలించే ప్రమాదముందని, అందుకనే అన్ని పార్టీలూ ఈ ప్రాంత అవసరాల కోసం, అభివృద్ధి కోసం నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేసుకోకుంటే ప్రజాప్రతినిధుల అధికారం కిందికి నీళ్ళొచ్చే ప్రమాదముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

- ఎం.డి. అబ్దుల్లా

## వయసు-17, ఊరు-జైపూర్, విజయం-కవిత్వంలో ఇంటర్నేషనల్ అవార్డు గరిమ గుప్తా



జైపూర్‌కి చెందిన పదిహేడేళ్ల గరిమగుప్తా ఈ తరం టీనేజర్. హృతిక్ అన్నా, ఐశ్వర్య అన్నా బోలెడంత ఇష్టం. నెట్ సర్ఫింగ్, ఛాటింగ్ లాంటి హాబీలు ఎలాగూవున్నాయి. అప్పుడప్పుడూ పెన్ను పట్టుకుని కవిత్వమూ రాస్తుంది. ఈ మధ్యనే ఆమె రాసిన 'లవ్' అనే కవితకి వరల్డ్‌ఛాంపియన్ అమెచ్యూర్ పొయెట్ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద ఇరవైవేల డాలర్ల నగదు బహుమతి కూడా ఇచ్చారు. వాషింగ్టన్‌లో గత ఆగస్ట్‌లో 'ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ పొయెట్స్' ఏర్పాటుచేసిన ఒక సదస్సులో ఆమె తన కవితలను వినిపించింది. ఈ సొసైటీ 1990లో ఏర్పాటైంది. వీరు ప్రతి ఏటా నిర్వహించే అమెచ్యూర్ పొయెట్రీ కాంపిటీషన్‌లోనే గరిమ కవితకి అవార్డు లభించింది. ఈ సొసైటీ ప్రతి ఏడాదీ ప్రచురించే సంకలనంలోకి ఆడియో క్యాసెట్‌లోకి గరిమ కవితలు ఎక్కాయి.

కవిత్వం మీద ఎప్పుడు శ్రద్ధ పెట్టని గరిమ, ఒక రోజు నెట్ సర్ఫింగ్ చేస్తుండగా పొయెట్రీ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌ను చూసింది. సరదాగా ఆ సైట్‌లో తన కవితలను కూడా పరిచయం చేసింది. కొద్ది రోజులకి ఇంటర్నేషనల్ పొయెట్స్ సొసైటీ నుంచి - మీ కవితలను పోటీలోకి తీసుకుంటున్నామంటూ ఒక లెటర్ రావటం చూసి ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత అవార్డు రావటం, వాషింగ్టన్‌లో జరిగిన కవుల సదస్సులో పాల్గొని కవితలను చదవటం జరిగిపోయాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న గరిమ 78 శాతం మార్కులతో ఇంటర్ పాసయింది. ప్రస్తుతం మెడిసిన్ సీటు కోసం ఎంట్రన్స్ టెస్ట్‌కు సిద్ధమవుతోంది.

స్థాయిలో అంచనా ఉన్నట్టే మనం అనుకోవచ్చు.

దశరథరామ్ టీమ్ మిత్రుడొకరు విజయవిహారానికి చెప్పిన దాని ప్రకారం - అప్పటి కాంగ్రెస్ నాయకుడు వంగవీటి మోహనరంగాకి - దశరథరామ్ హత్య కుట్రకి సంబంధించిన వివరాలు ఏదో ఒక స్థాయిలో లీకయి - తెలిశాయి. రంగా దశరథరామ్‌ని ఈ విషయంపై హెచ్చరించాడు. దశరథరామ్ తనకి అలవాటైన శైలిలో "పీక్కోమను. నన్నేం చేయలేరు. నేనే ఈ రాబోయే సంచికలో ఈ ప్రభుత్వం కూకటివేళ్ళతో కంపించే సమాచారం ప్రింట్ చేస్తాను" అన్నాడు. ఇదంతా మాకు నాటి ఎన్‌కౌంటర్ టీమ్ మిత్రుడొకరు చెప్పారు.

అయితే ఇందులో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ వుంది. దశరథరామ్ హత్య అనంతరం రంగా ఒక ప్రకటన ఇచ్చారు, అది : "దశరథరామ్ హత్యలో పెద్ద మనుషుల ప్రమేయం" అనే శీర్షికతో అక్టోబరు 23, 1985 నాటి ఆంధ్రభూమి దిన పత్రికలో వచ్చింది. ఆ వార్తలో ఇలా వుంది : "రాజకీయపక్షపత్రిక 'ఎన్‌కౌంటర్' ఎడిటర్ శ్రీ పింగళి దశరథరామ్ హత్య వెనుక కొంతమంది 'పెద్దమనుషులు' హస్తం ఉన్నదని కాంగ్రెస్ ఐ ఎమ్మెల్యే శ్రీ వంగవీటి మోహనరంగారావు ఆరోపించారు. మంగళవారం ఇక్కడ పాత్రికేయులతో మాట్లాడుతూ, తన వద్ద తగిన సాక్ష్యాదారాలు ఉన్నాయనీ, ప్రభుత్వం న్యాయ విచారణ ఆదేశిస్తే వాటిని బయట పెట్టగలమనీ ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి అల్లుడు శ్రీ చంద్రబాబునాయుడు తనను హత్య చేయించాలని కుట్రపన్నినట్టు శ్రీ దశరథరామ్ ఇటీవల కాంగ్రెస్ ఐ సానుభూతి పరుడైన ఒకరికి చెప్పారనీ, అటు తర్వాత రెండు రోజులలోనే హత్య జరిగిందనీ శ్రీ రంగా చెప్పారు. సదరు సానుభూతిపరుని పేరు బయటపెడితే పోలీసులు అతడిని వేధిస్తారనీ, న్యాయవిచారణ జరిగితే అంతా చెబుతామనీ ఆయన అన్నారు".

దీని ప్రకారం దశరథరామ్‌కి తనను హత్య చేసిన పథకం గురించి తెలుసు. దీన్ని ఆయనే మరొకరికి చెప్పాడు.

(ఆంధ్రభూమిలో రంగా ప్రకటన ఇంకా ఇలా సాగింది. " ప్రెస్ బిల్లును ఏ జర్నలిస్టు వైపు గురిపెట్టారో అతనినే చంపివేసారు. అదే వ్యక్తులు నన్ను కూడా చంపాలని చూస్తున్నారు."

నిజంగానే దశరథరామ్ హత్య జరిగిన కొంతకాలానికి రంగాను హత్య చేశారు. అది కూడా ఆయన తన ప్రాణాలకి రక్షణ కల్పించాలని నిరాహార దీక్ష చేస్తున్న శిబిరంలో. నిజానికి ఈ రెండు హత్యలకి లింకువుందని దశరథరామ్ హత్యలో ఇన్వాల్వ్ అయిన ముఠానే, రంగా హత్యలోనూ ఇన్వాల్వ్ అయిందని నమ్మేవారున్నారు)

దశరథరామ్ హత్యకి కారణాలపైన కూడా రకరకాల ఊహాగానాలు సాగాయి. దశరథరామ్ అప్పటి హోంమంత్రి వసంత నాగేశ్వరరావు కుమార్తె గురించి రాశాడని అదే అతని హత్యకు దారి తీసిందని కొందరంటే, అది నిజం కాదనీ, సాక్షాత్తూ అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమార్తెకి సంబంధించిన వ్యక్తిగత సమాచారమే దశరథరామ్ సేకరించాడని అది ప్రచురించబోతున్న విషయం లీక్ అయిందని అదే దశరథరామ్ హత్యకి కారణమని కొందరు చెప్పుకున్నారు. కారంచేడులో దళితుల మారణకాండపైన దశరథరామ్ చొరవ ప్రదర్శించి - వీడియో తీయడం, సభల్లో మాట్లాడటం, అగ్రెసివ్‌గా రాయడం - వెంటనే నెలరోజుల్లో ఆయన హత్యకి దారి తీసిందేమోననే అనుమానం సంగతి గత సంచికలో ప్రస్తావించాను. ఆనాటి పోలీస్ సూపరింటెండెంట్‌గా వున్న కె.యస్. వ్యాస్ అక్రమసంబంధంపైన దశరథరామ్ ఆధారసహితంగా వార్త ప్రచురించబోయాడని అదే అతడి ప్రాణాల మీదకి తెచ్చిందని కొందరు విశ్వసిస్తారు.

ఈ రకమైన చర్చలన్నీ దశరథరామ్ హత్య అనంతరం అనేక రాష్ట్ర, జాతీయ పత్రికల్లోనూ, ఆ తర్వాత చాలాకాలానికి మహమ్మద్ సర్వర్ సంపాదకత్వంలో వెలువడిన ఎన్‌కౌంటర్‌లోనూ వచ్చాయి.

ఆశ్చర్యం ఏమిటంటే - ఈ అంశాల్లో వసంత ఎపిసోడ్ తప్ప - ఎన్టీఆర్ వ్యవహారం, వ్యాస్ వ్యవహారం ఎన్‌కౌంటర్‌లో ఎప్పుడూ ప్రింట్‌కాలేదు. వసంత ఎపిసోడ్ ఈ హత్యకి ప్రధాన కారణం కాకపోవచ్చని సర్వర్ సంపాదకత్వంలో వచ్చిన ఎన్‌కౌంటర్ సూచించింది.

చిత్రమేమిటంటే దశరథరామ్ మరణానంతరం కారంచేడు వీడియో, ఎన్టీఆర్, వ్యాస్ వ్యవహారాలకి సంబంధించిన సమాచారం - దశరథరామ్ కుటుంబ సభ్యులకి లేదా ఎన్‌కౌంటర్ టీమ్‌కిగానీ లభించకుండా,దశరథరామ్ టేబుల్ మీదనుంచే అంతుచిక్కని రీతిలో మిస్ అయ్యింది.

అయితే ఒక్కటి మాత్రం నిజం - దశరథరామ్ తన పత్రికలో ప్రచురించ దలుచుకున్న సమాచారానికి సంబంధించి ఎటువంటి గోప్యత పాటించేవాడు కాదు, పైగా ఆ సమాచారం బాహాటంగా మిత్రులతో ప్రస్తావించేవాడు, ప్రత్యర్థులని హెచ్చరిస్తూ చెప్పేవాడు, సభల్లో 'నేనిదిరాయబోతున్నాను' అని వెల్లడించేవాడు. తన జీవితం - 'తెరచిన పుస్తకం'లా వుండాలి అని కోరుకున్న దశరథరామ్ - పాత్రికేయ జీవితంలో స్కూప్‌లకి సంబంధించి సమాచారాన్ని కూడా, లెక్షలేకుండా పబ్లిగ్గా చెప్పేవాడు. సీక్రెసీ పాటించేవాడు కాదు. అందువల్ల ఆయన రాయదలుచుకున్న సమాచారం సంగతి బయటకి పొక్కడం మాత్రం ఆశ్చర్యం కాదు.

హత్యవెనకాల కారణాల గురించి, శక్తుల గురించి మరోసారి వివరంగా చర్చిద్దాము.

అయితే, తనని హత్య చేసేందుకు ఏదో ఒక స్థాయిలో కుట్ర నడుస్తోందని ఎంతోకొంత సమాచారం తనకి తెలిసినా దశరథరామ్ ఇసుమంతైనా చెక్కు చెదరలేదని, బెంబేలు పడలేదని - అదే నైతిక స్థైర్యంతో అదే ఆత్మవిశ్వాసంతో - మృత్యువుని ఎదుర్కొన్నాడన్నది ఇక్కడ ముఖ్యం.

తెలుగు జర్నలిజం చరిత్రలో అంతపాశవికంగా ఒక జర్నలిస్టు నడిరోడ్డున హత్య చేయబడ్డ సంఘటన అదే.

ప్రశ్నించే సాహసానికి, పోరాడే స్థైర్యానికి, వెరపెరుగని తిరుగుబాటుకి - కత్తిపోట్లని బహుమతిగా ఇచ్చిన దుర్దినం అది.

ఆ రోజు 1985, అక్టోబర్ 20.

## రాత్రి సిన్మాకి వెళ్దాం...

(16 సంవత్సరాల తర్వాత కాదు, ఆమరణాంతం మరచిపోలేని కాళరాత్రి, తన జీవితంలో చీకటిని కుమ్మరించిన ఆ రాత్రి జ్ఞాపకాలను.... శోకమూర్తి సుశీల మా కోసం మళ్లీ మననం చేసుకున్నారు.)

అప్పుడు మార్కెట్లోకి రావాల్సిన ఎన్‌కౌంటర్ తాజా సంచిక కోసం దశరథరామ్ నాలుగురోజుల్నుంచీ వంచిన తల ఎత్తకుండా రాస్తున్నాడు. చివరికి

ఆ సాయంత్రానికి మేటర్ రాయడం పూర్తయ్యింది.

సాయంత్రం 5-6 గంటల మధ్యలో ఫ్రెండ్ వస్తే ఆ ఫ్రెండ్‌ని బస్ ఎక్కిస్తానని రిలీఫ్‌గా బయటికి వెళ్లాడు దశరథరామ్.

రాత్రి ఇంటికి వచ్చి, సెకండ్ షో "ప్రతిఘటన" సినిమాకి తీసుకువెళతానని దశరథరామ్ భార్యకి చెప్పాడు. 4 సంవత్సరాల వైవాహిక జీవితంలో అటువంటి ఘట్టాలు కాస్త అరుదు, అపురూపం కాబట్టి సుశీల కాస్త సంబరపడ్డారు.

దశరథరామ్ బయటికి వెళ్లిన కాసేపటికి మిత్రుడు సూరప్పడుగారు వచ్చి తలుపుతట్టారు. ఎ.వి.యస్.రెడ్డి - దశరథరామ్‌ని కలవాలనుకుంటున్నారని సూరప్పడు కబురు తెచ్చారు. దశరథరామ్ అప్పుడే బయటకి వెళ్ళారని,కాసేపట్లో వస్తారని,వచ్చాక చెపుతానని - సుశీల చెప్పారు.

కాసేపటికి ఒక పోలీస్ వచ్చి తలుపు తట్టారు.

'దశరథరామ్ ఉన్నాడా?' అని అడిగారు.

సుశీలకి పోలీసును చూసి భయం వేసింది. 'మళ్లీ ఏ ముప్పు ముంచుకొచ్చిందో" అనుకున్నారావిడ. చటుక్కున 'లేదు, హైద్రాబాద్ వెళ్లాడు' అని అబద్ధం చెప్పారు.

ఆ పోలీసు అదోలా చూసి వెళ్లి పోయాడు.

## నడిరోడ్డు మీద నరికి చంపారు...

అంతకు కొద్ది సేపటి క్రితం:

దశరథరామ్ మిత్రుడిని బస్టాండ్‌లో బస్ ఎక్కించి, రిక్షాలో ఇంటికి బయల్దేరాడు. అన్నపూర్ణ బ్రాందీ షాపు నుంచి రిలాక్స్ కావడానికి ఒక మద్యం సీసా కొనుక్కున్నాడు. రిక్షా రూఫ్‌ని తొలగింపచేశాడు. తర్వాత సత్యనారాయణపురం గేటు దగ్గర రిక్షా ఆపి తనకి అవసరమైన కొన్ని పుస్తకాలు కొనుక్కున్నాడు.

సమయం సరిగ్గా రాత్రి 8 గం.30ని. అయింది. రిక్షా సత్యనారాయణపురం పార్కు రోడ్డు మలుపు తిరిగి, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్ ఎదురుగా ఉండే గిరి రోడ్డులోకి వచ్చింది. ఆ రోడ్డులో మొదటి నాలుగు రోడ్ల కూడలి రాగానే అప్పటి వరకూ అనుసరించి వస్తున్న ముష్కరులు మొదట రిక్షాని ఆపారు. వాళ్ల చేతుల్లో కత్తులు, మారణాయుధాలు తళతళా మెరుస్తున్నాయి. రిక్షా వాడికి ముచ్చెమటలు పట్టి రిక్షా వదిలి పక్కకి జరిగాడు.

దశరథరామ్ 'ఏమిటిది, నేను మీకు ఏం హాని చేశాను' అని అడుగుతున్నంతలోనే కిరాతకులు బాకులతో గుండెలపైనా, కడుపులోనూ విచక్షణా రహితంగా పొడిచారు. 'అమ్మా...' అని విలవిలలాడుతూ బాధతో ముందుకు వంగాడు దశరథరామ్. హంతకుల కసి ఇంకా తీరలేదు.

అతడు ముందుకు వంగగానే పిచ్చిపట్టినట్టు వీపుపైన, మెడపైన, తలపైన ఇష్టం వచ్చినట్టు కత్తులతో చీల్చారు. దశరథరామ్... ఎట్టి పరిస్థితిలోనూ బతికే ప్రసక్తి వుండకూడదని... ఆ హంతకులకి ఎవరైనా బలంగా ఆదేశాలిచ్చారో ఏమో... చివరికి దశరథరామ్ చేతులు, మోకాళ్లు కూడా ఆ ఉన్మాదుల కత్తిపోట్లకి ఛిద్రమయ్యాయి. దశరథరామ్ శరీరంపై సుమారుగా 20 సార్లు కత్తితో పొడిచాక... అప్పటికే నెత్తుటి మడుగులో వున్న ఆ వీరుడు భౌతికంగా ఇక బతికే అవకాశం లేదని స్పష్టంగా నిర్ధారించుకున్న- ఆ రాక్షసులు తృప్తిగా నిష్క్రమించారు.



గజగజలాడుతున్న రిక్షావాడు రిక్షాని పోలీసు స్టేషన్‌కి తరలించాడు.

## 'ఎవరో పత్రికతన్ని.. చంపేశారుట'

నిజానికి పోలీసు దశరథరామ్ ఇంటికి వచ్చింది ఈ ఘోరవార్తని చెప్పడానికే. కానీ సుశీల అమాయకంగా అబద్ధం ఆడేసరికి, ఆమెకి 'అసలు విషయం' చెప్పలేక వెళ్ళిపోయాడు పోలీసు.

దశరథరామ్ తల్లి జానకీదేవికి టైలరింగ్ షాప్ ఉండేది. పోలీసులు అక్కడికి వెళ్ళారు, కానీ జానకమ్మ అక్కడ లేరు, ఏమండి బయటకి వెళ్ళారు.

బయట జనం 'ఎవరో పత్రికతన్ని... అక్కడ చంపేశారుట' అనుకోవడం విన్నారు ఆమె.

పోలీసు వెళ్ళిన కొద్దిసేపట్లో దశరథరామ్ మిత్రుడొకరు ఆందోళనగా వచ్చి సుశీలకి ఈ దుర్వార్త చెప్పారు. ఈలోగా జానకమ్మ కూడా ఇంటికి చేరుకున్నారు.

పావుగంటలో పోలీసులు వచ్చి కుటుంబసభ్యుల్ని స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

స్టేషన్ ముందు నెత్తుటితో తడిసిన రిక్షా ఉంది.

## అయ్యో.. ప్రాణం ఉంది... చంపెయ్యకండి... హాస్పిటల్‌కి తీసుకెళ్ళనివ్వండి...

రిక్షా నుంచి కారే నెత్తురు మట్టిని తడుపుతోంది. రిక్షాలో ఒరిగిపోయిన నెత్తుటి జల్లెడ లాంటి దశరథరామ్ దేహం... చూసి సుశీల, జానకమ్మలకి గుండెలవిసిపోయాయి.

ఇటువంటి ఘోరమేదో... ఎప్పుడో ఒక రోజు చూడకతప్పదని... గత 5 సంవత్సరాలుగా వాళ్ళు తల్లడిల్లని క్షణం లేదు. ఇంతలోనే ఈ దురదృష్టం ముంచుకొచ్చింది... రిక్షాలో రక్తపుష్పంలా ఒరిగి ఉన్న దశరథరామ్‌ని చూసి ఆ దిక్కులేని ఆడవాళ్ళిద్దరూ గుండె పగిలేలా ఏడ్చారు.

సుశీల వయసు అప్పటికి కేవలం 24 సంవత్సరాలు. దశరథరామ్‌ని ప్రేమించి పెళ్ళిచేసుకుని కేవలం 4 సంవత్సరాలైంది. ఒక మూడు సంవత్సరాల పాప, రెండు సంవత్సరాల వయసున్న బాబు, అదికాక అప్పటికి ఆమె గర్భవతి...

... అంతలోనే ఈ శోకం... ఆమె గుండెల్ని చీల్చేస్తోంది... రిక్షాలో తన ప్రాణం... తన సర్వస్వం... కాలు మీద కాలు వేసుకుని ఒరిగిన తన 'రాము'... దేహాన్నుంచి ఇంకా రక్తం ప్రవిస్తూనే ఉంది.

కన్నీళ్ళ మధ్య... ఆమె అస్పష్టంగా ఒక విషయం గమనించింది... నిజమే... ఆరు అడుగుల రాము దేహం... ...నె...మ్మ...ది...గా..., కష్టంగా... బలవంతంగా... ఊపిరి తీసుకుంటోంది... షర్ట్ మెల్లగా కదలడాన్ని... ఆమె గమనించింది. ఇక ఆమె ఆగలేదు.

'అత్తయ్యా... ప్రాణం ఉంది అత్తయ్యా... రండి ఆయన్ని మనం హాస్పిటల్‌కి తీసుకెళదాం...' అని కంగారుగా అరిచి... ఆమె ఒక్క ఉదుటున రిక్షా వద్దకి చేరి తన రాము వైపు చెయ్యి చాచింది...

చాచిన చేతి మీద బలంగా ఎముక విరిగేలా... పోలీసు లాఠీ... దెబ్బతగిలింది. "నువ్వు ముట్టుకోవడానికి వీల్లేదు. ఇది స్పాట్ డెడ్ కేసు" అని హూంకరించాడు ఒక పోలీసు కింకరుడు.

"అయ్యో... బ్రతికే ఉన్నాడయ్యా... ఇంకా కాస్త ఊపిరి ఉంది... హాస్పిటల్‌కి తీసుకువెళ్ళనివ్వండి... చంపెయ్యకండి" అని ఆ ఆడవాళ్ళిద్దరూ అసహాయంగా రోదిస్తూ... కాళ్ళావేళ్ళా పడినా ఆ ఖాకీ కిరాతకుల గుండెలు కరగలేదు.

తమ ఖర్చుతోటే వాహనం ఏర్పాటు చేస్తామని, లేదా కనీసం అక్కడికి ఒకసారి డాక్టర్‌ని పిలవమని - వేడుకున్నా పోలీసులు ఒప్పుకోలేదు.

దశరథరామ్ దేహంలో కడ ఊపిరిని తీసే కర్తవ్యమేదో తమకి అప్పగించబడిందన్నట్టుగా వాళ్ళు వ్యవహరించారు.

సమయం గడిచాక నెత్తురోడుతున్న దశరథరామ్‌ని పోలీసులు రిక్షా మీద నుంచి దించి కటిక నేల మీద పడుకోబెట్టారు.

మరికొంత సేపు గడిచాక - బకెట్లతో నీళ్ళు తెచ్చి దేహం మీద పోశారు. కత్తిపోట్లతో ఛిద్రమైన ఆ దేహంలో... ఇంకా ఎక్కడో మినుకుమినుకుమన్న ప్రాణం... అప్పటికి ఇక ఆరిపోయి ఉండాలి.

ఆధారాల్ని సేకరించాల్సిన పోలీసులు - దశరథరామ్ దేహంపై మిగిలిన హంతకుల ఆనవాళ్ళను, వేలిముద్రలను తుడిచేసేందుకే - అలా నీళ్ళు పోశారా?

పోలీసుల ప్రవర్తన పూర్తిగా అనుమానాస్పదంగా ఉంది.

ఈ వార్త రాత్రి మెల్లగా నగరంలో నలుగురికీ తెలిసి - దశరథరామ్ సన్నిహితులు, మిత్రులు స్టేషన్‌కి వచ్చేసరికి చాలా టైమ్ పట్టింది.

రాత్రి పన్నెండున్నర, ఒంటిగంట ప్రాంతంలో ఎన్‌కౌంటర్ అభిమానులు, స్నేహితు ఆందోళనగా స్టేషన్‌కి రావడం ప్రారంభించారు.

పోలీసులు ఎవర్నీ దశరథరామ్ దేహం దగ్గిరకి పోనివ్వలేదు.

తెల్లవారేముందు - ఉదయం 4గం.30ని. ప్రాంతంలో పోలీసులు దశరథరామ్ దేహాన్ని పోస్టుమార్టమ్‌కి పంపారు.

తెల్లవారేసరికి - దినపత్రికలు దశరథరామ్ మరణవార్తని - రాష్ట్రమంతటా లక్షలాదిమంది దశరథరామ్ అభిమానులకి మోసుకెళ్ళాయి.

రాష్ట్రం నలుమూలల్నుంచీ... కంటతడి పెడుతూ... ఆవేశపడుతూ... అభిమానులు విజయవాడ రావడం ప్రారంభమైంది.

## సర్వత్రా ఖండన

దశరథరామ్ దారుణహత్య వార్త రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపింది. పార్టీలకి, సిద్ధాంతాలకి సంబంధం లేకుండా రాష్ట్రం నలుమూలలా యువజనం ఆవేశంతో రగిలిపోయారు, ఆవేదనతో కన్నీరు పెట్టారు. బహుశా రాష్ట్ర చరిత్రలో ఏ సంపాదకుడు మరణించినా కనిపించని అపూర్వమైన స్పందన వారిలో కనిపించింది.

ప్రముఖ జాతీయ, ప్రాంతీయ పత్రికలన్నీ దశరథరామ్ హత్యపై పోటీపడి వార్తల్నీ, విశ్లేషణల్నీ ప్రచురించాయి. (కొన్ని పత్రికలు మొక్కుబడిగా స్పందించిన మాట మాత్రం వాస్తవం.) దాదాపుగా అన్ని కథనాలూ రాష్ట్రంలోని పాలక పక్షంవైపు, అధినేతవైపు వేలెత్తి చూపాయి. పోలీసుల, అమానుషత్వాన్ని నేరస్తులతో కుమ్మక్కు కావడాన్ని నిలదీశాయి.

అక్టోబర్ 23, 1985 నాటి ఆంధ్రభూమి దినపత్రిక తన సంపాదకీయంలో "...ఎన్‌కౌంటర్ ఎడిటర్ హత్య అనేక అనుమానాలకు ఆస్కారం కలిగించడం సహజం. హత్య రాత్రి సుమారు 8.30 గం.కి జరిగితే మరునటి రోజు తెల్లవారుజాము వరకూ శవాన్ని పోలీసులు తమ ఆధీనంలో ఉంచుకోవడం ఎందుకు జరిగిందని ఎవరైనా ప్రశ్నిస్తారు" అని రాసింది.

తెలుగుదేశం తప్ప మిగతా రాజకీయ పక్షాలన్నీ ఈ హత్యని తీవ్రంగా ఖండించాయి. పాలక పక్షం పాత్రపైన, పోలీసుల అనుమానాస్పద వైఖరిపైన ప్రశ్నలు గుప్పించాయి.

దశరథరామ్ హత్య జరిగిన వారం తర్వాత పోలీసులు పొలిటికల్ ఎన్‌కౌంటర్ బాధ్యులు తోటరాము, బెనర్జీనాథ్, వాళ్ళతో పాటు వి.మోహన్ అనే వ్యక్తిపై కూడా కేసులు బనాయించారు. వృత్తిపరమైన ఈర్ష్యాసూయలు, వేరే ఆర్థికపరమైన లావాదేవీలు ఈ హత్యకి కారణమని పోలీసులు పేర్కొన్నారు.

అయితే పోలీసుల పాత్రపై ప్రశ్నలు ఆగలేదు.

రాష్ట్రంలోని జర్నలిస్టు సంఘాలు ఈ హత్యని తీవ్రంగా ఖండించాయి. చివరికి ప్రెస్ కౌన్సిల్ సైతం జోక్యం కల్పించుకుని ఈ హత్యకి సంబంధించిన వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎన్‌కౌంటర్ హత్యని ఖండించిన వివిధ సంఘాలు, పార్టీలు, పత్రికలు - దశరథరామ్ రాతల్లో అసభ్యకరమైన, అభ్యంతరకరమైన భాగాలు ఉన్నాయనే సంగతి ప్రస్తావించాయి. ఆ రాతలతో ఏకీభవించకపోయినా ఈ హత్యని ఖండిస్తామని చెప్పాయి.

నవంబర్ 25న మచిలీపట్నం జిల్లా కోర్టులో - ఈ కేసును విచారిస్తున్న జడ్జి వెంకటరెడ్డి పోలీసుల ప్రవర్తన పట్ల ఆందోళనని వెలిబుచ్చారు.

"గాయపడిన వ్యక్తి మరణించాడని ప్రకటించడానికి పోలీసులు ఎవరు? ఆ పని ఆస్పత్రిలో అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాతే వైద్యులే చేయాల్సి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

(ఇంకా వుంది)

---

హత్య వెనుక దాగిన రహస్యాలు.., హత్యానంతరం దశరథరామ్ కుటుంబం పడ్డ బాధలు... వచ్చే సంచికలో.

## తెలుసుకుందాం!



## ఒప్పులుగా మాట్లాడుకుందాం! 3

# అల్లా మెహర్బాన్ తో గధా పహిల్వాన్

## (దేవుడు దయచూపిస్తే గాడిదే పహిల్వాన్) 11

స్వయంగా ముఖ్యమంత్రే అభినందించటం గంగారామ్‌కి చాలా ఆనందం కలిగించింది.

"మీరు మీ పొజిషన్ ఇంకా స్ట్రాంగ్‌గా చేసుకోడానికి ఇదే మంచి అవకాశం సార్" అన్నాడు పాపారావ్.

"ఇప్పుడే అందిన వార్త" అంది చిలక టీ.వి.లో న్యూస్ రీడర్‌ని అనుకరిస్తూ.

ఇద్దరూ అదిరిపడి చిలక వేపు చూశారు.

"అమెరికాలో అస్వస్థులయిన ఆంధ్రప్రదేశ్ హోమ్‌మినిస్టరు గారిని న్యూయార్క్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్లోచేర్చారు. ప్రపంచ ప్రముఖ వైద్యుడు డాక్టర్ క్రిస్టీబెర్నార్డ్ ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు" అంది చిలక.

"దానికెలా తెలిసిందీ న్యూస్" అనుమానంగా అడిగాడు గంగారామ్. "దీని పంజరం టీ.వి. దగ్గరే ఉంది కద్సార్! మొత్తం ప్రపంచం న్యూస్ అంతా తెలుసుదానికి-"

గంగారామ్ మొఖంలో ఆనందం కనిపించింది.

"పాపారావ్ చూశావా! దేముడు మన ప్రార్థనలు విన్నాడు. ఇంకొన్నాళ్ళు ఇదే పదవిలో నేను కొనసాగాలని దణ్ణం పెట్టుకున్నాను కదా! అందుకే హోమ్‌మినిస్టర్‌ని ఇంకొన్నాళ్ళు అమెరికాలోనే ఉంచుతున్నాడు దేవుడు".

పాపారావ్ దగ్గాడు.

"ఆ విషయం బయటకు చెప్పటం బావుండదు సార్-"

"ఎందుకు బావుండదు. ఎప్పుడు ఏ మినిస్టర్‌కి రోగాలోస్తాయా, ఎప్పుడూ ఏ మినిస్టర్ ఎగిరిపోతాడా, వాడుపోతే నాకు మినిస్టరయ్యే ఛాన్సుంటుందని ప్రతి ఎమ్మెల్యే అనుకోవటం మామూలేనా?"

"అది మామూలేసార్! అది తప్పని కూడా నేను అనటం లేదు. రాజకీయం అంటేనే తోటివాడికి కీడుని కోరుకోవటం కద్సార్! కాకపోతే ఆ విషయం తోటి వాళ్ళకూ ప్రజలకూ తెలీకూడదు అంతే!"

"అవునవును! తెలుస్తే చాలా అసహ్యంగా వుంటుంది - అన్నట్లు ఇందాకేదో అంటున్నావ్ నువ్వు - నా పొజిషన్ ఇప్పుడే ఇంకా స్ట్రాంగ్‌గా చేసుకోవాలి అని - ఏమిటిది?"

"అదే సార్! ఒక వేళ అనుకోనిది ఏదయినా జరిగి మన హోమ్‌మినిస్టర్ ప్రాణాలతో అమెరికా నుంచి తిరిగి వచ్చాడనుకోండి! వచ్చినాగానీ సి.ఎం. మిమ్మల్నే హోమ్‌మినిస్టర్‌గా కంటిన్యూ చేయమనాలి! అంత బాగా మీరు పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలన్న మాట-"

"కానీ ప్రస్తుతం ఈ డిపార్ట్‌మెంట్ పని చేస్తున్న తీరు తెన్నులు చూస్తోంటే ప్రజల్లో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవటం కష్టమనుకుంటాను-"

"ప్రజల్లో పేరు తెచ్చుకోవాలని ఎవరన్నారు సార్. వాళ్ళు మెచ్చుకుంటే ఎంత మెచ్చుకోకపోతే ఎంత? మీరు పేరు తెచ్చుకోవలసింది ముఖ్యమంత్రి దగ్గరా, ఆయన చుట్టూ ఉండే భజనపరుల వద్దా! అదే మీ భవిష్యత్తుకి ఉపయోగపడుతుందిగానీ ప్రజల్దేముంది? గొర్రెలు! ఒక గొర్రె ఎటుపోతే.

మిగతా గొర్రెలన్నీ అటేపోయినట్లు ముందున్నవాడు ఎటు ఓటు వేస్తే - మిగతా అందరూ అటే వేస్తారు. అంటే ఆ ముందున్న వాడిని మనం మానేజ్ చేసుకుంటేచాలు-"

గంగారామ్‌కి పాపారావ్ మాటలు నచ్చలేదుగానీ వాటిల్లో నిజం ఉన్నట్లు మాత్రం అనిపించింది.

"అయితే ఇప్పుడు నేనేం చేయాలి?"

"ముందునన్ను మీ ప్రైవేట్ సెక్రటరీగా వేసుకోవాలి!"

"నువ్వు అసలునాకు ప్రైవేట్ సెక్రటరీగా? ఇంకా వేసుకోవటం ఏమిటి?"

"మీరిప్పుడు మినిస్టర్ అయ్యారు కాబట్టి నన్ను ఆఫీషియల్‌గా మీ ప్రైవేట్ సెక్రటరీగా వేసుకోవచ్చు సార్! దీనివల్ల నాకు మీరు ప్రైవేట్‌గా ఇచ్చే జీతంకాక గవర్నమెంటు నుంచే అయిదువేలు జీతం ఎక్స్ట్రావస్తుందన్న మాట-"

"అయితే ఇంకేం ఇవాళే ఆర్డర్స్ వేయించేద్దాం - పద, సెక్రెట్టేరియట్ కెళ్దాం!" పాపారావ్‌తో పాటు సెక్రటేరియేట్‌ని చేరుకున్నాడు. వస్తూనే సెక్రటరీకి రింగ్ చేశాడు గంగారామ్.

"గుడ్‌మాణింగ్ సార్-" అన్నాడు ప్రిన్సిపాల్ హోమ్‌సెక్రటరీ మాయచంద్రన్.

"గుడ్‌మాణింగ్ మాయచంద్రన్‌గారూ ఒకసారి వస్తారా?"

"ఇప్పుడే వస్తున్నా సార్" మరు నిముషంలో మాయాచంద్రన్, గంగారామ్ చాంబర్‌లోకొచ్చాడు.

"మాయచంద్రన్‌గారూ - ఇతను మీకు తెలుసు కదా! నా సెక్రటరీ - మిస్టర్ పాపారావ్-"

"అయ్యో తెలీకపోవటమేమిటి సార్!" నిండా తెలుసు సారీ! మొన్న ఈయన భార్య చీర ఎత్తిన చోటే నా భార్య కూడా చీర ఎత్తింది-"

గంగారామ్ షాక్ అయిపోయాడు.

అతని పరిస్థితి గమనించి పాపారావ్ చప్పున ఆదుకున్నాడు.

"మరేం లేద్సార్ - మా మిసెస్ చందనా బదర్స్ షాప్‌లో చీరకొంటానికి వెళ్ళినప్పుడు ఆయన భార్యకూడా అదే సమయంలో చీరకొంటానికి వచ్చిందట. అక్కడ ఇద్దరికీ పరిచయం అయిందన్న మాట! ఆ మాట చెప్పడానికి ఇలా అఘోరించింది ఆయన భాష" అన్నాడు కంగారుగా.

"కొంచెం లాంగ్వేజ్ దా ప్రాబ్లెమ్ ఉండాది - గ్రామర్ వీక్-" అన్నాడు మాయచంద్రన్ నవ్వుతూ.

"మాయచంద్రన్‌గారూ! గ్రామర్ గురించి వర్రీ అవకండి! తెలుగుభాష తెలుగు ప్రజలు, తెలుగు సంస్కృతి ఏనాడు గంగలో కలిసిపోయినయ్ - మీలాంటి పరాయి రాష్ట్రాల ఐ.ఎ.ఎస్.లు, ఐ.పి.యస్‌ల వల్ల! ఇప్పుడు కొత్తగా తెలుగు గ్రామర్‌ని మీరు చిత్రవధ చేసిందేమూలకీ రాదు-"

మాయచంద్రన్ గలగలనవ్వాడు.

"మినిష్టర్ సార్ నిండా జోకు చేస్తారు - మీరు చెప్పింది నిండా నిజం సార్! నగ్ననిజం! తెలుగు వాండ్లు నిండా వెధవలు సార్! లేకపోతే వాండ్ల మీద, వాండ్ల పెండ్లాల మీదా, పిల్లల మీదా మా తమిళవాళ్ళు గ్రామర్ లేని డబ్బింగ్ సీరియల్స్ ఎందుకు రుద్దుతారు సార్? ఎందుకంటే తెలుగు వాళ్ళు నడిపే టీ.వి. ఛానెల్‌వాండ్లు ఇంకా పరమ వెధవలుసార్! పరాయివాడి సొత్తంటే నిండా ప్రేమ సార్! అందుకే అరవసీరియల్స్, హిందీ సీరియల్స్ ఎగబడి తెలుగులోకి గ్రామర్ లేకుండా డబ్ చేసుకుని వాడుతుండారుదానే! అదే మా తమిళ ఛానెల్ వాండ్లు చూడండి సార్! రొంబా ఇంటిలిజెంట్! తమిళ సీరియల్స్ నిండా తెలుంగులోకి డబ్ చేసి వాళ్ళ నెత్తిన రుద్దుతారుగానీ తెలుగువాళ్ళ సీరియల్ డబ్ చేసుకోరు - ఎందుకో తెరీమాసార్?"

"ఎందుకు?" వళ్ళుమండి పోతూంటే అడిగాడు గంగారామ్.

"అదిగూడా తెరీమిల్లెనా సార్? తమిళ వాళ్ళు తెలుంగు ఛానెల్ వాళ్ళంత వెధవలు కాద్సార్- మళ్ళీ పగలబడి నవ్వాడు" తెలుగు వాళ్ళకి టాలెంట్ ఇల్లె సార్- నో టాలెంట్ - అందుకే టామిళ్ సినిమాల రైట్స్‌కొని తెలుగులో సినిమాలు తీస్తారు, టామిళ్ సీరియల్స్ కొని డబ్ చేసుకుంటారు - టామిళ్ ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. వాళ్ళనే తీసుకొచ్చి ఎడ్మినిస్ట్రేషన్ చేయించుకుంటారు సార్"

గంగారామ్, పాపారావ్ మొఖాలు ఎర్రగా అయిపోయినయ్.

కానీ అతని స్టేట్‌మెంట్‌లో అన్నీ నిజాలే ఉండటం చేత నోర్మూసుకున్నారు.

కొద్దిసేపు వాళ్ళిద్దరినీ చూసి లోలోపల సంతోషించి పైకి జాలిపడి తనే టాపిక్ మార్చాడు మాయచంద్రన్?

"ఇంతకూ ఏదో మాట్లాడాలని పిలిచారు - ఏమి కారణం సార్?"

"అదే ఆ టాపిక్‌కే వస్తున్నా! మా పాపారావ్‌ని నా ప్రైవేట్ సెక్రటరీగా అపాయింట్ చేసుకుంటున్నాను - దానికి ఆర్డర్స్ తయారు చేయించండి!"

మాయచంద్రన్ మళ్ళీ నవ్వాడు.

"ఇదేమిసార్ ఇట్లా చెప్తారు - ప్రైవేట్ సెక్రటరీ పోస్ట్ ఒక గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్ చేస్తాడు సార్ - బయటి వాళ్ళను తీసుకోకూడదు - కావాలంటే మీకు రెండు పర్సనల్ అసిస్టెంట్ పోస్టులు వుంటాయి. అవి నాన్‌గెజిటెడ్ - అందులో ఒకటి పాపారావ్‌కి ఇచ్చి పూడ్చండి సార్"

పాపారావ్‌కి కోపం వచ్చింది.

"ఏం ప్రైవేట్ సెక్రటరీ పోస్ట్ నాకెందుకివ్వకూడదు?"

"దానికి ఇంటెలిజెంట్ మనిషి ఉండాలిదానే-"

పాపారావ్‌కి ఆవేశంతో జ్వరం వచ్చేసినట్లయింది.

"ఏం? నేను ఇంటెలిజెంట్ కాదా? నా ఇంటెలిజెన్స్ సంగతి మీకు తెలుసా?" అడిగాడు మండిపడుతూ.

"సరే - టెంపరరీగా - మీకు ఇంటెలిజెన్స్ ఉందని ఊహించుకుంటాము - మరి ఎక్స్‌పీరియన్స్ మాటేమిటి?"

"ఎక్స్‌పీరియన్స్ వర్క్ చేస్తే వస్తుంది గానీ భయపడి పారిపోతే రాదు-"

"అవును" ఒప్పుకున్నాడు గంగారామ్

"కొన్ని రోజులు వర్క్ చేస్తే ఎక్స్‌పీరియన్స్ వస్తుంది మాయాచంద్రన్-".

"రొంబ నిజమ్ సార్! కాని ఆ కొన్ని రోజులూ పాపారావ్ సార్‌వాడికి ఎక్స్‌పీరియన్స్ లేకపోవటం వల్ల మీకు చెడ్డపేరు వస్తుంది-"

పాపారావ్ ఇంక ఊరుకోదల్చుకోలేదు.

"మీరు ఐ.ఎ.ఎస్. పోస్టింగ్ తీసుకున్న తర్వాత మరి మొదటిసారి పదవి టేకప్ చేసినప్పుడు మీకేం ఎక్స్‌పీరియన్స్ ఉందని - అయినా మీరు ఆ పోస్ట్‌లో పని చేశారా లేదా?"

"అది వేరుసార్ - మేము ఐ.ఎ.ఎస్. - పనిచేసినా, చేయకపోయినా, పనితెల్సినా తెలీకపోయినా - మమ్మల్ని కొశ్చెన్ చేసేవాడెవడూ లేడు - అయినా నేను పని చేసేది ఆంధ్రప్రదేశ్‌లో కదా సార్ - నాకు ఎక్స్‌పీరియన్స్ లేకపోవటం వల్ల ఇక్కడి గవర్నమెంట్‌కి చెడ్డపేరు వస్తే నాదేమిపోతాది? పాయింట్ అండర్‌స్టాండయిందా సార్?"

"మీరెన్నయినా చెప్పండి - పాపారావ్‌నే నా ప్రైవేట్ సెక్రటరీగా వేసుకుంటాను-" పాపారావ్‌ని సపోర్ట్ చేస్తూ అన్నాడు గంగారామ్.

"రూల్ ఒప్పుకోదుసార్"

"అదంతానేను చూసుకుంటాను-"

"అలా అంటే మీ ఇష్టంసార్-"

గంగారామ్‌కి సంతోషం కలిగింది.

"ఓకే - నేను నా గెజిటెడ్ పి.ఏ.కి ఆర్డర్స్ డిక్టేట్ చేస్తాను - మీరు ప్రాసెస్ చేయండి".

"అలాగే సార్-"

"అతనికి అయిదువేలు జీతం కూడా ఏర్పాటు చేయాలి-"

"కన్సాలిడేటెడ్ సార్"

"పర్వాలేదు-"

మాయచంద్రన్ వెళ్ళిపోయాడు. వెంటనే గెజిటెడ్ పి.ఏ. రాములు లోపలికొచ్చాడు. అతనికి జరిగిందంతా చెప్పాడు గంగారామ్.

"ఆ పోస్ట్‌కి తన చెంచా ఒకడిని రికమండ్ చేస్తానని చెప్పి వాడి దగ్గర లక్షరూపాయలు అడ్వాన్స్ కొట్టేశాడు సార్. అందుకే పాపారావ్ వుండకూడదని ఏదో ఒక వంక చెప్తున్నాడు" అన్నాడు రాములు.

గంగారామ్‌తో పాటు పాపారావ్ కూడా ఉలిక్కి పడ్డాడు.

"ఏమిటీ నా ప్రైవేట్ సెక్రటరీ పోస్ట్ కోసం లక్ష రూపాయలు ఇచ్చాడా?"



"అవున్సార్! అంటే టోటల్ అయిదు లక్షలు! అందులో లక్ష అడ్వాన్స్ ఇచ్చాడు సార్!"

"ఎవరు?"

"రామనాథం అనీ - మూడుసార్లు ఎ.సి.బి. వాళ్ళు పట్టుకున్నారులెండి - అతను-"

"వాట్ - రామనాథం అనేవాడిని మూడుసార్లు ఎ.సి.బి. వాళ్ళు పట్టుకున్నారా?"

"అవున్సార్-"

"ఎందుకు?"

"ఎందుకేముంది సార్? కర్రప్షన్-"

"అంటే ఎ.సి.బి. వాళ్ళు నిజంగా అవినీతి పరులను పట్టుకుంటారా?"

"జనరల్‌గా పట్టుకోరు సార్! కానీ అప్పట్లో ఎ.సి.బి. డైరక్టర్ ఇంకా మహా అవినీతి పరుడున్నమాట! అతను ఎన్నిసార్లు కబురుచేసినా ఈ రామనాథం వాడికి లంచం ఇవ్వలేదు సార్. దాంతో కోపం వచ్చి ట్రాప్ చేసి పట్టుకున్నారు-"

"దిసీజ్ టూ మచ్ -" అన్నాడు గంగారామ్.

"అది సరే - కానీ ఆ రామనాథం నా దగ్గర పని చేయడానికి అయిదు లక్షల రూపాయలు ఎందుకిస్తున్నట్లు?"

"ఎందుకేమిటి సార్! ఆ పోస్ట్ అలాంటిది? ఒక్క నెలలో పదిలక్షలు సంపాదించవచ్చు. నిజం చెప్పాలంటే నేనే ఆ పోస్ట్ కోసం ప్రయత్నించాను సార్! కానీ నేను రెడీకాష్ యాభయ్‌వేలే అడ్వాన్స్ ఇస్తానని చెప్పాను-"

గంగారామ్‌కి వళ్ళుమండిపోతోంది.

"మిస్టర్ రాములూ"

"ఏం సార్?"

"నేను కర్రప్షన్‌కి వ్యతిరేకమని మీకు తెలుసా?"

"సాధారణంగా కొత్తగా వచ్చిన వాళ్ళందరూ ఇదే మాటంటారు సార్?"

"కానీ నేను ఇవాళొక మాట రేపొకమాట మాట్లాడే వాడిని కాదు-"

"అదేమిటి సార్ - మీరు మినిస్టరు కదా- రోజుకోమాట మార్చకుండా ఎన్నాళ్ళు మంత్రి పదవిలో ఉండగలరు సార్?"

"నేను అలాగే వుంటాను-"

"చాలా ఆశ్చర్యంగా వుంది సార్"

"ఉంటే ఉండనీ-"

"ఓ.కే సార్! అది మీ ఇష్టం సార్!"

"ఆల్‌రైట్ - ముందు నా ప్రైవేట్ సెక్రటరీగా మా పాపారావ్‌ని అపాయింట్ చేసుకుంటున్నాను. ఆ ఆర్డర్స్ తయారు చేయించండి-"

"అలాగా సార్. కానీ పాపారావ్‌గారు.."

"బయటి వ్యక్తే! నాకు బయటివ్యక్తే కావాలి - అర్థమయిందా?"

"అవుతోంది సార్-"

"మరి ఇంకా చూస్తూ నిలబడ్డారేమిటి?"

"అహహ - ఏంలేదుసార్"

అతను వెళ్ళిపోయాడు.

పాపారావ్ వంక చూసి నవ్వాడు గంగారామ్.

"వీళ్ళ ప్లానేమిటో తెలుసా? బయటి వ్యక్తి ఆ పోస్ట్‌లోకొస్తే ఈ బ్యూరోక్రసీ వాళ్ళ ఆటలేమీ సాగవని - వాళ్ళ వాడినే లాక్కు రావాలని చూశారు. కానీ నా ముందా వీళ్ళ కుప్పిగంతులు? నేను బ్యూరోక్రసీ గురించి బాగా స్టడీ చేసినవాడిని. మనదేశం మట్టికొట్టుకుపోవడానికి కారణం వీళ్ళే"

"అవున్సార్. ఆ మాట నిజమే! వీళ్ళంతా ఒక ఎలక్షన్ నుంచి ఇంకో ఎలక్షన్ వరకూ టైమ్‌పాస్ చేసేవాళ్ళే గానీ పనిచేసే వాళ్ళు కాద్సార్"

అదే రోజు మాయాచంద్రన్ పాపారావ్‌ని ప్రైవేట్ శెక్రటరీగా అపాయింట్ చేసే కార్యక్రమం చాలా అయిష్టంగా పూర్తిచేశాడు.



మీరు హైదరాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

యర్రంశెట్టి సాయి

# వ్యామరాల్జీ

తర్వాత ఆ రోజు రాష్ట్రంలో శాంతి భద్రతల విషయాల గురించి బ్రీఫ్స్ చూపించాడు.

"అంటే రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉందన్నమాట" అన్నాడు గంగారామ్.

"అవున్సార్"

ఆ పేపర్స్ అన్నీ చూస్తోన్న పాపారావ్ ఒక్క కేకవేశాడు.

"రాయలసీమలో బాంబుదాడిలో నలుగురు చనిపోయారు సార్"

గంగారామ్ అదిరిపడ్డాడు.

"ఏమిటి మాయాచంద్రన్ నిజమేనా?"

"నిజమేసార్ కానీ అదంతా నార్మల్ సార్!"

"రాగింగ్ భరించలేక గుంటూరులో ఒక విద్యార్థిని ఆత్మహత్య. నగరంలో మెడికల్ కాలేజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య" మళ్ళీ అన్నాడు పాపారావ్ కసిగా.

"ఈ సీజన్‌లో రాగింగ్ తాలూకు ఆత్మహత్యలు - హత్యలు రొంబ నార్మల్" అన్నాడు మాయాచంద్రన్.

"ఏలూరు దగ్గర ప్రత్తి రైతు ఆత్మహత్య" అన్నాడు పాపారావ్.

"రెగ్యులర్ కేస్‌లు - బిలో నార్మల్ - రోజుకి కనీసం అయిదారుగురు పోతే నార్మల్"

"ఇంకో బాంక్ డిపాజిటర్లను పది కోట్లకు మోసం చేసింది. ఛైర్మన్ డైరక్టర్లు మామూలుగానే పరార్"

"ఆంధ్రప్రదేశ్‌లో ఇది టోటల్‌గా నార్మల్ సార్"

"సెన్సార్ కట్ చేసిన అశ్లీల దృశ్యాలు తిరిగి సినిమాలో ప్రత్యక్షం"

"హైద్రాబాద్‌లో నార్మల్" అన్నాడు మాయాచంద్రన్.

"కల్తీసారా తాగి నలుగురు మృతి"

"ఇది టోటల్‌గా రెగ్యులర్ ఇన్సిడెంట్. మనం ఏ మాత్రం పట్టించుకోనక్కర్లేదు" మాయాచంద్రన్ మాటలు వింటూంటే గంగారామ్‌కి గంగవెర్రులెత్తుతోంది.

"ఇంత ఘోరాలు రాష్ట్రమంతా జరుగుతుంటే - మొత్తంమీద పరిస్థితి ప్రశాంతంగా, నార్మల్‌గా ఉందంటారేమిటి?" మండిపడుతూ అడిగాడు.

"అవున్సార్! ఇవన్నీ రెగ్యులర్‌గా జరిగేవే! అందుకని ఇలాంటి వాటి గురించి మనం పట్టించుకోనక్కర్లేదు"

"నో. మా మినిష్టరు అందరి మినిష్టర్ల లాగా టైమ్‌పాస్ కోసం వచ్చిన వ్యక్తి కాదు. ఇలాంటివన్నీ కూడా సీరియస్‌గా తీసుకోవలసిందే" అన్నాడు పాపారావ్.

"అలా చిన్న చిన్న విషయాలు కూడా పట్టించుకుంటే మనం ఇంక ముఖ్యమయిన వేరే పనులేమీ చేయలేం సార్" చిరాకుని కప్పిపెట్టుకుంటూ అన్నాడు మాయాచంద్రన్.

"మనకి ఇంక వేరే పనులేం ఉంటాయ్. అన్నీ ఇలాంటివే కదా?"

"కాద్సార్. ఇంకా చాలా ఉంటయ్"

"ఏమిటవి?"

"ఏమిటంటే... అలా సడెన్‌గా అడిగితే చెప్పలేం సర్. చాలా ఉంటాయ్"

"సడెన్‌గా అడిగితే చెప్పలేకపోవటమేమిటి?"

"అంటే బోలెడు వర్క్ ఉంటుంది కదా! వాటిని ఆర్డర్‌లో చెప్పాలంటే కుదరదు. అయినాగానీ డిటెయిల్స్ కావాలంటే మా అడిషనల్ శెక్రటరీనడిగి చెప్తాను"

"ఏదీ - ఆయనను ఇక్కడికే పిలవండి"

మాయాచంద్రన్ ఫోన్‌లో అడిషనల్ శెక్రటరీని పిలిచాడు.

రెండు నిమిషాల్లో అడిషనల్ శెక్రటరీ రూమ్‌లోకొచ్చాడు.

"గుడ్‌మాణింగ్ సర్. నేను అడిషనల్ శెక్రటరీ సుందర్‌సింగ్‌ని సర్"

"గుడ్‌మాణింగ్ సుందర్‌సింగ్! మన డిపార్ట్‌మెంట్‌కి చాలా వర్క్ ఉంటుంది అని ప్రిన్సిపల్ శెక్రటరీ గారంటున్నారు. అంత హెవీ వర్క్ ఏముంటుందో నాకు తెలుసుకోవాలనుంది. ఆ వర్క్ ఏమిటో మీకు బాగా తెలుసని ఆయన అంటున్నారు. అందుకని మిమ్మల్ని పిలిపించాము"

సుందర్‌సింగ్ చిరునవ్వు నవ్వాడు.

"నిజమే సార్. వర్క్ చాలా హెవీ అయిపోయింది. ఇంకో నలుగురు అసిస్టెంట్ శెక్రటరీస్ పోస్ట్‌లు శాంక్షన్ కావాలని ఇంతకు ముందున్న హోమ్ మినిష్టర్ గారు కూడా ఒప్పుకున్నారు. కానీ ఆ నోట్ మీద సంతకం చేయకుండానే పాపం వెళ్ళిపోయారు"

"ఆ నోట్ సంగతి తరువాత. ముందు నేనడిగింది చెప్పండి"

"మన డిపార్ట్‌మెంట్ హెవీవర్క్ గురించి అడిగారు కదూ? ఒకటేమో ఇంకా నాలుగు అడిషనల్‌గా అసిస్టెంట్ శెక్రటరీ పోస్ట్‌లు ఎందుకు కావాలి అనేదానికి జస్టిఫికేషన్ తయారు చేయటం సార్! ఆ ఒక్క వర్క్ మీద నేనూ, ఇద్దరు అసిస్టెంట్ శెక్రటరీలూ ఆరు నెలలనుంచీ వర్క్ చేస్తున్నాం!"

"అదిగాక ఇంకేమేం వర్క్స్ ఉన్నయ్?"

"అదిగాక ఇంకా చాలా ఉన్నయ్ సార్"

"ఏమిటవి?"

"అలా సడెన్‌గా అడిగితే చెప్పటం కష్టం సార్"

"చేస్తున్న పని చెప్పటంలో కష్టం ఏముంటుంది?"

"నిజం చెప్పాలంటే - అవన్నీ గుర్తు చేసుకోడానికి కూడా వీల్లేనంత హెవీ వర్క్ ఉందన్నమాట సార్! ఎనీవే మీరడిగారు కాబట్టి ఇప్పుడే మా అసిస్టెంట్ శెక్రటరీని పిలుస్తాను. అతనికి కరెక్ట్‌గా తెలుస్తుంది"

"సరే పిలవండి"

మరో అయిదు నిముషాల్లో అసిస్టెంట్ శెక్రటరీ వచ్చాడు.

"గుడ్ మాణింగ్ సార్! అయామ్ అసిస్టెంట్ శెక్రటరీ రెడ్డి సర్"

"గుడ్ మాణింగ్ రెడ్డీ! మన డిపార్ట్‌మెంట్‌కి హెవీవర్క్ ఉందని అందరూ అంటున్నారు. కానీ అదేమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. మీకేమయినా తెలుసేమో అని పిలిపించాను"

"నిజమే సార్. చాలా హెవీ వర్క్‌లోడ్ పెరిగిపోయింది సార్! అందుకే నాకు స్పెషల్‌గా ఇంకో ఇద్దరు సెక్షన్ ఆఫీసర్ల పోస్ట్‌లు శాంక్షన్ చేయమని ఇంతకుముందున్న హోమ్ శెక్రటరీగారికి నోట్ పేశాం సార్. కానీ పాపం అది సంతకం చేయకుండానే ఆయన అమెరికా వెళ్ళిపోయారు"

గంగారామ్ అతి కష్టం మీద కోపం అణచుకుంటున్నాడు.

"చూడండి! నేను అడిగింది ఒకే ఒక్క సింపుల్ క్వొశ్చన్! మన డిపార్ట్‌మెంట్‌కి హెవీ వర్క్ ఉందని అంటున్నారు. అదేమిటి అని! దీనికి సమాధానం మీదగ్గరుందా లేదా?"

"లేదుసార్" అందరూ ఉలిక్కిపడ్డారు.

"అయితే మరెవరికి తెలుసా విషయం?"

"మా ఎస్వోలకు తెలుస్తుంది సార్. వాళ్ళకు పాపం మంచి నీళ్ళు తాగడానికి కూడా టైముండదు. ఆఫీస్‌కి వచ్చిన దగ్గర్నుంచీ రాత్రి ఏడింటి వరకూ గొడ్డుల్లాగా కష్టపడతారు సార్"

"అలాగా. అయితే ఎస్వోని పిలిపించండి"

రెండు నిముషాల్లో ప్యూన్ తిరిగివచ్చాడు.

"ఎస్వోలెవరూ సీట్లల్లో లేరు సార్"

అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"ఎక్కడికెళ్ళారు?" అడిగాడు అసిస్టెంట్ శెక్రటరీ ఆశ్చర్యంగా.

"చాయ్‌కెళ్ళారంట సార్. ఇంకో అరగంట వరకూ రారంట. ఎవరయినా అడిగితే అసిస్టెంట్ శెక్రటరీ రూమ్‌కెళ్ళారని చెప్పమన్నారంట"

అసిస్టెంట్ శెక్రటరీ తలగోక్కుంటూ అడిషనల్ శెక్రటరీ వైపు చూశాడు.

ప్రిన్సిపల్ శెక్రటరీ సీలింగ్ వైపు చూశాడు.

"వాట్ నెక్స్ట్? అడిగాడు గంగారామ్.

"ఏయ్. వెంటనే కాంటీన్‌కెళ్ళి ఒక్క ఎస్వోనయినా పట్టుకునిరా!" కోపంగా అరచాడు అసిస్టెంట్.

ప్యూన్ బయటకు పరుగెత్తాడు.

పావుగంట తర్వాత ఒక ఎస్వోతో తిరిగి వచ్చాడు.

మళ్ళీ ఆ ఎస్వోకి జరిగిందంతా చెప్పాడు అసిస్టెంట్ శెక్రటరీ.

"కనుక నువ్ మినిష్టర్‌గారికిప్పుడు మన డిపార్ట్‌మెంట్‌కున్న హెవీ వర్క్ లోడ్ అంతా క్లియర్‌గా, డిటెయిల్డ్‌గా చెప్పు"

"నిజంగా మేము కోపప్ చేయలేనంత వర్క్ లోడ్ ఉంది సార్!" అన్నాడు ఎస్వో.

"అదే ఏమిటి అనడుగుతున్నాను" కోపంగా అరచాడు గంగారామ్.

"అది నాకెలా తెలుస్తుంది సార్. మా సెక్షన్‌కి సంబంధించినంతవరకే నాకు తెలుస్తుంది. మిగతాది మిగతా ఎస్వోలనడగాలి"

"మిగతా ఎస్వోలంటే ఎంత మంది ఉన్నారు?"

"మేము మొత్తం ఇరవై మంది సార్"

గంగారామ్ అదిరిపడ్డాడు.

"అంతమంది స్టాఫా? మరి మీకింద ఎంతమంది ఉన్నారు?"

"ఒకో సెక్షన్‌కి ఇద్దరు ఏఎస్వోలుంటారు సార్"

"సరే సరే. అయితే మిగతా సెక్షన్స్‌లో ఏ పని ఉంటుందో మీకు తెలీదు"

"తెలీదు సార్"

"అయితే మీ వర్క్ ఏమిటో చెప్పండి చూద్దాం"

అతను కొంచెం పజిలయాడు.

"అలా సడెన్‌గా అడిగితే..."

"చెప్పటం కష్టం" అంటూ పూర్తి చేశాడు పాపారావ్.

"కరెక్ట్ సార్. చెప్పటం కష్టం"

"ఓ.కే. ఎలాగూ ఇక్కడ ఎవడేం పని చేస్తున్నాడో ఎవడికీ తెలీదు గనుక. మనం ముందు ఒక పని చేద్దాం!" అన్నాడు గంగారామ్.

"ఏమిటి సార్ అది?"

"ముందు సిటీలోని ఆ మెడికల్ కాలేజ్ రాగింగ్ కేస్ టేకప్ చేద్దాం. ఇవాళ్ళ న్యూస్ పేపర్లో ఆ గొడవ గురించి రాశారు కదా"

ప్రిన్సిపల్ శెక్రటరీ చిరునవ్వు నవ్వాడు.



"అది ప్రయారిటీ కాద్సార్ మనకి."

"సరే ఒప్పుకుంటాను. ఏది ప్రియారిటీయో చెప్పండి. చూద్దాం!"

"అదీ. అది..."

గంగారామ్ చిరునవ్వు నవ్వాడు "నాకు తెలుసు! ఇంత సడెన్‌గా అడిగితే చెప్పటం కష్టం - అని అంటారు. అంతేనా?"

"నాట్ ఎగ్జాక్ట్‌లీ సర్"

"ఎలాగూ ప్రియారిటీ వర్క్ ఏదో తెలీదు కాబట్టి నేను చెప్పిన పనే ప్రియారిటీ వర్క్‌గా తీసుకుందాం! ఓ.కే.?"

"ఓకే సార్" ఒప్పుకున్నాడు మాయాచంద్రన్.

"కమాన్. సాయంత్రానికి డిజిపి, పోలీస్ కమిషనర్‌తో మీటింగ్ ఏర్పాటు చేయండి"

"ఓకే సార్"

"మన రాజధానిలో రాగింగ్ జరగటం మనందరికీ ఇన్సల్ట్! ఆ రాగింగ్ జరిపిన వాళ్ళందరి మీదా వెంటనే యాక్షన్ తీసుకోవాలి!"

"అలాగే సర్"

"ఇదివరకు లాగా ఊరికే నాలుగు రోజులు రాగింగ్ గురించి హడావుడి చేసి చేతులు దులిపేసుకోడానికి వీల్లేదు"

"అలాగే సార్!"

"అవును! అంతే కాదు! మిగతా అందరి మంత్రుల్లాగా నేను తాత్కాలికమయిన చర్యలు తీసుకునే వాడిని కాదు. శాశ్వతంగా ఈ సమస్యను సమాధి చేస్తాను"

"ఓకే సర్"

సాయంత్రం అనుకున్నట్లుగానే మీటింగ్ ఏరేంజ్ చేశాడు మాయాచంద్రన్.

"చూడండి. నేను కథలు చెప్పే మినిష్టర్‌ని కాదు. పని చేసే మినిష్టర్‌ని! ప్రస్తుతం ఈ రాగింగ్ సమస్యను నేను ప్రియారిటీ కింద తీసుకుంటున్నాను" అన్నాడు గంగారామ్.

డిజిపి, కమిషనర్ తప్పట్లు కొట్టారు.

పాపారావ్‌కి ఒళ్ళు మండిపోయింది.

"తప్పట్లు మా పార్టీ వాళ్ళు కొట్టాలి. గవర్నమెంట్ ఆఫీసర్లు కాదు"

మాయాచంద్రన్ ఒప్పుకోలేదు.

"మాకూ తప్పట్లు కొట్టటానికి పర్మిషన్ తీసుకున్నాం సార్"

"కానీ మనం రాగింగ్ సమస్యను ప్రస్తుతానికి పక్కన పెట్టి ఇంకేదయినా ఇష్యూ తీసుకుంటే బావుంటుంది సార్" అన్నాడు మాయాచంద్రన్.

"ఎందుకు?"

"ఎందుకంటే అది కొంచెం సెన్సిటివ్ ఇష్యూ సర్"

"ఎవరయినా మర్డర్లు చేసి నేను సెన్సిటివ్ అంటే వదిలేస్తారా?"

"అది వేరు ఇది వేరు సర్"

"నో. మనం ముందు అదే టేకప్ చేయాలి సర్" అన్నాడు పాపారావ్ కచ్చిగా.

పాపారావ్‌కి మాయాచంద్రన్‌ని చూస్తే ఒళ్ళు మండిపోతోంది.

తనను ప్రైవేట్ శెక్రటరీ అవకుండా ఎన్ని విధాలా అడ్డుకోవటానికి చూశాడో తల్చుకుంటేనే కాలిపోతోంది.

"మీ ఇష్టం సార్"

"ఏమిటి మీ ఇష్టం"

"అదే సార్! ర్యాగింగ్ ఇష్యూ"

"అవును. నా యిష్టప్రకారమే జరుగుతుంది"

"ఓ.కే. సార్"

"అయితే వెంటనే కేస్‌లు రిజిష్టర్ చేసి రాగింగ్ చేస్తున్న వాళ్ళందరినీ అరెస్ట్ చేయండి" డిజిపితో అన్నాడు గంగారామ్.

"అలాగే సర్"

"రేపు మాణింగ్ కల్లా రిజల్ట్స్ కావాలి"

"అలాగే సర్"

వెంటనే మీటింగ్ ముగిసింది.

మరో రెండు గంటల్లో సెల్‌ఫోన్ మోగింది.

"సార్. నేను కమిషనర్‌ని మాట్లాడుతున్నా సార్"

"చెప్పండి"

"మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కంప్లెయింట్ ఇవ్వటానికి రెఫ్యూజ్ చేస్తున్నారు సార్"

"ఎందుకని?"

"ఇస్తే ఆ సీనియర్ మెడికల్ స్టూడెంట్స్ ఆయన్ని మర్డర్ చేస్తారంట సార్"

"మరింకేం ఆ మాట చాలు కదా! రెండు కేసులు రిజిష్టర్ చేయండి. ఒకటి రాగింగ్ - రెండోది ప్రిన్సిపాల్‌ని హత్య చేస్తానని బెదిరించటం"

"కానీ అది రాసివ్వనంటున్నారు సార్"

"న్యూస్ పేపర్‌లో ఆయన చెప్పిన స్టేట్‌మెంట్‌నే కంప్లెయింట్ కింద తీసుకోండి"

"అలాగా సార్"

"అవును"

మర్నాడు న్యూస్ పేపర్లో వచ్చిన వార్తలు చూసి గంగారామ్, పాపారావ్ ఆనందంగా ఫీలయ్యారు.

"రాగింగ్ చేసిన ఎనిమిది మంది మెడికల్ విద్యార్థుల కోసం గాలింపు! రాగింగ్‌ని అంతం చేస్తానని హోమ్‌మినిష్టర్ గంగారామ్ ప్రతిజ్ఞ"

మరుక్షణం గంగారామ్ ఫోన్‌లన్నీ మోతెక్కిపోవటం మొదలయింది కంగ్రాచ్యులేషన్స్‌తో. ఆఖరికి గంగారామ్ భార్య కూడా అభినందించే సరికి గంగారామ్‌కి నిజంగానే హీరో లాగా అనిపించింది.

సాయంత్రానికల్లా రాగింగ్ చేసిన విద్యార్థులందరినీ అరెస్ట్ చేసినట్లు డిజిపి స్వయంగా వచ్చి చెప్పాడు ●

మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!, పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం. 9848019076

# తొలిచూపులోనే





నా పెళ్ళి మరో నెలరోజులుందనగా... నేనతన్ని చూశాను.

చూడగానే అనిపించింది. అతడు నాకోసమే పుట్టాడని.

నన్ను చూసి మంద్రంగా నవ్వినప్పుడు అతడే నా చెలికాడనుకున్నా.

పదే పదే మా కళ్ళు కలుసుకుంటూ వుంటే, యిది ఈ నాటి బంధం కాదని తెలిసింది.

అతడు ఎటుపోయి ఎటు వచ్చినా, నా కోసమే వెతుకుతున్నట్టు, నాకు కనిపించడం కోసమే అలా తిరుగుతున్నట్టుండేది.

మళ్ళీ మళ్ళీ నవ్వే ఆ కళ్ళను చూడాలని, హుందాగా నడిచే అతడి పక్కనే నడవాలని, అతడితో మాట్లాడాలని, అతని దరి చేరాలని మనసు తొందర చేసేది.

తీరా అతడు నాకెదురు పడితే, గుండె వేగం పెరిగేది, అడుగులు తడబడేవి, మనస్సులో గుబులు, ఏదీ నా స్వాధీనంలో వుండేది కాదు.

ఏదో పారవశ్యపు మైకం నన్ను కమ్మేసేది.

ఈ లోకంలో అతడెవరో, ఏంటో ఏమీ తెలీదు. కానీ మాది ఈ లోకపు అనుబంధం మాత్రం కాదు. అది ఏ నాటిదో, ఏ దేవుడి సంకల్పమో...

కనుక్కుంటే, అతడిది మావూరే, మా పక్కవీధేనని తెలిసింది.

యింతకాలం ఎక్కడ దాక్కున్నాడో దొంగ కృష్ణుడు అనుకున్నా. నా మనసంతా అతడితో నిండిపోయింది.

"ఒసే వనజా! కలలు కన్నది చాల్లే, నీ రాజకుమారుడు వచ్చాడు వెళ్ళి చూసుకో" అంది వరలక్ష్మి.

"ఎక్కడ?" అన్నా ఆత్రంగా.

"పెళ్ళి మంటపానికి పూలు కడుతున్నాడు" అంది.

పక్కనే బియ్యం పోసిన యిత్తడి పళ్ళెం తీసుకుని, ఏదో పని వున్నట్టు, ఒక్క పరుగున పెళ్ళి మంటపం చేరాను. తీరా వెళ్ళి చూస్తే, అక్కడుంది, 'రవి'. నిరాశగా వెనుదిరిగాడు.

రవి, నాక్కాబోయే భర్త. అతడిని చూస్తే నాకెప్పుడూ, ఏమీ అనిపించలేదు. పెళ్ళి చూపుల్లో, తరువాత మాట్లాడిన రెండుసార్లు, నిశ్చితార్థమప్పుడు, యిప్పుడు, ఎప్పుడూ...

ఆ క్షణమే అనిపించింది, ఈ పెళ్ళి చేసుకోకూడదని.

ప్రేమంటే ఏంటో తెలిసిన తరువాత, ప్రేమలేని పెళ్ళిని ఎలా చేసుకోవడం. మనసంతా అతను నిండి వుంటే, రవిని ఎలా చేసుకోను.

నేనలా నడుస్తూ వుంటే అతడు ఎదురయ్యాడు. పలకరింపుగా నవ్వాడు.

అదేదో శుభసూచకం అనిపించింది.

నా పెళ్ళిని ఆపడం ఎలాగో అర్థం కాలేదు.

సీత పెళ్ళి ఎప్పుడయిపోతుందా, ఎప్పుడెప్పుడు యింటికెళ్ళి అమ్మతో 'ఈ పెళ్ళి వద్దని' కచ్చితంగా చెప్తానా, అని తొందర పడింది మనసు.

అమ్మతో చెప్తేగానీ నా మనసు శాంతించదు.

సీత పెళ్ళిలో, అణువణువు ప్రతిచోటా అతడే కనిపించేవాడు. ఆరాధనగా అతడు నావేపు చూస్తూ వుంటే, 'నేనొస్తాను, నిన్ను తీసుకెళ్తాను' అని రహస్యంగా చెప్తున్నట్టుండేది.

పెళ్ళి ఎప్పుడయిందో, నేను తిరిగి యింటికి ఎప్పుడు చేరానో కూడా గుర్తులేదు. తీరా యింటికొచ్చాక, కనీసం అతని పేరయినా కనుక్కోలేదే అని బాధపడ్డాను.



పెళ్ళి వద్దని ఎలా చెప్పాలా అని సతమతమవుతూ వుంటే... ఒక రోజు నాన్న అమ్మతో "పెళ్ళి ఖర్చులకు 50,000 పంపమని కబురుపెట్టారు" అంటున్నాడు.

" పెల్లనిస్తే చాలు, మేమే ఖర్చుపెట్టి పెళ్ళి చేసుకుంటాం' అని చెప్పి మళ్ళీ యిదేం మాట" అంది అమ్మ.

"అదే నేనూ అన్నాను, 'అనవాయితీ!' అంటున్నారు. ఎలాగూ యివ్వాలనుకున్నాం కదా! యిక గొడవెందుకు పంపేద్దామను కుంటున్నా. ఏమంటావ్" అన్నాడు.

"అక్కర్లేదు. నాకీ పెళ్ళొద్దు" అని గట్టిగా అరిచాను.

అమ్మానాన్నా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. నిశ్చితార్థం అయ్యాక పెళ్ళి ఆగకూడదన్నారు. అమ్మ చస్తానంది. పెళ్ళయితే నేను చస్తానన్నాను.

వాళ్ళు డబ్బు వద్దన్నారు. అయినా నేను పెళ్ళి వద్దని గట్టిగా కూర్చున్నాను.

చివరికి ఎవరికీ ఏమీ అర్థం కాకుండానే పెళ్ళి ఆగిపోయింది.

రవి అన్నాడట, "వనజ మనసు మారితే ఎప్పుడయినా పెళ్ళి చేసుకుంటాను" అని

నేను మాత్రం సంతోషంగా వున్నాను.నా ప్రేమ రహస్యం, నాకెంత బలాన్నిచ్చిందో, తల్చుకుంటే నాకెంతో గర్వంగా వుంటుంది.

ఒకరోజు మా వీధి చివర మళ్ళీ అతన్ని చూశాను. అతడూ నన్ను చూశాడు. ఆ కళ్ళలో ఆరాధన, ఒకింత ఆశ్చర్యం.

'యిదంతా చేసింది నీ కోసమే సుమా' అని చెప్పాలనిపించింది. అయినా నేను చెప్పాలేంటి అతనికి తెలీదూ.

"మీరిక్కడే వుంటారా" అడిగాడు దగ్గరకు వచ్చి.

"అదే మా ఇల్లు" చూపించాను.

వెళుతూ వెళుతూ తిరిగి వెనక్కి చూశా. అతను నన్నే చూస్తున్నాడు.

–

* * *

నా ఫ్రెండు వనజయినా, చలం రాజేశ్వరి అయినా, సీతయినా, రాధయినా తన వాడిని తొలి చూపులోనే గుర్తించారు.

బహుశ, హృదయం కోరే సఖిని/చెలుని గురించిన, కలలు, ఆలోచనలు. అట్టివారిని గుర్తించేలా ప్రేమికుని సిద్ధం చేస్తాయేమో.

ప్రేమగా పరిణమించే స్నేహాలు కొన్నయితే, తొలిచూపులోనే పరిమళించే ప్రేమలు చాలా వుంటాయి. ముఖ్యంగా, స్త్రీ పురుష స్నేహాలకు అవకాశం తక్కువగా వున్న మన సమాజంలో 'Love at first sight' సర్వసాధారణం.

పదే పదే ఒకే రకమైన వ్యక్తుల పట్ల ఆకర్షణకు లోనవుతూ వుంటారు. అది, వారి ఆలోచనా తరంగాలు ఒక్కటే అవడం, జన్యుకారణాల వల్ల అని వైజ్ఞానిక పరిశోధనలు అంటున్నాయి.

హిందూ ధర్మం, దేవుడిని అర్ధనారీశ్వరుడు అంటుంది. ప్రతి స్త్రీలో ఒక పురుషుడుంటాడు, అలాగే ప్రతి పురుషుడిలో ఒక స్త్రీ వుంటుంది. పురుషుడు తనలోని స్త్రీలాంటి స్త్రీ కోసమే అన్వేషిస్తాడు. అలాగే స్త్రీ తనలోని పురుషుడి కోసం చూస్తుంది.

ఏ నిర్బంధం లేని, ఎన్నుకునే స్వేచ్ఛ వున్న సమాజంలో, స్త్రీ పురుషులు, తమకు సరిఅయిన భాగస్వామికి అతి సహజంగా దగ్గరవుతారు. నిజానికి అప్పుడే ఫలవంతమైన ప్రేమ జీవితం సాధ్యం.

* * *

కార్తీక మాసం: అప్పుడే తెల్లవారుతోంది. చమన్ అలవాటుగా ట్రాక్ సూట్ వేసుకుని పరుగు తీస్తున్నాడు. దట్టమైన పొగమంచు. అడుగు దూరంలో కూడా ఏమీ కనబడడం లేదు. మంచును చీల్చుకు వెళ్ళడంలో ఏదో థ్రిల్. జాగింగ్, శరీరాన్ని వేడెక్కిస్తుంటే, మెత్తని మంచు చల్లగా మొహాన్ని తాకుతూ హాయయిన అనుభూతి...

కాస్సేపటికి, షర్టు విప్పి ఆడుకుంటున్నాడు. విశాలమైన రోడ్డు నిర్మానుష్యంగా వుంది. చమన్ కాస్సేపు వెనక్కెడతాడు, కాస్సేపు పక్కకి నడుస్తాడు. అలవోకగా ముందుకు పడతాడు. బొంగరంలా గిర్రున తిరుగుతాడు. అంతా, పాటలేని నాట్యంలా వుంది. అయితే ఎవరికీ కనపడకుండా మంచు అతన్ని కప్పేసింది.

అతడు ఆనందంగా ఏవో నుందర లోకాలను స్పృశిస్తూ వుంటే, ఎవరో కెవ్వున పెట్టిన కేక అతడిని తిరిగి ఈ లోకంలో పడేసింది.

ఒక్క క్షణం ఆలశ్యమయివుంటే, అతడు, ఆ అమ్మాయి మీద పడిపోయేవాడు. అప్రయత్నంగా చురుకుగా కదిలే శరీరానికి, బలవంతంగా బ్రేక్ వేసేసరికి, తల తూలి నట్టయి, ఆమెను పట్టుకోబోయి ఆగాడు.

"సారీ..." చెప్తూ ఆమెను చూశాడు.

అప్పుడే తలంటు పోసుకున్న జుత్తులోంచి కారిన నీటి బిందువులు ఆమె డ్రస్‌ను తడిపేస్తున్నాయి. తెల్లటి మంచులో నల్లటి ఆమె మేనిచ్ఛాయ మెరిసిపోతోంది. భయంతో విశాలమైన కళ్ళు అతని మొహాన్ని కప్పేశాయి.

"సారీ..." చెప్పాడు చమన్.

ఆమె కళ్ళలో భయం కాస్త, చిరు కోపంగా మారింది. మౌనంగానే, అతన్ని నిరసనగా చూసి వెళ్ళబోయింది.

"సారీ... కనిపించలేదు" అన్నాడు వెళ్తున్న ఆమెకు అడ్డుగా నిలబడి.

"మనుషులకు కళ్ళు వెనక వుండవు. యిట్స్ ఓకే" అని నవ్వి వెళ్ళిపోయింది.

అప్పుడుగానీ అర్థమవ్వలేదు, అతడు వెనక్కి నడుస్తూ, ఆమె కేకకి ముందుకు తిరిగాడని.



ముసిముసిగా నవ్వుతూ తిరిగి వెనక్కి నడవడం మొదలు పెట్టాడు.

అయితే అప్పటికే అతని ఏకాంత హృదయ మందిరంలో ఆమె రూపం కొలువయింది.

పదే పదే, ఆమె రూపం, ఆమె అన్న నాల్గు మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు. రోజంతా అతడికి ఆ నాల్గు మాటలతోనే గడిచింది. కొన్నిసార్లు అదే పనిగా గుర్తు చేసుకుని మురిసి పోయాడు.

రెండో రోజు అప్రయత్నంగా ఆమె కోసం వెతికాడు. నమ్మకం లేక పోయినా ఆమె గురించి అదేచోట ఎదురు చూశాడు.

మూడో రోజు ఆమె కనిపించింది.

అదే చిందర వందరగా వదిలేసిన తడిసినతలతో. హృదయంఆనందంతో గంతులేసింది.

"హాయ్" అన్నాడు పలకరింపుగా.

ఆమె కూడా పలకరింపుగా నవ్వి వెళ్ళిపోయింది.

తరువాత రోజు, జాగింగ్ చేస్తూనే "వాకింగ్ వెళ్తున్నారా" అన్నాడు.

"కాదు గుడికి" అని చెప్పింది.

ప్రతి రోజు, ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలు, ఆమెకోసం, ఆ నవ్వుకోసం, మంచులో తడిసి నల్లగా మెరిసే మేని కోసం, నీళ్ళతో జారాడే ఆ కురులకోసం, విశాలమైన ఆ కళ్ళ కోసం, యింకా చెప్పలేని దేని కోసం...

ఎందుకోసం ఈ ఆరాటం. ఏమిటా సంతోషం. ఎందుకో తపన, ఎక్కడి నుండి వచ్చిందీ బాధ. బాధలోనే ఏమిటీ తీయదనం.

కొన్నాళ్ళకా బాధ భరించలేనిదయింది చమన్‌కు. ఏదో చేయాలి. ఆమెతో మాట్లాడాలి. ఆమెతో స్నేహం చేయాలి. కలిసి నడవాలి. కలిసి తిరగాలి. కలిసి జీవించాలి.

చమన్, ప్రియమైన తన వుదయాలను చూడడం మానేశాడు. తను ఆమెతో చెప్పలేదు. అలాగని చెప్పకుండా వుండలేడు. "ఆమె కూడా తనను ప్రేమిస్తుందని నమ్మకమేంటి. ఏదో నాల్గు రోజుల పరిచయంతోనే ప్రేమించడం... మూర్ఖత్వం" అనుకున్నాడు.

వారం రోజులు రకరకాలుగా తర్కించుకున్నాడు. 'అదేదో ఆకర్షణ' అనుకున్నాడు. 'ఎంతమంది అమ్మాయిలు తెలీదు తనకు' అని సరిపెట్టుకున్నాడు.

సూర్యోదయాన్ని తిరిగి పలకరించాడో రోజు. దట్టమైన పొగమంచులో దూరంగా లీలగా నల్లటి మనిషి రూపం, అది ఎవరిదో, ఏంటో తెలీదు కానీ చమన్ గుండె లయ తప్పింది. పరుగు వేగం పెరిగింది.

చూస్తే ఆమే. భంగిమను బట్టి, ఆమె ఎవరికోసమో ఎదురు చూస్తోందని తెలుస్తోంది.

"హలో" అన్నాడు మొహమాటంగా. నేరుగా ఆమెను చూడలేకపోయాడు.

"హలో" అంది, అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ.

అతను ముందుకెళ్ళిపోయాడు.

'ఆమె కళ్ళు. అందులో ఏముంది' తిరిగి చూశాడు.

ఆమె అతన్నే చూస్తోంది.

'ఆ చూపులో ఏముంది' అని అనుకుంటూ ఆగాడు. ఆమె అతని దగ్గరికొచ్చింది.

"యిన్నాళ్ళు రాలేదేం" అందులో ఆరోపణ, అలక, నేను నీ కోసం చూస్తానని తెలీదా అన్న సూచన. యింకా చెప్పలేని భావాలెన్నో.

"వీలుకాలేదు" అన్నాడు ఏమీ ఎరగనట్టు.

ఆమె అతని పక్కనే నడుస్తోంది.

"గుడికెళ్ళలేదా?" అడిగాడు.

"లేదు"

–

–

ఇదో అనంతమైన సంభాషణ ●

---



## నా ప్రేమానుభవం..

అప్పుడు నేను పదో తరగతి చదువుతున్నాను. మా యింటి పక్కనే వాళ్ళుండే వారు. మా కడపలో అందరూ మగవాళ్ళందరినీ అతను రిక్షా వాడయినా, సినిమా టిక్కెట్టు యిచ్చేవాడయినా, యిరుగు పొరుగు వారెవరయినా అందరినీ 'అన్నా' అని, అలాగే ఆడవాళ్ళందరినీ 'అక్కా' అని పిలిచేవారు. నేనూ మా పక్కింటి అబ్బాయిని అన్నా అనే పిలిచేదాన్ని. ఆ అబ్బాయి అప్పుడు యింటర్ ఎం.పి.సి. చదివేవాడు. అప్పుడప్పుడు నాకు ఏవయినా లెక్కలు రాకపోతే, ఆ అబ్బాయిని అడిగి చెప్పించుకునేదాన్ని. ఆ అబ్బాయి కూడా చాలా ఓపికగా లెక్కలు చెప్పేవాడు. నాకు ఆ అన్నంటే చాలాయిష్టం. ఆ అన్నను కలవడానికి, అప్పుడప్పుడు వూరికే లెక్కల పేరుతో వెళ్ళేదాన్ని. ఆ అబ్బాయి కూడా నాతో అవీ యివీ కబుర్లు చాలా చెప్పేవాడు.

నాకోరోజు ఆ అన్నను కౌగలించుకుని, ముద్దుపెట్టుకున్నట్టు కల వచ్చింది. కంగారుతో ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. లేచి అది కలే కదా అని సర్దుకుని పడుకున్నాను.

కానీ అది మొదలు నాకు అలా చాలా కలలు వచ్చేవి. నేను అతన్ని అన్న అని పిలుస్తున్నా కదా! అలా కలలు రావడం తప్పు కదా! అని చాలా దిగులు పడ్డాను. ఆ అబ్బాయిని కలవడం మానేశాను. కలిస్తే చాలా గుబులుగా భయంగా వుండేది. నేనిలా ఆలోచిస్తున్నానని తెలిస్తే ఆ అబ్బాయి ఏమనుకుంటాడు. నన్నుచెడ్డదానిగా అనుకుంటాడు కదా! అని దుఃఖం వచ్చేది. అందుకే ఒకోసారి లెక్కల్లో అనుమానాలున్నా అతన్ని కలిసేదాన్ని కాదు. అలా అలా కొంత కాలానికి అతని జ్ఞాపకాలు చెదిరిపోయాయి.

'తొలిప్రేమ' చదివినపుడు, మళ్ళీ అతను గుర్తొచ్చాడు. అది నా తొలిప్రేమ. అయితే వూరికే అలవాటుగా 'అన్న' అని అతన్ని పిలవడం వల్ల, నేను ఆ ప్రేమను అనుభవించలేకపోయాను. యిప్పటికీ ఆ అబ్బాయిని చూస్తే తప్పు చేసిన భావనే కలుగుతుంది. అయితే 'తొలిప్రేమ' చదివాక ఆ భావన పోయింది.

\- గిరిజ, కడప

## నిరుద్యోగులకోసం 'విజయవిహారం' ప్రత్యేకంగా సమర్పిస్తున్న వినూత్న ధారావాహిక

# నూటొక్క ఉపాధి అవకాశాలు



(గతసంచిక తరువాయి)

## 9 కేలండర్ ఆర్డర్లు

ప్రస్తుతం పబ్లిసిటీకి విపరీతమైన ప్రాముఖ్యత పెరిగింది. పెద్ద పెద్ద పరిశ్రమలైతే వాటి ఉత్పత్తుల్ని జనంలోకి తీసుకువెళ్ళేందుకు ఏటా కొన్ని కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తుంటాయి. ఎవరైనా తాము చేసే వ్యాపారం గురించి కానీ, ఉత్పత్తి గురించి కానీ పదిమందికీ తెలిస్తేనే నిలదొక్కుకోగలుగుతారు. అయితే చిన్న వ్యాపారాలు చేసేవాళ్లు ప్రచారానికి వేలు,లక్షల్లో డబ్బుని కుమ్మరించలేరు. ఇలాంటివారికి చవకైన, ప్రజల్లోకి వేగంగా చొచ్చుకుపోగల ప్రచార వ్యూహాలు అవసరం. వాటిలో ముఖ్యమైనది క్యాలెండర్. ఇది కొత్తదేమీ కాదు. చాలాకాలంనుంచీ వున్నదే. కాని దీన్నే ప్రస్తుతం ఓ ఉపాధి మార్గంగా మలుచుకునేందుకు అవకాశం చాలా వుంది. దీనికి మీకు పెట్టుబడి ఏమాత్రం అవసరం లేదు. కాస్త తెలివితేటలు చాలు. జనరల్ స్టోర్స్, హోటళ్లు, బట్టల దుకాణాలు, బేకరీలు, ఫోటో స్టూడియోలు, జ్యూవెలరీ షాపులు... ఒక్కటేమిటి... ఒక్కసారి ఓ మెయిన్ సెంటర్‌కి వెళ్లి రోడ్డుకి రెండువైపులా చూస్తే ఎన్ని వ్యాపార సముదాయాలు కనిపిస్తాయో అన్నింటినీ కలవొచ్చు. ప్రస్తుతం ఎంత చిన్న షాపైనా కస్టమర్లకు కేలండర్లు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. కొత్త ఏడాది వస్తోందంటే చాలు... కస్టమర్లే అడిగి మరీ తీసుకుంటారు. అందుకే కేలండర్లు వ్యాపారస్తులకు చాలా అవసరమవుతున్నాయి. మీరు చేయాల్సిందల్లా ఇలాంటి దుకాణాలు, వ్యాపార సంస్థలవారినుంచి ఎన్ని కేలండర్లు కావాలో ఆర్డర్లు తీసుకోవడమే. కేలండర్లమీద ఏవైనా సీనరీలు వుండాలా, లేక దేవుళ్ల ఫోటోలా, లేక కళాత్మక దృశ్యాలా అన్నది ప్రత్యేకంగా తెలుసుకోవాలి. దీనికి ముందే మీరు చేయాల్సిన ముఖ్యమైన పని- ఏదైనా ప్రముఖ ప్రింటింగ్ ప్రెస్‌తో ముందే మాట్లాడుకోవడం. పేపరు నాణ్యత, ఒక్కో కేలండర్‌లో ఎన్ని షీట్లు వుండాలి అన్నదానిపై రేట్లు మారుతుంటాయి. రెడీమేడ్‌గా వున్న కేలండర్లని మీరే చేరవేస్తారు కాబట్టి -ప్రెస్సువాళ్లని వెతుక్కోవడం, వాటిని




తెచ్చుకునే తిప్పలు షాపువాళ్లకి తప్పుతాయి. అంటే వ్యాపార సంస్థలకు, ప్రింటింగ్ ప్రెస్‌లకు మధ్య మీరు మీడియేటర్‌గా వ్యవహరిస్తారన్నమాట. దీనికోసం ప్రింటింగ్ చార్జీలకు అదనంగా మీ కమిషన్ కొంత కలుపుకొని రేటు వసూలు చేయవచ్చు. అటు ప్రింటింగ్ ప్రెస్‌వాళ్లనుంచి కూడా కమిషన్ పొందవచ్చు.

ఇది వచ్చేది కేలండర్ సీజన్... డిసెంబర్ వస్తోందంటే అంతటా కేలండర్ల హడావిడే. వెంటనే రంగంలోకి దిగండి. మీదే ఆలస్యం.

## 10 స్టాండింగ్ టిఫిన్ సెంటర్

ఓస్! టిఫిన్ సెంటరా!? అని పెదవి విరుపులొద్దు. చిన్న చూపూ వద్దు. నేటి చిన్న టిఫిన్ సెంటరే రేపటి హోటల్‌గా ఎదగవచ్చు. గౌరవప్రదమైన స్వయం ఉపాధి మార్గం ఇది. మీరు నిలదొక్కుకోవడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కూడా కల్పించవచ్చు. టిఫిన్ సెంటర్ ఆలోచన కొత్తది కాకపోవచ్చు. కాని ఇవాళ స్టాండింగ్ టిఫిన్ సెంటర్లు అనేది డెఫనెట్‌గా కొత్త ట్రెండే. టిఫిన్లను వేడివేడిగా సర్వ్ చేయడం అనేది- ఈ వ్యాపారంలోని విజయ రహస్యం. పరిశుభ్రంగా కనిపించడం కూడా- ఇవి పాపులర్ కావడానికి మరో ముఖ్య కారణం. ఇలాంటి టిఫిన్ సెంటరు ఏర్పాటు చేయడానికి- విశాలమైన స్థలం కాని, పెద్ద సంఖ్యలో వర్కర్లు కాని అక్కర్లేదు. చిన్న గది దొరికితే చాలు. మొదట్లో ఇడ్లి, వడ, పూరి, దోశలాంటి కామన్ టిఫిన్లతో ప్రారంభించవచ్చు. టిఫిన్‌లు తయారు చేయడంలో



కాస్త అనుభవం వున్న ఒక్క వర్కర్ చాలు మొదట్లో. కస్టమర్లు నిలబడే తింటారు కాబట్టి టేబుళ్లు, కుర్చీలులాంటివి అక్కర్లేదు. ప్రస్తుతం ఇలాంటి స్టాండింగ్ టిఫిన్ సెంటర్లకు ఎంత పాపులారిటీ వచ్చిందంటే- హోటల్ బిజినెస్‌లోకి దిగేవాళ్లంతా వీటినే ప్రారంభిస్తున్నారు. ఈ సెంటర్లు మొత్తానికి హోటల్ కాన్సెప్ట్‌నే మార్చేశాయి. కొన్నేళ్ల క్రితం హోటల్‌ను పెట్టాలంటే విశాలమైన గదులు, అనువైన చోటు, టేబుళ్లు-కుర్చీలులాంటి ఫర్నీచర్, పెద్ద సంఖ్యలో వర్కర్లు...భారీ ఎత్తున పెట్టుబడి అవసరమయ్యేది. సామాన్యుడికి అందని వ్యాపారంగానే వుండేది. కాని ఇప్పుడు ఈ స్టాండింగ్ టిఫిన్ సెంటర్ల పుణ్యమా అని స్వయం ఉపాధి కోరుకునేవారు కొద్ది పాటి పెట్టుబడితో, తేలిగ్గా ప్రారంభించగల వ్యాపారంగా మారింది. ఒక్కసారి హైదరాబాద్ నగరంలో ప్రధాన కూడళ్ల దగ్గర చూడండి. దర్శినిటైపు హోటళ్ల వ్యాపారం ఎలా సాగుతుందో... మొదట్లో సింగిల్ గదిలో ప్రారంభించిన ఈ సెంటర్లే -ఇవాళ జ్యూస్, ఐస్‌క్రీం పార్లర్, స్వీట్ షాప్‌లుగా ఎన్ని రకాలుగానో విస్తరిస్తున్నాయి. మీతో పాటు నలుగురికీ దారి చూపే ఈ గౌరవప్రదమైన స్వయం ఉపాధి మార్గం... ఎదిగేందుకు ఓ చక్కటి అవకాశం.

## 11 చైల్డ్‌కేర్ సెంటర్

నగరాలు, పట్టణాల్లో ఇలాంటి సెంటర్ల అవసరం చాలా పెరిగింది. ఉద్యోగినులకు ముఖ్యంగా చిన్న పిల్లలున్న తల్లులకి ఇవి నిజంగా వరం లాంటివి. ఉమ్మడి సంసారాల్లోనైతే ఏ బాధా లేదు. పిల్లల్ని చూసుకోవడానికి పెద్దవాళ్లెవరో ఒకరుంటారు. కాని ఇప్పుడన్నీ న్యూక్లియస్ ఫ్యామిలీసే కనక, ఉద్యోగినులైన తల్లులకు పిల్లల సంరక్షణ పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను తీర్చే చైల్డ్ కేర్ సెంటర్లు ప్రస్తుతం ఉద్యోగినులకు ఒక ప్రధాన అవసరంగా మారాయి. ఇంట్లోనే వుండి స్వయంగా ఒక ఉపాధిని వెతుక్కోవాలనుకునే వారికి దీన్ని మించిన ఉత్తమ మార్గం మరొకటి లేదు. పెట్టుబడి అంతగా అవసరం లేదు. అయితే పసిపిల్లల్ని బుజ్జగించడం, లాలించడం, ఆడించడం మొదలైన పనులకి అలవాటు పడేందుకు మొదట్లో కొంత కష్టంగా అనిపించినా- పిల్లల మధ్య గడపడం ఎంత ఆనందమో తర్వాత మీకే అర్థమవుతుంది. ఈ సెంటర్‌ని ప్రారంభించేందుకు ముందు మీరు చేయాల్సిన ముఖ్యమైన పని- స్త్రీ, శిశు సంక్షేమ శాఖనుంచి అనుమతి పొంది, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆ విషయం తెలియజేయాలి. ఇది చట్టపరంగా అవసరమే కాకుండా, మీదగ్గర పిల్లల్ని వదిలే తల్లులకు మీపై భరోసా, నమ్మకం ఏర్పడేందుకు పనికొస్తుంది. తర్వాత చేయాల్సింది- పరిశుభ్రమైన వాతావరణంలో వున్న ఒక మోస్తరు విశాలమైన వసతిని చూసుకోవడం. స్వంత ఇల్లుంటే మంచిదే. అది లేనప్పుడు ఏ అపార్టుమెంటో అద్దెకు తీసుకోవడం ఉత్తమం. భద్రత వుంటుంది. తర్వాత -పిల్లలకి అవసరమైన రకరకాల ఆటవస్తువుల్ని సమకూర్చుకోవాలి. నమ్మకస్తులైన ఆయాల్ని (పిల్లల సంఖ్యనిబట్టి ఇద్దర్నో, ముగ్గుర్నో...) నియమించుకోవాలి...ఫోన్ సౌకర్యం కలిగివుండటం చాలా అవసరం. పిల్లల్ని చేర్చుకునేప్పుడే తల్లుల కాంటాక్ట్ నంబర్లు తీసుకుంటే ఏదైనా అవసరమొస్తే సంప్రతించేందుకు వీలుంటుంది. ఈ ఉపాధి మార్గం ఎంచుకుంటే బుడిబుడి నడతల బుడతల మధ్య గంటలు క్షణాల్లా గడిచిపోతాయి. వారికి సగం



అమ్మతనాన్ని పంచిఇచ్చే అపూర్వమైన అవకాశం ఇందులోనే దొరుకుతుంది. ఆదాయానికి ఆదాయమూ వుంటుంది. (ఇంకావుంది)

## వ్యాపారం ఏదైనా లైసెన్స్ తప్పనిసరి

ఏదైనా వ్యాపారం ప్రారంభించాలనుకున్నప్పుడు పెట్టుబడి, అనువైన చోటు, అవసరమైన సామాగ్రి... ఇలా వీటిని సమకూర్చుకోవడంతో పాటు చేయాల్సిన అతిముఖ్యమైన పని మరొకటి వుంది. అది లైసెన్సు. ఈ మాట వినగానే అదేదో బ్రహ్మ పదార్థంలాగా అనిపిస్తుంది. దాని గురించి అవగాహన లేకే ఇదంతా. లైసెన్స్ అనగానే... దానికోసం కాళ్లరిగేలా తిరగాల్సివుంటుందని, అధికారులను 'ప్రసన్నం' చేసుకోవాల్సివుంటుందని, కఠినమైన రూల్స్ వుంటాయని... ఇలా అనేక అపోహలు చాలా మందికి వుంటాయి. ఇప్పుడు ప్రభుత్వం లైసెన్సుల జారీని చాలా వరకు సరళీకరించింది. ఔత్సాహిక వ్యాపారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ఇవేవీ తెలియకపోవడం వల్లే చాలా మంది మధ్య దళారుల్ని దేబిరిస్తున్నారు. మోసపోతున్నారు. దళారులకి పని అప్పచెబితే తొందరగా అవుతుందన్న అభిప్రాయం కూడా చాలా మందికి వుంది. కాని సంబంధిత అధికారుల్ని నేరుగా కలిస్తే మన పనులు అతి సులువుగా అవుతాయన్న సంగతి గ్రహించాలి. మనం చూసుకోవాల్సిందల్లా లైసెన్స్ పొందడానికి అధికారులు అడిగే వివరాలు అన్నీ మన దగ్గర వున్నాయా లేదా అనేది చూసుకోవడమే.

మనం ప్రారంభించబోయే వ్యాపారం ఎంత చిన్నదైనా దానికి లైసెన్స్ వుండాల్సిందే. లైసెన్స్ అంటే ప్రభుత్వ అనుమతి అన్నమాట. అంటే మనం ఫలానా వ్యాపారం చేస్తున్నామని ప్రభుత్వానికి తెలియపరుస్తున్నాం. దీనివల్ల మన వ్యాపారానికి చట్టబద్ధత వుంటుంది. మీ పనిలో ఏ అధికారీ జోక్యం చేసుకునే అవకాశం వుండదు. మీ వ్యాపారానికి భద్రత వుంటుంది. ఉదాహరణకు మనం చిన్న టిఫిన్ సెంటర్ ఒకటి చిన్న గదిలో మొదలు పెట్టామనుకోండి. ఏముందిలే ఇంత చిన్నదానికి కూడా లైసెన్స్ అవసరమా అని మనకు అనిపించవచ్చు. కాని ఏ మున్సిపల్ అధికారో లేక శానిటరీ ఇన్‌స్పెక్టరో తనిఖీకి వచ్చారంటే ముందుగా అడిగేది లైసెన్స్ వుందా అనే. లైసెన్స్ అంటే అదేదో మనం ప్రభుత్వానికి వేలల్లో డబ్బు చెల్లించాలేమో అన్న అపోహ కూడా చాలా మందికి వుంది. ఇది తప్పు. ఏడాదికి లైసెన్స్ కింద మీరు చెల్లించే మొత్తం (పైన చెప్పిన టిఫిన్ సెంటర్‌లాంటి చిన్న వ్యాపారాల మటుకైతే) కేవలం వందల్లోనే వుంటుంది.

హైదరాబాద్ నగరంలో వ్యాపారం ప్రారంభించాలనుకుంటున్న ఔత్సాహిక వ్యాపారుల సౌకర్యార్థం ఈ క్రింద కొన్ని ముఖ్యమైన కార్యాలయాల ఫోన్ నంబర్లు ఇస్తున్నాము.

కమిషనర్ స్పెషల్ ఆఫీసర్ - 3225267
చీఫ్ మెడికల్ ఆఫీసర్/
అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ - 3221276
డిప్యూటీ మున్సిపల్ కమిషనర్/
అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సర్కిల్-1 - 525841,2
సర్కిల్-2 - 4525842
సర్కిల్-3 - 4736912
సర్కిల్-4 - 326975/3314778
సర్కిల్-5 - 3326976/3314954
సర్కిల్-6 - 4740211/3556441
సికిందరాబాద్ కార్యాలయం/7804022
అడిషనల్ కమిషనర్ మెడికల్ ఆఫీసర్/780448

### లైసెన్స్‌కోసం ఎవరిని సంప్రదించాలి?

మీరు ఎంత చిన్న వ్యాపారం ఆరంభించాలనుకున్నా సరే... మొదట లైసెన్స్ గురించి పొందడం ముఖ్యమని గుర్తుంచుకోండి. మీరు ఏ ఏరియాలో నివసిస్తున్నారో ఆ ఏరియాకు సంబంధించిన మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో, మండల్ కార్యాలయంలో లైసెన్స్ కోసం నిర్ణీత ఫారంను పొందవచ్చు. దరఖాస్తులో మీ వ్యక్తిగత వివరాలతో పాటు , నివాస వివరాలు, అలాగే మీరు చేయదలచిన వ్యాపారం ఏమిటి, ఎక్కడ ప్రారంభిస్తున్నారు, ఆ ఏరియా ప్లింత్ ఏరియా, ఆ స్థలం యజమాని ఎవరు తదితర వివరాలను దరఖాస్తులో పొందుపరచాలి. వ్యాపారాన్ని స్వంతంగా ప్రారంభిస్తున్నారా లేక ఏరియాను లీజుకు తీసుకున్నారా? అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్నారా? అన్నది పేర్కొనాలి. కొత్త లైసెన్స్ ఎంతకాలానికి కావాలి? ప్రారంభించదలుచుకున్న దుకాణానికి దగ్గరలో అదే విధమైన దుకాణం ఎంత దూరంలో వుంది? అనే వివరాల్ని పొందుపరచాలి. స్థల యజమానితో కుదుర్చుకున్న రెంటల్ డీడ్ లేదా లీజ్ డీడ్ జత చేయాలి.

ఈ వివరాలను పరిశీలించి అధికారులు లైసెన్స్ జారీ చేస్తారు. నిర్ణీత లైసెన్స్ ఫీజును చెల్లించాల్సివుంటుంది. లైసెన్స్ సాధారణంగా ఒక ఏడాదికి ఇస్తారు. ప్రతి ఏడాది దాన్ని రెన్యువల్ చేయించుకోవాలి.

ఇదంతా చదివితే సంక్లిష్టంగా అనిపించవచ్చు కాని ఒక్కసారి మీకు దగ్గరలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను, అధికారులను నేరుగా కలిస్తే ఇదెంత తేలికైన వ్యవహారమో అర్థమవుతుంది. మీకు ఏవైనా సందేహాలుంటే వాటిని క్లియర్ చేసుకోవచ్చు.

ప్రొఫెషనల్స్‌నీ, లెర్నర్స్‌నీ
సమానంగా ఆకర్షిస్తూ,
సంచలనం సృష్టిస్తున్న
తొలి తెలుగు
కంప్యూటర్‌ఎడ్యుకేషన్ సీరియల్ !!



సి.యస్. సలీం బాషా




## కంట్రోల్ ప్యానెల్

విండోస్'95లో కంట్రోల్ ప్యానెల్ ద్వారా మనకు కావాల్సిన విధంగా సెట్టింగ్స్ మార్చుకోవచ్చు. విండోస్‌కు సంబంధించిన అన్ని ఆబ్జెక్ట్స్ ఇందులో వుంటాయి. కంట్రోల్ ప్యానెల్ గురించి తెలుసుకోవటం వల్ల అవసరమైనపుడు సెట్టింగ్స్ మార్చుకోవటం సులభమవుతుంది. కంట్రోల్ ప్యానెల్‌లోని కొన్ని ఆబ్జెక్ట్స్ గురించి - వాటిని ఎలా మార్చుకోవాలి అన్న దాని గురించి ఇదివరకే వివరించటం జరిగింది. ఇపుడు మరికొన్ని సెట్టింగ్స్ గురించి తెలుసుకుందాం.




## కీబోర్డ్ సెట్టింగ్స్

కీబోర్డ్ సెట్టింగ్స్ మార్చటానికి కంట్రోల్ ప్యానెల్‌లో కీ బోర్డ్ ఆబ్జెక్ట్‌ను డబుల్‌క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ రావచ్చు.




ఇందులో Repeat delay, repeat rate cursor blink rate ఫీల్డ్ వున్నాయి. Repeat delay అంటే ఏదైనా కీబోర్డ్‌లోని కీ అలాగే నొక్కి పెడితే ఎంత వేగంగా ఆ కీ రిపీట్ అవుతుంది అన్నది మార్చుకోవచ్చు. ఈ ఫీల్డ్‌లోని యారోని మౌస్ ద్వారా long లేదా short వైపుకి జరుపుకోవచ్చు. అలాగే Repeat rate కూడా. కింద ఇచ్చిన "click here..." ఫీల్డ్ దగ్గర దీని Test చేసుకోవచ్చు. అలాగే కర్సర్ ఎంత వేగంగా blink కావాలన్న ఫీల్డ్ కూడా మార్చుకోవచ్చు. Language టాబ్‌ను క్లిక్ చేసి మనకు కావాల్సిన లాంగ్వేజ్‌ను మార్చుకోవచ్చు.

## విండోస్‌లో *Uninstall* సమస్య

ఒక సాఫ్ట్‌వేర్‌ను Install చేసుకున్న తర్వాత అవసరం లేనపుడు దాన్ని Uninstall చేసుకోవటం మంచిది. ఒక్క డైరెక్టరీని తొలగించినందువల్ల లాభం లేకపోవచ్చు. Uninstall సరిగ్గా చెయ్యకపోతే Registryలోకి వెళ్లి దాన్ని సరిచేయవచ్చు. Start Menuలో Run కమాండ్ లైన్‌లో RegEdit in టైప్ చేసి HKEY-LOCAL-MACHINE అన్నదాన్ని క్లిక్ చేసి SOFTWARE/MICROSOFT/WINDOWS/CURRENT/UNINSTALL అనే డైరెక్టరీలో మనకు కావాల్సిన వాటిని ఎన్నుకుని డిలీట్ చేస్తే uninstall పూర్తవుతుంది. కాని ఇలా ఏవైనా తొలగించేటపుడు కాస్త జాగ్రత్తగా వుండటం మంచిది!

## పాస్‌వర్డ్ మర్చిపోవటం

పాస్‌వర్డ్ మర్చిపోతే - కంప్యూటర్‌ని Dos Modeలో ఓపెన్ చేసి విండోస్ డైరెక్టరీ దగ్గర dir*.pwl అని కమాండ్ ఇవ్వాలి. అపుడు మనం సెట్ చేసుకున్న పాస్‌వర్డ్ కనపడుతుంది. ఇపుడు ఆ ఫైల్‌ని తొలగించి, కంప్యూటర్‌ను మళ్లీ Reboot చేసి username, password మళ్లీ తాజాగా ఏర్పర్చుకోవచ్చు. ఒకవేళ CMOSలో పాస్‌వర్డ్ మర్చిపోతే - సిపియులోని CMOS batteryని తీసి మళ్లీ పెట్టేయాలి. పాస్‌వర్డ్ అవసరం వుండదు. కావాలంటే మళ్లీ కొత్త పాస్‌వర్డ్‌ను ఇచ్చుకోవచ్చు.

## ఫైల్సు శాశ్వతంగా తొలగించటం

విండోస్‌లో ఒక ఫైలు కాని, ఫోల్డర్‌కాని delete చేస్తే అది ముందు Recycle binకు వెళుతుంది. Recycle bin empty చేస్తే కాని ఆ ఫైలు శాశ్వతంగా పోదు. అలా తొలగించిన వెంటనే ఫైలు శాశ్వతంగా వెళ్లిపోవాలంటే Recycle bin objectను రైట్‌క్లిక్ చేసి Propertiesని ఎన్నుకుంటే ఇలాంటి Box రావచ్చు.




అందులో 'use settings for all drivers' అనే ఆప్షన్‌ను ఆన్ చేసి 'Do not move....' అనే చెక్‌బాక్స్‌ని ఆన్ చెయ్యాలి. ఆ తర్వాత ఏదైనా ఫైలు తొలగిస్తే అది Recycle binకి వెళ్లకుండా శాశ్వతంగా తొలగించబడుతుంది.

## అన్ని విండోలో ఒకేసారి *close* చెయ్యటం

మనం ఒక్కోసారి ఎన్నో విండోలు ఓపెన్ చేస్తాము. వాటిని close చెయ్యాలంటే ఒకదాని తర్వాత మరొకటి క్లిక్ చేసి (x) close చేస్తూ పోవాలి. అలా కాకుండా Alt+Shift+F4 ఒకేసారి నొక్కితే అన్ని విండోలు ఒకసారి close అవుతాయి.

## విండోస్‌లో బ్యాకప్ సౌకర్యం

'బ్యాకప్' అంటే ఒక డేటాకు మరో కాపీ తీసి పెట్టుకోవటం. ఒకవేళ కంప్యూటర్‌లో వున్న డేటా పోయిన పక్షంలో బ్యాకప్ నుంచి మళ్లీ రిస్టోర్ చేసుకోవచ్చు. బ్యాకప్ అంటే సింపుల్‌గా రెండుమూడు కాపీలు తీసి వుంచటం. అసలు బ్యాకప్ అవసర మేమిటి అని కొందరు అనుకుంటారు. మన దగ్గర ఒరిజినల్ డిస్కులు వున్నపుడు కూడా బ్యాకప్ అవసరం!

అయితే అవసరం లేని ఫైల్సును, ప్రోగ్రాంలను బ్యాకప్ తీసుకోవటం వల్ల సమయం, స్థలం రెండూ వృథా అవుతాయి. అందుకే ముఖ్యమైన డేటానే బ్యాకప్ తీసుకోవాలి. విండోస్‌లో బ్యాకప్ సౌకర్యం వుంది. అందుకోసం Accessories → System Tools → Backup క్లిక్ చేయాలి (ఆ క్రమంలో). అపుడు బ్యాకప్ డైలాగ్ బాక్స్ వస్తుంది. దాని ద్వారా మనకు కావాల్సిన విధంగా బ్యాకప్‌ను సులభంగా తీసుకోవచ్చు. అవసరమైనపుడు రీస్టోర్ చేసుకోవచ్చు. నిజానికి హౌస్ యూజర్స్‌కి బ్యాకప్ అవసరం అంతగా వుండకపోయినా బ్యాకప్ ఎలా తీసుకోవాల అన్న దాని మీద ప్రాథమిక పరిజ్ఞానం అవసరం. విండోస్'95 తర్వాత వచ్చిన వెర్షన్‌లలో బ్యాకప్ సౌకర్యం మరింత మెరుగుపర్చటం జరిగింది.

## విండోస్‌లో *Short cut Keys :*



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

ప్రతిసారీ మౌస్‌ను క్లిక్ చెయ్యకుండా, కీబోర్డు ద్వారా అదే పనిని వేగంగా పూర్తి చెయ్యవచ్చు.

విండోస్'95లో అనేక 'కీ'లు వున్నాయి.

ఇలా ఎన్నో షార్ట్‌కట్ 'కీ'లు వున్నాయి. అవసరాన్ని బట్టి - వాడకాన్ని బట్టి కొన్ని గుర్తుండిపోతాయి. మరికొన్ని మనం రాసిపెట్టుకోవచ్చు.

| కీ | పని |
|---|---|
| Alt + F4 | ఒక అప్లికేషన్‌ను క్లోజ్ చేస్తుంది |
| Ctrl + F4 | మొదటి విండో కాకుండా మిగతా విండోను క్లోజ్ చేస్తుంది. |
| F1 | హెల్ప్ |
| F2 | Rename |
| F3 | రిఫ్రెష్ |
| F5 | ఫైల్‌ను లేదా ఫోల్డర్‌ను వెతకటం |
| Alt + Space bar | ఒక అప్లికేషన్ కంట్రోల్ మెనూ ఓపెన్ చేస్తుంది. |
| Ctrl + Esc | స్టార్ట్ మెనూ ఓపెన్ అవుతుంది. |
| Tab | ప్రోగ్రాముల మధ్య మారుతూ వుండటానికి |

## విండోస్‌లో కొన్ని టిప్స్

విండోస్'95 ఒక సముద్రం లాంటిది. అయితే అన్నీ నేర్చుకోవాల్సిన అవసరం అందరికీ వుండదు. అవసరాన్ని బట్టి నేర్చుకోవటం మంచిది. ప్రాథమిక పరిజ్ఞానం అందరికీ అవసరమే.

☆ మౌస్ పాయింటర్ మార్చుకోవటం ఎలా? :

సాధారణంగా మౌస్ పాయింటర్ అంటే బాణం గుర్తు వుంటుంది. అలా కాకుండా మనం మనకు నచ్చిన గుర్తు ఏదైనా పాయింటర్‌లా వుంచుకోవచ్చు. సిడిలోనుంచి వివిధ పాయింటర్స్‌ను విండోస్‌లో ఒక ఫోల్డర్‌లో వుంచుకుని అవసరమైనపుడు మనకు కావాల్సిన పాయింటర్‌ను మార్చు కోవచ్చు. విండోస్‌లో Add/Remove Programs లోకి వెళ్లి ఆ డైలాగ్ బాక్స్‌లో నుంచి విండోస్ సెటప్ టాబ్‌ను క్లిక్ చేసి కాంపోనెంట్స్ కిందవచ్చిన లిస్ట్‌లో Accessories ని డబుల్ క్లిక్ చెయ్యాలి. తర్వాత మౌస్ పాయింటర్స్‌ను ఎన్నుకుని ఓకె బటన్‌ను రెండుసార్లు క్లిక్ చేయాలి. (ఒక వేళ సిస్టమ్ Installation సిడిని అడగొచ్చు. అలా అడిగితే సిడి డ్రైవ్‌లో సిడిని వుంచాలి) ఇక సిడిలోని అన్ని పాయింటర్‌లు ఫోల్డర్‌లో స్టోర్ అవుతాయి. తర్వాత కంట్రోల్ ప్యానెల్ ద్వారా మౌస్‌ను సెలెక్ట్ చేసుకుని అందులో పాయింటర్స్ టాబ్‌ను క్లిక్ చేస్తే ఒక లిస్ట్ వస్తుంది. అందులోనుంచి మనకు కావాల్సిన పాయింటర్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు. పాయింటర్‌ల కోసం www.cursor.com కు వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

☆ విండోస్‌ను షట్‌డౌన్ చేసినపుడు 'now its safe.......' అన్న మెసేజ్ వస్తుంది. అలా కాకుండా ఏవైనా బొమ్మలను, సీన్‌లను కూడా ఆ Text తో పాటు డిస్‌ప్లే చేసుకోవచ్చు. మనకు కావాల్సిన ఇమేజ్‌ను సెలెక్ట్ చేసుకుని విండోస్‌లో logos.sys ఫైల్‌లోకి కాపీ చెయ్యాలి. తర్వాత ఏదైనా Text ను కూడా Text Tool ద్వారా టైప్ చేసుకోవచ్చు. ఇపుడు విండోస్ షట్‌డౌన్ చేసేటపుడు సరికొత్త స్క్రీన్ వుంటుంది.

☆ డెస్క్‌టాప్‌ను త్వరగా పొందాలనుకుంటే 'Show Deskup' అనే ఆబ్జెక్ట్‌ను క్విక్ లాంచ్‌బార్‌లో వుంచాలి. అపుడు ఇది టాస్క్‌బార్‌పై డిస్‌ప్లే అవుతుంది.

## మౌస్ సమస్యలు :

మౌస్ ఉపయోగించేటపుడు కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం వుంది.

1) కంప్యూటర్ మౌస్‌ను గుర్తించకపోవటం

2) మౌస్ పాయింటర్ సరిగ్గా కదలక పోవటం

మొదటి సమస్యకి సమాధానం ఏమిటంటే మౌస్‌ను PS/2 పోర్ట్‌కు సరిగ్గా కనెక్ట్ చేశారో లేదో చూసుకోవటం - కంప్యూటర్ రీస్టార్ట్ చెయ్యటం రెండవ సమస్యకు మౌస్‌ను క్లీన్ చెయ్యటం లేదా కొత్త మౌస్‌ను అమర్చుకోవటం. మౌస్‌ను క్లీన్ చెయ్యటం సులువే. వెనకవైపు ఓపెన్ చేస్తే ఒక బంతిలాంటిది వుంటుంది. దీన్ని క్లీన్ చెయ్యాలి. ఇక మౌస్ సెట్టింగ్స్ గురించి ఇది వరకే చెప్పటం జరిగింది. మౌస్ చాలా సున్నితమైనది - పైగా విండోస్‌కు అత్యంత అవసరమైంది. అందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

☆ మౌస్ ప్యాడ్‌ను ఉపయోగించాలి. దాన్ని తరచూ క్లీన్ చేయాలి.

☆ బటన్స్ గట్టిగా క్లిక్ చెయ్యకూడదు.

☆ మౌస్‌ను సరైన ఎత్తులో వుంచుకోవాలి.

☆ మౌస్‌దగ్గర కాఫీ, టీ కప్పులు వుంచి పనిచేయకూడదు.

(అసలు కంప్యూటర్ దగ్గరే ఇలాంటివి లేకుండా చూసుకోవాలి)

☆ తరచూ కేబుల్ కనెక్షన్స్ చెక్ చేసుకోవాలి.

మౌస్ గురించిన ఇతరా వివరాలకు మౌస్‌ను క్లిక్ చేసి వివిధ టాబ్‌లను క్లిక్ చెయ్యటం ద్వారా చూడవచ్చు. మౌస్ సాధారణంగా కంప్యూటర్‌కు ఎడమపక్క వుండేటట్లుచూసుకోవాలి. ఎదురుగా పెట్టుకోకూడదు.

స్టార్టప్ ఫోల్డర్ ఏదైనా అప్లికేషన్ వుంచితే అది విండోస్ స్టార్టయినపుడు ఆటోమాటిక్‌గా రన్ అవుతుంది. అలా కాకుండా వుండాలంటే సిస్టమ్ స్టార్టయి బూటింగ్ జరుగుతున్నప్పుడు (విండోస్ లోగో కనిపించినపుడు) 'షిఫ్ట్' 'కీ'ని నొక్కి వుంచాలి. విండోస్ మాత్రమే లోడ్ అవుతుంది.

(ఇంకావుంది)

# పర్సనల్ కంప్యూటర్ కొనాలనుకుంటున్నారా? ఒక్క క్షణం....

ఇపుడు ప్రతి ఒక్కరు కంప్యూటర్ కొంటే బావుంటుందేమో? అని ఆలోచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు అలాంటివి. అయితే వాళ్ళందరు ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. దీన్నే సీ.బి.ఎస్. లేదా కంప్యూటర్ బయ్యర్స్ సిండ్రెమ్ అని చెప్పుకోవచ్చు.

అందరూ కొంటున్నారు కనుక మనమూ కొనుక్కోవాలని అనుకుంటే మాత్రం కీబోర్డులో కాలేసినట్లే! (తర్వాత ఎలాగూ చేతులు కాల్తాయి. అదే వేరే విషయం). మరి కొందరు ఇన్‌స్టాల్‌మెంట్లలో వస్తుంది కదా అని కొనేస్తున్నారు.

### పిసీ ఎవరు కొనుక్కోవచ్చు :

నిజానికి ఈ ప్రశ్నకు సమాధానం లేదు. ఒకే విధంగా చూస్తే ఎవరైనా కొనుక్కోవచ్చు. అయితే అది ఏ వెయ్యి రెండు వేలకో వచ్చినపుడు. లేదా డబ్బులు ఎక్కువై ఏం చెయ్యాలో తెలీనపుడు. పిసీ కొనటానికి - వద్దనుకోవటానికి డబ్బులు ముఖ్యం. తర్వాత అవసరం. లేదా అవసరం ముఖ్యమైతే ఎలాగైనా సరే కొనాల్సిందే. సాధారణంగా ఎవరు కొనవచ్చు అంటే.....

☆ కొంత డబ్బు దాని మీద ఖర్చుపెట్టే స్తోమత వున్నవారు.

☆ ఇంట్లో చదువుకునే పిల్లలు వున్నవారు.

☆ ఇంటర్‌నెట్ ఉపయోగించే ఆసక్తి వున్నవారు.

☆ చిన్నచిన్న వ్యాపారులు, సంస్థలు నడిపేవారు.

☆ స్కూల్సు

ఇలానే కాకుండా సరదాగా కూడా కొనుక్కోవచ్చు - అయితే మన ఆర్థిక స్తోమత మీద ఆధారపడుతుంది. అయితే పర్సనల్ కంప్యూటర్ వల్ల అంతోఇంతో ఉపయోగం వుంటుందనటంలో సందేహం లేదు.

## పీసీలో ముఖ్యమైన భాగాలు

ఒక పీసీని కొనేటపుడు ముఖ్యంగా నాలుగు అంశాలను గమనించాలి. మిగతా అంశాలు కూడా చూసుకోవచ్చు. అయితే పీసీ సామర్థ్యం వాటి మీద ఆధారపడదని గుర్తుంచుకోండి.

1) ప్రాసెసర్

2) ర్యామ్

3) మెమరీ - హార్డ్‌డిస్క్

4) గ్రాఫిక్ కార్డ్స్ - సౌండ్ కార్డ్ లాంటివి

ఇతర పెరిఫరల్స్ - ఫర్నిచర్ వంటివి మన అవసరాలకి బడ్జెట్‌కి అనుగుణంగా తీసుకోవచ్చు. ఉదా: ప్రింటర్-మల్టీమీడియా కిట్ వంటివి.

ఇపుడు పీసీలోని భాగాలను గురించి కొంతవరకు తెలుసుకోవటం ఉపయోగకరంగా వుంటుంది.

**1) ప్రాసెసర్ :** కంప్యూటర్‌కు గుండె వంటిది. దీన్ని చిప్ అని కూడా అంటారు. ప్రపంచంలో ప్రాసెసర్‌ల తయారీలో అగ్రగామి 'ఇంటెల్' సంస్థ. ఇంకా AMD (Advanced Micro Devices) మోటరోలా వంటి ఇతర సంస్థలు కూడా ప్రాసెసర్‌లు తయారు చేస్తున్నాయి. ఇపుడు పెంటియం-4 ప్రాసెసర్ తాజాగా వచ్చింది. ప్రాసెసర్ సామర్థ్యం MHz లలో చెప్తారు. అంటే ఒక సెకనులో ఎన్ని మిలియన్‌ల సూచనలను అమలు చేసే శక్తి పెంటియం-4 ప్రాసెసర్ 1.5 గిగా హెర్జ్‌ల సామర్థ్యంతో పనిచేస్తుంది. ప్రాసెసర్ పేరు ఏదైనా కంపెనీ పేరు ముఖ్యం. ప్రాసెసర్ ఎంత లేటెస్ట్ అయితే అంత మంచిది.

**సూచనలు :**

☆ ఇంటెల్ ప్రాసెసర్‌లు కొనటం మంచిది

☆ ఎక్కువ సామర్థ్యం వున్న ప్రాసెసర్ మీద డబ్బు ఎక్కువగానే ఖర్చు చేసినా నష్టం లేదు.

**2) హార్డ్ డిస్క్ :** దీన్ని కూడా ఎక్కువ సామర్థ్యం వున్నదాన్నే ఎన్నుకోవాలి. ప్రస్తుతం 20 నుంచి 30 గిగాబైట్స్ సామర్థ్యం వున్న హార్డ్‌డిస్క్‌లు లభిస్తున్నాయి. సీగెట్ కంపెనీ హార్డ్‌డిస్క్‌లు కొంతవరకు ప్రాముఖ్యాన్ని పొంది వున్నాయి.

**3) ర్యామ్ :** మల్టీమీడియాలాంటి అప్లికేషన్స్‌కు ఎక్కువ ర్యామ్ అవసరం అవుతుంది. అందుకే కనీసం 128 ఎమ్.బి. సామర్థ్యం వున్న ర్యామ్ (ర్యాండమ్ యాక్సెస్ మెమరీ)ను తీసుకోవటం మంచిది. ఎస్.డి.ర్యామ్ గురించి అడిగి అది తీసుకోవటం వల్ల ఉపయోగం వుంటుంది.

**4) మానిటర్ :** మానిటర్‌ల ఎంపికలో మొదట చూడాల్సింది రిజల్యూషన్ ఇది పిక్సెల్స్ మీద ఆధారం. ఎన్ని ఎక్కువ పిక్సెల్స్ (చిన్న చిన్న చుక్కలు) వుంటే బొమ్మ అంత క్లియర్‌గా వుంటుంది. ఇంట్లో అవసరం కోసం 15" లేదా 17" ల మానిటర్ బావుంటుంది. మంచి కంపెనీవే ఎన్నుకోవాలి.

**5) సీడిరామ్ :** స్యామ్‌సంగ్, ఎల్‌జీ వంటి కంపెనీలు సిడిర్యామ్‌లు తయారుచేస్తాయి. '52 X' సీడిర్యామ్ బావుంటుంది. ఇక డి.వి.డి. లేదా ఫ్లాపీ డ్రైవ్‌లు కూడా తగినవి ఎన్నుకోవాలి.

**6) వివిధ కార్డ్‌లు :** గ్రాఫిక్ కార్డ్ డిస్‌ప్లేకు సంబంధించింది. ఈ కార్డ్‌కు కూడా ర్యామ్ వుంటుంది. దీన్ని విర్యామ్ అంటారు. కనీసం 8 ఎమ్.బి. విర్యామ్ వుంటే బావుంటుంది. దీన్నే వీడియోకార్డ్ అని కూడా అంటారు. ఇక సౌండ్‌కార్డ్ కనీసం 4 ఎమ్.బి. వుంటే శబ్ధ నాణ్యత బావుంటుంది. స్పీకర్‌లలో మంచి కంపెనీవి ఎన్నుకోవాలి. 300 వాట్స్‌పైన వుండే స్పీకర్స్ బావుంటాయి.

**7) మోడెమ్ :** ఇంటర్‌నెట్ - ఫాక్స్ కోసం కొనాలి. ఎక్స్‌టెర్నల్ మోడెమ్‌లు బావుంటాయి. కనీసం 55.6 కె.పి.బి.ఎస్. వుండేవి బావుంటాయి. మంచి కంపెనీ ఎన్నుకోవాలి.

ఇక ప్రింటర్, స్కానర్, సిడిరైటర్ వంటివి అవసరాన్ని బట్టి తీసుకోవాలి. అదే పనిగా కొనకూడదు. సాఫ్ట్‌వేర్ కూడా అవసరాన్ని బట్టి కొనాలి. ఆఫీస్-2000, అవసరమనుకుంటే పేజ్‌మేకర్ వంటివి తీసుకోవాలి. అయితే ఫ్రీగా వస్తుంది కదా అని ఏది పడితే అది కంప్యూటర్‌లో పెట్టుకోకూడదు. పీసీతో పాటు ఏదైనా వారెంటీ వుందా లేదా తెలుసుకోవాలి.

## గుర్తుంచుకోండి!

1) పీసీకొనేముందు ఇంతకు ముందుకొన్నవారిని సంప్రదించాలి. వివిధ కంపెనీల పీసీల గురించి కొంత సమాచారం సేకరించాలి. తెలిసిన నిపుణుల సూచనలు పాటించాలి.

2) పీసీకి సంబంధించిన వివిధవిషయాలు కొంతవరకైనా తెలుసుకోవాలి.

3) ఉచితంగా ఏదైనా వస్తుంటే వెంటనే తీసుకోకూడదు. సాఫ్ట్‌వేర్ పైరేటర్ కొనటం మంచిది కాదు.

4) మన అవసరాలు, పనులు ఖచ్చితంగా అంచనా వేసుకుని అందుకు అనుగుణంగానే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ వుండేట్లు చూసుకోవాలి. తక్కువ ధరలో వస్తున్నాయి కదా అని ఏవిపడితే అవి కొనకూడదు.

**సాధారణంగా హౌస్ యూజర్స్‌కు ఇలాంటి పీసీ వుంటే బావుంటుంది:**

1. పెంటీయమ్-3 అంతకుపై ప్రాసెసర్
2. 128 ఎమ్.బి. ర్యామ్
3. 20 జి.బి. హార్డ్‌డిస్క్
4. 15" లేదా 17" కలర్ మానిటర్
5. పిఎస్/2 మౌస్
6. మల్టీమీడియా కీబోర్డు
7. 52 X సీడి-ర్యామ్
8. 180 వాట్స్ స్పీకర్‌లు
9. 500 కె.వి.ఎ. పై యు.పి.ఎస్. లేదా స్టెబిలైజర్
10. 1.44 ఎమ్.బి. ఫ్లాపీ డ్రైవ్
11. ఇంక్‌జెట్ ప్రింటర్ (అవసరమైతే)

### అసెంబుల్డ్ పీసీలను కొనటం మంచిదేనా?

| | అసెంబుల్డ్ | కంపెనీ |
|---|---|---|
| 1. ధర | తక్కువ | ఎక్కువ |
| 2. సాఫ్ట్‌వేర్ | ఎక్కువ/లేటెస్ట్ | తక్కువ/పాతది |
| 3. పనితనం | ఎక్కువ | ఫర్వాలేదు |
| 4. సర్వీస్ | బావుంటుంది | బావుండదు. |
| 5. డెలివరీ | త్వరగా | టైంపడుతుంది |
| 6. ఇతరా భాగాలకు | మన ఇష్టం | వాళ్ళ ఇష్టం |

**పీసీ ప్రశ్నలు :**

ప్ర. పీసీకొంటే ఎయిర్ కండిషనర్ వుండాలా?

జ. అవసరం లేదు. ఇది అన్ని ఎలక్ట్రానిక్ పరికరాల మాదిరే. అయితే దుమ్ము, ధూళీ రాకుండా జాగ్రత్త పడటం అవసరం.

ప్ర. పీసీకి యాంటీ-గ్లేర్ స్క్రీన్ అవసరమా?

జ. లేదు. అది ఇంటర్‌లేటెడ్ ట్యూబ్‌లు వున్న వాటికే కావాలి. ఇపుడు వస్తున్నవి నాన్ ఇంటర్‌లేటెడ్ మానిటర్‌లు కనుక కళ్ళకి రక్షణగా యాంటీ-గ్లేర్ స్క్రీన్ అంతగా అవసరం లేదు.

ప్ర. బిల్ట్-ఇన్ స్పీకర్స్ బావుంటాయా, ఎక్స్‌టెర్నల్ స్పీకర్స్ బావుంటాయా?

జ. ఎక్స్‌టెర్నల్‌వి కొనటమే బావుంటుంది. అలాగే మోడెమ్స్‌లో కూడా ఎక్స్‌టెర్నల్‌వి తక్కువ ప్రోబ్లెమ్స్‌ను ఇస్తున్నాయి.

# వైతాళికుడు అంబేద్కర్



ధారావాహిక ♦ రచన : కీ.శే. మధులిమాయె ♦ అనువాదం : కీ.శే.సురమౌళి

సాంఘిక విప్లవ సూర్యుడి శిఖరాయమాన వ్యక్తిత్వంపై నిబద్ధతగల సోషలిస్టు మేధావి నిష్పాక్షిక విశ్లేషణ

19

కులనిర్మూలన కాంక్షించే ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రచన!

**(గత సంచిక తరువాయి)**

భారతదేశపు సమాజంలోని వైరుధ్యాలనూ, తగాదాలనూ రెండవ ప్రపంచయుద్ధం మరింత రెచ్చగొట్టింది. సంఘర్షణ శిఖరాగ్రానికి చేరింది. ప్రపంచ యుద్ధంలో కాంగ్రెసు మంత్రులందరూ రాజీనామాలు చేశారు. యుద్ధకాలంలో అధికారంలో దళితుల నిజమైన ప్రతినిధులకు స్థానం లేకుండా చేయడం, అంబేద్కర్‌ను కాంగ్రెసుకు పూర్తిగా దూరం చేసింది. ద్విజాతి సిద్ధాంతాన్నీ భారత విభజన కోరికనూ ప్రచారం చేసుకోవడానికి ముస్లిం లీగుకు అవకాశం లభించింది. అల్ప సంఖ్యాకుల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు, బాధ్యతా యుతమైన జాతీయ ప్రభుత్వాన్ని సాధించు కోవడానికి కాంగ్రెసువారు చేసే ప్రయత్నాలను అంబేద్కరూ, ముస్లిం లీగూ కూడా వ్యతిరేకించారు. అంతరంగిక విభేదాలను బ్రిటిష్‌వారు, దేశం మీద తమ ప్రాబల్యాన్ని కొనసాగించు కోవడానికి వాడుకున్నారు. నియంత్రితమైన శాసనోల్లంఘు నోన్ముఖంగా కాంగ్రెసు పురోగమించింది. 1942 కల్లా బహిరంగ తిరుగుబాటుకే పూనుకున్నారు. కాంగ్రెసు వైఖరి పట్లగానీ, దాని ఆకాంక్షల పట్లగానీ అంబేద్కర్‌కు సానుభూతి వుండేది కాదు. ఉభయులమధ్య పెద్ద గండి ఏర్పడింది. వైస్‌రాయ్‌గారు తన ఎక్జిక్యూటివ్ కౌన్సిల్‌ను భారతీయం చేశారు. అంబేద్కర్‌ను కూడా అందులో చేరవలసిందిగా కోరారు. బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా అంబేద్కర్‌కు పదవి లభించి వుండేది. ఇంకా ముమ్ముందు ఫెడరల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా కూడా ఆయన్ను నియమించే అవకాశం ఉండేది. అయితే ప్రజాజీవిత రంగాల నుంచి విరమించుకోవడానికి అంబేద్కర్ సిద్ధపడలేదు. అందువల్ల ఎక్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చేరడానికి ఆయన ఇష్టపడ్డారు.

## కార్మిక విభాగం నాయకత్వం

ఎక్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక విషయాల ఇన్‌ఛార్జిగా అంబేద్కర్ నియుక్తులయ్యారు. అంతకు ముందునుంచే అమలులోనికి వచ్చిన త్రైపాక్షిక సంప్రదింపుల విధానాన్ని సమన్వయ పరిచి మరింత పటిష్టం చేయడానికి ఆయన ప్రయత్నించారు. అయితే వాస్తవమైన అధికారాన్ని గానీ, బాధ్యతనుగానీ ఇవ్వనటువంటి. బానిస రాజ్యాంగం క్రింద అనేక పరిమితులకు లోబడి అంబేద్కర్ పని చేయవలసి వచ్చింది. యుద్ధ సన్నాహాలకు అనుగుణంగా కార్మికులను సమీకరించడం ఆయనకు



అనివార్యమైనది. కార్మికోద్యమాలలోని ప్రగతివాదులూ, తీవ్రవాదులూ దీన్ని వ్యతిరేకించారు. అయితే ఎం.ఎస్.రాయ్ అనుయాయులు మాత్రం ఈ కృషికి సంపూర్ణ సహకారం అందించారు. నెలకు 13,000 రూపాయల చొప్పున ఆర్థిక బహుమానం పొందారు. ఆ రోజుల్లో 13 వేల రూపాయల మొత్తం అంటే చాలా పెద్ద మొత్తమే. ఈ తరుణంలో కమ్యూనిస్టులు కూడా తమ యుద్ధవ్యతిరేక వైఖరిని సవరించుకునే దశలో ఉన్నారు. యుద్ధాన్ని వారు ప్రజా యుద్ధమని ప్రచారం చేయసాగారు. ఈ పరిణామాలన్నీ జాతీయవాదుల్లో వ్యతిరేకతను ప్రేరేపించాయి. యుద్ధ సమయపు సమీకరణల వల్లఅంబేద్కర్ పట్ల వ్యతిరేక భావన గట్టిపడింది. ఫలితంగా సామాజిక సమానత్వ లక్ష్యం వెనక్కిపోయింది.

1945లో సిమ్లా మహాసభకు ముందు కాంగ్రెసు నాయకులను విడుదల చేశారు. ఐతే మహాసభ విఫలమైంది. కేంద్ర విధానసభకూ, రాష్ట్ర విధానసభలకూ తాజాగా ఎన్నికలు జరపాలని, నూతన లేబర్ పార్టీ ప్రభుత్వం ఉత్తరువు చేసింది. ఎన్నికలు జరిగాయి.

1945లో కేంద్ర విధానసభకు జరిగిన ఎన్నికల్లో ప్రతిచోటా, ముస్లిం నియోజకవర్గాలలో ముస్లిం లీగు అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. 1946లో రాష్ట్ర విధాన సభలకు జరిగిన ఎన్నికలలో కూడా ఇదే జరిగింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రం ఒక్కటే మినహాయింపు. ఇటువంటి మారుమూల ప్రాంతమైన రాష్ట్రంలో కూడా ముస్లింలీగు తన పరిస్థితిని బాగా మెరుగుపరచుకున్నది. 1937 ఎన్నికల్లో అక్కడ దాని వూసే ఉండేది కాదు. కాంగ్రెసుకన్నా ఈసారి ముస్లిం లీగు ఎక్కువ స్థానాలు సంపాదించింది. జనరల్ సీట్లలో గెలిచిన వారి సహాయంతోనే 1945లో అక్కడ డాక్టర్ ఖాన్ సాహెబ్ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు.

ఎరవాడ ఒప్పందం ప్రకారం రూపొందిన ప్రాథమిక ఎన్నికలలో షెడ్యూలు కులాలకు చెందిన ఓటర్ల ప్రవర్తన, 1945 ఎన్నికలలో గమనించాల్సిన విశేషాంశం. షెడ్యూల్డు కులాలకు చెందిన వారందరి మద్దత్తూ తమకే వున్నదని, హరిజనులకు కాంగ్రెసే ప్రాతినిధ్యం వహిస్తున్నదన్నమాట. బూటకమని రుజువు చెయ్యాలని, డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలోని షెడ్యూల్డు కులాల సమాఖ్య ప్రయత్నించింది.

అఖిల భారత స్థాయిలో, సమాఖ్య ఈ విషయాన్ని రుజువు చేయలేకపోయింది. బొంబాయి ప్రెసిడెన్సిలోనూ, సెంట్రల్ ప్రావిన్సు - బెరార్ రాష్ట్రాలలోని మరాఠీ భాషీయ ప్రాంతంలో అంబేద్కర్ అనుయాయులు గణనీయంగా ఎన్నికయ్యారు. మిగతాచోట్ల మాత్రం వారు కాంగ్రెసుకన్నా వెనుకే వుండిపోయారు.

మహా విదర్భ ప్రాంతంలో డాక్టర్ అంబేద్కర్ గారికి గట్టి ప్రాబల్యం ఉన్నదని శ్రీ రవిశంకర్ శుక్లా అంగీకరించారు. నాగపూర్‌కు చెందిన కార్మిక నాయకుడు ఆర్.ఎస్. రూయికర్ డాక్టర్ అంబేద్కర్ నాయకత్వాన బలమైన పార్టీ పనిచేస్తున్నది అని పేర్కొన్నారు. కాంగ్రెసువారూ, ప్రగతి వాదులూ ఏకమైనప్పుడే, రిజర్వు చేసిన హరిజన స్థానాలనూ, లేబరు స్థానాన్నీ, మహిళాస్థానాన్నీ కాంగ్రెసు గెలుచుకోవడం సాధ్యమని సూచించారు. సహకారం కోసం రూయికర్ అభ్యర్థనకు సర్దార్ ప్రతిస్పందించారు. కాంగ్రెసు నుండి ఒక్క సీటు కూడా పోకుండా చూడాలని, కాంగ్రెసును వ్యతిరేకించేవారు ఎక్కడా గెలువకూడదని ఆయన దృఢ సంకల్పం.

ఒరిస్సాలోనూ ఇతర రాష్ట్రాలలోనూ అంబేద్కర్

## న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్

సంతృప్తికరమైన స్థానం సంపాదించ లేకపోయారు. ఒరిస్సా గురించి సర్దార్‌కు రాసిన ఒక లేఖలో విశ్వనాథ్ దాస్ ఇలా రాశారు.

షెడ్యూల్డు తరగతులకు చెందిన నియోజకవర్గాలలో ప్రాథమిక ఎన్నికలకు సంబంధించినంత వరకు పూరీ, బాలాసోర్ జిల్లాలకు చెందిన నాలుగు సీట్లలోనూ, కటక్ జిల్లాలోని ఒక సీటులోనూ పోటీయే లేదు. కటక్ జిల్లాలోని మరొక సీటు విషయంలోనూ, ఒరిస్సా బయటి నుంచి వారి అఖిల భారత పార్టీ నుంచి నేరుగా ఆర్థికంగానూ, ఇతరత్రానూ సహాయం పొందుతున్న అంబేద్కర్ పార్టీ నుంచి మనం గట్టి పోటీని ఎదుర్కోవలసి రావచ్చు. అయితే ఈ అర్థం గురించి పెద్దగా ఆందోళన పడవలసిన అవసరం లేదు.

ప్రాథమిక ఎన్నికలలో, వారి కులంలో కూడా మన వ్యతిరేక అభ్యర్థులను సమర్థించేవారి సంఖ్య చాలా స్వల్పమని రుజువు చేయడానికి మేం కృషి చేస్తున్నాము. డాక్టర్ అంబేద్కర్‌కు ఇది గొప్ప గుణపాఠం కావాలి, కాని వారు వీటి విషయం పట్టించుకోవడం లేదు. అందువల్ల (ఈ నియోజకవర్గాలలో) ఒరిస్సాలో ప్రాథమిక ఎన్నికలు లేవన్నట్లే.

1945 డిసెంబరు 20వ తేదీన సి.పి. బెరార్ మాజీ ప్రధాని శ్రీ రవిశంకర్ శుక్లా, సర్దార్‌పటేల్‌కు ఒక లేఖరాస్తూ, సి.పి. బెరార్‌లలోని మరాఠీ ప్రాంతాలలో మనం ప్రాథమిక ఎన్నికల విషయం పట్టించుకోకుండా ఉంటేనే బాగుంటుందనీ, డాక్టర్ అంబేద్కర్; గవాయి, ఖాండేకర్ ముఖాలవారు నిలిపిన అభ్యర్థులలో ఎవరినైనా ఓడించి, గెలుపు సాధించగల సామర్థ్యం కాంగ్రెసు హరిజన అభ్యర్థులకుండదని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక ఎన్నికలు ముగిసింతర్వాత అందరూ కాంగ్రెసు సహాయం కోసం అర్రులు చాస్తారు. అప్పుడు మనం వారిలో ఉత్తముడైన అభ్యర్థిని ఎంచుకోవచ్చు. ఈ విధానం న్యాయవిధానం కాదని, లంచం ఇచ్చే పద్ధతి, ఆశలు కల్పించి ఆకర్షించే పద్ధతి అని అంబేద్కర్ విమర్శించారు. మరింత సున్నితమైన విధానాన్ని అనుసరించవలసిందిగా శ్రీ బ్రిజ్‌లాల్ బియానీకి సర్దార్ రాశారు. విదర్భ ప్రాంతంలోని రాష్ట్రాలలో కాంగ్రెసు జోక్యం చేసుకోకూడదు. మహా అయితే టిక్కెటు ఇవ్వకుండా మనవారినెవరినైనా ఒక హరిజనుణ్ణి నిలబెట్టాలి; ఎన్నికలలో గెలిచిన తర్వాత అతన్ని కాంగ్రెసు దత్తత తీసుకోవాలి. అంబేద్కర్ చేతుల్లో చిత్తుగా ఓడిపోవడం అనే అప్రతిష్టను నివారించుకోవాలన్నది సర్దార్ ఆతురత.

ఎన్నికల ఫలితాలు అటు కాంగ్రెసుకూ, ఇటు ముస్లిం లీగుకూ బ్రహ్మాండమైన సంతృప్తిని కలిగించాయి. మిగతా పార్టీలన్నీ ఓడిపోయాయి. త్యాగాలూ, బలిదానాల ద్వారా కాంగ్రెసు ప్రజాభిమానాన్ని చూరగొన్నది. దానికి బలమైన పునాదులు ఏర్పడ్డాయి. ఒక మరాఠీ భాష మాట్లాడే ప్రాంతంలో తప్ప దళితుల్లో కూడా కాంగ్రెసు పార్టీ బలం పుంజుకున్నది. డాక్టర్ అంబేద్కర్ ప్రయాణించిన దారి ముందుకు సాగకుండా ఆగిపోయింది. 1946లో వైస్‌రాయ్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి అంబేద్కర్ రాజీనామా చేశారు. 1946 సెప్టెంబరులో తాత్కాలిక ప్రభుత్వం అధికారం స్వీకరించింది. కొత్త ప్రభుత్వంలో శ్రీ జగజీవన్‌రాం, అంబేద్కర్ స్థానాన్ని చేపట్టారు. అంబేద్కర్, ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలి? చీలుదారుల కూడలివద్ద దారిని ఎంచుకునే స్థితికి ఆయన వచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయసాగింది. ఆయన పట్ల కఠిన వైఖరి కూడా అనుసరించనట్లు అర్థం కాసాగింది.

1945లో జైలు నుంచి బయటికి వచ్చిన సర్దార్, మారిన మనిషిగా బయటికి వచ్చారు. అధికారం హస్తగతం కావడానికి ఇక కొద్దికాలమే ఉన్నదన్న విశ్వాసం ఆయనకు కలిగింది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన విశ్వాసం ధ్రువపడింది. సత్యాగ్రహ సిద్ధాంతాన్నీ, ప్రత్యక్ష చర్య పద్ధతినీ, చాలా గట్టిగా సమర్థించే సర్దార్ అభిప్రాయాలు అప్పటికి రూపాంతరం చెందాయి. ఆయన



దృక్పథం మారింది. దేశంలో కాంగ్రెసు పాలకపక్షం అని ఆయన భావించసాగారు. ఆయన నైత్యకవేదాంతాన్ని అనుసరించడం మొదలుపెట్టారు. ప్రజలందరూ కాంగ్రెసు పార్టీని విశ్వసించాలనీ, అందరికీ న్యాయం కలిగించే అవకాశాన్ని కాంగ్రెసుకు కల్పించాలనీ, మిగతా వారంతా నోరుమూసుకుంటే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులూ, ఉద్యమాలు, శాసనోల్లంఘన ఉద్యమాలూ లేదా సమ్మెలూ మొదలైనవన్నీ క్రమశిక్షణ రాహిత్యంగా ఆయన భావించసాగారు.

## అంబేద్కర్ : పటేల్, నెహ్రూ

1945 - 1946 సంవత్సరాలలో సర్దార్ పటేల్ దృక్పథం ఒకవైపు సంకుచితమూ అయింది; మరొకవైపు విశాలమూ అయింది. పోరాటాలన్నా, ఆందోళన వైఖరులన్నా ఆయనలో బద్ధవ్యతిరేకత పెరిగింది; అది సంకుచితమవడం. అయితే అదే సమయంలో ఆయన దృక్పథం విశాలమైంది కూడాను. పురాతన విభేదాలను విస్మరించి, జాతి పునర్నిర్మాణ కృషిలో అందరి సహకారాన్ని పొందడానికి ఆయన సంసిద్ధులైనారు. అయితే సహకారాన్ని స్వీకరించాలన్న ఆయన దృక్పథం ఆయన ఇప్పుడు వచ్చిన అభివృద్ధి నిరోధక దృక్పథానికి అనుబంధంగా ఉండేది. ఎవరెవరి నుంచి సహకారం పొందాలని భావించారో, వారిలో డాక్టర్ అంబేద్కర్ కూడా ఒకరు.

1935 - 1936 సంవత్సరాలలో మతం మార్చుకుంటానని డాక్టర్ అంబేద్కర్ ప్రకటించింతరవాత గాంధీజీ మనస్సు ఎక్కడో విరిగింది. డాక్టర్‌గారి పట్ల ఆయన హృదయం కఠినం కాసాగింది. అంబేద్కర్ చేసిన ఒక మొండి ప్రసంగం కూడా ఆయన్ను నొప్పించింది. 1946లో రాష్ట్రాలలో కాంగ్రెసు తిరిగి అధికారంలోనికి వచ్చింతర్వాత మొట్టమొదటి సారిగా సర్దార్ రాజీ ప్రతిపాదనలతో ముందుకు వచ్చినప్పుడు మహాత్మాగాంధీ వైఖరి అయిష్టంగా ఉండిందన్నది స్పష్టమే. భీమరావు అంబేద్కర్‌ను నీవు కలుసుకోవడం మంచిదేనని, ఐతే ఆయన ఒప్పుకోడని, 20 శాతం ఎందుకు? (విధానసభల్లో సీట్లు) ఇందులో ఏదో లోపం ఉన్నట్లు నాకు అనిపిస్తున్నది. దాన్ని గురించి మళ్లీ ఆలోచించం అని జూలై 21వ తేదీన గాంధీజీ సర్దార్‌కు రాస్తూ హెచ్చరించారు.

అయితే సంప్రదింపులు నిలిపివేయాలని మాత్రం ఆయన కోరలేదు. పూనాకు గానీ సేవాగ్రాంకుగానీ వచ్చేట్లయితే తానే స్వయంగా అంబేద్కర్‌ను చూడాలనుకున్నారు, గాంధీజీ. ఇందుకు భిన్నంగా వార్తాపత్రికలలో వచ్చిన అంశం నిజం కాదు.

సర్దార్ పట్టుపట్టారు. 1946 ఆగస్టు 1వ తేదీన ఆయనకు గాంధీజీ వివరమైన ఉత్తరం రాశారు. డాక్టర్ అంబేద్కర్‌తో రాజీపడటంలో ఏదో ప్రమాదం వున్నదని గాంధీజీ భావించారు. సత్యానికీ, అసత్యానికీ మధ్య, హింసకూ అహింసకూ మధ్య తేడాను అంబేద్కర్ గుర్తించరని గాంధీజీ అభిప్రాయం. ఈ విషయాన్ని అంబేద్కరే స్వయంగా గాంధీజీతో అన్నారు. డాక్టర్‌గారు తన సహజసిద్ధమైన ఈ ధోరణిలోనే బహుశా గాంధీజీతో మాట్లాడివుంటారు. గాంధీజీ ప్రతి మాటనూ జాగ్రత్తగా విని గుర్తుపెట్టుకొని వుంటారు. సాంఘికన్యాయం పట్ల అంబేద్కర్‌కున్న అంకిత భావం అమోఘమైనది. ఇదివరకే మనం గమనించినట్లు, ఆయన బహిరంగంగానే, తనకు షెడ్యూల్డు కులాలవారి ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలకన్నా ప్రధానం అని ప్రకటించారు. అయితే గాంధీజీకున్న నిజమైన అభ్యంతరం వేరే వున్నది. క్రైస్తవుడయి, ముస్లిముల్లో చేరి, సిక్కుమతం పుచ్చుకొని తనకు అనుకూలంగా వున్నప్పుడు తిరిగి మతంలోనికి వచ్చే మనిషిని గురించి మనం జాగ్రత్తగా వుండాలి, అన్నారాయన.

మతం విషయంలో గాంధీజీ వైఖరే వేరు. అతి గహనమైన కార్యాచరణను ప్రేరేపించేది మతం; మనిషికి దేవుడు చూపించిన మార్గం దేవునితో మనిషికున్న బంధం. డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో ఇదేమి ప్రధానమైనది కాదు. ఉన్న స్థితిలో, ఈ బ్రతుకులో, ఈ లోకంలో ఇప్పటికిప్పుడు మానవసంబంధాల గురించి మతం చేసిందేమిటనేదే అంబేద్కర్‌కు ప్రధానం. పరస్పర అవగాహనకు సంబంధించిన లోపం ఉభయుల్లోనూ వుండేది.

ముస్లింలీగువల్ల కలిగిన భయం కారణంగా అంబేద్కర్‌తో రాజీ సంప్రదింపులకు ఉపక్రమించవద్దని గాంధీజీ, సర్దార్‌కు సలహా చెప్పారు. అలా చేస్తే ఉభయభ్రష్టత్వం సంప్రాప్తిస్తుందని ఆయన అభిప్రాయం. హరిజనుల పట్ల గాంధీజీకి సానుభూతి లేదని ఎవరన్నా అపార్థం చేసుకోకుండా వుండాలని గాంధీజీ రాసిన ఒక లేఖలోని ఈ దిగువ అంశాలను ఇక్కడ పేర్కొంటున్నాను :

> **"భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కొంతవరకు రాష్ట్రాలు కూడా స్వతంత్రం అయినపుడు - హిందూ అగ్రకులాలవారు సక్రమంగా, ఉంటే సరే సరి. న్యాయోచితంగా ఆలోచించేవారి సంఖ్య తక్కువై అధికారం మూఢుల గుప్పిళ్లలోకి వెళ్లిపోతే, ఈనాడు మనం ఎన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నా సరే, అన్యాయం జరిగి తీరుతుందనడంలో సందేహం లేదు. ఈనాడు మీకిష్టం వున్నటువంటి ఏ షరతులనైనా అంగీకరించవచ్చు; హరిజనులను కొట్టేవారూ, వారిని హత్యలు చేసేవారూ, అందరూ వాడుకునే బావుల నుంచి నీరు తోడుకోకుండా వారిని అడ్డగించేవారూ, పాఠశాలల నుంచి వారిని తరిమి వేసేవారు, ఇళ్లల్లోకి వారిని అడుగుపెట్టనివ్వని వారూ - ఎవరు? వారందరూ కాంగ్రెసువారే. ఔనా కాదా? ఈ విషయమై స్పష్టమైన అవగాహన అవసరం".**

అయితే సర్దార్ ఊరుకోలేదు. గాంధీజీతో చర్చలు కొనసాగించారు. రెండు రోజుల తర్వాత (1946 ఆగస్టు - 3) గాంధీజీ ఆయనతో ఇలా అన్నారు. "ఇందులో ఎలాంటి ప్రమాదమూ నీకు కన్పించకపోతే నేను చెప్పేదేముంటుంది? అన్ని విధాలా భీమరావుతో రాజీపడు. నేను ఇంకా చెప్పేదేమీ లేదు".

(ఇంకావుంది)



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

# బాపు 68



కళామతల్లికి రెండు చేతులా చచ్చేంత సేవచేశాం. వయసు పైబడింది. రామా! రామా! మోర్ టైమ్స్ రామా అనుకోవాల్సిన టైమ్. ఏది ఇండియనింకో, ఏది క్రొక్విల్‌లో మరేది పెన్సిల్‌లో వెతుక్కోవాల్సిన ఖర్మం. దూసుకొచ్చిన కొత్తతరం గీతల్ని వారి బొమ్మల రీతుల్ని విస్తుబోయి చూడాల్సిన పిరియడ్. 'ఆ పాత బొమ్మలేసే ఆయన పాపం బాగా పెద్దవాడై పోయింటాడు.







యిపుడేం చేస్తున్నాడో'"? అని వాకబు చేయాల్సిన కాలం. రాసుకోవడానికే కదా. ఇట్లాంటివి, బోల్డంత ఊహించి రాయచ్చు గాని, పరిస్థితి మాత్రం అట్లా లేదు? అరవై ఎనిమిది ఏండ్లొచ్చినపుడు ఎట్లుండాల?, వీపు వంగలేదు సరికదా, ఇంకా తీవీగా, వెన్ను విరుచుకో నిలబడింది ఆ గీత. ఈ సారికిలా పోనిద్దాం. అనే ఛాన్స్ లేకుండా యాభై యేళ్ళుగా సవాల్ చేస్తానే వుందది.



కోతి మొహం స్వామిలా కుంచె దారికడ్డంగా వేసుకొని కూచ్చున్నాడీయన. దాన్ని దాటడానికి మా తండ్రుల చేతే కాక పోయింది. నిక ఈ మనవాళ్ళ సంగతా....

డిసెంబర్ 15న బాపు అనబడే సత్తిరాజు లక్ష్మి నారాయణ తాతగారి పుట్టిన రోజు. అందుకే ఈ గోలంతా. భగవంతుడి దయవల్ల మాలాంటి పనికిమాలిన ఆర్టిస్టులు దేశంలో తక్కువేం లేరు. మా ఆయిష్షంతా పోసుకొని బాపుగారు కలకాలం వర్థిల్లాలని శ్రీరాముణ్ణి ప్రార్థిస్తూ.....



\- అన్వర్

## స్మరించుకుందాం!

## 'నా కఫన్‌లో నా మాతృభూమి మృత్తికను వుంచండి'

'...నా మాతృభూమి నిత్యం సకల సౌభాగ్యాలతో తులతూగాలి. నాదేముంది నేను ఉండొచ్చు ఉండకపోవచ్చు...' స్వాతంత్ర్య సంగ్రామ వీరుడు, ప్రముఖ ఉర్దూ కవి షహీద్ అష్ఫాఖుల్లాఖాన్ తన మాతృదేశం సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ పలికిన పలుకులివి. మాతృభూమి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో బ్రిటీష్ వలసపాలకులపై విప్లవించిన అమరవీరుడు అష్ఫాఖుల్లాఖాన్. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అగ్ని యుగంగా కీర్తించబడిన విప్లవోద్యమంలో, ఈ యువకిశోరం తన అపూర్వమైన త్యాగంతో యువకుల్లో దేశభక్తి భావాలను ప్రజ్వరిల్ల చేసి చిరంజీవి అయ్యాడు.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుండి వీరపుత్రులను అందిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్‌లో అష్ఫాఖుల్లా ఖాన్ 1900 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన జన్మించారు. చిన్ననాటనే భారత దేశ పరిస్థితులు, ప్రపంచ చరిత్రను అధ్యయనం చేస్తూ, దేశీయుల కష్టనష్టాలను, రాజకీయాలను అర్థం చేసుకోసాగారు. స్వతంత్ర ఆలోచనలు సాగించాడు. 'హసరత్' ఆయన కలం పేరు ఉర్దూలో చక్కని కవితలను అల్లటం ప్రారంభించాడు. బ్రిటీష్ పోలీసులు సాగించే దుశ్చర్యల మీద మండిపడుతూ, అకిరాతకాలను ఎదుర్కొన్న ప్రజానీకం ధైర్య సాహసాలను కీర్తిస్తూ గీతాలు రాసారు. బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటున్న ఆయనకు 'హిందూస్థాన్ రిపబ్లిక్ ఆర్మీ' శ్రీరాంప్రసాద్ బిస్మిల్ పరిచయం కలగటంతో ఆర్మీ సభ్యత్వం స్వీకరించాడు.

ఆనాడు బ్రిటీషర్లను తరిమి కొట్టేందుకు అంగబలంతో పాటుగా ఆయుధాలు అవసరం అయ్యాయి. ప్రభుత్వ ధనాన్ని దోచుకుని ఆయుధాలు సమకూర్చుకుని పోరాటం సాగించాలని ఆర్మీ నిర్ణయించింది. ఆ మేరకు బ్రిటీష్ ప్రభుత్వ ఖజానాను తీసుకు వస్తున్న ఒక రైలు నుండి ధనాన్ని సొంతం చేసుకునేందుకు పథకం తయారైంది. ఆ పథకం ప్రకారం 1925 ఆగష్టు 9వ తేదీన "కాకోరి" గ్రామం మీదుగా వెళ్ళే 'మెయిల్'లో తరలిస్తున్న ఖజానాను కాకోరి దళం కైవసం చేసుకుంది. ఈ సంఘటనతో బ్రిటీష్ ప్రభుత్వం ఖంగుతింది. కాకోరి యాక్షన్ దళసభ్యుల కోసం భారీ స్థాయిలో పోలీసువేట ప్రారంభమైంది. 'ఆర్మీ' నాయకుడు బిస్మిల్‌ను సెప్టెంబర్ 26వ అరెస్టు చేశారు. ఆ తరువాత దళంలోని సభ్యులందరినీ నిర్బంధించారు. బ్రిటీష్ పోలీసు బలగాలను ముప్పుతిప్పలు పెడుతూ ఏడాది పాటు అష్ఫాఖుల్లా ఖాన్ పట్టుబడలేదు. చివరకు రష్యా వెళ్ళే ప్రయత్నంలో ఉండగా, ఒక మిత్రుడి ద్రోహం వలన ఆయన ఢిల్లీ పోలీసుల వలలో చిక్కుకున్నారు.

ఆయనను అప్రూవర్‌గా మార్చాలని బ్రిటీష్ పోలీసులు పన్నాగం పన్నారు. ఆ ప్రయత్నాలలో భాగంగా, కాకోరి సంఘటనలో ఉరిశిక్ష తప్పదని భయపెడుతూ, ప్రభుత్వంతో సహకరిస్తే శిక్ష తప్పిపోవటమే కాక, సుఖవంతమైన జీవితానికి అవసరమైన ఏర్పాట్లు చేయిస్తానని మధ్యవర్తుల ద్వారా ప్రలోభ పెట్టచూసారు. తుచ్ఛమైన ప్రాణం కోసం విప్లవోద్యమానికి ద్రోహం చేసి, మాతృదేశ గౌరవాన్ని మంటగలిపే కంటె ప్రాణాలను త్యజించటం మేలని ఆయన ప్రకటించారు. విశ్వాసఘాతుకానికి పాల్పడాల్సిందిగా, నీచమైన ప్రతిపాదనలతో తన వద్దకు వచ్చిన మధ్యవర్తులను అసహ్యించుకున్నారు. చివరకు ఆయనను తీవ్ర చిత్రహింసలకు గురిచేసారు.

చరిత్ర సృష్టించిన 'కాకోరి రైలు దోపిడి కేసు' విచారణ దశల వారీగా జరిగింది. చివరకు కాకోరి దళం సభ్యులైన రాజన్ లహరి, రోషన్ సింగ్, బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌కు ఉరిశిక్షలు విధిస్తూ 1927 ఏప్రిల్ 8వ తేదీన కోర్టు తీర్పు చెప్పింది. 'ఆర్మీ' లోని కొందరు క్షమాభిక్ష కోరారు. బిస్మిల్ బలవంతం మీద ఆయన కూడా క్షమాభిక్ష కోరాడు. ఆ క్షమాభిక్ష విజ్ఞప్తులను ప్రభుత్వం తిరస్కరించింది. 1927 డిసెంబరు 19వ తేదీన ఫైజాబాద్ జైలులో ఉరిశిక్షను అమలు జరపాలని కోర్టు ఆదేశించింది.

ఆ మృత్యుఘడియ రానే వచ్చింది. చివరిసారిగా ఆయనను చూసుకునేందుకు బంధువులు, సన్నిహితులు జైలుకు వచ్చారు. రోదిస్తున్న మిత్రులను చూసి వ్యాకులపడ్డాడు. మాతృదేశం కోసం ప్రాణాలను త్యాగం చేసే అవకాశం లభించినందుకు, ఆ అదృష్టాన్ని తలంచుకుంటూ తాను పొంగిపోతుండగా తనను చూసి గర్వపడాల్సింది పోయి, రోదించటం ఆయన మనస్సుకు కష్టం కల్గించింది. ఈ విషయాన్ని ఆయన స్పష్టంగా వ్యక్తీకరించాడు.




షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ ఉరికంబం ఎక్కడానికి మూడురోజుల ముందు జైలునుంచి రాసిన చివరి లేఖ



## షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ (1900-1927)

దుందుడుకు సాహసోపేత చర్యల కంటే, సార్థకత చేకూర్చే చర్యలపట్ల అష్ఫాఖుల్లా ఆసక్తి చూపారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, భారతదేశం మొత్తం మీద విప్లవ జ్వాలలను ప్రజ్వరిల్ల చేయాలన్నది ఆయన అభిమతం. ఈ విషయాలను జైలు నుండి రాసిన చివరి లేఖలో "... భారత రంగస్థలం పైన మా పాత్ర మేము నిర్వహించాం... ఏమి చేసినా స్వాతంత్ర్యం సంపాదించాలనే భావనతో ప్రేరితులమయ్యే చేశాం... మేము దేశంలో భయోత్పాతాలు సృష్టిస్తున్నామని కొందరు అంటున్నారు... మా ఉద్దేశ్యం అది కాదు. మేము స్వాతంత్ర్యం సంపాదించేందుకు దేశం మొత్తంలో విప్లవం తీసుకురావాలని అనుకున్నాం..." అని పేర్కొన్నారు.

అది 1927 డిసెంబర్ 19వ తేది ప్రాతఃకాలం. మాతృభూమి విముక్తి పోరాటంలో తాను ఒక సమిధగా మారనున్నందుకు అష్ఫాఖ్ ఆనందించసాగారు. ఈ విషయాన్ని విప్లవయోధుడు సర్దార్ భగత్ సింగ్ వర్ణించారు. '...ఈ స్వచ్ఛంద కవి... ఆశ్చర్యంలో ముంచే ఉల్లాసంతో ఉరికంబమెక్కాడు... ఉరి తీయడానికి ఒక రోజు ముందు ఆయనను కలిశాను. ఆయన బాగా ముస్తాబు అయి ఉన్నాడు. పాపట తీసి దువ్విన పొడవాటి వెంట్రుకలు ఎంతో అందంగా ఉన్నాయి. ఎంతో హుషారుగా నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడాడు. 'రేపు నా పెళ్ళి' అన్నాడు... మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు ఆయనను ఉరి తీసారు. కురాన్ షరీఫ్ కట్టి ఉంచిన చిన్న సంచిని వేలాడదీసుకుని హాజీలాగా పారాయణం చేస్తూ ఎంతో ధైర్యంగా ముందుకు నడిచాడు. ముందుకు నడిచి ఉరికంబంపైన తాడును ముద్దు పెట్టుకున్నాడు'. ఆయన మృత్యువుకు ఏనాడు భయపడలేదు. విప్లవ దీక్ష తీసుకున్న రోజుననే జీవితాన్ని విప్లవోద్యమానికి అర్పితం చేశారు. "...ఉరి కొయ్య మీద ఉయ్యాలలూగే సుందర స్వప్నాన్ని అనునిత్యం దర్శిస్తున్నాను..'' అంటూ, ఉరిశిక్ష అమలు కోసం ఎదురు చూసాడు.

హిందూ - ముస్లింల ఐక్యతను కోరుకున్న అష్ఫాఖుల్లా ఖాన్ ఆ దిశగా ఎంతో కృషి చేశాడు. 1927 డిసెంబరు 16 తేదీన ఫైజాబాద్ జైలు నుండి దేశవాసులకు సందేశం పంపాడు. ఆ లేఖలో '...భారతదేశ సోదరులారా మీరు ఏ మతానికి, సంప్రదాయానికి చెందిన వారైనా సరే, దేశ సేవలో సహకరించండి. వృథాగా పరస్పరం కలహించకండి. ఒకవేళ దారులు వేరైనా అందరి లక్ష్యం ఒకటే. అన్ని పనులూ ఒకే లక్ష్యాన్ని సాధించేందుకు సాధనాలు. అలాంటప్పుడు ఈ వ్యర్థపు కొట్లాటలూ, కుమ్ములాటలు ఎందుకు?.. ఐకమత్యంతో దేశంలోని దొరతనాన్ని ఎదిరించండి. దేశాన్ని స్వతంత్రం చేయండి... చివరగా అందరికి నా సలాం. భారతదేశం స్వతంత్రమగు గాక. నా సోదరులు సుఖంగా ఉందురుగాక..' అంటూ చారిత్రాత్మకమైన లేఖను ముగించాడు. ఆనాటి ఆయన మాటలు ఈనాటి పరిస్థితులకు సరిగ్గా సరిపోతూ మనల్ని మతతత్వ వేర్పాటు వాద శక్తుల పట్ల హెచ్చరిస్తున్నాయి.

మరణం తరువాత కూడా అష్ఫాఖ్ తన పుట్టిన మట్టి నుండి దూరం కాదలచుకోలేదు. తాను పుట్టి పెరిగిన మట్టిలో కలసిపోవాలన్న ప్రగాఢ కాంక్షను వ్యక్తం చేసాడు. ఈ మేరకు తన మనస్సును కవిత్వీకరిస్తూ, '...నాకు మరే కోరికా లేదు... ఉన్న కోరికల్లా ఒక్కటే, నా కఫన్‌లో ఎవరైనా మాతృభూమి మృత్తికను కొంత పెడితే బాగు...' అన్నాడు.

ఉరిశిక్ష అమలు జరిగాక ఆయన మృతదేహాన్ని ఆయన పుట్టిన గ్రామానికి తీసుకెళ్లారు. ఆయన కోరిన విధంగానే ఆయన అంత్యక్రియలు జరిగాయి. మూడు దశాబ్దాలు నిండని వయస్సులో జీవితాన్ని ప్రయోజనకంగా ముగించుకుని వెళ్లిపోయిన విప్లవ కవి, అమర వీరుడు, అష్ఫాఖుల్లా ఖాన్ భౌతిక కాయాన్ని 1927 డిసెంబర్ 19వ తేదీన గౌరవ మర్యాదలతో ఖననం చేశారు.

\- సయ్యద్ నసీర్ అహ్మద్



గవర్నర్ రంగరాజన్, ముఖ్యమంత్రి చంద్రబాబులతో కొత్తమంత్రులు - ఎడమనుంచి వరుసగా ఎం.దామోదర్‌రెడ్డి, టి.శ్రీనివాస్ యాదవ్, ఎస్.దేవయ్య, జె.ఆర్.పుష్పరాజ్, పి.రాములు, పి.నారాయణస్వామి నాయుడు, కోడెల శివప్రసాద్, బి.గోపాలకృష్ణా రెడ్డి, ఎస్.చంద్రమోహన్ రెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, డి.ఆంజనేయులు




1.11.01

➤ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్.పి. భరూచ ప్రమాణ స్వీకారం చేశారు.

➤ ఆఫ్గనిస్తాన్‌లోని అతిపెద్ద ఆనకట్ట కజకిపై అమెరికా యుద్ధవిమానాలు బాంబులు వేశాయి. డ్యాంతో పాటు అక్కడున్న భారీ జలవిద్యుత్ కేంద్రం కూడా ధ్వంసమైంది.

2.11.01

➤ స్పెయిన్‌లో జరిగిన ప్రపంచ యూత్ ఫెస్టివల్‌లో 11 ఏళ్ల తెలుగు బాలిక ద్రోణవల్లి హారిక-పన్నెండేళ్లలోపు బాలికల విభాగంలో రెండవ స్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకుంది.

➤ దేశ వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

3.11.01

➤ ఎల్‌టిటిఇ, హమాస్ తదితర తీవ్రవాద గ్రూపులతోపాటు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థలను అమెరికా నిషేధించింది.

5.11.01

➤ ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెను జూనియర్ డాక్టర్లు విరమించారు.

6.11.01

➤ ప్రధాని వాజ్‌పేయి, రష్యా అధ్యక్షుడు పుతిన్ మాస్కోలో సమావేశమై- తీవ్రవాదంపై ఉమ్మడి పోరుకు సంబంధించి మాస్కో డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు.

7.11.01

➤ 21రోజులుగా జరిగిన ఆర్.టి.సి సమ్మెకు తెరపడింది. కార్మికుల 42 డిమాండ్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



వివాదంలో క్రికెట్

8.11.01

➤ ప్రముఖ భారతీయ రచయిత్రి అరుంధతీరాయ్‌కి పారిస్‌కు చెందిన 'వరల్డ్ అకాడమీ ఆఫ్ కల్చర్' అత్యున్నత అవార్డు లభించింది.

9.11.01

➤ జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదంపై భారతదేశం జరుపుతున్న పోరాటానికి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ మద్దతు ప్రకటించారు. బుష్, ప్రధాని వాజ్‌పేయి మధ్య వైట్‌హౌజ్‌లో చర్చలు జరిగాయి.

➤ ఆఫ్గనిస్తాన్‌లో కీలకపట్టణమైన మజారే షరీఫ్ నార్తర్న్ అలయెన్స్ వశమైంది.



మిస్ వరల్డ్ 2001 అగ్బనీ

12.11.01

➤ న్యూయార్క్‌లో ఒక విమానం కూలి 255 మంది చనిపోయారు.

13.11.01

➤ ఆఫ్గనిస్తాన్ రాజధాని కాబూల్ నార్తర్న్ అలయెన్స్ వశమైంది.

15.11.01

➤ ఖతర్ రాజధాని దోహాలో జరిగిన 142 సభ్యదేశాల డబ్ల్యుటిఓ సమావేశంలో చర్చోపచర్చల తర్వాత డిక్లరేషన్‌పై సంతకాలు జరిగాయి.

16.11.01

➤ అమెరికా బాంబుదాడుల్లో అల్‌ఖైదా అగ్రనేత, ఒసామా బిన్‌లాడెన్ కుడిభుజమైన అతీఫ్ హతమయ్యాడు.

17.11.01

➤ ప్రపంచ సుందరి కిరీటం తొలిసారిగా ఓ నల్లజాతి ఆఫ్రికా యువతికి దక్కింది. దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన పోటీలలో మిస్ నైజీరియా అగ్బనీ డరెగో (18) మిస్ వరల్డ్ కిరీటాన్ని ధరించింది.

19.11.01

➤ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన రీతిలో కెప్టెన్ సౌరవ్ గంగూలీ, మాస్టర్ బ్యాట్స్‌మెన్ సచిన్‌తో సహా ఆరుగురు క్రికెటర్లపై ఐసిసి మ్యాచ్ రెఫ్రీ మైక్ డెన్నిస్ తీవ్రమైన శిక్షవిధించారు. మైక్ శిక్షకు గురైనవారిలో సెహవాగ్, హర్భజన్ సింగ్, శివసుందర్‌దాస్, దీప్‌దాస్ గుప్తా వున్నారు.

20.11.01

➤ నవంబర్ 14 నుంచి 20వ తేదీదాకా హైదరాబాద్‌లో జరిగిన పన్నెండవ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవంలో ఉత్తమ చిత్రంగా ఇరాన్‌కు చెందిన 'చిల్డ్రన్ ఆఫ్ పెట్రోలియం' ఎంపికైంది. ఈ చిత్రానికి 'బంగారు ఏనుగు' అవార్డుతోపాటు లక్షరూపాయల నగదు బహుమతి అందజేశారు. 'గర్ల్ ఇన్ స్నీకర్స్' చిత్రానికిగాను ఇరాన్‌కే చెందిన రసూల్ సాదర్ అమెలికి ఉత్తమ దర్శకుడి అవార్డు లభించింది. ఉత్తమ బాలనటుడుగా గ్రీస్‌కు చెందిన అలెగ్జాండ్రిస్ 'కానరీ ఎల్లో బైసికిల్' చిత్రానికి ఎంపికయ్యాడు. భారత్‌కు సంబంధించి రాణూ చిత్రంలో నటించిన సీమా జ్యారీ ప్రత్యేక అవార్డు గెలుచుకుంది.

22.11.01

➤ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌ను భారత, దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డులు ధిక్కరించాయి. 23నుంచి జోహాన్స్‌బర్గ్‌లో జరిగే మూడవ క్రికెట్‌టెస్టుకు మ్యాచ్ రెఫ్రీ పదవినుంచి మైక్‌డెన్నిస్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించాయి. దీంతో ఈ టెస్టును గుర్తించబోమని ఐసిసి ప్రకటించింది.

24.11.01

➤ నేపాల్‌లో మావోయిస్టులు చెలరేగిపోయారు. నాలుగు నెలల కాల్పుల విరమణకు తిలోదకాలిచ్చి 35 మంది భద్రతా సిబ్బందిని హతమార్చారు. ఉన్నతాధికారులను కిడ్నాప్ చేశారు. 'ప్రజా ప్రభుత్వం' ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

25.11.01

➤ ఆఫ్గనిస్తాన్ ఉత్తరాది నగరం కుందుజ్ నార్తరన్ అలయెన్స్ వశమైంది. రెండు వేలమంది తాలిబన్లు లొంగిపోయారు.

26.11.01

➤ రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా డాక్టర్ జస్టిస్ ఎ.సి. లక్ష్మణన్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

➤ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. 8 మంది మంత్రులకు ఉద్వాసనపలికారు. 11 మంది కొత్త మంత్రులకు చోటు కల్పించారు. పదవులు కోల్పోయిన వారిలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎన్. అరుణ, పుష్పలీల, ఎన్. శివప్రసాద్, ఇ. పెద్దిరెడ్డి, కృష్ణయాదవ్, లక్ష్మీ పద్మావతి, ఎ. ప్రభాకర్ రెడ్డి వున్నారు. కొత్తగా పదవులు పొందిన వారిలో చంద్రమోహన్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, పుష్పరాజ్, రామసుబ్బారెడ్డి, కోడెల, శ్రీనివాస్ యాదవ్, దామచర్ల ఆంజనేయులు, దామోదర్ రెడ్డి, సుద్దాల దేవయ్య, నారాయణ స్వామి నాయుడు, పి.రాములు వున్నారు.



నందూరి

➤ నేపాల్‌లో ఎమర్జన్సీ ప్రకటించారు. భద్రతాదళాల కాల్పుల్లో 200 మంది మావోయిస్టు తీవ్రవాదులు హతమయ్యారు.

28.11.01

➤ నిరంకుశ నిజాం నవాబు దాష్టీకాన్ని ఎదిరించి, వందేమాతరం అంటూ ఎలుగెత్తి నినదించిన స్వాతంత్ర్య సమరయోధుడు 'వందేమాతరం రామచంద్రరావు' కన్నుమూశారు.



కాబూల్‌లో నార్తర్న్ అలయెన్స్

29.11.01

➤ సి.పి.యం. వృద్ధ నాయకుడు, కార్మిక ఉద్యమనేత నండూరి ప్రసాదరావు అస్తమించాడు.

➤ చిత్తూరు జిల్లాలో పీలేరు ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణికి చెందిన హెరిటేజ్ ప్లాంట్‌ను ప్రజా గెరిల్లా సమితి దళం పేల్చివేసింది.

30.11.01

➤ మెదక్ జిల్లాలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు రెచ్చిపోయారు. కేంద్ర మంత్రి కృష్ణంరాజుకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీని, టాటా కాఫీ ప్లాంట్‌ను, ఇద్దరు తెలుగుదేశం నేతల ఇళ్లను ధ్వంసం చేశారు. 5 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. గజ్వేలు కాంగ్రెస్ నాయకుడైన జె.వెంకటరెడ్డిని హత్య చేశారు.

# విలీనాల బాటలో బ్యాంకింగ్




ఏ ఆర్థిక వ్యవస్థకైనా మూలస్తంభం బ్యాంకింగ్ రంగమే. ఆర్థిక వ్యవస్థ పెరుగుదలలో ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యత ఇతర రంగాలకు లేదంటే అతిశయోక్తి కాదు. వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీసుల రంగాలలో కూడా ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలైనా వాటికి కావలసిన పెట్టుబడులు అందించేది బ్యాంకింగ్ రంగమే. ఈ రంగం అందించే ఆర్థిక సహాయమన్నదే లేకపోతే మొత్తం ఆర్థిక వ్యవస్థే స్తంభించిపోతుందన్నది నిర్వివాదం. అయితే అంతర్జాతీయ ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు, భౌగోళికీకరణ ప్రభావినికి బ్యాంకింగ్ రంగం కూడా లోనుకాక తప్పడం లేదు.

భౌగోళికీకరణ ప్రభావం వల్ల ప్రపంచం అంతా ఒక గ్రామసీమగా మారిపోతోంది. దేశాల మధ్య హద్దులు చెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సరళీకృత ఆర్థిక విధానాలను అవకాశంగా తీసుకుని అనేక విదేశీబ్యాంకులు ఇతర దేశాల్లో తమ కార్యకలాపాలు విస్తరించడంతోపాటు వినూత్న పథకాలు, భిన్న ఉత్పత్తులతో కస్టమర్లను విశేషంగా ఆకట్టుకోగలుగుతున్నాయి. ఈ పరిణామాన్ని ధైర్యంగా ఎదుర్కొని నిలవడంతోపాటు వాటికి గట్టిపోటీదారుగా నిలబడాలంటే దేశీయ బ్యాంకింగ్ రంగానికి ఉన్న ఒకే ఒక ప్రత్యామ్నాయం మెగావిలీనాలతో యూనివర్సల్ బ్యాంకుల ఏర్పాటు. ప్రస్తుతం భారత బ్యాంకింగ్ రంగం ఈ దిశలోనేసాగుతుంది. ఇందుకు తార్కాణమే దేశంలోని అతిపెద్ద పారిశ్రామిక ఆర్థిక సహాయసంస్థ అయిన ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఐ.సి.ఐ.సి.ఐ), దాని అనుబంధ ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంకుల మెగా విలీనం ప్రకటన. ఈ రెండు సంస్థలు తాము విలీనం చెందాలని గతనెలలో ప్రకటించగా సరిగ్గా అదే సమయంలో దేశంలోని మరో ప్రధాన పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడిబిఐ) కూడా తాను మరో బ్యాంకును విలీనం చేసుకోవడం ద్వారా యూనివర్సల్ బ్యాంకుగా అవతరించాలనుకుంటున్నట్టు రిజర్వుబ్యాంకుకు ప్రతిపాదన పంపడం మరీ విశేషం. అయితే ఐడిబిఐ ఈ ప్రయత్నంలో భాగంగా తనను దీటైన భాగస్వామిని ఎంపిక చేసుకోవలసి వుంది. ఒకటి, రెండు ప్రభుత్వరంగ బ్యాంకుల దృష్టిలో ఉన్నా సరైన భాగస్వామి ఎవరు అన్నది తేలడానికి ఇంకా కొంత వ్యవధి పడుతుంది.

అసలు ఈ మెగా విలీనాలు, యూనివర్సల్ బ్యాంకుల అవతరణ అంత అవసరమా అనే ప్రశ్న ఉదయించవచ్చు. ఇంతకు ముందే చెప్పినట్టు భౌగోళికీకరణ ప్రభావం వల్ల విదేశీ బ్యాంకుల నుంచి ఎదురవుతున్న పోటీ ఈ విలీనాలు, యూనివర్సల్ బ్యాంకుల అవతరణలూ ఒక పార్శ్వం కాగా కొన్ని అనూహ్యపరిణామాల కారణంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆర్థికసంస్థలను, అప్పులు-ఆస్తుల మధ్య సమతూకం లోపించి తడిసి మోపడవుతున్న నిరుత్పాదక ఆస్తుల భారం (ఎన్.పి.ఏ.), నానాటికీ తీసికట్టుగా మారుతున్న మూలధనం బ్యాంకులను ఈ విలీనాల వైపు దృష్టి సారించేలా చేస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితం వరకు ఎంతో పటిష్టంగా ఉండి కార్యకలాపాలు సాగించుకుంటూ వచ్చిన ప్రగతికారక ఆర్థిక సహాయసంస్థలు తాజా పరిణామాల నేపథ్యంలో నష్టాలను భరిస్తూ నానాటికీ తరిగిపోతున్న మూలధనంతో కార్యకలాపాలు కొనసాగించలేక ప్రభుత్వం అందించే చేయూత కోసం ఎదురు చూసేకన్నా ఇలాంటి విలీనాలతో ఉభయతారకమైన ప్రయోజనం పొందవచ్చునన్న వ్యూహంతో యూనివర్సల్ బ్యాంకుల దిశగా దృష్టి సారిస్తున్నాయనక తప్పదు. అదేవిధంగా బ్యాంకులు కూడా నానాటికీ పెరిగిపోతున్న పోయే వాతావరణంలో తమ మనుగడకే ముప్పు తెచ్చుకునేకన్నా ఈ తరహా విలీనాలతో శక్తివంతమైన సంస్థగా అవతరిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని భావించి ఈ దిశగా మొగ్గుచూపుతున్నాయి.

ఇవన్నీ అలా ఉంచితే ఇలాంటి విలీనాల వల్ల విలీనం అయ్యే సంస్థల కార్యకలాపాలు ఒక్కటిగా మారి నిర్వహణ వ్యయాలు తగ్గుతాయన్నది నిర్వివాదం. పైగా రెండు సంస్థల కస్టమర్లు ఒకే ఛత్రం కిందకి వస్తారు గనుక కస్టమర్ బేస్ పెరుగుతుంది. కస్టమర్లకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడంతో పాటు భిన్న, అన్వేషణాత్మక ఉత్పత్తులతో మరికొంత మంచి కస్టమర్లను ఆకర్షించేందుకు అవకాశం ఏర్పడుతుంది. రెండు సంస్థల ఉన్నత స్థాయి యాజమాన్య పగ్గాలు చేపడుతున్నవారు తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని రంగరించి కొత్త సంస్థకు సమర్థవంతమైన మార్గదర్శకత్వం నెరపడానికి వీలవుతుంది. నన్ను ముట్టుకోకు నామాలకాకి అన్న ధోరణిలో ఒంటెద్దు పోకడలు పోయేకన్నా ఇన్ని ప్రయోజనాలు పొందడమే ఎవరికైనా మేలు. ప్రస్తుత వాతావరణంలో ఇది అవశ్యం కూడా.

- శ్రీ వత్స



విజయవిహారం మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000 : 11 సంచికలు) ముచ్చటైన బైండ్ సెట్‌గా వెలువడింది! వెల : రూ. 125/-

## మా ఆవిడ...



భలేరావు, చిన్నారావు, బోళాశంకర్ తమ తమ భార్యల అవివేకాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు.

భలేరావు: మా ఆవిడకి అస్సలు బుర్ర లేదు. చవగ్గా దొరుకుతోందని 10 కిలోల మటన్ కొనుక్కొచ్చింది. కనీసం మా ఇంట్లో ఫ్రిజ్ కూడా లేదని మర్చిపోయింది.

చిన్నారావు: మా ఆవిడ ఇంకా తెలివి తక్కువది. ఇరవై వేలు ఖర్చుపెట్టి కారు డ్రైవింగ్ నేర్చుకుంది. మా ఇంట్లో కారు ఎక్కడుంది?

బోళాశంకర్: మా ఆవిడకి బొత్తిగా తెలివి లేదు. మొన్నటికి మొన్న గోవా వెళ్ళింది. తన సూట్‌కేస్ సర్దుకుంటున్నప్పుడు నేను గమనించాను. కనీసం 100 కండోమ్స్ ఉన్న ప్యాక్ తీసుకెళ్ళింది. నేను ఇక్కడే ఉంటున్నానని, తనతో రావట్లేదన్న సంగతి కూడా మర్చిపోయింది.

## మాటలు నేర్చిన చిలక



బోళాశంకర్ మాటలు నేర్చిన చిలకని కొనేందుకు మార్కెట్‌కి వెళ్ళాడు.

ఒక దుకాణదారు అమ్ముతున్న చిలకకి ఒక కాలికి ఎర్రదారం మరో కాలికి నీలం దారం వేలాడుతూ ఉండటం చూసి బోళాశంకర్ ఆశ్చర్యపడ్డాడు.

"ఈ ఎర్రదారం లాగితే ఈ చిలక సినిమా పాటలు పాడుతుంది, ఈ నీలం దారం లాగితే ఈ చిలక కబుర్లు చెప్తుంది" - దుకాణదారు వివరించాడు.

"మరి రెండుదారాలూ ఒకేసారి లాగితేనో?" బోళాశంకర్‌కి అనుమానం వొచ్చి అడిగాడు.

"రెండు దారాలూ ఒకేసారి లాగితే కిందపడతాన్రా వెధవా" అని చిలక కోపంగా అరిచింది.

## ఆ తర్వాత బుల్లెట్...



బోళాశంకర్‌కి భార్య మీద అనుమానం వచ్చింది.

కష్టపడి ఓ తుపాకి సంపాదించి, రోజుల తరబడి రహస్యంగా పహారా కాశాడు. చివరికి తన భార్య, ఆ కాలనీ చౌకీదార్ - ఒకరి కౌగిలిలో ఒకరు మైమరచి ఉన్నపుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు బోళాశంకర్.

తుపాకీ తీసి మొదట చౌకీదార్‌ని కాల్చేద్దామనుకున్నాడు.

అంతలోనే బోళాశంకర్ మనసు మారింది.

జీవితం మీద విరక్తి కలిగింది. తుపాకి తీసి తన కణతకి గురిపెట్టుకున్నాడు.

"అంత పని చెయ్యకండి" అని భార్య గొల్లుమంది.

"నోర్ముయ్, లేకపోతే ఆ తర్వాత బుల్లెట్‌తో నిన్నే చంపెయ్యాల్సి వస్తుంది" బోళాశంకర్ గర్జించాడు.

## దూరం



చిన్నారావుకి ముంబై వెళ్ళే పనిపడింది.

ముంబై వెళ్ళే ట్రెన్ ఎక్కి చిన్నారావు ప్రతీ స్టేషన్‌లోనూ దిగి తర్వాత స్టేషన్ వరకూ టికెట్ కొంటూ హైరాన పడుతున్నాడు.

ట్రైను ముంబై చేరాక, మొదట్నుంచీ ఈ తంతు అంతా గమనిస్తున్న సహప్రయాణీకుడు ఒకాయన చిన్నారావుని కారణం అడిగేశాడు: "సార్ ఒకేసారి ముంబై టికెట్ కొనే బదులు, మీరు ఇలా ప్రతీ స్టేషన్‌లోనూ దిగి తర్వాత స్టేషన్‌కి టికెట్ ఎందుకు కొంటున్నారు?"

చిన్నారావు బదులిచ్చాడు : "ఏం చేసేది మరి, నాకేమో ముంబై అర్జంటుగా వెళ్ళి తీరాల్సిన పని పడింది, మా డాక్టరేమో ఒకేసారి దూర ప్రయాణం చెయ్యడం నా ఒంటికి మంచిది కాదని వార్నింగ్ ఇచ్చాడు. అందుకే తక్కువ తక్కువ దూరాలు ప్రయాణం చేస్తూ వచ్చాను".

## చెత్త బండి



"మీ అబ్బాయి పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నాడు?" భలేరావు 6 సం. కొడుకు గురించి, మిత్రుడు ఒకాయన అడిగాడు.

"మా వాడు పెద్దయ్యాక మునిసిపాలిటీ చెత్తబండిలో పనిచెయ్యాలని అనుకుంటున్నాడు" - భలేరావు చెప్పాడు.

"చెత్తబండిలో పనిచెయ్యాలని అనుకుంటున్నాడా, చిత్రంగానే ఉందే" అని ఆశ్చర్యపడ్డాడు మిత్రుడు.

"చెత్తబండి వాళ్ళు అయితేనే కేవలం వారానికి ఒక్క రోజు అంటే మంగళవారం మాత్రమే పని చేస్తారని వాడి నమ్మకం" - భలేరావు వివరించాడు.

## జేబులో



భలేరావు బార్‌కి వెళ్ళి ఒకేసారి ఫుల్‌బాటిల్ ఆర్డర్ చేసి ఒక్కగుక్కలో తాగేశాడు.

వెయిటర్ ఆశ్చర్యపడి "మీ అంత ఫాస్ట్‌గా తాగినవాడిని నేను చూడలేదు" అని ప్రశంసించాడు.

భలేరావు కష్టపడి మాటలు కూడదీసుకుని "ఈ బార్‌లోకొచ్చిన వాడెవడి జేబులోనైనా, నా జేబులో ఉన్నదే ఉంటే - వాడూ నా అంత ఫాస్ట్‌గానూ తాగగలడు" అన్నాడు.

"మీ జేబులో ఏముంది?" - వెయిటర్ కుతూహలం ఆపుకోలేకపోయాడు.

"అర్ధరూపాయి బిళ్ళ" - భలేరావు నోరు జారాడు.

## గిఫ్ట్ బాక్స్



## ప్లాను



భలేరావు వాక్యూమ్ క్లీనర్ల సేల్స్‌మాన్‌గా జాయినయ్యాడు. ఏదైనా క్రియేటివ్‌గా ఉండే ప్లాను వేసి మంచి సేల్సు సాధించాలని తలపోశాడు. పొద్దున్నే వెళ్ళి, నగర శివార్లలో ఒక ఇంటి తలుపు కొట్టాడు భలేరావు.

ఇంటి యజమాని తలుపు తీయగానే గబాగబా రోడ్డు మీద ఉన్న పేడ తెచ్చి, ఇంట్లో జొరబడి, సోఫాల మీదా కార్పెట్ల మీదా ఆ పేడని చల్లాడు.

"మీరేమీ కంగారు పడకండి. మా వాక్యూమ్ క్లీనర్ సామర్థ్యం చూసి మీరు ఆశ్చర్యపోతారు. మా వాక్యూమ్ క్లీనర్ సహాయంతో ఇప్పుడే ఇదంతా ఒక్క చిటికెలో క్లీన్ చేస్తాను"అని వినయంగా మనవిచేశాడు.

ఇంటి యజమాని భలే రావుని ఈడ్చికొట్టి "అంట్ల వెధవా, మేము ఇంట్లో మొన్నే దిగాం. ఇంకా ఈ ఇంటికి ఎలక్ట్రిక్ కనెక్షన్ రాలేదు" అని అరిచాడు.

## ఎలా?



గంభీర్రావు కోటీశ్వరుడు.

ఆయన కోటీశ్వరుడెలా అయ్యాడో చెప్పమని, ఒక బిజినెస్ పత్రికా విలేకరి ఆయన్ని అడిగాడు.

"ముప్పయ్యేళ్ళ క్రితం నా దగ్గిర చిల్లికానీ లేదు. నాకు రోడ్డు మీద ఒక యాపిల్ దొరికింది. ఒక రోజంతా ఆ యాపిల్‌ని నా కర్చీఫ్‌తో నిగనిగలాడేలా తుడిచాను. సాయంత్రం అమ్మేశాను. దానితో మర్నాడు రెండు యాపిల్ పళ్ళు కొన్నాను. వాటిని కూడా కష్టపడి కర్చీఫ్‌తో నిగనిగా మెరిశాలా పాలిష్ చేశాను. వాటిని ఆ సాయంత్రం ఒక రూపాయికి అమ్మేశాను.

ఇలా నెలరోజులు కష్టపడితే నా దగ్గిర పది రూపాయలు సమకూరాయి".

"ఆ తర్వాత....?" విలేకరి ఆత్రుతగా అడిగాడు.

"ఆ తర్వాత మా మేనమామ చచ్చిపోవడంతో నాకు కోటి రూపాయల ఆస్తి కలిసి వచ్చింది"

## 9 PM



భలేరావు బార్బర్ షాపుకి వెళ్ళి షాపతన్ని "ఇవ్వాళ మీరు ఎన్ని గంటలకి క్లోజ్ చేస్తారు?" అని అడిగాడు.

షాపతను "రాత్రి 9 గంటలకి" అని జవాబిచ్చాడు.

మళ్ళీ మర్నాడు కూడా భలేరావు అదే షాప్‌కి వచ్చి అదే ప్రశ్న అడిగాడు.

షాపతను మళ్ళీ "రాత్రి 9 గంటలకి" అని జవాబు చెప్పాడు.

ఈ తంతు ఓ నెల్లాళ్ళు నడిచింది. భలేరావు రోజా రావడం షాపతన్ని అడగడం, షాపతను "రాత్రి 9 గంటలకి" మూసేస్తామని చెప్పడం.

చివరికి షాపతనికి విసుగు వచ్చింది. ఒకరోజు భలేరావు అదే ప్రశ్న అడిగి వెళ్ళిపోయిన తర్వాత షాపతను తన అసిస్టెంటుని పిలిచి "వీడెవడో వెర్రి వెధవలా ఉన్నాడు. రోజా వచ్చి షాపు ఎన్ని గంటలకి మూసేస్తారని అడుగుతాడు కానీ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా షాపులో కటింగ్ చేయించుకోడానికి రాలేదు. నువ్వు వీడ్ని కాస్త ఫాలో అయి అసలు వీడెక్కడివాడో ఏం చేస్తుంటాడో తెలుసుకో" అన్నాడు.

కొన్ని రోజుల తర్వాత అసిస్టెంటు, బాస్‌కి చెప్పాడు: "గురూ, వీడెక్కడి వాడో ఏం చేస్తుంటాడో తెలీదు కానీ, ఒక్కటి మాత్రం చెప్పగలను - రోజా మీ ఇంటికెళ్ళి, సరిగ్గా 9 గంటలకి బయటకి వచ్చేస్తుంటాడు".

## అక్షర క్రీడ- 21 నిర్వహణ : కె.రాజేశ్వరరావు

నిబంధనలు : ఈ గళ్ళ నుడికట్టులో కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా పూరించి పోస్టులో పంపాలి. **జిరాక్స్‌కాపీ అనుమతించబడదు.** అన్ని జవాబులు సరిగ్గారాసిన వారికి విజయవిహారం పత్రిక ఆరు నెలలు ఉచితంగా పంపిస్తాము. తుది నిర్ణయం యాజమాన్యానిదే. ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశంలేదు. ఎంట్రీలు డిసెంబర్ 20వ తేదీలోపుగా మా కార్యాలయానికి అందాలి.

**ఆధారాలు - అడ్డం :** 1. ధరగల పెదవి (4). 5. ఇది రొయ్యకు లేదా బారెడు అన్నాడొక కవి (3). 7. పూర్వం మన దేశాన్ని ఇలా కూడా పిలిచేవారు (5). 10. జనగణమనలో లెక్కింపు (3) 12. అటునుండి దారి (2). 13. అంత జనసమూహములో వాడు ఇది వేసి చూసినా కనిపించడం లేదు (4). 14. పదును (2). 15. చాటింపును ఇది వేయడం అని కూడా అంటారు (3). 16. ఈ కత్తెరలో పోకచెక్క అని సామెత (2). 17. కురిసేది (2). 18. ఫుల్‌స్టాప్‌లు కాదు; చెదిరిన విరామ చిహ్నాలు (3). 22. 'క' గుణింతంలో నెమలి (2). 23. ఇంగ్లీషులో ఎందుకు (1). 24. తలలో పుడుతుంది (4). 27. ఏ భాషరాయాలన్నా ఇది అవసరం (2). 29. పారిపోవడం (4). 31. అటునుంచి వేడి (2). 33. అధికార పీఠం మరోలా (3). 35. అంతం లేనిది (3). 37. లాహిరి (2). 38. భోజనం తినకుండా వుంటే ఇది వుండటం అంటారు (4). 40. ఒట్టు (2). 41. ప్రాగ్జోతిషపురపాలకుడు, సత్యభామ చేతిలో ఓడాడు (4). 42. జబ్బు (3). 44. చంద్రగుప్తుని తల్లి (2). 47. _____ వానసిరా (4). 48. అడ్డం 23తో యువదర్శకుని ఇంటి పేరు (1). 49. ముక్తిని కోరేవారు చెదిరిపోయారు (5).

**నిలువు :** 1. కన్ను (2). 2. మహా రచయిత చలం చేరుకున్నది ఈ మహర్షి ఆశ్రమానికే (3). 3. టూరిస్టులు తెలుగులో (5). 4. వాక్యంలో కనిపించేవాడు (2). 6. వనము మరో అక్షరంతో యజ్ఞం (4). 8. తిరగబడిన అక్కమగడు (2). 9. గుడ్డు మరోలా - అక్షరాలు అటూ ఇటూ అయ్యాయి (3). 10. చదరంగంలో వుండేవి ఏకవచనంలో (2). 11. ఎటు చూసినా అభినయమే (3). 14. బలుపు కాదు (2). 16. పున్నమికి వ్యతిరేకం - చివరి అక్షరాల్లేవు (2). 17. ఇంటి ముందరి భాగం వాలికి కనపడదా (3). 19. గూర్ఖా కాసేది (3). 20. ఆవు ఇందులో మేస్తే దూడగట్టున మేస్తుందా? (2). 21. గుడ్డులో వుండే ద్రవాన్ని ఇలా అంటారు (2). 24. మగతోడు లేని ఆగమనం (2). 25. కదలిక (3). 26. అనుమానం (2). 28. పిడుగు పడదులో 1,4 (2). 29. వజ్రాయుధం (2). 30. ప్రయాణం మరోలా, చెల్లా చెదురయింది (3). 32. కోరిక (3). 34. ఈ మహారాజు జానకి మామగారు (4). 35. సంగతము కానిది (5). 36. తీగ, లేక వైర్ (2). 38. ఇది పట్టిన పట్టు వదలదని ప్రతీతి (3). 39. రోజులు, వారాలు - ప్రథమాక్షరాలు తలక్రిందులయ్యాయి (2). 40. పద! ఆవేపు ప్రమాదం వుంది (3). 43. ఇది కోటలో దేనికి వేయడం? (2). 45. శబ్దం - మరోలా మధ్యక్షరం లేకుండా (2). 46. తాతారావు దాగిన ప్రదేశం (2).

### అక్షరక్రీడ-20 సమాధానాలు



### అక్షరక్రీడ-20 విజేతలు :

- జి.ఆర్. సుధాకర్ రావు, అనంతపూర్ ● ఏ.పి. సుజేష్ కుమార్, ప్రొద్దుటూరు ● పి. అపర్ణ, సికింద్రాబాద్ ● దరిశి హైమావతి, నర్సరావుపేట ● ఏలూరు వంశీకృష్ణ, నర్సారావుపేట ● డి. వేణుగోపాల్, అనంతపురం ● కె.కె.వరం, పెందుర్తి ● జె.జ్యోతి రమ్య, మల్కాజ్‌గిరి ● బి.మానస, హైదరాబాద్ ● జి. సీతారామయ్య, మంగళగిరి, గుంటూరు ● షిల్లా సూర్యనారాయణ, బ్రహ్మపురం (గంజాం) ● టి. సోమేశ్వరరావు, బ్రహ్మపురం ● డాక్టర్ ఎస్. రంగారావు, బ్రహ్మపురం ● జి. శారదా శుభాకర రావు, కర్నూలు ● దుగ్యాల రాజేంద్ర ప్రసాద్, మిర్యాలగూడ ● కె. మైథిలి, సూళ్లూరుపేట ● కె.వి.సూర్యనారాయణ, బి.వసుంధర, అమలాపురం



పేరు :

చిరునామా :

పిన్‌కోడ్ :

ఎంట్రీలు పంపే చిరునామా : అక్షరక్రీడ, **విజయ విహారం**, 12-5-33/2, విజయపురి, తార్నాక, సికింద్రాబాద్-17 ☎ 7007053

మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

# అడ్వర్టైజింగ్ ట్రేడ్

సమస్య ఏమిటంటే మనం చాలా మటుకు అలవాటు పడిపోతున్నాం.

అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో - ఆడవాళ్లని ఏదోరకంగా 'మనుషుల'కి కాస్త ఎక్కువగానో, తక్కువ గానో (చాలాసార్లు 'వస్తువులు'గానో) - చూపించడం తప్ప - 'మనుషులు'గా చూపడం బహు అరుదు. ఈ విషయాన్ని గురించి ఎప్పుడైనా, ఎవరైనా ఆడవాళ్లో, వాళ్ల సంఘాలో మొత్తుకున్నా వినిపించుకునే వాళ్లెవరూ లేరు. అసలు ఆమాటకొస్తే ఇప్పుడు అలా అభ్యంతరపెట్టే వాళ్లూ లేరు.

---

[సరే సంస్కృతీ పరిరక్షణ, శీలము అంటూ వీరంగంవేసే- మతోన్మాద గూండా సంస్థల సంగతి వేరు.

మీ భార్యపైన ప్రేమ ఉంటే ఫలానా ప్రెషర్ కుక్కర్ కొనుక్కొని ఇంటికి తీసుకెళ్లండి అని దారాసింగ్ పహిల్వాన్- ప్రకటన వీరికి అభ్యంతరకరంగా తోచదు. (భార్యపైన ప్రేమ ఉంటే ఇంటికి ప్రెషర్ కుక్కర్ కొనుక్కొని వెళ్లడమే కాకుండా, ఈ దారాసింగ్ పహిల్వాన్ కాస్త వంటలో భార్యకి సాయం చెయ్యకూడదా? కొన్ని రోజులు తానే వండి పెట్టకూడదా?) భర్తకి ఎలాగైనా బట్టల్ని తెల్లగా ఉతికి ఇవ్వడమే భార్య కర్తవ్యమని చిత్రించే ప్రకటనలు వీరికి అభ్యంతరం కాదు. (అఫ్‌కోర్స్, సమాజంలో మార్పుల్ని తీసుకురావాల్సిన బాధ్యత అడ్వర్టైజింగ్ రంగం మీదే వుందని మనం ఎవ్వరం పట్టుపట్టక్కర్లేదనుకోండి)

సాధారణంగా మతోన్మాద గూండా సంస్థలు ప్రకటనలపైన 'గొడవలు' చేసే ప్రతి సందర్భంలోనూ- ఆ గొడవంతా వారు భావించే 'దృశ్యపరమైన అశ్లీలం' మీదే. పైగా ఆ 'గొడవ' అంతా ఆ ప్రకటనల్లో నటించిన మహిళలపైనే 'గురిపెట్టడం' ఎక్కువ సందర్భాల్లో బహు సహజం (మిళింద్ సోమన్, మధు సప్రేలు విడివిడిగా నటించిన ఒకానొక 'షూస్' ప్రకటనకి సంబంధించిన వివాదంలో మధుసప్రే అత్యధికంగా వేధింపులకి గురైన సంగతి నిజం కాదా?). ఈ సంస్థలు 'గొడవ' చేసే మరో సందర్భం - తాము నిర్వచించే మత విశ్వాసాలకి సంబంధించినది. ఎక్కువ సందర్భాల్లో ఈ తరహా సంస్థల చేతిలో వేధింపులకు గురైన ప్రకటనకారులు పరాయిమతస్థులు కావడం యాదృచ్ఛికం కాదు.

ఇన్ని కారణాల వల్ల ఆయా సంస్థలు లేవనెత్తే వివాదాలను అనుమానించి తీరాల్సిందే]

---

అయితే, ప్రకటనకారుల మురికి మనస్తత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం లేదా?

ఖచ్చితంగా వుంది.

ఈ రోజు మన ప్రకటనకారుల (అందరూ కాదు) 'కళాత్మక' దృష్టిలో- ప్రధాన స్థానం... శృంగారం... ఛ ఛ.. కాదు కాదు... కామానిదే. అదికూడా 'పురుష' కామం.

---

అలాగని మన దేశంలో అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో సృజనాత్మకతను ప్రదర్శించినవారు లేరని కాదు. మనవాళ్ళ క్రియేటివ్ టాలెంట్‌కి ఉదాహరణల్ని ఎన్నైనా చూపించవచ్చు.

దశాబ్దంన్నర క్రితం నేను చూసిన ఒక ప్రకటన గురించి చెపుతాను. ఆ ప్రకటన దేశంలోని ప్రముఖ ఇంగ్లీషు దినపత్రికల్లో ఫుల్‌పేజీ అడ్వర్టైజ్‌మెంట్‌గా వచ్చింది. ఆ పేజీ మొత్తం తెల్ల కాగితమే. పేజీ అట్టడుగున అతి చిన్న అక్షరాలతో 'ఒనిడా వాషెస్ ది నేషన్ క్లీన్' అని ఇచ్చారు. ఆ ప్రకటన అప్పట్లో కొత్తగా విడుదల చేసిన ఒనిడా వాషింగ్‌మిషన్‌ల గురించి అని చెప్పకపోయినా స్పష్టంగా చెప్పినట్టే కదా. పదిహేను సంవత్సరాల తరువాత కూడా ఈ ప్రకటనని నేను ప్రస్తావిస్తున్నానంటే - ఈ ప్రకటన నాపై చూపిన ఇంపాక్ట్‌కి ఇది ప్రబలసాక్ష్యం కాదా. ఒక సృజనాత్మకమైన ప్రకటన కలిగించే ప్రభావంతోపోలిస్తే, చౌకబారు ప్రకటన సాధించగలిగేది తక్కువే-అని చెప్పడానికి మొత్తంగా దశాబ్దాల అడ్వర్టైజ్‌మెంట్‌రంగ చరిత్రలో అనేక ఉదాహరణలు చూపవచ్చు.

---

ఐడియాలు లోపించిన ప్రకటనకారులకి- ప్రస్తుతం వస్తువేదైనా, కొనుగోలుదారుల్ని ఆకర్షించేందుకు- 'ఆడ శరీరమే' ఆయుధంగా కనిపిస్తున్నట్టుంది!

కండోమ్ అడ్వర్టైజ్‌మెంట్లలో శృంగారం డోసు అధికమైనా, ప్రోడక్ట్ శృంగారానికి సంబంధించినదే కాబట్టి తప్పులేదనో, లేదంటే ఈ రోజు కండోమ్స్ వినియోగం పెరగడం మన సమాజానికి అత్యంత అవసరమనో సర్దుకోవచ్చు.

లోదుస్తుల ప్రకటనల్లో స్త్రీ, పురుషుల శరీర ప్రదర్శన తప్పదేమోలే అనుకోవచ్చు. (మగవాళ్లు ఫలానారకం అండర్ వేర్ ధరిస్తే ఆడవాళ్లు ఎగబడి ముద్దులు పెట్టుకుంటారనో , మీద పడతారనో ప్రచారం చేసే నాటు అడ్వర్టైజ్‌మెంట్లని చచ్చినట్టు భరిస్తున్నాం కదా!) హెయిర్ రిమూవర్‌లు, బాత్‌టబ్‌లు, బాత్ క్యూబికల్స్ ప్రకటనల్లో ఎక్స్‌పోజింగ్ తప్పదేమోలే అని సర్దుకోవచ్చు. (బస్ట్ క్రీముల దుర్మార్గం గురించి వేరే ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి.)

సెక్స్ గురించి మాట్లాడటం, చిత్రించటం, రాయటం తప్పుకాదు. కానీ స్త్రీని ఇన్ఫీరియర్‌గానో, సెక్స్ వస్తువుగానో ముద్రవేయటం తప్పు కాదా?

వాచీలకి స్త్రీల నగ్న దేహాలతో సంబంధం ఏమిటి? కరెంటు స్విచ్చిల అమ్మకాలకి స్త్రీల నగ్న సౌందర్యం తప్ప వేరే దారి లేదా? స్కూటర్‌ని స్త్రీ దేహంతో పోల్చి కొనుగోలుదారుల్ని ఆకర్షించాల్సిందేనా? మగవాళ్ల చొక్కాలు అమ్మేందుకు ఒళ్లు చూపించే 'ఆడ బొమ్మల్ని' ప్రదర్శించాల్సిందేనా? చివరికి గుట్కాలు, మద్యం, టైల్స్, డాట్‌కామ్‌లు, బ్యాంకులు, మినరల్ వాటర్... ఒక్కటేమిటి అన్ని ఉత్పత్తులనీ అమ్మిపెట్టాల్సింది...'ఆడ శరీరమే'. ఈ కాలుష్యమంతా 'అభిరుచి'పేరుమీద,'క్రియేటివిటీ' పేరుమీద మన నెత్తిమీద రుద్దబడుతోంది. యువతీ యువకులు పరస్పరం ఏర్పరుచుకునే దృక్పథాల పైన, అంతిమంగా మానవ సంబంధాలపైన- వీటి ప్రభావం ఏదో ఒక మేరకి ఉండకతప్పదు కదా. మనుషులు 'వస్తువులు'గా, 'బొమ్మలు'గా కాక, సజీవమైన వ్యక్తులుగా గుర్తించబడాలి. మనుషులమధ్య సంబంధాలకి అటువంటి ఆరోగ్యకరమైన అవగాహనే ప్రాతిపదిక కావాలి.

నిషేధించమని అడగక్కర్లేదు కాని- ఇవ్వాళ వందల, వేల సంఖ్యలో మన పత్రికల్ని, థియేటర్లని, టీవీల్ని ముంచెత్తుతున్న ఈ దర్టీ అడ్వర్టైజింగ్ ట్రిక్స్ గురించి, అవి కలిగించే దుష్ప్రభావం గురించి కనీసం మాట్లాడుకోవాల్సిన అవసరం లేదా?



లెదర్ బ్యాగ్‌లు అమ్ముకోవడానికి ఆడ (పైన), మగ (కింద) న్యూడ్ బొమ్మలు అవసరం లేదని మీరనుకోవచ్చు-ఈ ప్రకటన కారులు మాత్రం ఒప్పుకోరు.





వీళ్ళు బేబీ వైప్స్ అమ్ముకుందామనుకుంటున్నారు. బిడ్డకు పాలిస్తున్న తల్లి బొమ్మ (తల తీసేసి) ప్రచురించారు. వీళ్ళ కాన్సెప్ట్ మనకి అర్థం కాదేమోనని - తల్లి గుండెలపై 'సేఫెస్ట్ బేబీ ఫుడ్' అనే అక్షరాలు ప్రచురించారు. వీళ్ళ బేబీ వైప్స్ అంటే సేఫెస్ట్ బేబీ కేర్ అని చెబుతున్నారు.-నో కామెంట్!-

ఈ న్యూడ్ - నడుం నొప్పి క్రీం యాడ్















బహుశా ఈ పెర్ఫ్యూమ్ యాడ్‌లంత దుర్మార్గంగా ఏ యాడ్‌లూ ఉండవేమో! వందల సంఖ్యలో ఈ నాటుయాడ్‌లు పత్రికల్ని ముట్టడిస్తున్నాయి. సుమారుగా మగవాళ్ళ పెర్ఫ్యూమ్‌యాడ్‌లన్నింటికీ ఆడ న్యూడ్‌బొమ్మలే ఆలంబన.









# రక్తకాసారం



## సీరియల్ 14

**నవీన్**

(గతసంచిక తరువాయి)

సునీల వాళ్ళమ్మతో పోట్లాడి హాస్టల్ బయటకొచ్చేసి వేరే ఓ రూమ్ అద్దెకు తీసుకొని ఒక్కతే స్వతంత్రంగా ఉండటం మొదలెట్టింది. ఆ రూమిచ్చిన వాళ్ళు సుమతికి బాగా తెలిసినవాళ్ళే. చాలా గౌరవనీయుమైన కుటుంబానికి చెందినవాళ్ళేనే అభిప్రాయంతోటే వాళ్ళు సునీలకు ప్రత్యేకంగా ఓ గదిని అద్దెకిచ్చారు. సునీల తనే స్వయంగా వంట చేసుకొని ఆ గదిలో ఉంటుండేది. హాస్టల్ నుండి ఆ గదిలోకొచ్చాక ఆమెకు జైల్లోంచి బయటపడ్డట్టుగా ఉంది.

ఆమెకు కొన్నిసార్లు అన్సలు వంట చేసుకోవాలనిపించేది కాదు. యే హోటల్‌కో వెళ్ళి భోజనం చేసేది. ఆమె చేతిలో ఎప్పుడూ డబ్బు పుష్కలంగానే ఉండేది. డబ్బయిపోగానే ఇంటికెళ్ళి వాళ్ళమ్మతో పోట్లాడి డబ్బు తెచ్చుకునేది. వాళ్ళమ్మ ఆ ఊర్లో ఉన్న వడ్డీ వ్యాపారస్తుని దగ్గరకెళ్ళి డబ్బు తెచ్చి కూతురి చేతిలో పెట్టేది. అసలూ, వడ్డీ కలిసి పెద్ద మొత్తం కాగానే ఓ ఎకరం భూమి అమ్మేసి ఆ అప్పు తీర్చేది. డబ్బు పోతేపోయింది. తనకున్న ఒక్కగానొక్క కూతురు హాయిగా, సంతోషంగా ఉంటే చాలు అనుకునేదామె.

త్వరలోనే సునీలకు చాలామంది బోయ్‌ఫ్రెండ్స్ ఏర్పడ్డారు.. బోయ్ ఫ్రెండ్స్‌తో తిరగటం తప్పు అనే భావం ఆమెకెప్పుడూ కల్గేది కాదు. తనకేసి చూస్తున్న వాళ్ళందర్నీ "హాయ్!" అని ఫ్రీగా పలకరించేది. వాళ్ళు ఆమె వెంటపడ్తే, కొంతకాలం తన చుట్టూ తిప్పుకొని వదిలేసేది. ఇదంతా ఆమెకో జోక్‌లా కనిపించేది.

ఆమె చదువుతున్న కాలేజీలో ఆమెకు ఎకనమిక్స్ చెప్పే శ్రీకాంత్‌తో మాత్రం ఆమెకు నిజమైన స్నేహమేర్పడిందనుకునేది. శ్రీకాంత్ ఎం.ఏ. ఆ సంవత్సరమే ప్యాసయ్యాడు. ఊరికేనే ఉండటం దేనికని అతడా ప్రైవేట్ కాలేజీలో చేరాడు. పేరుకు లెక్చరర్ ఉద్యోగమే కానీ ఆ కాలేజి మేనేజిమెంట్ వాళ్ళు అతనికిచ్చేది నెలకు రెండు వేలు మాత్రమే.

సునీల తనకేసి అదే పనిగా చూడటం శ్రీకాంత్ గమనించాడు. కొంచెం ప్రయత్నిస్తే ఆమెతో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం సాధ్యమేననిపించిందతనికి. ఎదుటివాడిని కవ్వించే అందం ఆమెది. "ఆమె తనవెంట పడ్తున్నప్పుడు ఎందుకొదిలిపెట్టాలి" అనుకున్నాడతడు.

ఓ రోజు ఓ సినిమా థియేటర్ ముందు సునీలొక్కతే నిల్చొని ఉండటాన్ని శ్రీకాంత్ చూశాడు.

"సినిమాకొచ్చావా?" అన్నాడు.

"అవును. మీరు కూడా సినిమాకేనా?" అంది సునీల.

"సినిమాకే..." అంటూ అతడు బుకింగ్ దగ్గరకెళ్ళి రెండు టికట్లు తెచ్చాడు. ఇద్దరూ పక్కపక్కనే కూర్చొని సినిమా చూశారు. అట్లా ఓ అబ్బాయి పక్క కూర్చొని సినిమా చూడటం తప్పని ఆమెకనిపించలేదు.

అప్పట్నించి ఇద్దరూ తరచుగా కలుసుకోవడం ప్రారంభమైంది. సినిమాల్లోనూ, పార్కుల్లోనూ, హోటళ్ళలోనూ వాళ్ళు కలుసుకునేవాళ్ళు. కొన్నిసార్లు శ్రీకాంత్ సునీల ఉంటున్న రూమ్‌క్కూడా వస్తుండేవాడు. అతడలా రావడాన్ని ఇంటివాళ్ళు చూశారు. వాళ్ళు వెంటనే ఈ విషయాన్ని సునీల వాళ్ళ అమ్మకు తెలియజేశారు. వెంటనే సుమతి పరిగెత్తుకొని వచ్చింది.

"ఇదేం అన్యాయమే... ఎవడినో రూమ్‌కు తీసుకొస్తున్నవట?" అంది వాళ్ళమ్మ.

"అన్యాయమేమీ లేదు. ఆయన మా లెక్చరర్... మేమిద్దరం త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నాం..." అంది సునీల.

"ఇంటర్మీడియెట్టన్నా పూర్తి చెయ్యలేదు... అప్పుడే పెండ్లేమిటే" అంది సుమతి.

"నాకు చదువుకోవాలని లేదు. క్లాసులో కూర్చోవడమంటే బోర్!" అంది సునీల.

"నువ్వు బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేస్తవని, నన్ను ఉద్ధరిస్తవని నేను కలలుగంటున్న" అంది సుమతి.

"అట్లాంటి కలలు కనమని నేను నీకు చెప్పిన్నా? నీ పిచ్చిపిచ్చి కలలకు నేను బాధ్యురాల్ని కాను"

"అట్లా మాట్లాడకే!"

"నాకు మాట్లాడే హక్కు లేదంటవా?"

వాళ్ళిద్దరలా మాట్లాడు కుంటోంటే ఆ ఇంటి యజమానురాలొచ్చింది.

"యేందే పిల్లా! తల్లన్న గౌరవం లేకుంట గట్ల మాట్లాడుతున్నవు" అందామె.

"నేను అట్లనే మాట్లాడుత. అడగటానికి మధ్య నువ్వెవరు?"

"నేనెవర్నా... పాపమని ఇల్లిస్తే నాకే ఎదురు మాట్లాడుతున్నవా?".

"పాపమని ఇయ్యలేదు. కిరాయి తీసుకుంటలేవా?"

"నువ్వు గనుకిచ్చినవులే బోడికిరాయి.. యేదో మర్యాదస్తుల పిల్లవని ఇల్లిస్తే ఎవ్వన్ని బడ్తే వాన్ని ఇంటికి దీసుకొస్తవా?"

"ఏయ్ ముసల్దాన! ఎక్కువ తక్కువ మాట్లాడకు. నోర్మూసుకో"

"నన్ను నోరుమూసుకొమ్మంటవా? నా ఇంట్ల ఉండుకుంట నన్ను నోరు మూసుకొమ్మంటవా? నా ఇల్లు ఖాళీ చెయ్... సుమతమ్మా! నీ ముఖం జూసి నీ బిడ్డకు ఇల్లిచ్చిన... నీ బిడ్డ నీ చేతిల కూడ లేదని తెలిసిపోయింది.. ఇగ ఒక్క గడియ కూడ మీరు మా యింట్ల ఉండొద్దు... ఇప్పుడే ఖాళీ చేసి పొండ్రి" అంది ఇంటామె.

"నీ ఇల్లుపాటిల్లు మాకింకోటి దొరకనే దొరకదనుకుంటున్నవా యేంది.... నీ బోడిల్లు ఎవ్వనిక్కావాలె. ఇప్పుడే ఖాళీ చేస్తం" అంది సునీల.

"నువ్వు మరీ బరితెగించిపోతున్నవే సునీల" అంది సుమతి.

"అమ్మా! ఎక్కువ తక్కువ మాట్లాడినవంటె నీ మర్యాద కూడ దక్కదు. నోర్మూసుకొనుండు. రేపీపాటికి నేనింకో ఇల్లు చూస్త. ఈ ఇల్లు ఖాళీ చేసి పోదాం" అంది సునీల.

తనింకేం మాట్లాడినా తన కూతురు ఇంటామె ముందు పరువు తీసేస్తుందని సుమతి నోరు మూసుకుంది. పరువు పోతుందన్న భయంతో సుమతి చాలాసార్లు కూతురు ఏం చేసినా చూస్తూ ఊరుకుంది.

ఆ రోజు ఊరంతా తిరిగి సునీల మరో ఇల్లు చూసింది. ఇదివరకున్న ఇంట్లో సునీల వాళ్ళకిచ్చింది ఒకటే రూమ్. ఇప్పుడీ కొత్తింట్లో రెండు రూములు తీసుకుంటేనే ఇష్టామన్నారు. కిరాయి వెయ్యి రూపాయలని చెప్పారు. ఇదివరకున్న ఇంటికి ఐదువందలే ఇచ్చారు.

"ఒక్కసారే ఐదు వందలు పెరిగితే నేనెక్కడ్నించి తెచ్చియ్యను? ఈ ఇల్లొద్దు. మరో ఇల్లు... ఐదు వందలకు దొరికేది చూడు" అంది సుమతి. ఆ సాయంత్రం బయటకెళ్ళొచ్చిన కూతురు సునీలతో.

"ఇంకో ఇల్లు చూడనుగాక చూడను... రోజంతా వెతికితే ఈ ఇల్లు దొరికింది... ఈ ఇల్లు చాలా బావుంది. ఐదు వందలు ఎక్కువ పోతే పోయినయి.. ఈ ఇంటివాళ్ళు చాలా మంచివాళ్ళు.. ఈ ఇంటి ముసల్దానిలాగ కిరాయికున్న వాళ్ళింట్లోకి ఎవరొస్తున్నరు.. ఎవరు పోతున్నరని సి.ఐ.డి.ల్లాగ చూస్తుండరు.. ఆ ఇల్లు నాకు బాగా నచ్చింది.. ఆ ఇంట్లో అందరూ.. ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ బయటకెళ్ళి ఉద్యోగాలు చేసేవాళ్ళే. కాబట్టి నన్ను వాళ్ళు అర్థం చేసుకుంటారు. నేను వాళ్ళకు ఐదొందలు ఎడ్వాన్స్ కూడా ఇచ్చొచ్చాను" అంది సునీల.

"ఇదేం అన్యాయమే... నాకో మాటైనా చెప్పకుండా నువ్వు అడ్వాన్స్ ఇచ్చి రావడమేమిటి? నెలకు వెయ్యి రూపాయలు కిరాయకే పోతే ఆపైన నీ ఖర్చులు.. మొత్తం రెండు వేలో... మూడు వేలో అయ్యేటట్టుంది. అంత డబ్బు నా దగ్గర లేదు.. నువ్వు చదువు మానేసి ఏదన్నా ఉద్యోగం చూసుకో"

"ఎప్పుడడిగినా డబ్బు లేదు.. డబ్బులేదు.. ఇదే పాట.. నీ తోడబుట్టినోళ్ళందరికి డబ్బున్నప్పుడు నీకెందుకు లేదే ఎడ్డిమొఖమా? మీ నాయన నిన్నే పిచ్చోనికిచ్చి చేసిండు.. అట్లెందుకు చేసినవని అడుగుపో.. వాళ్ళందరెంత హైక్లాసుగ బతుకుతున్నరో చూడుపో. మేం కూడ మీలాగ ఎందుకుండొద్దని లొల్లిబెట్టిరాపో"

"ఎవ్వరదృష్టం వాళ్ళది.. వాళ్ళకు మనకు పోలికెందుకు.. ఒకప్పుడు మీ నాయన కూడ బాగా ఉన్నోడే.. బాగా ఉన్నోడనే నన్నాయనకిచ్చి చేసిండ్రు.. ఉన్న భూమంత రోగానికే పోతదని ఎవ్వడనుకున్నడు"

"అదృష్టం లేదు.. గిదృష్టం లేదు.. వాళ్ళ లాగ బతికే హక్కు మనక్కూడా ఉంది.. ఇంకా కొంత భూముందిగద.. ఇంకో ఎకరం అమ్మేయ్.. అంతేగని డబ్బులేదని మాత్రం చెప్పొద్దు. నాకు తిక్క కోపమొస్తది"

"అంతా ఇప్పుడే అమ్ముకుంటే రేపు నీ పెళ్ళెట్లయితదే"

"నా పెళ్ళి గూర్చి నువ్వేం ఆలోచించకు.. నా పెళ్ళి నువ్వేం చెయ్యొద్దు. నువ్వేం కట్నం కానుకలియ్యొద్దు. నా పెళ్ళి నేనే చేసుకుంట."

"ఎవర్ని చేసుకుంటవు. గా శ్రీకాంత్‌నే చేసుకుంటవా? ప్రైవేట్ కాలేజిల ఉద్యోగం చేసెటోనికేమిస్తరు? చేసుకుంటె గవర్నమెంట్ జాబ్ చేసెటోన్ని చేసుకోవాలె..." అంది సుమతి.

"ఎవ్వన్నో చేసుకుంట... కొండ మీది కోతిని చేసుకుంట... నీకెందుకు? నోర్మూసుకోనుండు"

"నాకెందుకా? నేనుగాక నీకెవరున్నరే.. నన్నే నీకెందుకంటవానె.. నీ మెదడు చెడిపోయిందే.. నువ్వసలు మనిషివేనా?"

"మనిషిని కాను.. పశువును.. సరేనా? నా జోలికి రాకు.. నా మానాన నన్ను బతకనీయ్.. నా స్వేచ్ఛకు అడ్డొచ్చే వాళ్ళెవరైనా సరె... నేను లెక్కచెయ్యను.. నాకు నా స్వేచ్ఛ ముఖ్యం"

"నువ్వు కూడ నా జోలికి రాకు.. నన్ను పైసలడక్కుండ స్వేచ్ఛగబతుకు"

"నన్ను కన్నావు కాబట్టి నన్ను పోషించ వలసిన బాధ్యత నీదే కాబట్టి నిన్ను పైసలడుగుత. ఎట్లాగో ఇంకో రెండు మూడేళ్ళు పోషించు.. ఆ తర్వాత నా దారి నేను చూసుకుంట.. నీ కంటిక్కూడ కనిపించను. సరేనా?"

"అంటే... యేం చేస్తవు? కంటికి కనపడకుంట ఎక్కడికి పోతవే..." సుమతి ఇదేం అఘాయిత్యం చేస్తుందోనని తల్లడిల్లిపోయింది.



"ఎక్కడికన్న పోత... నీకేదో పెద్ద భారంగా మారిన్ననుకుంటున్నవు కద... ఇంకో రెండు మూడేళ్ళ తర్వాత నాదారేదో నేను చూసుకుంట.. నీ మీద ఎలాంటి భారం ఉండదు"

"ఎందుకట్ల మాట్లాడతవే.. నాకు నువ్వు తప్ప ఎవరున్నరే.. బిడ్డనైనా, కొడుకునైనా నువ్వే కద"

"ఇదే నేను నీ కొడుకునైతే ఇట్లనే మాట్లాడేదానివా? వానికేదంటె అది తెచ్చిచ్చేదానివి.. బిడ్డను కాబట్టే ఇట్ల మాట్లాడుతున్నవు... ఆడవాళ్ళ పట్ల ఒక రకంగా, మొగవాళ్ళ పట్ల ఒకరకంగా ప్రవర్తించే సమాజం మనది.. అందుకే ఈ పురుషాధిక్య సమాజమంటే నాకు పరమ అసహ్యం" అంది సునీల.

వాళ్ళిద్దరూ అలా చాలాసేపు వాదించుకొని, అలా వాదించుకుంటూనే భోజనం చేసి అర్ధరాత్రి దాటాక నిద్రపోయారు. సునీల పట్ల తను కఠినంగా ఉంటే అదేం అఘాయిత్యం చేస్తుందోనన్న భయం సుమతిలో ప్రారంభమయ్యింది. తనిక కఠినంగా ఉండకూడదు. తనకున్న ఆ ఒక్కతీ హాయిగా ఉంటే చాలు అనుకుంది.

ఆ మర్నాడే వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి ఊరికి దూరంగా కొత్తగా ఏర్పడిన ఓ కాలనీలో కొత్తగా నిర్మించబడిన ఇంట్లో దిగారు.

రెండ్రోజుల తర్వాత సుమతి వాళ్ళూరి కెళ్ళిపోయింది. మరో మూడు నెలల తర్వాత సునీల ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసింది. కానీ ఆమెకు ప్యాసవుతానన్న నమ్మకం లేదు.

శ్రీకాంత్, సునీల కలిసి ఎక్కడెక్కడో తిరుగుతూనే ఉన్నారు. వాళ్ళిద్దరు ప్రేమించుకుంటున్నారని, త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నారని వాళ్ళకు తెలిసిన వాళ్ళందరూ అనుకున్నారు.

వేసవికాలం సెలవుల్లో కాలేజి మూసేసినప్పుడు శ్రీకాంత్‌ను ఉద్యోగం లోంచి తీసేశారు... "మళ్ళీ కాలేజీలు తెరిచాక నన్నే తీసుకుంటార్లే" అన్నాడు శ్రీకాంత్.

సెలవుల్లో కూడా సునీల వాళ్ళూరు వెళ్ళలేదు. శ్రీకాంత్, ఆమె చాలా దగ్గరైపోయారు.. ఒకర్ని విడిచి ఒకరు ఒక్క క్షణం కూడా బతకలేమనుకున్నారు.

సెలవులైపోతుండగా "నాకు వేరే ఊర్లో చాలా మంచి ఆఫరొచ్చింది. మా బంధువులే కొత్తగా ఓ కాలేజి పెడ్తున్నారు. నన్నా కాలేజికి ప్రిన్స్‌పాల్‌గా రమ్మంటున్నారు. అందుకే వెళ్తున్నాను.. నువ్వేం ఇంటర్మీడియెట్ ప్యాసైతే నిన్ను కూడా ఆ కాలేజిలోనే జాయిన్ చేయిస్తా... ఇద్దరం కలిసే ఉండొచ్చు" అన్నాడు శ్రీకాంత్.

"గ్రేట్... నువ్వు ప్రిన్స్‌పాల్ అవుతున్నావంటే గ్రేట్... నువ్వు ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తున్న కాలేజిలో నేను చదవడమంటే గ్రేట్... త్వరగా వెళ్ళి జాయినయిపో" అంది సునీల.

"నీ రిజల్ట్సు రాగానే నేనొచ్చి నిన్నా కాలేజికి తీసికెళ్తా..."

"నువ్వు లేకుండా నేనెలా బతకాలి శ్రీ! త్వరగా వచ్చేస్తావు కదూ"

"వారం, పది రోజులు ఎలాగో గడిపేసెయ్.. సాధ్యమైనంత త్వరగా నేనొచ్చేస్తాగా..." అన్నాడు శ్రీకాంత్ ఆమె చేతిలో చెయ్యేసి.

అలా వెళ్ళిన శ్రీకాంత్ మళ్ళీ రాలేదు.

ఈలోగా ఇంటర్మీడియెట్ రిజల్ట్సు వచ్చాయి. సునీల ప్యాసు కాలేదు.

సునీల వాళ్ళమ్మొచ్చి "ఇన్ని పైసలు పాడుచేసి ఈ సిటీల ఉంటున్నవు.. ఇంటర్మీడియెట్ కూడ ప్యాసు కాకపోతివి.. ఇంక సిటీలుండుటెందుకు? మనూరు పోదాం పా..." అంది.

"సప్లిమెంటరీ రాసి ప్యాసవుత.. నీకెప్పుడూ పైసల గొడవే.. నేనా పల్లెటూరుకు రాను" అంది సునీల.

"పైసలగొడవే మరి. పైసలు మస్తుగుంటే నువ్వడిగినన్ని పైసలిచ్చేదాన్నే.. ఉన్న భూమి మొత్తం అమ్మేసినా నీ చదువు పూర్తయ్యేటట్టు లేదు. రేపు నీ పెళ్ళెట్ల చెయ్యాల్నని నేనెంత కుమిలిపోతున్ననో నీకేమెరుక?" అంది సుమతి.

"నా పెళ్ళి గురించి ఆలోచించొద్దని నీకెప్పుడో చెప్పిన.. దయచేసి నువ్వు వెళ్ళిపో.. నేను సప్లిమెంటరీకి చదువుకోవాలె.. నన్ను డిస్టర్బ్ చెయ్యకు" అంది సునీల.

దీంతో వాదించి లాభం లేదని సుమతి వెళ్ళిపోయింది.

ఈసారి సునీల సప్లిమెంటరీ పరీక్ష సీరియస్‌గానే రాసింది.. రెండు నెలల తర్వాత రిజల్ట్సు వచ్చాయి. ఈసారి సునీల ప్యాసయ్యింది.

శ్రీకాంత్‌ను కలుసుకోవాలని ఆమె చాలా ప్రయత్నించింది. అతడు ప్రిన్స్‌పాల్‌గా ఫలానా ఊరికి వెళ్తున్నానని చెప్పిన ఊరికి వెళ్ళింది. అక్కడున్న ప్రైవేట్ కాలేజీలన్నింట్లోను శ్రీకాంత్‌ను గూర్చి అడిగింది. అలాంటి వాళ్ళెవరు ఆ ఊర్లో లేరని ఆమెకు తెలిసిపోయింది. శ్రీకాంత్ తనకు అబద్ధం చెప్పాడని కూడా ఆమెకర్థమయింది.

రెండు మూడు నెలల తర్వాత శ్రీకాంత్ ఫ్రెండొకరు సునీలను కలిసి శ్రీకాంత్ పెళ్ళి చేసుకుంటున్నాడనీ, నిన్నా పెళ్ళికి తప్పక రమ్మన్నాడని చెప్పి శుభలేఖ ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రంతా సునీల తన గదిలో యేడుస్తూ ఉండిపోయింది. ఆమెకు అంతగా దుఃఖం రావడం ఆమె జీవితంలో అదే మొదటిసారి.

ఈ మగవాళ్ళంత మోసగాళ్ళు ఈ ప్రపంచంలో మరొకరుండరనిపించిందామెకు. శ్రీకాంత్ కనిపిస్తే కాల్చిపారెయ్యాలన్నంత కసి పుట్టింది.

కొద్దిరోజుల తర్వాత ఆమె ఇంటర్ చదివిన కాలేజిలోనే బి.ఏ.లో జాయినయ్యింది. ఇంటర్, డిగ్రీ ఒకే క్యాంపస్‌లో ఉన్నాయి.

బి.ఏ. చదువుతుండగా ఆమెకు సంధ్యతో పరిచయమయ్యింది.. సంధ్య ఆమెకు చాలా విషయాలు చెప్పింది. సంధ్య చెప్పిన విషయాల్లో సునీలకు బాగా నచ్చిన అంశం స్త్రీవాదం.. మనది ప్రధానంగా పితృస్వామ్య వ్యవస్థ అంది. కాబట్టి ఈ వ్యవస్థలో పురుషుడిదే రాజ్యమంది. స్త్రీని ఈ సమాజం ఎన్ని విధాలుగా అణిచివేస్తున్నదో చెప్పింది... పోరాటం ద్వారా తప్ప స్త్రీకి విముక్తి లేదంది. అన్నైనా, తమ్ముడైనా, తండ్రయినా, కొడుకైనా, భర్తయినా, ఇంకెవరైనా స్త్రీ స్వేచ్ఛకు అడ్డొచ్చే వాళ్ళందరితోనూ రాజీలేని పోరాటం చెయ్యాల్సిందేనంది.. స్త్రీనో "సెక్స్ ఆబ్జెక్ట్"గా మాత్రమే చూసే ఈ పురుషపుంగవుల ఆటకట్టించాల్సిందేనంది.

సంధ్య సునీలకు చాలా పుస్తకాలిచ్చింది. అవన్నీ చదువుతోంటే సునీలకు గొప్ప జ్ఞానోదయమైనట్టు తోచింది. ఆమె కళ్ళెదుట అనుక్షణం శ్రీకాంతే మెదలసాగాడు.. ఆమె ఎదుట శ్రీకాంత్ ఈ పురుషాధిక్య పితృస్వామ్య సమాజానికి గొప్ప ప్రతినిధిగా నిల్చాడు. తను శ్రీకాంత్ మీద పగతీర్చుకోవాలి. శ్రీకాంత్‌ను నగ్నంగా నడిబజార్లో నిలబెట్టి కొరడాలతో కొడ్తున్నట్టుగా ఊహించుకుంది. ఆ ఊహాచిత్రం ఆమె కళ్ళముందు మెదులుతున్నంత సేపు ఆమెకెంతో హాయిగా ఉంది.

సునీల సంధ్యతో కలిసి చాలా సమావేశాల కెళ్ళింది. స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడుతున్న సంఘాల్లో సభ్యత్వం తీసుకుంది. ఎక్కడ స్త్రీకి అన్యాయం జరిగిందని తెలిసినా అక్కడికెళ్ళి ఆ స్త్రీ పక్షాన నిలిచింది. మెల్లమెల్లగా వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడం కూడా మొదలెట్టింది. ఊరేగింపుల్లో పాల్గొనడం, ధర్నాలు చెయ్యడం, నిరాహార దీక్షలు చెయ్యడం మొదలైన పోరాట మార్గాలన్నీ ఆమెకు సుగమమైపోయాయి. ఈ పనులన్నీ చేస్తున్నప్పుడు ఆమె ఎంతో తృప్తిగా ఫీలయ్యింది.

ఆమె బి.ఏ. ఫైనలియర్‌లోకొచ్చాక ఆమెకో సమావేశంలో సుధీర్ పరిచయమయ్యాడు. ఆ రోజు స్త్రీవాదాన్ని గూర్చి సుధీర్ చేసిన ఉపన్యాసం ఆమెకు బాగా నచ్చింది. ఈ పితృస్వామిక పురుషాధిక్య సమాజం మీద సుధీర్ నిప్పులు చెరిగాడు.. ఈ పితృస్వామిక వ్యవస్థను కూకటివేళ్ళతో సహా పెకిలిస్తే తప్ప స్త్రీకి న్యాయం జరగదన్నాడు. ఈ పితృస్వామిక వ్యవస్థను కూకటివేళ్ళతో సహా కూల్చివెయ్యాలంటే ఒక్క స్త్రీవాదం మాత్రమే సరిపోదన్నాడు. అందుకు



విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ. 10/-, రెండవ సంపుటి (మార్చి 2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ. 15/-

స్త్రీలంతా మార్క్సిజాన్ని ఆశ్రయించక తప్పదన్నాడు.. "ఈ పెట్టుబడిదారీ సమాజంలో ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అనే రెండు వర్గాలున్నాయి. స్త్రీలంతా లేనివాళ్ళకిందకే వస్తారు.. స్త్రీలంతా అణచివేయబడ్తున్న వర్గాలకిందకే వస్తారు. స్త్రీ ఈ భూమ్మీద పుట్టినప్పట్నించీ అనుక్షణం అమానుషమైన అణచివేతకు గురవుతున్నది.. ఆమె ఏం తినాలో.. ఏం కట్టుకోవాలో.. ఏం మాట్లాడాలో, ఎక్కడ కూర్చోవాలో, ఎక్కడ నిల్చోవాలో అన్నీ పురుషుడే నిర్ణయిస్తున్నాడు.. బాల్యంలో తండ్రి మీద, యౌవనంలో భర్త మీద, వృద్ధాప్యంలో కొడుకు మీద ఆధారపడి బతకాలే తప్ప స్త్రీ స్వాతంత్ర్యానికి అర్హురాలు కాదని మన పురుషపుంగవులు ఘోషించారు.. మనమసలు స్త్రీనొక మనసున్న, రక్తమాంసాలున్న మనిషిగా ఎన్నడు చూశామని... స్త్రీనొక వస్తువుగా చూశాం.. పురుషుడి కామాన్ని తీర్చే సాధనంగా చూశాం.. పురుషుడికి పిల్లల్ని కనిచ్చే యంత్రంగా చూశాం.. పురుషుడ్ని పున్నామ నరకం నుండి కాపాడటానికి పుత్రున్ని కనిచ్చే గర్భంగా చూశాం.. స్త్రీ అసలు మనసున్న మనిషే కాదన్నాం. మొన్న మొన్న చలం లాంటోడొకడొచ్చి స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకి మెదడుంది.. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం యివ్వాలి అని చెప్పేంత వరకు మనం స్త్రీనో మనిషిలా చూళ్ళేకపోయాం. స్త్రీకి ఈ సమాజంలో అందరూ శత్రువులే.. ఆమె తండ్రి, అన్న, తమ్ముడు, భర్త, కొడుకులు - అందరూ ఆమెను ఎలా అణచెయ్యాలని చూసేవాళ్ళే.. చివరకు ఆమెను ప్రేమించామని ఆమెను నమ్మించే ఆమె సోకాల్డ్ ప్రియులు కూడా ఆమెను మోసం చేసేవాళ్ళే.. నేనూ పురుషజాతికి చెందినవాడినే అయినా పురుషులందరూ స్త్రీ విషయంలో పరమ దుర్మార్గులుగా ప్రవర్తిస్తారని నిస్సంకోచంగా చెబుతున్నాను.. స్త్రీనో సెక్స్ ఆబ్జెక్ట్‌గా తప్ప ఈ పురుషులు మరోలా చూడలేరు. ఇలాంటి దుర్మార్గ, దుష్ట దుర్భేద్య సమాజం మారాలంటే ఒక్కటే మార్గం.. అదే విప్లవం.. మార్క్సిస్టు విప్లవం! మార్క్సిస్టు విప్లవమొక్కటే సమాజాన్ని సమూలంగా మార్చగల్గుతుంది. ఉన్నవాడు, లేనివాడు, కాపిటలిస్టు, కార్మికుడు, భూస్వామి, వ్యవసాయకూలీ, స్త్రీలు, పురుషులు అనే వర్గాల్ని కూలదోసి వర్గరహిత సమ సమాజాన్ని స్థాపించగల్గుతుంది.. అలాంటి సమ సమాజంలోనే స్త్రీకి న్యాయం జరుగుతుంది. అలాంటి సమాజంలోనే స్త్రీ కూడా ఉత్పత్తిలో భాగస్వామురాలౌతుంది. ఉత్పత్తి సంబంధాలు మారినప్పుడే సమాజం మారుతుంది. స్త్రీని గౌరవించడం నేర్చుకుంటుంది... కాబట్టి డియర్ సిస్టర్స్! మీరు స్త్రీవాదం దగ్గరే ఆగిపోకండి. మార్క్సిజమ్ దాకా పయనించండి.. మార్క్సిస్టు విప్లవమొక్కటే స్త్రీ సమస్యను తీర్చగల్గుతుందని గమనించండి. లాంగ్ లివ్ రెవల్యూషన్!" అంటూ సుధీర్ తన ఉపన్యాసాన్ని ముగించాడు.

ఆనాటి నుండి సునీలకు మార్క్సిజమ్ మీద ఇంటరెస్ట్ కల్గింది. సుధీర్‌తో స్నేహం చెయ్యడం మొదలెట్టింది. సుధీర్ ఆమెకు అనేక విషయాలు బోధించాడు. ఎన్నో పుస్తకాలిచ్చాడు.. ఆ పుస్తకాల్లో కొన్నింటిని సునీల చదివింది. ఆమెకా పుస్తకాలు బాగా నచ్చాయి.

సుధీర్‌కు దగ్గరౌతున్నకొద్దీ ఆమెకు సుధీర్ చెప్పే ప్రతీమాట నూటికి నూరుపాళ్ళు నిజమేనన్న నమ్మకం కల్గింది.. వాళ్ళిద్దరూ కలిసి అనేక సభల్లో పాల్గొన్నారు.. అనేక విషయాల్ని చర్చించారు.. కాఫీ హోటళ్ళలో కూర్చొని కాఫీ తాగుతూ, పార్కుల్లో కూర్చొని వేరుశనక్కాయలు తింటూ, సునీల రూమ్‌లో ఇద్దరూ కలిసి వంట చేసుకొని, భోజనం చేస్తూ వాళ్ళు గంటలగ్గంటలకు చర్చించుకునేవాళ్ళు. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునేంతగా వాళ్ళు దగ్గరైపోయారు.

"పార్లమెంటరీ పద్ధతి ద్వారా మార్క్సిజాన్ని స్థాపించలేమంటారా?" అంది సునీల ఓరోజు.

"ఇంపాజిబుల్" అన్నాడు సుధీర్.

"ఎందుకంటారు?" అంది సునీల.

"పార్లమెంటరీ విధానం భ్రష్టుపట్టిపోయింది. ఈ ఎన్నికలనేవో పెద్ద బూటకం.. కండబలం, ధనబలం ఉన్నవాడే ఈ ఎన్నికల్లో గెలుస్తాడు.. ఇదో బూటకపు ప్రజాస్వామ్యం.. ఇవ్వే బూటకపు ఎన్నికలు.. ఈ వ్యవస్థ ఎంతగా చెడిపోయిందంట దీన్నెవడన్నా బాగుచెయ్యాలని సిన్సియర్‌గా ప్రయత్నిస్తే వాడిని కూడా ఈ వ్యవస్థ తనలో కలుపుకుంటుంది. ఇదో పెద్ద ఊబి. పార్లమెంటరీ పద్ధతి ద్వారా మార్క్సిజాన్ని స్థాపించబోతే మార్క్సిజమ్ కూడా ఆ ఊబిలో పడిపోతుంది."

"మార్క్సిజాన్ని... వర్గరహిత సమసమాజాన్ని స్థాపించడానికి మార్గమేమిటంటారు"

"సాయుధ పోరాటమొక్కటే మార్గం.. మరింకేమార్గం ద్వారా కూడా మార్క్సిజాన్ని స్థాపించడానికి అవకాశం లేదు.. ఒకవేళ పార్లమెంటరీ పద్ధతి ద్వారా మార్క్సిజాన్ని స్థాపించినా అదెంతో కాలం నిల్వదు"

"సోవియట్ యూనియన్‌లో నిన్నగాక మొన్నేం జరిగింది? అక్కడ మార్క్సిజాన్ని సాయుధపోరాటం ద్వారానే స్థాపించారు కదా! అదెందుకు నిలువలేదు"

"సోవియట్ యూనియన్‌లో మార్క్సిజాన్ని స్థాపించారని నీకెవరు చెప్పారు? మొన్నటిదాకా అక్కడున్నది మార్క్సిజమూ కాదు.. కమ్యూనిజమూ కాదు. మొదట్ల.. అంటే 1917లో అక్కడ కమ్యూనిస్టు విప్లవం వచ్చిన మాట నిజమే.. కానీ కొంతకాలం తర్వాత ఆ కమ్యూనిస్టు విప్లవం దారి తప్పిపోయింది. అది "సోషల్ ఇంపీరియలిజం"గా మారిపోయింది.. అందుకే అది కుప్పకూలిపోయింది."

"మరిప్పుడు చైనాలో ఉన్నది కమ్యూనిజమా?"

"కాదు... చైనాలో ఉన్నది కూడా కమ్యూనిజం కాదు.. అది 'మార్కెట్ సోషలిజం'గా దిగజారిపోయింది.. మావో ప్రారంభించిన 'కల్చరల్ రెవల్యూషన్'ను ఆపేసినప్పుడే చైనాలో కమ్యూనిజం దారి తప్పిపోయింది. వర్గశత్రు నిర్మూలన సంపూర్ణంగా జరిగేదాకా కల్చరల్ రెవల్యూషన్ను కొనసాగించి ఉంటే చైనాలో కమ్యూనిజం బతికేది.. డెంగ్ సియావో సింగ్ అనేవాడొచ్చి చైనాలో కమ్యూనిజాన్ని భ్రష్టుపట్టించాడు.. రెవల్యూషన్ అనేది ఒకనాటితో, లేక ఒక సంవత్సరంతో, లేక ఒక దశాబ్దితో ఆగిపో కూడదు. ఇట్ మస్ట్‌బీ యె కంటిన్యువస్ ప్రాసెస్. నిరంతర విప్లవంగా కొనసాగాలి.. ప్రతి మనిషిలోని స్వార్థం చచ్చేదాకా, ప్రతి మనిషిలోని అహం చచ్చేదాకా, ప్రతి మనిషిలోని విశృంఖలత్వం చచ్చేదాకా - ఒక్క మాటలో ప్రతి మనిషిలోని దుష్టశక్తులన్నీ చచ్చేదాకా, ప్రతి మనిషి సంపూర్ణ సోషలిస్టు మ్యాన్‌గా, సమానత్వ భావాన్ని తన రక్తంలో జీర్ణించుకున్న మానవుడిగా మారేదాకా - విప్లవం కొనసాగుతూనే ఉండాలి.. అప్పుడే నిజమైన సామ్యవాద వ్యవస్థ స్థాపించబడుతుంది. ప్రపంచమంతా అలా మారినప్పుడే విప్లవం విజయవంతమైనట్టుగా భావించాలి"

"అదెప్పుడు జరుగుతుందంటారు"

"ఎప్పుడైనా జరగొచ్చు... ఇవ్వాళ్ళ... రేపు... పదేళ్ళ తర్వాత.. పది శతాబ్దాల తర్వాత.. ఎప్పుడైనా జరగొచ్చు.. జరగటం మాత్రం అనివార్యం.. ప్రతి రోజూ సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత తథ్యమో ఎప్పుడో అప్పుడు విప్లవం సంభవించడం కూడా అంతే తథ్యం"

"ఇప్పుడు కమ్యూనిజం అనేది ప్రపంచంలో ఎక్కడన్నా ఉందా?"

"ఎక్కడా నిజమైన కమ్యూనిజం లేదు"

"ఇప్పుడు క్రాంతికారులు జరుపుతున్న పోరాటాన్ని గూర్చి మీ అభిప్రాయమేమిటి?"

"హేట్సాఫ్ టు దెమ్! సిద్ధాంతం కోసం సర్వాన్నీ త్యజించి... చివరకు ప్రాణాన్ని కూడా లెక్కచెయ్యకుండా పోరాడటం గ్రేట్... సింప్లీ గ్రేట్! ఆ విప్లవ వీరులకు నా జోహార్లు..." అన్నాడు సుధీర్.

"వాళ్ళు ఎందరో అమాయకుల్ని చంపుతున్నారనీ, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారనీ, చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూలదోయడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని విమర్శిస్తున్నారు!"

"నాన్‌సెన్స్... అట్టర్ నాన్‌సెన్స్.. యే గొప్ప పోరాటంలోనైనా కొందరు అమాయకులు బలికాక తప్పదు.. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చెయ్యడమా? ఇవ్వాళ్ళ ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చెయ్యని రాజకీయ పార్టీలేవైనా ఉన్నాయా? అదీ ప్రజాస్వామ్యాన్నీ పార్లమెంటరీ పంథాను నమ్ముకున్న రాజకీయ పార్టీలనే చూడు.. ఇవ్వాళ్ళ బస్సుల్ని తగలబెట్టని రాజకీయ పార్టీ యేదన్నా ఉందేమో చూపెట్టు. పెల్లుబికిన ప్రజల నిరసన బస్సుల మీదకే మల్లుతుంది. అది సహజం. తప్పదు. ఇది చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వమని ఎవడంటాడు? కండబలంతో, ధనబలంతో ఎన్నికల్ని గెలిచి, ప్రభుత్వాన్ని స్థాపిస్తే అది చట్టబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వమౌతుందా? ఎన్నికలు న్యాయంగా జరిగినప్పుడు, నిజంగా "ఫ్రీ అండ్ ఫెయిర్"గా జరిగినప్పుడు ఏర్పడిన ప్రభుత్వాన్ని చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వమంటారు.. ఇంకో కొన్ని దశాబ్దాల దాకా ఈ దేశంలో ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా జరుగుతాయన్న నమ్మకం ఎవరికీ లేదు.. కోట్ల డబ్బు ఖర్చు పెట్టినవాడే ఈ ఎన్నికలు గెలుస్తాడు. వాడే రాజ్యాన్ని స్థాపిస్తాడు.. కాబట్టి అలాంటి ప్రభుత్వాన్ని కూలదోయటంలో తప్పేమీ లేదు.. ఇక ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని చిలుక పలుకులు పలకగానే లాభం లేదు... అసలది నిజమైన ప్రజాస్వామ్యమేనా? వాళ్ళు చేస్తున్నది హింసేనా? ఇది ప్రజాస్వామ్యం కాదు.. ప్రజాస్వామ్యం పేరుతో ఉన్నవాళ్ళు లేనివాళ్ళ మీద జరుపుతున్న కుట్ర ఇది.. అలాగే క్రాంతికారులు జరుపుతున్నది హింస కాదు. రాజ్యహింసకు ప్రతిహింస మాత్రమే... తలుపులన్నీ మూసేసి పిల్లిని కొట్టబోతే ఏమౌతుందో నీకు తెలుసు కదా?" అన్నాడు సుధీర్.

సుధీర్ చెబుతున్నదంతా సునీలకు అద్భుతంగా తోచింది. అతని ఆర్గ్యుమెంట్‌కు తిరుగు లేదనిపించింది... అతడో మానవాతీతుడైన వ్యక్తిగా ఆమెకు కనిపించాడు.

అలా సుధీర్‌తో కలిసి సునీల ఓ సంవత్సరం పాటు తిరిగింది.

సుధీర్ తల్లిదండ్రులెవరో... సుధీర్ ఏం చేస్తాడో, సుధీర్ ఎక్కడివాడో మొదలైన విషయాలేవీ సునీలకు తెలీదు.. ఎప్పుడైనా వాటి ప్రస్తావన తెచ్చినా సుధీర్ సరిగ్గా చెప్పేవాడు కాదు. నాకన్నా పెద్దవాళ్ళందరూ నా తల్లిదండ్రులే అనేవాడు. చేతనైన సమాజసేవ చెయ్యడమే నా పని అనేవాడు. ఈ ప్రపంచమంతా నాదే అనేవాడు.

సునీల సుధీర్‌ని మానవాతీత వ్యక్తిగా ఆమె హృదయంలో ప్రతిష్ఠించుకొని పూజింపసాగింది. అతడేం చేసినా ఆమెకు అద్భుతంగా ఉండేది.. ఏం మాట్లాడినా అద్భుతంగా ఉండేది.

అలాంటి సుధీర్ అకస్మాత్తుగా అదృశ్యమైపోయాడు... అతడెక్కడికెళ్ళాడో, ఏమైపోయాడో సునీలకు తెలియలేదు.. అతనికోసం ఊరంతా తిరిగింది.. తెలిసిన వాళ్ళందర్నీ అడిగింది... "మాకు తెలీదు.. నీకే తెలియాలి" ఎవర్నడిగినా ఇదే సమాధానం... అతనికోసం ఆమె కన్నులు పొడుచుకొని అన్వేషించింది... దిక్కులు పిక్కటిల్లేట్టు "సుధీర్! సుధీర్!" అని అరిచింది. గుండెలు పగిలేట్టుగా రోదించింది. కానీ ఆమెకు సుధీర్ దొరకలేదు.

ఓ మూడు నెలలు గడిచాయి...

ఈ మూడు నెలలూ సునీల సుధీర్ కోసం తనకు తెలిసిన ప్రపంచంలోని అణువణువూ గాలిస్తూనే ఉంది. ఎవర్ని చూసినా "సుధీర్ కనిపించాడా? సుధీర్ కనిపించాడా?" అని అడుగుతూనే ఉంది.

సుమతి వచ్చి కూతురు దగ్గర్నే ఉండటం మొదలెట్టింది. తల్లిని కూడా అనుక్షణం "సుధీర్ కనిపించాడా అమ్మా! సుధీర్ ఎక్కడున్నాడో చెప్పవా అమ్మా!" అని అడగటం తప్ప సునీల మరో మాట మాట్లాడలేదు.

"నా బిడ్డకేదో పిచ్చిబట్టింది.. ఎవరో చేతబడి చేసినట్టుంది" అనుకుంది సుమతి.

ఓ రోజు సునీల బుర్రలో ఓ మెరుపులా ఓ ఆలోచన మెరిసింది. సుధీర్ క్రాంతికారుల్లో కలిసిపోయాడేమో! తను కూడా క్రాంతికారుల్లో చేరిపోతే సుధీర్ తప్పకుండా కనిపిస్తాడు... తను వెంటనే క్రాంతికారుల్లో చేరిపోవాలి.

రోజురోజుకు ఆమెలో ఈ భావం "ఇంతింతై వటుడింతై" అన్నట్టుగా పెరిగిపోయింది.

సునీల ఓ రోజు అర్ధరాత్రి పక్కమీంచి లేచి తల్లికి చెప్పకుండానే ఆ ఊరి బస్‌స్టేషన్ వైపు వెళ్ళిపోయింది.

కొత్తకొండకెళ్ళే బస్సెక్కింది. తెలతెలవారుతుండగా కొత్తకొండలో బస్సు దిగింది. అక్కడికి దగ్గర్లోనే ఉన్న అడవిలో క్రాంతికారులుంటారని ఆమెకెవరో చెప్పారు.

కొత్తకొండ ఊర్లో దిగి ఎవరు కనిపిస్తే వాళ్ళను "నన్ను క్రాంతికారుల దగ్గరికి తీసుకపోతరా?" అని అడగటం మొదలెట్టింది.. ఆమెనో పిచ్చిదనుకొని ఎవరూ ఆమెకు సమాధానం చెప్పలేదు. కొందరు మాత్రం "క్రాంతికారుల దగ్గరకు తీసుకపోతే ఏం జేస్తవు?" అని అడిగారు.

"నేను కూడ వాళ్ళతో చేరిపోత.. అక్కడ మా సుధీర్ ఉన్నడు.. అతన్ని కలుసుకుంట.. అతనితో కలిసి తుపాకి పట్టుకొని పోరాటం జేస్త.. సమసమాజాన్ని తీసుకొస్త. ఇది జోక్ గాదు. నిజంగ చెబుతున్న.. నన్ను సుధీర్ దగ్గరకు తీసుకపోండ్రి" అంటూ బతిమాలిందామె.

ఆ రోజు రాత్రి ఆమెకు బలరామ్ అన్న ఓ వ్యక్తి కలిశాడు. "నేను నిన్ను క్రాంతికారుల దగ్గరకు తీసుకపోత" అని ఆమెకు మాటిచ్చాడు. బలరామ్ ఎవరో ఆ ఊర్లో ఎవరికీ తెలియదు.

బలరామ్ ఆమెను చాలా ప్రశ్నలడిగాడు. ఏమడిగినా ఆమె "నాకు సుధీర్ కావాలె.. నేను సుధీర్‌ను కలుసుకోవాలె" అన్న సమాధానమే చెప్పింది. "సుధీర్ ఎవర"ంటే ఓసారి "నాకు తెలీద"ంది. మరోసారి "సుధీర్ దేవుడ"ంది. మరోసారి "మార్క్స్" అంది.

ఆ మర్నాడు బలరామ్ ఆమెను అడవుల్లోకి తీసికెళ్ళాడు.

* * *

పదిరోజుల తర్వాత కొత్తకొండ అడవుల మధ్యలోంచి వెళ్ళే తారురోడ్డు పక్కన సునీల శవం కనిపించింది. ఆమె వొంటి మీది బట్టలన్నీ చిరిగిపోయి ఇంచుమించు నగ్నంగా ఉంది. దార్లో వెళ్తున్న వాళ్ళెవరో ఆమె మీద ఓ బట్టకప్పి పోయారు.

సునీలను పోలీసు ఇన్‌ఫార్మర్ అనుకొని ఆమెను అమానుషంగా చిత్రహింసలకు గురిచేసి క్రాంతికారులు చంపేశారని పోలీసులు తెలియజేశారు.

సునీల హత్యతో మాకెలాంటి సంబంధం లేదని, సునీలను పోలీసులే ఆమెకు క్రాంతికారులతో సంబంధాలున్నాయన్న అనుమానంతో అరెస్ట్‌చేసి, టార్చర్ చేసి, గ్యాంగ్ రేప్ చేసి చంపేశారని క్రాంతికారులో ప్రకటన విడుదల చేశారు...

ఈ రెండు స్టేట్‌మెంట్లలో ఏది నిజమో, ఏది అబద్ధమో ప్రజలు తేల్చుకోలేకపోయారు.

## భవిష్యత్తు

ఈ యుద్ధంఇలా కొనసాగుతూనే ఉంటుంది. రక్షకభటులు క్రాంతికారుల్ని చంపుతూనే ఉంటారు. క్రాంతికారులు రక్షకభటుల్నీ, వాళ్ళను ఆశ్రయించుకొని బతికేవాళ్ళ తాబేదార్లనీ చంపుతూనే ఉంటారు.. రాజ్యహింస సాగుతూనే ఉంటుంది. ప్రతిహింసా సాగుతూనే ఉంటుంది. మధ్యలో ఎందరో అమాయకులు బలయిపోతూనే ఉంటారు. విప్లవం కోసం జరుగుతున్న పోరాటంలో ఇది అనివార్యమని క్రాంతికారులూ, వాళ్ళ మేధావులూ చెబుతూనే ఉంటారు.

ఉన్నవాడు లేనివాడ్ని దోచుకుంటూనే ఉంటాడు. అవకాశం వచ్చినప్పుడల్లా లేనివాడు తిరగబడ్తూనే ఉంటాడు... ఏదో రూపంలో పోరాడుతూనే ఉంటాడు. ఏదో రూపంలో పోరాడుతూనే ఉంటాడు. సమసమాజాన్ని గూర్చి మేధావులు కలలుగంటూనే ఉంటారు. ఆ కలల్ని నిజం చెయ్యాలని కొందరు ఉడుకు రక్తపు యువకులు యుద్ధరంగంలోకి దుముకుతూనే ఉంటారు. ప్రాణాల్ని కోల్పోతూనే ఉంటారు. మేధావులు మాత్రం క్షేమంగానే ఉంటుంటారు.

లేనివాడు ఉన్నవాడుగా మారిపోగానే తనూ ఒకప్పుడు లేనివాన్ననీ, దోపిడీకి గురయిన వాడినేనని మరచిపోతూనే ఉంటాడు. తనూ దోపిడీకి పాల్పడుతూనే ఉంటాడు.

యుద్ధం ఏనాటికైనా అంతమౌతుందా? ప్రజలందరూ శాంతిసౌఖ్యాలతో ఈ భూమ్మీద నివసించే రోజు వస్తుందా అని ఓ గొప్ప భౌతిక శాస్త్రవేత్త ఓ గొప్ప మానసిక శాస్త్రవేత్తను అడిగాడట.. యుద్ధం అనేది ఏనాటికీ అంతం కాదని, యుద్ధం అనేది బయటలేదని, మనిషి మనసులో, మనిషి ఆలోచనలో యుద్ధం ఉందని, మనిషి మైండ్‌ను మార్చడం అంత సులభం కాదనీ, కాబట్టి మనిషి యుద్ధంతో సహజీవనం చెయ్యడం నేర్చుకోవాలని ఆ మానసిక శాస్త్రజ్ఞుడు సమాధానం చెప్పాడట!

ప్రతిజీవిలోనూ జీవితేచ్ఛా ఉంటుంది. మరణకాంక్షా ఉంటుంది. ప్రేమ, కరుణ, త్యాగం, సహనం జీవితేచ్ఛలోంచి జనిస్తాయి. పగ, ఈర్ష్య, ద్వేషం, విధ్వంసం మరణకాంక్షలోంచి జనిస్తాయి. ప్రేమ జీవితేచ్ఛకు చిహ్నమైతే యుద్ధం మరణకాంక్షకు సంకేతం. ప్రతి మనిషిలోనూ ఈ రెండూ సహజీవనం చేస్తాయి. మనిషి మొదలు తనతో తను పోరాటం చేసుకొని ఈ రెండింటి మధ్య సమతౌల్యాన్ని సాధించాలి. మనిషి మొదలు తన మనసులో ఉన్న యుద్ధాన్ని జయిస్తే బయట జరిగే యుద్ధాన్ని జయించగల్గుతాడు. కానీ....."

**(సమాప్తం)**


...మారుతున్న కాలపు కెమిస్ట్రీని ఖచ్చితంగా ఒడిసి పట్టుకున్న టెక్నిక్, అక్షరాల్లో సూపర్‌సానిక్ స్పీడు, గుండెలు కొట్టుకులాడే, నరాలు బిగిసి తెగిపోయే మలుపుల, సస్పెన్సుల, భయాల బ్లడ్‌ప్రెషర్ పెరిగి పెరిగి కట్టలుతెగి కెరటాలై ఎగిరి రాళ్ళకి గుద్దుకుని విరిగి పడేంత ఉక్కిరి బిక్కిరి...

... ఏ రాగమైనా మహత్తర తెలుగువాక్యవిన్యాసంతో పాఠకజన హృదయాన్ని గమ్మత్తుగా చుట్టుకునే, వెర్రెత్తించే శైలి, తెరిస్తే ముగిసే దాకా పుస్తకం కింద పెట్టనివ్వని బిగువు, కథనాశ్వంపై అక్షరమాంత్రికుని అద్భుతస్వారీ...

యండమూరి వీరేంద్రనాథ్

విజయవిహారం పాఠకుల కోసం ప్రత్యేకంగా సృష్టిస్తున్న

'ఒక వర్షాకాలపు సాయంత్రం'

వచ్చే సంచిక నుంచే...




- ఇలా గురువుని - అది కూడా పాఠం రాసుకోమని అడిగి కాదంటే కేవలం బెంచీ మీద నిల్చోమన్నందుకు- గురువుని శిక్షించిన 'దేవుడ్ని' గురించి ఎవరైనా విన్నారా?

'ఆచార్య దేవోభవ' అంటోంది భారతీయ సంప్రదాయం; మరి గురువుని శిక్షించడం ఏం సంప్రదాయం? 'బురిడీ' సంప్రదాయమా?

విద్యార్థిని ప్రాణం పోయేదాకా కఠినంగా శిక్షించమని బోధించే బురిడీ బాబాకి - నోట్సు రాసుకోనందుకు బెంచీ మీద నిల్చోమంటేనే అంత తప్పొచ్చిందా?

ఇటువంటి వికృతమైన కథల్ని విస్తృతంగా ప్రచారంలో పెడుతున్న - 'బురిడీ' మేధావులు ఏ ఆదర్శాన్ని బోధించ దలుచుకున్నారు?

ఇంతకీ ఇదే 'మహాత్మ్యా'న్ని బురిడీ బాబా 'లీల'లకి నాంది - అని మురుస్తున్నవారు ఉన్నారు. ఓపెనింగే ఇంత అధ్వానంగా ఉందంటే - దీన్నిబట్టే వీరి మిగతా 'దివ్యలీల'ల గొప్పదనం తెలుస్తోంది!

నోట్సు రాసుకోనందుకు బెంచీ ఎక్కమని చెప్పిన ఉపాధ్యాయుడ్ని - శిక్షించిన 'లీల'లో ఏమంత 'దైవత్వం', 'ప్రేమతత్వం', 'ఔచిత్యం', 'ఆదర్శం' లేదని ఎన్.కస్తూరి వంటి వారికి తెలీకపోలేదు. (ఎన్. కస్తూరి కూడా పూర్వాశ్రమంలో ఉపాధ్యాయవృత్తిలో ఉన్నవాడే కదా) అందుకే ఆయన 'సత్యం శివం సుందరం'లో ఈ ఉదంతాన్ని రాసిన వెంటనే "... అయ్యవారిపై కోపము చేతగాక తన దివ్యశక్తిని లోకమునకు జూప సంకల్పించెను. ఇదియే శ్రీ సత్యనారాయణుని దివ్యలీలా ప్రకటనమునకు నాంది..." అని కుంటిసమర్థన ఇచ్చే ప్రయత్నం చేశారు.

కానీ బురిడీబాబా అభిప్రాయం దీనికి భిన్నంగానే వుంది. డాక్టర్ చౌదరి ఓలేటి రాసిన "పవిత్రాత్ముడు - అవతార పురుషుడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబ" పుస్తకంలో ఆయన ఈ ఉదంతాన్ని ఉటంకించి ఇలా రాశారు: "... ఈ సంఘటనను భగవానులే తెల్పిరి. తనను అన్యాయముగా బాధించిన దురహంకారము గల వుపాధ్యాయునకు సరియైన శిక్ష అని చెప్పిరి..."

అదీ సంగతి!



# డిబార్ చెయ్యాల్సింది!

## విద్యార్థి దశలో 'బురిడీ' వేషాలు -1

పాఠం నోట్సు రాసుకోమని చెపితే, అలా రాసుకోనందుకు బెంచీ మీద నిల్చోబెడితే ఆ ఉపాధ్యాయుడిది 'అన్యాయ'మైన 'దురహంకారం'! ఆ ఉపాధ్యాయుడికి 'సరియైన శిక్ష' విధించిన బురిడీబాబా వారిది మాత్రం దైవత్వం!

బాబా భక్తుల్లో ఎంతమంది తల్లితండ్రులు, ఎంతమంది పిల్లలు, ఎంతమంది ఉపాధ్యాయులు - ఈ వికృత భావాల్ని, వెకిలి లీలల ప్రచారాల్ని ఆదర్శంగా భావిస్తారో - తేల్చుకోవాలి!

అయినా ఒక మాట- బురిడీబాబాకి అక్షరాలు రావని, లైనుకి మూడు తప్పులు రాస్తాడని గతంలో ఉదాహరణలు చూసాం. చిన్నప్పుడు అహంకారంతో వ్యవహరించకుండా- కాస్త అక్షరం ముక్కలు నేర్చుకునివుంటే బురిడీబాబాకి ఈ అక్షరాలు రాని దుస్థితి దాపురించేది కాదేమో! (విజయవిహారం తొలి సంచికల్లో బురిడీబాబా దస్తూరీ తప్పుల్ని ఎత్తి చూపినప్పుడు మిస్ అయిన మిత్రులు బాధ పడక్కర్లేదు. అటువంటివి రాబోయే సంచికల్లో మళ్లీ ఇవ్వబోతున్నాను.)

### డిబార్ చెయ్యాల్సింది!

ఇప్పుడు మరో బురిడీ లీల గురించి మాట్లాడుకుందాం. చిన్నప్పుడు బురిడీ బాబాకి ఇద్దరు స్నేహితులుండేవారట. వాళ్లిద్దరు పుట్టబాబాకి గట్టి స్నేహితులట. అందుచేత పరీక్షల్లో వాళ్లకి సాయం చేద్దామని పరీక్షల్లో వాళ్లకి ఆన్సర్ పేపర్లు- అది కూడా దస్తూరీ మార్చి వాళ్ల దస్తూరీతోనే రాసి పెట్టే హైన్యానికి దిగాడు పుట్టబాబా. ఈ ఉదంతం బురిడీ సాహిత్యంలో చాలా సార్లు వచ్చింది.

మచ్చుకి ఒక ఉదాహరణ:

"కమలాపురంలో చదువుకుంటున్న రోజులలో ఇద్దరు స్నేహితులు స్వామికి చాలా సన్నిహితంగా, ఆత్మీయంగా వుండేవారు. అందులో ఒకతను రమేష్ ఒక షిరిస్తేదారు కుమారుడు. మరొకతను రఘు. ఈ ఇద్దరు స్వామిని విడిచిపెట్టి వుండేవారు కాదు. వారు స్వామి ఎక్కడికి వెళ్లితే అక్కడికి వెళ్లేవారు. స్కూలులో కూడా రమేష్, రఘులు స్వామికి అటూ, ఇటూ కూర్చునేవారు. అందువల్ల స్వామి ప్రభావం వారిద్దరిమీద పడుతుండేది.

ఆ స్కూలు విద్యార్థులంతా మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలు రాయబోతున్నారు. అప్పుడు పరీక్షలు చాలా క్రమశిక్షణతో జరిగేవి. విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షలంటే భయపడసాగారు. ఆ ముందు రోజు రమేష్, రఘు ఇద్దరూ సత్యం దగ్గరకు వచ్చి పరీక్షలు ఎలా వ్రాయాలా అని దిగులు పడసాగారు. అప్పుడు సత్యం వారితో " నేనుండగా భయమెందుకు? పరీక్ష హాలులో పేపరు తీసుకుని ఏదో ఒకటి వ్రాస్తూ వుండండి. తరువాత సంగతి నేను చూసుకుంటాను." అన్నాడు. పరీక్ష హాలులో సత్యం తన పేపరు వ్రాయటం పూర్తి చేసి, మిత్రులిద్దరి పేపర్లు కూడా తానే వ్రాసాడు. తన పేపరు తన దస్తూరీతో, ఒకటి రమేష్ దస్తూరీతో, మరొకటి రఘు దస్తూరీతో వ్రాసి మూడు పేపర్లు వ్రాయడం పూర్తి కాగానే తానే అవి తీసుకొని వెళ్లి ఆ టీచర్‌కిచ్చి బయటకు వచ్చేశాడు.

కొన్నాళ్లకు పరీక్ష ఫలితాలు వచ్చాయి. కేవలం ఈ ముగ్గురే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. రమేష్, రఘులకు ప్రథమ శ్రేణి వచ్చినందుకు అందరూ ఆశ్చర్యపడ్డారు." - (శ్రీకృష్ణుడు శ్రీ సత్యసాయి, పేజీ 101)

డాక్టర్ ఓలేటి చౌదరి తన 'పవిత్రాత్ముడు- అవతార పురుషుడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా' పుస్తకంలో 96వ పేజీలో ఇలా రాశాడు.

"రమేష్ మరియు సుధీర్ భగవానుని అత్యంత ఆప్త మిత్రులు. వారిద్దరికీ భగవానుని దైవాంశ తెలిసియుండెను. పాఠశాలలో వారు భగవానుని ఇరువక్కలా కూర్చొనెడివారు. వారు ఎల్లప్పుడూ భగవానుని అనుసరించెడివారు. మరియు వీరు భగవానునకు తమను తామే సమర్పించుకొనియుండిరి. రాష్ట్ర స్థాయిలో జరుగు పెద్ద పరీక్షలో భగవాన్ మూడు సెట్ల ఆన్సర్ల కాగితములను మూడు రకాల చేతి వ్రాతలలో వ్రాసిరి. ఆ ముగ్గురును ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైరి."

ఇందాకటి 'రమేష్', 'రఘు' అనే పేర్లు ఈ పుస్తకంలో 'రమేష్', 'సుధీర్'గా ఎలా మారిపోయాయని దయచేసి నన్ను అడగకండి.

ఎందుకంటే బురిడీ సాహిత్యంలో ఇలాంటివి కామన్. బహుశా రాసేది అబద్ధమని వాళ్లకీ తెలుసు కాబట్టి ఒకసారి ఒకళ్ల రాసింది- మరొకళ్ల రాసేటప్పుడు మారిపోతుంది. సాక్షాత్తూ బురిడీ బాబానే తాను ఒకసారి చెప్పిన సంఘటన- మరోసారి ఆయనే చెప్పినప్పుడు మారి పోయిన ఉదాహరణలు గతంలో చూశాం. ఇంకా చాలా చూస్తాం కూడా.

ఇదే విషయం సనాతనసారథి ఏప్రిల్, 2001 సంచికలో (బురిడీ బాబా ఉపన్యాసంలో) 124, 125 పేజీల్లో కాస్త వివరంగా వచ్చింది:

"స్కూల్లో నేను రమేశ్, సురేశ్ ప్రక్క ప్రక్కన కూర్చునేవారు. మా ముగ్గురిదీ ఒకే డెస్కు. నేను మధ్యలో కూర్చుంటే రమేశ్, సురేశ్‌లు ఇరు వైపులా కూర్చునేవారు. వారికి చదువు సరిగా రాదు. టీచర్లు వారినేదైనా ప్రశ్న అడిగినప్పుడు నేనొక కాగితంపై జవాబు వ్రాసి వారికి కనిపించేట్లు పెట్టేవాడిని. వారు దాన్ని చూసి జవాబు చెప్పి టీచర్ల మెప్పును పొందేవారు.

మేము ఇఎస్ఎల్‌సి పబ్లిక్ పరీక్షలకు హాజరు కావలసివచ్చింది. రమేశ్, సురేశ్‌లు నా వద్దకు వచ్చి 'రాజా! పబ్లిక్ పరీక్షలు వ్రాయటానికి మాకు చేతకాదు. మా గతి ఏమౌతుందో!' అని భయం వ్యక్తం చేసారు. 'మీరేమీ భయపడకండి. నన్ను నమ్ముకున్నారు కనుక నేను మిమ్మల్ని తప్పక ఉత్తీర్ణులను చేస్తాను.' అని అభయమిచ్చి వారికొక ఉపాయం చెప్పాను. 'హాల్లో ప్రవేశించిన వెంటనే మీకు జవాబులు వ్రాయడానికి పేపర్లు ఇస్తారు. వాటిని తీసుకొని మీ నియమిత స్థానాల్లో కోర్చోండి. ఆ తరువాత సంగతి నేను చూసుకుంటాను.' అన్నాను. వారు సరేనన్నారు. ఏ విషయంలోనూ వారు నా మాట జవదాటేవారు కాదు.



పరీక్షా హాలులో మేము ముగ్గురం ఒకరికొకరం చాలా దూరంగా కూర్చోవలిసివచ్చింది. మా నెంబర్లు ఆ విధంగా వచ్చాయి. రమేశ్, సురేశ్‌లు నేను చెప్పినట్లు వారి నియమిత స్థానాల్లో కూర్చుని ఏదో వ్రాస్తున్నట్లు నటించారు. నా పేపరును నేను అరగంటలో పూర్తి చేసాను. రమేశ్, సురేశ్‌ల పేపర్లను కూడా వారి వారి హాండ్ రైటింగ్‌లతో నేనే వ్రాసాను. నాది, రమేశ్‌ది, సురేశ్‌ది గంటన్నరలో పూర్తి అయినాయి. బెల్ కొడుతూనే మా ముగ్గురి పేపర్లను నేనే తీసుకు వెళ్లి టేబుల్‌పైన పెట్టాను. ఆ పిల్లలు బయటకి వచ్చేసారు. తర్వాత పరీక్షా ఫలితాలు ప్రకటించబడినాయి. రాజు, రమేశ్, సురేశ్‌లకు మాత్రమే ఫస్ట్‌క్లాస్ వచ్చింది. మార్కులు 98, 99... ఈ విధంగా వచ్చాయి. మా రూల్ నెంబర్ల ప్రకారం పరీక్షా హాలులో ఒకరికొకరం చాలా దూరంగా కూర్చున్నాం కాబట్టి, వారు కాపీ కొట్టారనుకోవటానికి వీల్లేదు. ఎవరి పేపర్ వారి హాండ్‌రైటింగ్ (దస్తూరి)లోనే వుంది కాబట్టి, ఎట్టి సందేహానికి అవకాశం లేదు. గ్రామస్తులు మా ముగ్గురిని ఘనంగా వూరేగించారు. ఊరేగింపు జరుగుతుంటే రమేశ్, సురేశ్‌లు సిగ్గుతో తలలు దించుకున్నారు. 'మీరేమీ దొంగతనం చేయలేదు కదా! తల ఎత్తండి', అని నేను వారికి ధైర్యం చెప్పాను. తరువాత, క్లాస్‌రూమ్‌లో టీచర్లు పరీక్షలో అడిగిన ప్రశ్నలనే మళ్లీ అడిగినప్పుడు పిల్లలెవ్వరూ జవాబులు చెప్పలేకపోయారు. జరిగిన సంగతి ఎవ్వరికీ చెప్పకూడదని నేను ముందుగానే వారిని హెచ్చరించాను. 'ఆసమయంలో మా హృదయానికి తోచింది వ్రాసామని చెప్పండి', అన్నాను. వారు ఆ విధంగానే చేసారు."

- అదీ సంగతి!

( ఇప్పుడు ఆ విద్యార్థుల పేర్లు రమేశ్, సురేశ్‌లుగా మారిపోయాయి చూశారా...)

సరే... దీంట్లో ' దివ్యలీల', 'ఆధ్యాత్మికత' లాంటివి ఏవీ లేవని- దీన్ని 'మాల్‌ప్రాక్టీస్' అంటారని- పట్టుబడితే ఇటువంటి కమీనె పనులకి- మూడు సంవత్సరాలు డిబార్ చేస్తారని, లేదా ఒక్కోసారి క్రిమినల్ కేసు పెట్టి, అరెస్టు చేసి జైలుకి కూడా పంపిస్తారని- అందరికీ తెలుసు.

మై లైఫ్ ఈజ్ మై మెసేజ్ అంటూ గాంధీజీని కాపీ కొట్టి చెప్పుకునే బురిడీ బాబాకి- బాల్యంలో గాంధీజీ జీవితంలో కాపీలని అసహ్యించుకొని అవసరమైతే ఆ విషయంలో టీచర్ల మాట కూడా కాదన్న సందర్భం వుందని తెలుసా?

పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు గాంధీజీని చూసి 'మై లైఫ్ ఈజ్ మై మెసేజ్' అని చెప్పుకునే బురిడీ బాబాకి ఆ మాటల అర్థం తెలుసా? ఇలా తన 'లైఫ్'లో పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడటమే తన మెసేజ్ అని చెప్పదలిచాడా?

పుట్టబాబావలె బాలవికాస్, ఇ.హెచ్.వి (ఎడ్యుకేషన్ విత్ హ్యూమన్ వాల్యూస్) కార్యక్రమాల్లో ఈ మాల్‌ప్రాక్టీస్ ట్రైనింగ్‌లు వుంటాయా?

ఇంగితం వున్న వారెవరూ బాబా చేసిన పనిని 'ఛీ' అనకుండా వుండలేరు.

' శ్రీకృష్ణుడు, శ్రీసత్యసాయి' పుస్తకంలో 101వ పేజీలో ఇలా రాశారు:

"... అప్పుడు విద్యార్థులతో పాటు విదేశీ భక్తుడైన డాక్టర్ గోల్డ్‌స్టీన్ కూడా వున్నారు. మరునాడు గోల్డ్‌స్టీన్ సాహసించి భగవాన్ బాబాతో ' స్వామీ! మీరు ఈ విధంగా రమేష్, రఘులకు పరీక్ష హాలులో సమాధాన పత్రాలు వ్రాయటం మంచి పద్ధతి కాదు కదా. అది తోటి విద్యార్థులకు ఆదర్శం కాదు గదా.' అని అడిగారు.

అప్పుడు భగవాన్ బాబా ఇలా అన్నారు. - ' భగవంతుణ్ణి ప్రగాఢంగా నమ్మి ప్రేమించేవారి కోసం భగవంతుడు ఏదైనా చేయగలడు. రమేష్, రఘులకోసం నేను చేసిన పనిలో నా స్వార్థం ఎంత మాత్రం లేదు. పరీక్ష హాలులో నేను వారితో కాపీ వ్రాయమని అంటే అది తప్పు. కాని వారి కోసం నేను వ్రాశాను. నేను ఏది చేసినా అది నిస్వార్థము, నిర్దోషము...'..."

డాక్టర్ చౌదరి ఓలేటి తన 'పవిత్రాత్ముడు- అవతార పురుషుడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా' పుస్తకంలో 96వ పేజీలో ఇలా రాశారు: "... భగవాన్ ఈ అనుభవాన్ని చెప్పగానే విద్యార్థులందరూ భగవాన్ చేసిన పనికి నిరశన ప్రకటించిరి..."

ఈ సంఘటన నిజమో లేక బురిడీ గప్పాలో తెలీదు. అసలు అక్షరాలు రాయడం సరిగ్గా రాని బురిడీ బాబా (ఆధారాలు గత సంచికల్లో చూశాం, రాబోయే సంచికల్లో మళ్లీ చూపిస్తాం) మరొకరి పేపర్లు ఎలా రాయగలుగుతాడు? రాసినా దానికి అన్నేసి మార్కులు ఎలా వస్తాయి? అయినా ఇలా జరిగేటప్పుడు, ఆ ఇద్దరు విద్యార్థులకు తను సాయం చేయదలుచుకున్నప్పుడు- బురిడీ బాబాలో ఏ మాత్రం పద్ధతి, న్యాయం, సత్యం పట్ల ప్రేమ వున్నా- ఆయన ఆ విద్యార్థి మిత్రులకు చదువు పట్ల అభినివేశం కల్పించాల్సింది. తను చదువుకుంటూ వారినీ తనతో కలిసి చదివించాల్సింది. ప్రాణం పోయినా ఎటువంటి తప్పులకి పాల్పడరాదని సత్యపథాన్ని వీడరాదనే పట్టుదలని వారిలో కల్పించాల్సింది.

కాని 'బురిడీబుద్ధి'కి ఇటువంటి మంచి మాటలు ఎలా తోస్తాయి?

## ఈ బోధనలు ప్రమాదం కాదా?

మంచిని మంచి అని, చెడుని చెడు అని చెప్పకపోతే- ఆ బూటకపు ఉద్యమాల వల్ల సమాజానికి జరిగే చెడు ఖచ్చితంగా వుంటుంది.

అందువల్ల ఈ ధోరణులను ఉపేక్షించడం సరికాదు.

విద్యార్థులు తమ కాళ్లమీద తాము నిలవాలని, తమ కృషితో తాము పైకి రావాలని అనుకోవాలి. అంతేకాని, ఎలాగైనా స్లిప్పులు పెట్టో, కాపీలు కొట్టో పైకి రావాలని అనుకోకూడదు.





స్వయంకృషితో న్యాయంగా పైకి వచ్చేందుకు దైవం తోడ్పడాలని ఆశించాలి కాని, దైవం పరీక్షలో స్లిప్పులు అందించి తోడ్పడాలని అనుకోరాదు కదా! కాని మంచి చెడుల పట్ల విచక్షణ నశిస్తే జరిగేది అదేకదా!

ఇక్కడ ఒక ఉదాహరణ చూపుతాను. తొలిదశలో పుట్టబాబాకి కుమారమ్మ అనే భక్తురాలు ఉండేది. ఆమె రాసిన 'అన్యథా శరణం నాస్తి' అనే పుస్తకం ద్వారా ఆమె అనుభవాలు, మనోభావాలు మనకు తెలుస్తున్నాయి.

"... నా స్నేహితులు ఏదైనా కోరితే నా బ్యాగునించి తీసి ఇచ్చేవాడిని. పరీక్షా సమయములందు రాబోయే ప్రశ్నలు, వారికి మాత్రం చెప్పేవాడని. ఒకసారి నా మిత్రుడు పరీక్ష వ్రాయకపోగా, ఆ పేపర్ పుచ్చుకొని వాని అక్షరాల్లాగే వ్రాసి ఇచ్చాను..." - (అన్యథా శరణం నాస్తి, పేజీ 157)

అంటూ బురిడీ బాబా చెప్పే కబుర్లకి ఆమె పరవశించింది. అదే సరైన ఆదర్శమని ఆమె నమ్మింది.

ఆమె ఒకసారి తన పరీక్షకి సరిగ్గా ప్రిపేర్ కాకుండా వెళ్లిన అనుభవం గురించి అదే పుస్తకంలో 53,54వ పేజీలలో వర్ణించింది. సహజంగా 'బురిడీ' భక్తురాలు కాబట్టి- తన 'బురిడీ' దేవుడు తనకి స్లిప్పులు అందేలా చేస్తే బాగుంటుందనే కదా ఆమె కోరుకునేది. ఆమె అనుభవం చూడండి.

"... పేపర్ తెరిస్తే తలతిరిగిపోయింది. కళ్లనీళ్లు తిరిగింది. కలం కదలలేదు. ఎగ్జామినర్ వచ్చి 'అరే! ఇదేమిటి! ఆరంభించనే లేదా' అన్నారు. నా సంగతి విని జాలిగా చూచి వెళ్ళిపోయారు. అయిదు నిముషాలయ్యాక వచ్చి మెల్లగా ఒక పేపర్ నా టేబుల్ మీద పెట్టి, 'వ్రాసి ఇచ్చేయి' అని వెళ్లిపోయారు. చేతులు వణుకుతూ తెరిస్తే, ఆన్సర్ పేపరది. గుండె ఆగిపోయింది. ఇది సాధ్యమేనా! 'స్వామీ!ఆపద్బాంధవా! కరుణా సముద్రా!' అని గట్టిగా లోపలే ప్రార్థించి పేపర్ ముగించే సరికి, మరో పేపర్ సిద్ధం. ఎవ్వరీయన? ఎందుకిలా చేస్తున్నారు? అగోచరం. వారికి ధన్యవాదాలర్పించి ధీమాగా మెట్లు దిగి వస్తూంటే, మా స్నేహితురాలు గేలిగా చూచి 'దంచేశావా' అంది. 'దంచటమేమిటి? జమాయించేశాను' అన్నాను అదే స్వరంతో. మరునాడు ప్రాక్టికల్స్ చేసి, బస్సు ఎక్కి పర్తి చేరాం. గేటు వద్దే సాయి తల్లి ప్రత్యక్షం. పరుగెత్తు కుంటూ ముందుకు నడిస్తే, వారు పరుగెత్తుకుంటూ మా దరి చేరారు. వారి పాదాలమీద కుప్పగా వాలిపోయాం. కనుదోయిలో అనురాగవాహిని ప్రవహిస్తుండగా, మమ్ము లేవనెత్తి అందులో జలకమాడించారు. మా పక్కనే నిలిచివున్న ఆ తల్లి హస్తాలలో బందీ అయ్యాం...

... ఫలితాలు వచ్చాయి. మామూలు ఫస్టు కాదు. జిల్లాకే ఫస్టు. ఇదంతా సాయి తల్లి చలవే. కుప్పం వెళ్లాక టీచర్లు, హెడ్మాస్టరు మమ్ము అభినందించి, సాయి మహిమను కొనియాడి, పెద్ద ట్రాఫీ బహూకరించారు. నమ్మకమనేది మనకుంటే, గట్టు చేర్చడం స్వామి వంతు. సాయి పలుకు వేదవాక్కు..."

- అదీ పరిస్థితి.

కుమారమ్మకు నిజమైన నిజాయితీ వుంటే బురిడీ ఉద్యమం ఆమెకి నైతికత అందిస్తే ఆమె స్లిప్పులు అందుకొని పేపరు రాయడానికి తిరస్కరించి వుండాలి. ఆ స్లిప్పులనే దైవ కృపగా భావించే హీన స్థితిలో వుండరాదు.

కాని 'బురిడీ' బాబా చేష్టలవల్ల, బోధల వల్ల భక్తులకి అంతకుమించిన నైతిక స్థాయి ఎలా కలుగుతుంది? ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా?

బాబా భక్తులైన తల్లితండ్రులు వేసుకోవాల్సిన ప్రశ్న ఇదే- వాళ్ల తమ పిల్లలు కష్టపడి చదువుకుని పైకి రావాలని కోరుకుంటున్నారా, లేక బాబా భక్తిలో పడి, బాబా తమకి ఎలాగైనా స్లిప్పులు అందించి గట్టెక్కించాలని ఆశించే స్థితిలో వుండాలని కోరుకుంటున్నారా?

వారు కష్టపడి పైకి రావాలనే కోరుకుంటున్నట్లైతే, అదే సక్రమమైన పద్ధతి అని అనుకునేట్టయితే- బురిడీ బాబా అక్రమ చేష్టల్ని, బోధల్ని ఖండించక్కర్లేదా?

## ఆ ఇద్దరు మిత్రులు ... కుక్కలై...చచ్చార్ర!

ఇందాక బాబా 'ప్రేమ'గా నిస్సిగ్గుగా పరీక్షల్లో ఆన్సరు పేపర్లు రాసి ఇచ్చిన- ఇద్దరు మిత్రులు తర్వాత ఏమయ్యారనే ప్రశ్న బహుశా సాధారణంగా ఎవరికీ రాదు.

ఎందుకంటే పుట్టబాబా దయకి, ప్రేమకి 'అంతగా' పాత్రులైనవారికి ఎదురేముంది? వాళ్లకి అంతా మంచే జరుగుతుందని ఎవరైనా ఊహిస్తారు.

కాని నిజానికి ఏం జరిగిందో చూడండి:

"...సురేశ్ బావిలోపడి మరణించాడు. రమేశ్‌కు పిచ్చి పట్టింది. తల్లిదండ్రులు అతనిని బెంగుళూరుకు తీసుకువెళ్ళి పిచ్చాసుపత్రిలో చేర్చారు. కాని, కొంత కాలానికి ఆ పిల్లవాడు కూడా మరణించాడు..."-(సనాతనసారథి, ఏప్రిల్2001,పే.126)

వారిద్దరూ బురిడీబాబా మీద ప్రేమతోటే అలా చచ్చిపోయారని- ఆయన మనని నమ్మించదలుచుకున్నాడు.

సరేకాని తనమీద ప్రేమ ఎక్కువైతే చచ్చిపోవడం, పిచ్చివాళ్ళు కావడం చేయనక్కర్లేదని, జీవించి తనయొక్క 'మహత్తర' ఉద్యమంలో చేరి పనిచేయాలనే స్ఫూర్తిని బురిడీబాబా వారికి ఇవ్వలేకపోయాడు.

ఆన్సర్ పేపర్లు రాసిపెట్టాడు కాని జీవితంలో ఎదురయ్యే సమస్యలకి ఆన్సర్లు వెతకడం నేర్పించలేకపోయాడు.

ఈ మిత్రులిద్దరి విషాదాంతాన్ని గురించి బురిడీ సాహిత్యంలో చాలా చోట్ల ప్రస్తావన వుంది.

సరే, కాస్సేపు ఈ ఇద్దరి గురించి వదిలిపెట్టి, జాక్ అండ్ జిల్ అనబడే రెండు కుక్కల సంగతి చూద్దాం. బురిడీ సాహిత్యమంతటా ఈ కుక్కల ప్రసక్తి వస్తుంది.

మార్చి 1997 నాటి సనాతనసారథి సంచికలో 13.2.1997లో పుట్టబాబా ఇచ్చిన ఉపన్యాసం ప్రచురించారు. ఆ ఉపన్యాసం చివరి భాగంలో ఇలా వుంది.

"**జాక్ అండ్ జిల్ భక్తి విశ్వాసాలు:** ఒక చిన్న కథ చెప్పి నా ప్రసంగాన్ని ముగిస్తాను. పూర్వం నేను పాత మందిరంలో వున్నప్పుడు మిస్టర్ అండ్ మిసెస్ క్రూప్ అనేవారు ఒకనాడు రెండు కుక్క పిల్లలను తెచ్చి, ' స్వామీ! ఇవి మా ఇంటిలో పుట్టినవి. వీటిని స్వామి సన్నిధిలో వుంచాలని మా కోరిక. మేము ఇక్కడ లేకపోయినా ఇవి వుంటే మేము వున్నట్లుగానే భావిస్తాము.' అన్నారు. వారి కోరికను మన్నించి వాటిని నాదగ్గర పెట్టుకున్నాను. వాటికి 'జాక్' మరియు 'జిల్' అని పేరు పెట్టారు. వాటికి స్వామిపట్ల ఎంత ప్రేమ అంటే- నేను పడుకొన్నప్పుడు తల దగ్గర ఒకటి, కాళ్ల దగ్గర ఒకటి వుండేవి.

కొంతకాలం తరువాత ఒకనాడు మైసూరు రాణి వచ్చింది. ఆమెకు మడి ఆచారాలెక్కువ. చాలా చాదస్తం. కుక్కలు అరిచినా భోజనం చేయదు. కనుక ఆమె సెక్రటరీ ముందుగానే వచ్చి 'ఇక్కడ కుక్కలేమైనా వుంటే ఒక గదిలో పెట్టి బీగం వేయండి.' అని చెప్పాడు. ఆ కాలంలో పుట్టపర్తికి రోడ్డు వుండేది కాదు. భక్తులు కర్ణాటక పల్లి వద్దనే కారు ఆపుకుని అక్కడినుండి నడుచుకొని వచ్చేవారు. రాణిగారు కూడా ఆ విధంగానేచేసింది. కర్ణాటకపల్లి ప్రాంతంలో ఎక్కడా హోటల్స్ కూడా వుండేవి కావు. అందుచేత డ్రైవరు భోజనం కోసం సాయంకాలము మందిరానికి రావలసివచ్చింది. అతనితో రాణీగారు, 'నేను ఒక రాత్రి స్వామివారి మందిరంలో నిద్ర చేయాలి. కనుక ఈనాడు నేను రాను.' అని చెప్పింది.

భోజనం చేసిన తర్వాత డ్రైవరొక్కడే తిరిగి కర్ణాటకపల్లెకు బయలుదేరాడు. కాని చీకట్లో అతనికి దోవ తెలియదు. అందుచేత నేను జాక్‌ను దగ్గరకు పిలిచి 'నీవు ఈ డ్రైవరుతోవెళ్ళి తెల్లవారగానే వచ్చేసెయ్.' అని చెప్పాను. జాక్ ముందు నడుస్తూ దారి చూపగా డ్రైవరు దాని వెనుక నడుచుకుంటూ కర్ణాటక పల్లెకు వెళ్లి తన కారులో పడుకున్నాడు. ఈ కుక్క కారు టైరు వద్ద పడుకున్నది. డ్రైవరు తెల్లవారుజామున లేచాడు. అది చలికాలం. రాణీగారు వచ్చేలోగా కారును స్టార్టు చేసి కొంచెం తిప్పాలని ముందుకు నడిపాడు. దాంతో కారు టైరు జాక్ నడుము పైనుండి పోయింది. దాని వెన్నెముక విరిగిపోయింది. ఇంక ఆ బాధను భరించుకోలేక అది అరుచుకుంటూ మందిరానికి బయలు దేరింది. చిత్రావతి ఇసుకలో తన శరీరాన్ని ఈడ్చుకుంటూ వస్తున్నది. బాగా రక్తము కారుతున్నది.

ఆ రోజుల్లో పాత మందిరం గేటు దగ్గర చాకలి సుబ్బన్న వుండేవాడు. అతడు ఆదుర్దాగా లోపలికి వచ్చి 'స్వామీ! మన జాక్ నడుం విరిగి పోయింది.' అని చెప్పడంతో నేను లోపలినుండి బయటకు వచ్చాను. 'జాక్! జాక్!' అని పిలుస్తూ దగ్గరకు వెళ్లాను. అది బాధతో అరుచుకుంటూ వచ్చి నా పాదాలపై పడింది. ప్రాణం వదిలింది. చూశారా దాని కెంత విశ్వాసమో! నా పాదాలపైపడి ప్రాణం వదలాలని ఆ స్థితిలోనూ అది అంత దూరం నుండీ విశ్వాసంతో వచ్చింది. అది మరణించే పూర్వం నన్నే చూస్తూ వున్నది. నేను లోపలినుండి పాలు తెప్పించి దాని నోట్లో పోశాను. అది తన రెండు చేతులనూ నా చేతులపై పెట్టి ప్రాణంవిడిచింది. జాక్ మరణించిందని జిల్ ఆ నాటినుండీ ఆహారం మాని వేసింది. దాంతో కొన్ని దినములకు జిల్‌కూడా మరణించింది. ఇప్పుడు పాత మందిరం వెనుకభాగంలో కనిపించే బృందావనం ఆ రెండిటి సమాధియే.

ఎంత విశ్వాసము కుక్కకు! ఎంత ప్రేమ కుక్కకు! ఈ ప్రేమలో ఏ కించిత్ భాగమైనా మానవునిలో వుంటే ఎంత ధన్యుడయ్యేవాడు! కాని ఈ నాడిట్టి విశ్వాసమే లేదు. అవసరం వచ్చినప్పుడు విశ్వాసం, అవసరం తీరగానే మర్చిపోవడం! ఆశలను మాత్రం పెంచుకుంటూ పోతున్నారు కాని, స్వామి ఆశయాలను ఎవరు పాటిస్తున్నారు? ఆశయాలను వదిలి ఆశలు మాత్రమే నెరవేరాలంటే ఎలా సాధ్యమవుతుంది? మీరు నేర్చుకోవలసింది ఏమిటంటే ఎట్టి కష్టములెదురైనా భగవత్ ప్రేమను మాత్రం దూరం చేసుకోకూడదు. ఒక్క భగవత్ప్రేమను గట్టిగా పట్టుకుంటే పర్వతాలవంటి కష్టాలైనా మంచువలె మాయమైపోతాయి..." - పే.67, 68, 69

సాధారణంగా రాణులు, జమిందార్లు వచ్చినప్పుడు పుట్టబాబా ఆశ్రమంలో తన రూల్స్ కాకుండా వాళ్ల రూల్సే పాటించేవాడు. మామూలు భక్తుడెవరైనా వచ్చి 'ఈ కుక్క ఇక్కడ వుండకూడదు' అంటే బాబా ఒప్పుకోడు. కాని అదే రాణులు, జమీందార్లు చెబితే ఒప్పుకుంటాడు. బాబా రాణీగారిచ్చే డబ్బుకి కక్కుర్తి పడి ఆవిడ ఆజ్ఞ పాటించడంవల్లే జాక్ అనే కుక్క అన్యాయంగా చచ్చింది. ఆయన ఆ విషయం మాత్రం ఎక్కడా చెప్పడు.

ఇంత సుదీర్ఘమైన ఈ కుక్కల కథ ఇక్కడ ఎందుకు ఇచ్చానని అనుకుంటున్నారా? కారణం వుంది. నిజానికి ఈ కథ బురిడీ సాహిత్యంలో అనేక చోట్ల కనిపిస్తుంది.

ఏప్రిల్, 2001నాటి సనాతన సారథి సంచికలో 126, 127 పేజీల్లో ఇదే కథ మళ్ళీ ఇచ్చారు చూడండి:

"...నా దగ్గర లిల్లీ, బిల్లీ అనే కుక్కలుండేవి. వాటికి జాక్, జిల్ అనే రెండు బిడ్డలు పుట్టాయి. వారే చనిపోయిన రమేశ్,







**అంకితం :** సత్యమేదైవమని, ఆ సత్యం కోసం ఒక్కళ్ళూ నిలబడాల్సి వచ్చినా నిలబడాలని, అవసరమైతే అందుకు యావత్ ప్రపంచాన్నీ ఒంటరిగా ఎదిరించాలనీ చెప్పిన గాంధీ ఆదర్శం,-కర్మలపైనే కానీ ఫలితంపై ఆసక్తి వలదని, సిద్ధి, అసిద్ధులపైన సమభావంతో యోగివై కర్తవ్యాన్ని నిర్వహించమనే భగవద్గీతలోని శ్రీకృష్ణుడి ఆదేశం,-వెర్రి నమ్మకాలు, మూఢ విశ్వాసాలతో సత్కార్యాలు సాధ్యం కావనీ, బురదతో బురదను కడగలేమని, ప్రజల్ని స్వతంత్రులని చేయమని, వాళ్ళ సంకెళ్ళను ఛేదించమనే వివేకానందుడి ఉపదేశం,-ఈ ప్రయత్నానికి ప్రేరణ, స్ఫూర్తి. ఈ మహనీయులు ముగ్గురికీ ఈ ధారావాహికని అంకితం చేస్తున్నాను. - రచయిత



## పుట్టబాబా ఉవాచ:14

### డాగ్ - గాడ్

"రోజూ మీ ఇంటి దగ్గర నువ్వు ఒక కుక్కకి అన్నం పెడుతున్నావనుకో. ఇలా చేయగా చేయగా కొంతకాలానికి ఆ కుక్క ప్రతిరోజు అదే టైమ్‌కి అదే ప్రదేశానికి వచ్చి చేరుతుంది. నియమంతో నువ్వు ఒక పని చేస్తే దానికి డాగ్(కుక్క) స్పందించినపుడు ఇంక గాడ్ (భగవంతుడు) స్పందించడా? తప్పక అనుగ్రహం లభిస్తుంది."

- సనాతన సారథి, మార్చి 1997,పే.73

సురేశ్ నన్ను వదిలి పోలేక కుక్కలుగానైనా పుట్టి నా దగ్గర వుండాలని వచ్చారు. నేను అప్పుడు పాత మందిరంలో వున్నాను. కరణం సుబ్బమ్మ వేయించిన గడ్డి కొట్టంలో పడుకొనేవాడిని. అప్పుడు అవి నా కాళ్లదగ్గర ఒకటి, తలదగ్గర ఒకటి పడుకునేవి. నేనేమాత్రం కదిలినా తక్షణమే అవి లేచేవి.

ఒకనాడు మైసూరురాణి స్వామిదర్శనం కోసం వచ్చింది. ఆమె గొప్ప భక్తురాలు. ఆ రోజుల్లో ఏటి అవతల వున్న కర్ణాటక నాగేపల్లివద్ద కారు దిగి పుట్టపర్తికి నడుచుకుంటూ రావలిసివచ్చేది. ఇంకొకరి అడుగులో అడుగుపెట్టడం ఆమెకిష్టం లేదు. అందుచేత ఆమె తన వెంట ఒక వ్యానును రెండు చెక్కలు తీసుకువచ్చింది. ముందు రెండు చెక్కలు పరచడం వాటిపై నడవడం- ఈ రీతిగా ఆమె మందిరానికి వచ్చింది: స్వామి దర్శనం చేసుకొని చాలా ఆనందించింది. భోజనం చేసిన తర్వాత డ్రైవరు కారు వద్దకు తిరిగి వెళ్లాలి. కాని అతను తనకు త్రోవ తెలియదన్నాడు. అప్పటికి చీకటి పడింది. దారిలో విద్యుద్దీపాలు లేవు. పుట్టపర్తి ఈ నాడు పెద్ద పట్టణంగా మారిపోయిందిగాని, అరవై సంవత్సరాలకు పూర్వం ఇదొక కుగ్రామం. ఈ కుగ్రామంలోనే ఈనాడు ఎయిర్‌పోర్టు, యూనివర్శిటీ, రైల్వే స్టేషను ఏర్పడినాయి. కాని, ఆనాడు కనీసం సరి అయిన రోడ్లు కూడా లేవు. నేను జాక్‌ని పిలిచి, డ్రైవర్‌కి సహాయంగా వెళ్లమన్నాను. అది ముందు నడుస్తుంటే డ్రైవరు దానిననుసరించాడు. ఇద్దరూ కారు వద్దకు వెళ్ళారు. అతడు కారులో పడుకున్నాడు. జాక్ కారు కింద పడుకుంది. తెల్లవారు జామున రాణిగారు వస్తారని డ్రైవరు కారును స్టార్ట్ చేసి కాస్త ముందుకు నడిపాడు. కింద పడుకున్న జాక్ నడుం పైనుండి టైరు పోయింది. అక్కడినుండి జాక్ ఏడ్చుకుంటూ, ఇసుకలో తన దేహాన్ని ఈడ్చుకుంటూ మందిరానికి బయలుదేరింది. నా దగ్గర చాకలి సుబ్బన్న వుండేవాడు. అతడు వచ్చి 'స్వామీ! ఎందుకోగాని జాక్ చాలా గట్టిగా అరుచుకుంటూ వస్తోంది.' అన్నాడు. 'నాకు తెలుసులే.' అంటూ గేటు దగ్గరికి వెళ్ళాను. జాక్ బాధతో అరుచుకుంటూ వచ్చి నా పాదాలపై పడి ప్రాణం వదిలింది. మరికొన్ని దినములకు జిల్ కూడా మరణించింది. వాటిని పాత మందిరం వెనకమున్న స్థలంలో సమాధి చేయించి, అక్కడొక బృందావనం కట్టించి, తులసి మొక్క పెట్టించాను. మొన్నటివరకు ఆ బృందావనం వుండేది. కళ్యాణమంటపం యొక్క పునర్నిర్మాణం జరిగినప్పుడు దాన్ని తొలగించారు. ఆ సమయంలో నేను బెంగుళూరులో వున్నాను. ఈ విధంగా రమేశ్, సురేశ్‌లు మరణించిన తర్వాత కుక్కలుగా జన్మించి, నా దగ్గరే వుండి, చివరికి నాలోనే ఐక్యమయ్యారు. నమ్మినవారికి ఏలోటూ వుండదు..."

ఇంతకుముందు మిస్టర్ అండ్ మిసెస్ క్రూక్ అనే వారు తనకి తెచ్చిచ్చిన కుక్క పిల్లలు జాక్ అండ్ జిల్ అని మార్చి 1997 సంచికలో చెప్పినవాడు- ఇప్పుడు ఏప్రిల్, 2001 సంచికలో తన దగ్గర వున్న లిల్లీ, బిల్లీ అనే కుక్కలకే జాక్ అండ్ జిల్ పుట్టాయని మార్చాడు.

నిజం చెప్పాలనే నిజాయితీ, అవసరం ఏనాడూ బురిడీ బాబాకి లేవు. 'చెప్పేవాడికి వినేవాడు లోకువ' అని వారి అభిప్రాయం. అడిగే వాడు ఎవ్వడూ లేడనే ధైర్యంతో, ఏది చెప్పినా నడుస్తుందనే అలుసుతో, నోటికొచ్చిన అబద్దాలు చెప్పడం బురిడీ బాబాకి అలవాటే. అందుకు ఈ కథల్లో తేడాలే బలమైన సాక్ష్యం.

ఈ కుక్కలకథ బురిడీ సాహిత్యంలో చాలాచోట్లవచ్చింది.

ఐతే వివేకానందుడు షిరిడీసాయి వంటి మహనీయుల నించి మొదలు- కన్న తల్లితండ్రుల వరకు ఏదో ఒకరకంగా అవమానించి, తక్కువ చేసి మాట్లాడకపోతే బురిడీ బాబా శాడిస్టు ప్రవృత్తికి తృప్తి రాదు కదా!

అందుచేత విషాద మరణం పొందిన ఒకనాటి మిత్రులే... కుక్కలుగా తనవద్ద పుట్టి... తరించి, చచ్చారని చెప్పుకుని తన శాడిజం చూపించుకున్నాడు.

విద్యార్థి దశలో బాబా ప్రదర్శించిన మరికొన్ని బురిడీ సైల్ చేష్టల్ని గురించి రాబోయే సంచికల్లో చర్చించుకుందాం.

- (ఇంకా వుంది)

## పెట్రేగిన మతఛాందసం

# బంగ్లా హిందువుల కంట రక్త కన్నీరు

దాదాపు పాతికమంది వున్న గుంపొకటి, ఇంటి మీదకి వొస్తున్నప్పుడు - ఆ దాడికి కారణమేమిటో ఆ కుటుంబానికి అర్థం కాలేదు. వారంతా నానా కారుకూతలూ కూస్తూ ఇంట్లో వస్తువులన్నింటినీ నాశనం చేస్తున్నప్పుడు కూడా తాము చేసిన నేరం ఏమిటో వారు తెలుసుకోలేకపోయారు. అక్కడితో ఆగని ఆ అల్లరిమూక నిండా పదిహేనేళ్ళు లేని పూర్ణిమాశీల్‌ని దొరకబుచ్చుకుంది. పెరటివెనక్కి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు... దారుణంగా మానభంగం చేశారు. కళ్లముందే కన్నకూతురిపై జరుగుతున్న అత్యాచారాన్ని చూసి పూర్ణిమ తల్లి బాషణరాణి కన్నీరుమున్నీరయింది. సహాయం కోసం ఆమె పెట్టిన కేకలు గాలిలో కలిసిపోయాయి.

ఈ సంఘటన, అక్టోబరు8న బంగ్లాదేశ్‌లోని ఉత్తర సెరాజ్‌గంజ్ జిల్లా మారుమూల గ్రామమైన పూర్బాదేలువాల్ లో జరిగింది. ఈ దాడికీ, అత్యాచారానికీ ఒక్కటే కారణం...బాధితులు హిందువులు కావడమే!

ఒక కోటీ ముప్పయ్ లక్షల బంగ్లాదేశ్ జనాభాలో పన్నెండు శాతం వున్న హిందువుల ప్రస్తుత పరిస్థితికి అద్దం పట్టే అనేకానేక సంఘటనల్లో ఇది ఒకటి మాత్రమే.

### బతకాలంటే... భారత్‌కు పారిపోండి

అక్టోబరు ఒకటిన జరిగిన ఎన్నికలలో ఖలీదాజియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) గెలిచిన మరుక్షణం నుంచే దేశవ్యాపితంగా హిందువులపై అత్యాచారాలు, దాడులు, లూటీలు విచ్చలవిడిగా మొదలయ్యాయి. కొత్త ప్రభుత్వం అక్టోబరు పదోతారీఖున ఏర్పడింది. మధ్యలో వున్న పదిరోజుల సంధికాలాన్ని అదనుగా తీసుకుని చెలరేగిపోయారు. అప్పటివరకూ అధికారంలో వున్న అవామీలీగ్‌మీద కత్తులు నూరుతూ కక్షసాధింపుకి దిగారు. హిందువుల అనుకూల పార్టీగా ముద్ర వున్న అవామీపైన, పగ తీర్చుకోవడానికి హిందువులు అలుసుగా కనిపించారు. 'బతకాలంటే బంగ్లాదేశ్ వదిలి, భారతదేశం పారిపోండి' అని హెచ్చరిస్తూ భయోత్పాతం సృష్టించారు. మొత్తం 15 వేల మంది హిందువులు పుట్టినగడ్డనూ, ఆస్తిపాస్తులనూ వదిలిపెట్టి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పశ్చిమబెంగాల్ పారిపోయివచ్చారంటే దాడులు ఏ స్థాయిలో జరిగివుంటాయో ఊహించుకోవచ్చు.




నలభై ఐదేళ్ల బిధుభూషణ్‌దాస్ కొన్ని రోజుల కిందటి వరకూ ఒక స్టోరు యజమాని. పదిహేనుమందికి ఉపాధి కల్పించాడు. కానీ ఇప్పుడతడు పట్టెడన్నం కోసం రోజుకూలీగా పొలం పని

> హిందువుల అనుకూలపార్టీగా ముద్ర వున్న అవామీపైన, పగ తీర్చుకోవడానికి హిందువులు అలుసుగా కనిపించారు. 'బతకాలంటే బంగ్లాదేశ్ వదిలి, భారతదేశం పారిపోండి' అని హెచ్చరిస్తూ భయోత్పాతం సృష్టించారు. మొత్తం 15 వేల మంది హిందువులు పుట్టినగడ్డనూ, ఆస్తిపాస్తులనూ వదిలిపెట్టి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పశ్చిమబెంగాల్ పారిపోయి వచ్చారంటే దాడులు ఏ స్థాయిలో జరిగివుంటాయో ఊహించుకోవచ్చు.

చేసుకోవలసిన దుస్థితిలో పడ్డాడు. అక్టోబరు 8న అతడిపైన దాడి జరిగింది. దీంతో అతడు బతికుంటే బలుసాకు తినొచ్చు అని అన్నీ వదిలేసి భారతదేశం పారిపోయివచ్చాడు. అక్టోబరు నెలలో ఇటువంటి సంఘటనలు ఎన్నెన్నో!

### పసిపిల్లలపై సైతం...

నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకోవలసిన సంఘటన భోలా పట్టణంలో జరిగింది. అక్కచెల్లెళ్లయిన ఎనిమిదేళ్ల సుషమ, ఏడేళ్ల సులేఖలను కొందరు దుండగులు తండ్రి కళ్ల ముందే దారుణంగా చెరిచారు. ప్రతిఘటించిన పాపానికి ఆ తండ్రిని పీక కోసి చంపేశారు. ఘోరమైన అత్యాచారానికి సుషమ బలి అయిపోయింది. సులేఖ మాత్రం ప్రాణాలతో ఆసుపత్రిలోనే ఇంకా పడివుంది. తృష్ణ అనే యువతి తమ గ్రామంలో జరిగిన అనేక రేప్ ఉదంతాలను వెల్లడిస్తూ 'యువతులు, మధ్యవయస్కులైన మహిళలు అల్లరిమూకల కాళ్లపైన పడ్డా వారు కనికరించలేదు' అంటోంది. తృష్ణ మరో యువతితో కలిసి సరిహద్దుల్లో వున్న ఇరుదేశాల సైనికులకూ పదివేల రూపాయల లంచమిచ్చి భారత్‌లోకి అడుగుపెట్టింది. తృష్ణది పాతికమంది సభ్యులున్న ఉమ్మడి కుటుంబం. ఈ దాడుల్లో చెల్లాచెదురైన వారంతా ఎక్కడున్నారో ఎలా వున్నారో తెలీక ఆమె తల్లడిల్లుతోంది.

నలభైఏళ్ల షెఫాలీదాస్ అనే మహిళ కూడా రేప్‌కు గురై, తన ముగ్గురు పిల్లలతో భారతదేశానికి వలసవచ్చింది. 'హిందూ మహిళలను తరచూ పొరుగిళ్లవారే రేప్ చేయడం చూశాను. మామూలు సందర్భాలలో సైతం ముస్లింలు, చివరికి చిన్నపిల్లలు కూడా మమ్మల్ని దూషించటం, వేధించటం సర్వసాధారణం' అని చెబుతోంది.

### ఎటువంటి హక్కులూ లేవు

ఇంత దారుణంగా అత్యాచారాలు జరుగుతున్నా పోలీసులు పట్టనట్టే వుండిపోయారని మరొక శరణార్థి సునీల్‌డే ఆరోపిస్తున్నాడు. కొత్తగా ఎంపికైన ఒకరిద్దరు బిఎన్‌పి, జమాత్ ఎంపీలు మరింత ముందుకెళ్లి 'హిందువులకు ఇక్కడ ఎటువంటి హక్కులూ లేవు. వారు ఆస్తుల్ని అమ్మాలన్నా, బ్యాంకు లావాదేవీలు జరపాలన్నా మా అనుమతితోనే జరగాలి' అంటూ అగ్నికి మరింత ఆజ్యం పోశారు. భోలా ఎం.పి 'కుర్రాళ్లు ఏదో సరదాపడినట్టున్నారు, పోలీసులు కఠినంగా వ్యవహరించవద్దు' అని కోరాడు. ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధే రేప్‌లను సరదాలుగా వర్ణించాడంటే, అక్కడ మతవిద్వేషం ఏ స్థాయిలో వుందో అర్థమవుతుంది.




హిందువులు తీవ్రమైన అభద్రతలోకి వెళుతున్న సూచనలు ఎన్నికలరోజునే పొడచూపాయి. రూబెల్‌దాస్ ఆ రోజు ఓటింగ్‌కి వెళ్లడానికి భయపడి మానుకుందామని అనుకున్నాడు. కానీ ఆసక్తి కొద్దీ వెళ్లాడు. తీరాచూస్తే పోలీసులు క్యూలో వున్న హిందూ మహిళలను పక్కకు తప్పించి ఓటు చేయకుండా నిరోధిస్తున్నారు. మరోవైపు బురాఖా ధరించివచ్చిన మహిళలు మళ్లీమళ్లీ ఓటు వేయడానికి అనుకూలంగా, పై అధికారులు వారి వేళ్లకి సిరా చుక్క వేయకపోవడం కూడా గమనించిన దాస్‌కి ఆశ్చర్యమూ కోపమూ కలిగాయి. 'మామూలు రోజుల్లో కూడా ఏదైనా వారు ఏదైనా ప్రదర్శన తీస్తున్నప్పుడు, దారిలో హిందువుల ఇళ్ల మీద రాళ్లు రువ్వటం, బతకాలంటే బంగ్లాదేశ్ విడిచి భారతదేశం పొండి అంటూ రెచ్చగొట్టే స్లోగన్లు ఇవ్వటం ఎన్నోసార్లు చూశాను' అంటున్నాడు దాస్.




ఈసారి ఎన్నికల్లో బిఎన్‌పి విజయం ఖాయం అని తెలిసిపోయిన మరుక్షణమే మతకల్లోలాలు చెలరేగాయి. దేశంలో మొత్తం 64 జిల్లాలుండగా, అందులో 40 జిల్లాలలో హిందువుల మీద దాడులు జరిగాయి. అక్టోబరు 3 నుంచి 8 వరకూ మధ్య వున్న ఐదురోజుల వ్యవధిలోనే 57 సంఘటనలు జరిగాయని బి.యు.యు.ఎస్ (బంగ్లాదేశ్ ఉద్బస్తు ఉన్నయన్ సంస్థ) బంగ్లాదేశ్ పత్రికలలో వచ్చిన వార్తల ఆధారంగానే చెబుతోంది.

### నిర్లక్ష్యంలో శరణార్థులు

బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థుల కోసం ఏర్పాటయిన ఈ సంస్థకి బిమల్ మజుందార్ ఒక కార్యవర్గసభ్యుడు. ఆయన చాలా ఏళ్లకిందటే శరణార్థిగా పశ్చిమబెంగాల్ వచ్చినవాడు. కొత్తగా వస్తున్న శరణార్థుల గురించి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆగ్రహం వ్యక్తం చేస్తూ - 'శరణార్థులను పరాయి దేశస్తులుగా చూస్తూ అక్రమంగా వలసవచ్చారంటూ అరెస్టు చేస్తాయి. బంగ్లాదేశ్‌లో వారు మానప్రాణాల్ని పోగొట్టుకుని ఇక్కడకు చేరుకుంటే, వారిని కేవలం హిందువులైన పాపానికి అరెస్టు చేస్తున్నారు. రాజకీయనాయకులు, బంగ్లాదేశ్ నుంచి తరలివచ్చిన ముస్లింలకైతే రేషన్‌కార్డుల దగ్గర్నుంచి అన్నీ సమకూర్చి వారు స్థిరపడటానికి చేయాల్సిందంతా చేస్తారు. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడిన తర్వాత శరణార్థులుగా వచ్చిన మాబోటి వారికి మాత్రం పౌరసత్వం కానీ, ఇతర ఉపాధి అవకాశాలు కానీ ఇవ్వడానికి తిరస్కరిస్తున్నారు. ఇక స్థానిక మేధావులు ఆఫ్ఘనిస్తాన్ కోసం ప్రదర్శనలు చేస్తారు కానీ, పక్కనే వున్న మాలాంటి వేలాది శరణార్థుల గురించి ఒక్కమాట కూడా మాట్లాడరు' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### మనుషులుగా చూడరు

మరోవైపున జరిగిన దాడుల్ని నిరసిస్తూ బంగ్లాదేశ్‌లో అక్టోబరు 24న హిందూ నాయకులంతా ఒక రోజంతా నిరశనదీక్ష చేపట్టారు. 'మేము ఈ దేశంలో ముస్లింల మాదిరిగానే గౌరవనీయులైన పౌరులుగా జీవించాలని కోరుకుంటున్నాం' అని ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఒక పాత్రికేయుడు చెప్పాడు. 'హిందువుల్ని ఇక్కడ మనుషులుగా చూడరు. అందరికీ, ముఖ్యంగా మైనారిటీలకి సమానహక్కులున్న దేశంలో ఇలా జరుగుతున్నదంటే - ఒక జాతిగా ఏర్పడటంలో ఇది మా వైఫల్యం' అని ఢాకా యూనివర్సిటీ చరిత్ర ప్రొఫెసర్ ముంతాజిర్ మామూన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎవరు అధికారంలో వున్నా హిందువులు ఇబ్బందులు పడుతూనే వున్నారు. అవామీలీగ్ అధికారంలో వున్నప్పుడు కూడా వాళ్లేమీ సుఖంగా లేరు' అని మరో ప్రొఫెసర్ సెరాజుల్ ఇస్లాం చౌధురి చెబుతున్నారు. మొత్తమ్మీద గతంలోనూ ఇప్పుడూ కూడా, దాడుల వెనుక హిందువుల ఆస్తులను కాజేసే ఉద్దేశ్యమే ప్రధానంగా కనిపిస్తున్నదని విశ్లేషకుల విశ్లేషణ.

('ఔట్‌లుక్' సౌజన్యంతో)

# చిట్టి కథ

## డ్రోండెరీ చెవులు

డ్రోండెరీకి తన చెవులంటే బొత్తిగా ఇష్టం లేదు. తనకి కూడా ఎద్దుకి ఉన్నట్లుగా మాంచి కొమ్ములు ఉంటే ఎంతో బావుండునని అది అనుకుంది. ఇంక ఉండబట్టలేక డ్రోండెరీ ప్రకృతి మాతను శరణు వేడింది. డ్రోండెరీ కోరిక విని ప్రకృతి మాత నిర్ఘాంతపోయింది.

''ఏమిటీ? నీకు కొమ్ములు కావాలా? ఇప్పటికే నీకు ఎంతో ఎత్తుగా ఉండే శరీరం ఇచ్చాను. ఎడారులని దాటే శక్తి ఇచ్చాను. ఇంకా కొమ్ములు కూడా ఎందుకూ?'' అంది.

డ్రోండెరీ తన పట్టు వదల లేదు. ప్రకృతి మాత కాసేపు ఆలోచించింది. ఆ తర్వాత ఆమె డ్రోండెరీ చెవులని పట్టుకుని నలిపి చిన్నవిగా చేసింది.

డ్రోండెరీ ఇంటికి వచ్చి అద్దంలో చూసుకుని, ''కొమ్ములు లేకపోతే ఏం? నా చెవులు చిన్నవిగా కొత్తరకంగా ఉన్నాయిగా!'' అనుకుని తృప్తి పడింది.








పిల్లలూ! చుక్కలు కలిపితే, చక్కని బొమ్మ మీకోసం సిద్ధంగా ఉంది.







పాపం కోడిపిల్ల తప్పిపోయింది! తల్లి దగ్గరికి చేర్చగలరా?

## జగదీష్‌చంద్రబోస్

మొక్కలకి కూడా మనుషులకిలాగే బాధా, భయమూ ఉంటాయని మొట్టమొదటగా కనుగొన్నారు జగదీష్ చంద్రబోస్. ఆయన దాదాపు నూట నలభై మూడు సంవత్సరాల క్రితం, అంటే 1858లో పుట్టారు. ఆయన చిన్నప్పుడు ఇండియాలో చదువుకుని ఆ తర్వాత మెడిసిన్ చదవడానికిగానూ ఇంగ్లాండ్‌కి వెళ్ళారు. తిరిగివచ్చాక, బోస్ బాబు కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజిలో ఫిజిక్స్ చెప్పడానికిగానూ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆ కాలేజీలో బాత్‌రూం పక్కన ఉన్న చిన్న స్థలాన్నే ఆయన తన లేబొరేటరీగా మార్చుకున్నారు. 1895లో బోస్ ఎలెక్ట్రోమాగ్నెటిక్ తరంగాల ప్రభావాన్ని విజయవంతంగా ప్రదర్శించి నిరూపించారు. ఆ ప్రదర్శనలో భాగంగా ఎక్కడో ఉన్న బెల్లుని రిమోట్ కంట్రోల్ ద్వారా మోగించడమూ, గన్ పౌడర్‌ని పేలేలా చేయడమూ జరిగింది. మార్కోనీ చేసిన వైర్‌లెస్ సిగ్నలింగ్ ప్రయోగం 1897 మే నెల దాకా సక్సెస్ కాలేదు. వీళ్ళందరి కంటే రెండేళ్ళ ముందరే జగదీష్ చంద్రబోస్ తన ప్రయోగాలకు ఒక రూపం తేవడం గమనార్హం! పంతొమ్మిదో శతాబ్దం చివరి భాగానికొచ్చేసరికి, జగదీష్ చంద్రబోస్‌కి ఈ ఎలెక్ట్రో మాగ్నెటిక్ తరంగాల పట్ల ఆసక్తి తగ్గిపోయింది. ఆయన దృష్టి మొక్కల మీదికి మళ్ళింది. మొక్కలకి కూడా బాధ, భయం లాంటి ఫీలింగ్స్ ఉంటాయని సోదాహరణంగా రుజువు చేశారు జగదీష్ చంద్ర బోస్. 1917లో బోస్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించ బడింది.



1920లో ఆయన ప్రతిష్టాత్మకమైన రాయల్ సొసైటీకి ఎన్నుకోబడ్డారు. మొక్కల విషయంలో అత్యద్భుతం అనిపించే విషయాలను వెలుగులోకి తెచ్చిన జగదీష్ చంద్రబోస్ 1937లో, తన డెబ్బయ్ తొమ్మిదో ఏట మరణించారు.

స్వర్గం లాంటిదే! అడ్వెంచర్లు కోరుకునే టూరిస్టులు చాలా మంది ఇక్కడికి వస్తూ ఉంటారు. ఇక్కడి స్థానిక ప్రజలు చాలా స్నేహశీలురు. నిరాడంబరమైన జీవితం గడిపేస్తూ, ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ బతకాలని వాళ్ళ కోరిక. వాళ్ళ మాతృభాష బిస్లాం అయినా ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు కూడా ధారాళంగా వినబడుతూనే ఉంటాయి. ముఖ్య ద్వీపమైన ఎఫేట్‌లో ఉంది రాజధాని పోర్ట్‌విలా. అందమైన చిన్న నగరం అది. చాలా కాలం నుంచి బట్టీ ఆ నగరం మీద ఫ్రెంచి వారి ప్రభావం ఉన్నాకూడా అది అనేకమైన సంస్కృతులకి కూడలి. అక్కడ డ్యూటీ ఫ్రీ షాపింగ్ చేయవచ్చును. అంటే, కొన్ని వస్తువుల మీద పన్ను ఉండదు. అక్కడి ప్రజలకి తమ ఆచార వ్యవహారాలంటే ఎంతో గౌరవం. పోలీనేసియాలోని ఈస్టర్ ఐలాండ్ వాసులు చెక్కేటట్లుగా, వీళ్ళు కూడా చెక్కతో చిత్రమైన ఆకారాలని చెక్కుతారు. అది అక్కడి ఆకర్షణలలో ఒకటి.





# దునియా...

## 'నాసిక'విత్వం

హృదయంలో ఉప్పొంగే కవిత్వానికి చేతులతోనే అక్షరరూపం ఇవ్వాలని రూలేమీ లేదు. కలకత్తా కవి తపన్‌డే అయితే ముక్కుతోనూ, చెవులతోనూ కూడా కవితలు రాసిపడేస్తాడు. ముప్పయేళ్ల తపన్ చరిత్ర విద్యార్థి. కవిత్వంలో ప్రవేశం వుంది. ఈ ప్రతిభాశాలి రెండు చేతులతోను, చెవితోనూ ఏకకాలంలో భిన్న భాషల్లో కవిత్వం రాసేస్తాడు. తపన్‌కి గిన్నిస్‌బుక్ రికార్డుల్లో ఎక్కాలన్న తపన. తన (క)విన్యాసాలన్నీ చూసి ఎక్కించకపోతారా అన్న ఆశ. అసలే కవి, ఆ పైన రికార్డు పిచ్చి. ఇక క్రియేటివిటీకి లోటేమిటి?



## భలేమంచి హార్స్‌బేరము



◆ ఏమిటిదీ?

వేరే చెప్పాలా? కట్టు విప్పితే కదం తొక్కే జవనాశ్వం కదూ!

◆ పేరేమిటో?

బల్లాడ్ ఆఫ్ ట్రాట్‌స్కీ

◆ దీని ఖరీదు....?

వందలూ, వేలనుకున్నారా? ఏకంగా 4.1 కోట్లు పోసి ఈ మధ్యే కొనుక్కున్నాడు ఓ ఆసామి.

◆ మై గాడ్.... ఎక్కడో?

లండన్‌లోని క్రిస్టీస్ వేలం పాటలో

◆ అదేమిటీ... అది కళాఖండాల్ని వేలం వేసే చోటు కదూ!

అవును... ఎవరు కాదన్నారు? ఈ గుర్రం కూడా ఓ అద్భుత కళాఖండమే కదా!

◆ అంతా గజిబిజిగా వుంది. ఇది నిజం గుర్రం కాదా?

మాంఛి జబ్బపుష్టితో నిగనిగ లాడుతున్న దీన్ని చూస్తే అలాగే అనుకుంటాం మరి! ఇదో కొయ్యగుర్రమని చెబితేగాని తెలియడం లేదు కదూ!

◆ ఎవరబ్బా దీన్ని ఇంత సజీవంగా చెక్కిందీ?

మారిజియో కాటెలాన్ అనే ఓ ఇటాలియన్ ఆర్టిస్టు.

## కింగ్‌కోబ్రా... గుండె గాబరా

కింగ్ కోబ్రా... అయ్యబాబోయ్...! పేరు వింటేనే ఒంట్లో దడపుడుతుంది. అలాంటిది ఎదురుపడి బుస్సుమంటే- భయంతో బిక్కచచ్చిపోమూ? మరి- విషపు కోరల కోబ్రాని ఐస్‌క్రీమ్‌లా నోట్లో వుంచుకొని డాన్సులు చేయడానికీ-

నిలువెత్తు పాముని కండువాలా మెడచుట్టూ చుట్టుకొని- బండిమీద చక్కర్లు కొట్టడానికీ ఎన్ని గుండెలుండాలి?

వాళ్ల మానాన వాళ్లు చాలా క్యాజువల్‌గానే చేసుకుపోతారుకాని- చూసే వాళ్లకి మాత్రం పై ప్రాణాలు పైనే పోతాయ్! ఇలాంటి దృశ్యాలు థాయ్‌లాండ్‌లో 'సర్ప'సాధారణమే! అక్కడి బాన్‌ఖోక్ ప్రాంతంలో 'కింగ్ కోబ్రా క్లబ్'లు అనేకం వున్నాయి. ఈ క్లబ్బుల్లో ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి ప్రమాదకరమైన డాన్సులు చేసే స్త్రీలు ఎందరో కనిపిస్తారు. వీళ్ల ఫీట్లన్నీ నాలుగు రాళ్ల కోసమే. ఈ ప్రాంతంలో చాలా కాలంగా కోబ్రాలను చంపి, వండుకుతినే అలవాటుంది. కాని ఈ మధ్య అడవులు తరిగిపోయి,కేవలం వరిసాగుమీదే ఆధారపడాల్సివచ్చేసరికి వారి ఆదాయ వనరులు తగ్గిపోయాయి. అందుకే వారు కోబ్రాలను చంపి తినకుండా, ఆ పూట గడిచేందుకు ఇలాంటి ఒళ్లు గగుర్పొడిచే రిస్కీ ఫీట్లు చేస్తున్నారు.







## రంగీలా పందులు

ఈ ఆకతాయి పందులు ఏ రంగు డబ్బాలోనో మూతులు ముంచే వుంటాయి...వీటి కళ్లకీ, చెవులకీ మెరిసే రంగుల్ని పొందిగ్గా ఎవరో పూసే వుంటారు... చూస్తే అలాగే వుంది కదూ! కాని అది నిజం కాదు. సైంటిస్టులు వాటిని అలా పుట్టించారు. విశ్వామిత్రుడు ఏం సృష్టించాడో తెలీదు కాని మన సైంటిస్టుల సృష్టిమాత్రం- ఆ కథల్ని తలదన్నేట్టుగా వుంది. ఇంతకీ సంగతేమిటంటే - ఒకే కాన్పులో పుట్టిన నాలుగు పంది కూనల్ని అచ్చు రంగుల బొమ్మల్లా పుట్టించారు. కలర్‌ఫుల్‌గా వుండే జెల్లీఫిష్ జీన్‌ని, తల్లివరాహం జీన్‌తో కలిపి ఈ పంది కూనలకు రంగుల్ని తెప్పించారు. క్లోనింగ్‌తో ఆ మధ్య 'డాలీ' గొర్రె పిల్లని సృష్టించినట్టే- ఈ కూనల్నీ పుట్టించారు. వేర్వేరు జంతువుల జీన్స్‌ని ఇలా జతచేసి ఇంతకంటే అద్భుతాలెన్నో సృష్టిస్తామంటున్నారు మిస్సోరీ యూనివర్శిటీ సైంటిస్టులు.

## పెన్‌నిధి

చేత్తో పట్టుకుని చూపిస్తున్నది ఓ మెగా పెన్ను అనే సంగతి తెలుస్తూనే ఉంది. కానీ ఆ కంటి కొసపై నిగనిగలాడే తుమ్మెదలాగా వాలిందేమిటి... అదీ ఓ పెన్నే... దాని సైజు రెండంగుళాలు. ఎంచక్కా రాస్తుంది. కృష్ణా జిల్లాకు చెందిన యార్లగడ్డ వెంకట మోహన్ దగ్గర 'కలం ఖజానా'యే ఉంది. ఈ ఖజానాలో ఇలాంటి రకరకాల సైజులు, రంగులు, షేడ్‌లలో... వందో రెండొందలో కాదు ఏకంగా పన్నెండు వందలకు పైనే బాల్‌పాయింట్ పెన్నులున్నాయి. కొత్తగా ఏ పెన్ వచ్చినా చటుక్కున తన ఖజానాలో కలిపేయడం ఆయనకు హాబీ. 1985 నుంచి మొదలైన ఈ హాబీయే ఆయనను 'అత్యధిక పెన్నుల్ని సేకరించిన వ్యక్తి'గా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి చేర్చింది.



## ఈ ఫాదర్ 'కళం'కితుడా?

శిల్పకారులు స్త్రీలను మోడల్స్‌గా తీసుకుని నగ్న శిల్పాలు తయారు చేయడం సర్వసాధారణమే. ఇక్కడ ఆ పనిచేస్తున్న శిల్పి ఒక క్రైస్తవ ఫాదర్ కూడా అయివుండటంతో వివాదం మొదలైంది. తిరువనంతపురానికి చెందిన 35 ఏళ్ళ థామస్ అనే ఫాదర్‌పైన కేరళలోని క్రైస్తవ వర్గాలు మండిపడుతున్నాయి. ఇది అనైతికం అంటున్నాయి. తత్వ, మత శాస్త్రాలలో డిగ్రీ చేసిన థామస్ మంచి పెయింటర్ కూడా. దాంతో ఫైన్‌ఆర్ట్స్ కాలేజీకి అప్లయ్‌చేసి ఎంట్రన్స్‌రాసి సీటు సంపాదించాడు. ఆ నాలుగేళ్ల కోర్సు ఫస్ట్‌ర్యాంకులో పాసయ్యాడు కూడా. అతడు తన కోర్సులో భాగంగా స్త్రీలను మోడల్స్‌గా తీసుకుని నగ్నశిల్పాలు రూపొందించడం వివాదమైకూర్చుంది. "సెక్స్‌గానీ, నగ్నత్వంగానీ పాపమని నేను అనుకోవటం లేదు. శిల్పాలు చేసినంత మాత్రాన్న నేను కళంకితుడిని అయిపోను. ఆ మాట కొస్తే సంప్రదాయ క్రైస్తవ చిత్రకారులు కానీ, భారతీయ శిల్పులు కానీ వీటిని నిషిద్ధంగా చూడలేదు. సెయింట్ పీటర్స్ బసిలికాలో ఎన్నో నగ్నచిత్రాలున్నాయి. ఇక సెయింట్ ఫ్రాన్సిస్ ఏకకాలంలో సెయింట్‌గాను, ఆర్టిస్ట్‌గానూ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించారు. అదే పని నేను చేస్తే తప్పెందుకవుతున్నదో అర్థం కావటం లేదు. సరైన మార్గాన్ని సూచించమని భగవంతుడిని ప్రార్థిస్తాను" అని ఆవేదనగా అంటున్నాడు ఫాదర్ థామస్. మొత్తమ్మీద కళాకారుడికి వుండే సహజసిద్ధమైన స్వేచ్ఛకీ, మతం విధించే పరిమితులకీ మధ్యన థామస్ హృదయం నలిగిపోతోంది.



# చిరంజీవి సినిమా విడుదలైతే చాలు స్కూల్ ఎగ్గొట్టిమరీ చూసేవాడిని

## యంగ్‌స్టార్ ఉదయ్‌కిరణ్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

**చా**లా సాదాసీదా కుర్రాడు, తొలి 'చిత్రం' వరకే. ఆ తర్వాత వరుసగా మరో రెండు సినిమాలు. సక్సెస్ మీద సక్సెస్. పరిశ్రమను, ప్రేక్షకులను గుక్క తిప్పుకోనివ్వని హ్యాట్రిక్. ఇప్పుడు ఆ కుర్రాడు సాదాసీదా కాదు, స్టార్. కాలేజీ టీనేజీ కలల కథల ట్రెండ్‌లో కిరణమై మెరిసి తేజమై వెలుగుతున్న ఇ-జనరేషన్ హీరో పేరు ...ఉదయ్‌కిరణ్.



అతడికి అంతకుముందు పరిశ్రమలో కేరాఫ్ లేదు. ఎవరికీ వారసుడు కాదు. అయినా యువతరం హీరోల్లో అతడే నెంబర్‌వన్‌గా నిలబడటం మామూలు విషయం కాదు. చిన్నప్పుడు చిరంజీవి సినిమాల ఇన్స్‌పిరేషన్‌తో ఒక పెద్ద హీరో కావాలని కలలుకన్న ఈ మధ్య తరగతి కుర్రాడు , ఇప్పుడు అగ్రహీరోల సినిమాలకి దీటుగా బిజినెస్ ఇచ్చే సక్సెస్‌ఫుల్ బ్రాండ్‌గా మారాడు. 'నువ్వు నేను', 'మనసంతా నువ్వే' - ఈ రెండు సూపర్‌హిట్లతో సూపర్‌సానిక్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాడు. ఆర్.పి.జి ప్రొడక్షన్స్ చిత్రం ఇప్పుడున్న స్థాయి నుంచి మరింత ఎదిగి, విభిన్న పాత్రలు చేసి 'వర్సటైల్ ఆర్టిస్ట్' అనిపించుకోవాలని కోరిక.

**ఒక సినిమాను ఎంచుకునేటప్పుడు ప్రధానంగా ఏమేం చూస్తున్నారు?**

- ప్రధానంగా కథ విషయంలో జాగ్రత్త పాటిస్తున్నా. ఒక సినిమాకి మరొక సినిమాకి సంబంధం లేకుండా ప్రతి సినిమాలో కొత్తదనం వుండేందుకు ప్రయత్నిస్తున్నా. ఎందుకంటే ప్రేక్షకుడే తెలివైన విమర్శకుడు. కాబట్టి మోనాటనీకి దూరంగా సున్నితమైన విలువలతో రూపొందించే సినిమాల్లో నటిస్తున్నా. ఆ వైవిధ్యం మీకు 'మనసంతా నువ్వే'లో కనిపిస్తుంది.

షూటింగ్‌గ్యాప్‌లో ఉదయ్‌కిరణ్‌తో 'విజయ విహారం' ప్రత్యేక ఇంటర్వ్యూ.....

**ఈ సినిమాకి కృష్ణవంశీ స్క్రిప్టు సమకూర్చారట నిజమేనా?**

- ఇది నేను 'నువ్వు-నేను' సక్సెస్‌కి ముందే ఒప్పుకున్న సినిమా. ఇప్పుడు వరుసహిట్ల తర్వాత స్క్రిప్టు జాగ్రత్తగా పరిశీలించుకోవలసిన అవసరం మరింత పెరిగింది. ఆ కారణంగా దీనికి చాలావరకూ కృష్ణవంశీగారు సహకరించారు. అంతేగానీ పూర్తిగా కాదు.

**భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న అగ్రహీరోల సినిమాలు ఫెయిల్ అవుతున్నా, మీ సినిమాలు వరుసగా హిట్ కొడుతున్నాయి... మీ ఫీలింగ్?**

- నా సక్సెస్‌కి ప్రధాన కారణం టీమ్‌వర్క్ మాత్రమే. కథ, కథనం, టెక్నీషియన్స్ నా సినిమా విజయానికి ప్రధాన కారకులు. నేను ఫార్టీ పర్సెంట్ చేస్తే, మిగిలిందంతా కథ, దర్శకుడు, టెక్నీషియన్‌లదే. నా సినిమాయే కాదు, ఎవరి సినిమా అయినా ఎంచుకునే కథ, చెప్పే పద్ధతి మీద ఆధారపడి వుంటుంది.

**ప్రస్తుతం హీరోగా మీకొక స్థాయి వుంది. దీని కోసం మీరు మొదట్నుంచీ ప్రయత్నించారా?**



- అవునండీ, నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. చిరంజీవి సినిమా విడుదలయిందంటే చాలు, ఆ రోజో, ఆ మరునటి రోజో కచ్చితంగా స్కూలు ఎగ్గొట్టి మరీ చూసేవాడిని. అంతగా ఆయనను ఆరాధించి అలాంటి హీరో కావాలనుకున్నా.

**'మనసంతా నువ్వే' విజయాన్ని మీరు ఎలా ఎంజాయ్ చేస్తున్నారు?**

- రియల్లీ.. ఇట్ టచెస్ ఎవ్రీవన్స్ హార్ట్. చిన్నప్పుడు మనం కలబోసుకున్న ఊహలు, ఆశలు, పెద్దయ్యాక కూడా మనల్ని వీడకపోవడం ప్రతి ఒక్కరి జీవితంలోనూ వుంటుంది. ఆ సున్నితమైన స్పందనలను హృద్యంగా తెరమీద చూపించటంతో ప్రేక్షకులు తమ ఫీలింగ్స్‌ను అందులో వెదుక్కున్నారు. అందుకే 'మనసంతా నువ్వే' అందరి హృదయాల్లో నిలిచిపోయింది.

**'లవర్‌బోయ్' ఇమేజ్‌నుంచి బయటపడే ప్రయత్నం...?**

- (నవ్వుతూ..) బహుశ నేను నా వయసుకి తగిన పాత్రలనే చేస్తున్నాననుకుంటా. అయినప్పటికీ నా మూడు చిత్రాల్లో దేనికదే వైవిధ్యంగా వుంది. 'చిత్రం'లో నటించడానికి అంత స్కోప్ లేదు. అదే 'నువ్వు నేను'లో, 'మనసంతా నువ్వే'లో నా పాత్రలు యాక్షన్‌కి అవకాశమిచ్చాయి. ఇక ముందు రాబోయే చిత్రాలు కూడా ఇంకాస్త డిఫరెంట్‌గా వుంటాయి.

**'చిత్రం' నుంచి 'మనసంతా నువ్వే' దాకా సాగిన పయనం...?**

- 'చిత్రం' సినిమాకి నూతన నటీనటుల కోసం తేజా గారు ఇచ్చిన యాడ్ చూసి అందరిలానే అప్లయ్ చేసి ఇంటర్వ్యూలో సెలక్టయ్యాను. 'చిత్రం' పెద్ద హిట్టయినా నాకు అంతగా పేరు రాలేదు. తర్వాత నిలదొక్కుకోవటానికి సంవత్సరం కష్టపడాల్సివచ్చింది. 'నువ్వునేను' 'మనసంతా నువ్వే' హిట్‌ల తర్వాత వెనక్కి తిరిగి చూడాల్సిన పని లేకుండా పోయింది.

> "అమీర్‌ఖాన్‌లాగా ఒక సినిమాకు మరొక సినిమాకు సంబంధం లేకుండా ప్రతి సినిమా డిఫరెంట్‌గా వుండేందుకు కృషి చేస్తున్నా. ఇటీవల 'లగాన్' చూశాక అటువంటి సినిమా చేయాలనే కోరిక కలిగింది. నటనకు అవకాశం వుంటే నెగెటివ్ రోల్స్ చేయడానికి కూడా వెనుకాడను. ప్రేక్షకులు ఎప్పుడూ వైవిధ్యాన్ని ఆదరిస్తారనే నమ్మకం నాకుంది."

దాంతోపాటు బాధ్యతా పెరిగింది.

**ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటం కష్టంగా అనిపించటం లేదా?**

- లేదండీ, నాకు ఇప్పటికీ ఎవరి గైడెన్స్, బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడం వల్ల నాకు నేనుగా ఇండస్ట్రీలో సర్వైవ్ కావటం నేర్చుకున్నా. ఇండస్ట్రీ టాలెంట్‌ను కొత్తదనాన్ని ఎప్పుడూ ఆహ్వానిస్తుంది. అదనంగా ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ 'ఎసెన్షియల్ క్వాలిఫికేషన్' కాదు.



**కానీ, 'మనసంతా నువ్వే' తర్వాత మీకు కొన్ని బెదిరింపులు వచ్చినట్టు... తర్వాత మీరు నాగార్జునను కలిసినట్టు వచ్చిన వార్త...?**

- మొదట్లో ఏవో కొన్ని బెదిరింపులు వచ్చాయి. కానీ తర్వాత వాటంతటవే సర్దుకున్నాయి. మొదట్లో కొంత కలతచెంది మామూలుగా కలిసినప్పుడు నాగార్జునగారితో మాట్లాడాను. అంతే తప్ప, ప్రత్యేకంగా ఏమీ కలవలేదు. ప్రస్తుతానికి అన్నీ సర్దుకున్నాయి.

**దర్శకుడు తేజాకీ, మీకు మధ్య సంబంధాలు చెడిపోయినట్టు.....?**

- తేజగారు నాకు మార్గదర్శకులు. ఈ మధ్య మేమిద్దరం కలిసినప్పుడు, ఇద్దరికీ అనువైన సమయంలో ఒక సినిమా చేద్దామని తేజగారు అన్నారు. తేజగారు ఎప్పుడు పిలిస్తే అప్పుడు నేను సినిమా చేయడానికి రెడీ.

**రీమాసేన్‌తో రెండు హిట్ సినిమాలు చేయడం తో మీది 'హిట్ పెయిర్'గా నిలిచినట్టుందే?**

- సినిమా హిట్ అనేది తారల మీద ఆధారపడి వుండదు. కథ మీదే ప్రధానంగా ఆధారపడివుంటుంది. రీమాసేన్‌తో మొదటిసారి 'చిత్రం'లో చేసినప్పుడు కొన్ని సన్నివేశాల్లో ఇబ్బందిగా ఫీలయ్యాను. కానీ, 'మనసంతా నువ్వే' చేస్తున్నప్పుడు ఇద్దరం ఒక అండర్‌స్టాండింగ్‌తో చేశాం. ఇప్పుడు మా ఇద్దరి మధ్యా యింటిమసీ పెరిగింది. ఆమెతో చేయడం నాకు చాలా సంతోషంగా వుంది.

**మీరు సినిమా ఫీల్డ్‌లో 'లాంగ్ స్టాండింగ్' కెరీర్‌ను ఆశిస్తున్నారా? లేక సక్సెస్ ఊపులో డబ్బు, పేరు తొందరగా సంపాదించి వెళ్లాలనుకుంటున్నారా?**

- లేదండీ, నాకు డబ్బు, పేరు హడావుడిగా సంపాదించేయాలనే వుంటే ఏదిపడితే అది ఒప్పేసుకునేవాణ్ణి. నా పేరుకున్న ఇమేజ్‌ను క్యాష్ చేసుకునేవాణ్ణి. ఇండస్ట్రీలో 'లాంగ్ పీరియడ్' వుండి డిఫరెంట్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నా.

**సామాజిక ప్రయోజనాన్ని ఆశించి తీసే చిత్రాలలో నటించాలన్న ఆలోచన ఏమైనా వుందా?**

- సహజంగా ప్రేక్షకులు సవాలక్ష సమస్యల నుంచి రిలీఫ్ కోసం, ఎంటర్‌టైన్‌మెంటు కోసం సినిమాకు వస్తారు. అంతేకానీ, భారీ ఉపన్యాసాల కోసమో, సందేశాల కోసమో రారు. నేను సినిమా చూసినా వినోదం కోసమే చూస్తాను. ప్రస్తుతానికైతే నా ఏజ్‌కి తగిన పాత్రల్నే చేస్తాను, తర్వాత ఆలోచిస్తా.

**మీ వాయిస్ మీకు మైనస్ అని భావిస్తున్నారా?**

- ప్రతి సినిమాకూ నా వాయిస్‌ను ఇంప్రూవ్ చేసుకుంటున్నా. 'చిత్రం'కు నేను డబ్బింగ్ చెప్పలేదు. 'నువ్వు-నేను' కంటే 'మనసంతా నువ్వే'లో నా వాయిస్ కొంత ఇంప్రూవ్ అయింది. ఇకముందు మరికొంత ఇంప్రూవ్‌మెంటు కోసం ప్రయత్నిస్తా.

**ఇప్పటి యూత్, కాలేజీ సినిమాలు యువత బలహీనతల్ని క్యాష్ చేసుకుంటున్నాయనేదానిపై మీ కామెంట్?**

- అది కొంత నిజమే. సినిమా అనే బలమైన మీడియా మా చేతిలో వున్నప్పుడు దానిని మేం జాగ్రత్తగా వాడుకోవాలి. సాధ్యమైనంత వరకూ అలానే చూస్తాం. కొన్నిసార్లు పొరపాట్లు దొర్లుతాయి. ప్రేక్షకులు కూడా ఎక్కువగా అటువంటి వాటినే స్వీకరిస్తున్నారు. ఏదేమైనా అలాంటి సినిమాలు మంచిది కాదు. అందుకు భిన్నమైన వాతావరణం. ఉల్లాసభరితమైన



సన్నివేశాలు మీకు 'మనసంతా నువ్వే'లో కనిపిస్తాయి.

**భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?**

- అమీర్‌ఖాన్‌లాగా ఒక సినిమాకు మరొక సినిమాకు సంబంధం లేకుండా ప్రతి సినిమా డిఫరెంట్‌గా వుండేందుకు కృషి చేస్తున్నా. ఇటీవల 'లగాన్' చూశాక అటువంటి సినిమా చేయాలనే కోరిక కలిగింది. నటనకు అవకాశం వుంటే నెగెటివ్ రోల్స్ చేయడానికి కూడా వెనుకాడను. ప్రేక్షకులు ఎప్పుడూ వైవిధ్యాన్ని ఆదరిస్తారనే నమ్మకం నాకుంది.

**అభిమానుల స్పందనకు మీ రియాక్షన్...**

- ప్రేక్షకులు వరుసగా నా మూడు చిత్రాలను ఆదరించి, హిట్ చేసి నాపై మరింత బాధ్యతను మోపారు. ఇది నేను ఊహించలేదు. ఆ ఆనందాన్ని వ్యక్తీకరించలేను. మంచి చిత్రాలుచేసి వారి రుణం తీర్చుకుంటా. అమ్మాయిల నుంచి వచ్చే కాల్స్ తట్టుకోలేక సెల్ ఆఫ్ చేసి పెట్టుకోవాల్సివస్తోంది (నవ్వుతూ..)

**పరిశ్రమ స్లంప్ గురించి ఏమంటారు?**

- మొదటినుంచీ సరైన కథ, ప్లానింగ్, టెక్నీషియన్స్ టీమ్ వర్క్ వుంటే, ఎలాంటి సినిమా అయినా హిట్టవుతుంది. ఇప్పుడు హీరో ఎవరనేది ప్రేక్షకులు ఆలోచించటం లేదు. మంచి సినిమాను ఆదరిస్తున్నారు. అంతే.

**మీ కెరీర్‌లో తలిదండ్రులు సహకారం ఎలా వుంది?**

- మా అమ్మ గృహిణి. నాన్న ప్రభుత్వోద్యోగి. ఎవరి పనులు వాళ్లు చేసుకుంటూనే, నాకు అన్ని వేళలా మానసిక స్థైర్యాన్ని చేయూతను అందిస్తున్నారు.

**ఇక ముందు చేయబోయే ప్రాజెక్టులు..**

- వచ్చిన ఆఫర్స్‌లో సెలెక్టివ్‌గా ఎన్నుకుంటున్నాను. ప్రస్తుతానికి ఆర్.పి.జి ప్రొడక్షన్స్ చిత్రం, సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ చిత్రం, శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ చిత్రం చేస్తున్నాను. అంతే...

ఇంటర్వ్యూ: కె.క్రాంతికుమార్



# తెలుగు ప్రేక్షకుడికి జీర్ణంకాని ఉన్మాదం

ఇదొక 'సైకో' సినిమా! సారీ సైకిక్‌గా మారిన ఓ వ్యక్తి సినిమా! కథ మొత్తం ఉన్మాది కమలహసన్‌దే! (మళ్ళీసారీ! ఉన్మాదం కమల్‌కి కాదు 'అభయ్' పాత్రకి) చుట్టు తిరుగుతుంది.

అభయ్ ఒక మానసికరోగి. ('స్కిజోఫ్రెనియా' దానిపేరు) కాదు తెలివైన పిచ్చివాడు. కాదు కాదు పిచ్చిపట్టిన తెలివైన వాడు (ఏంటీ! అంతా తికమకగావుంది). ఇలాంటి సినిమాలో కథ కోసం వెతకటం పిచ్చి'తనం. కమల్ తెలివిగా 'స్కిజోఫ్రెనియా'ని నమ్ముకున్నాడు. ఎందుకంటే ఈ మానసిక రోగం గురించి, రోగి చేష్టల గురించి ఇదమిద్ధంగా చెప్పడం కష్టం.

ఎలాగైనా ప్రవర్తించే అవకాశం వుంది. పిచ్చిపిచ్చిగా నటించే అవకాశం ఎక్కువ. అయితే పాత్ర (అభయ్)తో పాటు స్క్రిప్టుకి కుడా 'స్కిజోఫ్రెనియా' పట్టటం వల్ల సినిమా అర్థం పర్థం లేకుండా తయారయ్యింది. ఈ సినిమాలో గ్రాఫిక్స్ చాలా బావున్నాయి. అయితే వాటి మధ్య అనేక పిచ్చి(ఏంటోమళ్ళీ కన్ఫ్యూజనూ) సన్నివేశాలు- అభయ్ వున్న సన్నివేశాలు ఎక్కువగా ఉండటం వల్ల మానసిక స్థిమితంగల మంచి సన్నివేశాలు కనపడకుండా పోయాయి. కమల్‌హాసన్ బాగా నటించాడా లేదా అన్నది కూడా చెప్పటానికి అవకాశం లేదు. ఎందుకంటే భారత సినిమా చరిత్రలో ఇలాంటి పాత్రలు తక్కువే. ఒకవేళ పోలిస్తే హాలీవుడ్‌తో పోల్చాలి. అది కష్టం. నిజం చెప్పాలంటే (ఇంతకుముందువన్నీ అబద్ధం అనికాదు)ఒకటి రెండు సీన్లు చాలా క్రియేటివ్‌గా వున్నాయి. ముఖ్యంగా మనీషాను కమల్ చంపే సీను- అలాగే అభయ్‌తల్లి కనపడే ఊహాత్మక సన్నివేశాలు...కాని సినిమా మొత్తం గందరగోళంగాను, కొండొకచో అసహజంగాను వుంది. ఈ సినిమాలో నెగిటివ్ పాత్రలు అనేకం వున్నాయి (అభయ్, అతని తండ్రి, సవతి తల్లి...)కథ కొంతవరకు ఫ్లాష్‌బ్యాక్ సహకారంతో నడుస్తుంది. సినిమా ప్రారంభంలోనే కమల్ (ఒక కమాండర్) కిడ్నాపర్‌ల బారి నుంచి కొంతమందిని రక్షించటంతో ఆసక్తి కరంగా మొదలై చివరకు పేలవంగా ముగుస్తుంది. అభయ్, విజయ్(కమల్‌హాసన్) కవలలు, చిన్నతనంలో తల్లి చనిపోగా సవతి తల్లి (గిద్వానీ) బారిన పడతారు.




తండ్రి (మిలింద్ గుణాజీ) కూడా పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తాడు దాంతో విజయ్ మేనమామతో పాటుఢిల్లీ వెళ్ళిపోయి బాగుపడితే, అభయ్ సవతితల్లి చేతిలో హింసలుపడి సైకోగా మారతాడు. వర్తమానంలో విజయ్, రవీనాలు పెళ్ళి చేసుకుంటున్నామని జైలులో వున్న (అప్పటికీ స్త్రీ ద్వేషిగా మారిన) అభయ్‌కి చెప్తాడు.దాంతో అభయ్ జైలు నుంచి తప్పించుకుని రవీనాను చంపి విజయ్‌ను కాపాడాలనుకుంటాడు. అక్కడి నుంచి కథ గతి తప్పి ఎటో వెళ్ళిపోయింది. అభయ్ రవీనాను చంపటానికి ప్రయత్నించి విఫలం కావటం- చివరికి తల్లి పిలవగా రవీనాను చంపే ఉద్దేశ్యం మానుకుని తానే ఆత్మాహుతి చేసుకోవటంతో సినిమా ముగుస్తుంది. ఇందులో అనేక పిచ్చి సన్నివేశాలు వున్నాయి. అసహజమైన సన్నివేశాలు వున్నాయి. జైల్లో వున్న కమల్‌కి సిటి మొత్తం కొట్టిన పిండి -జైలు నుంచి తప్పించుకోవటానికి వేసిన ప్లాను గురించి పిల్లలకు కూడా తెలుస్తుంది. పాపం పోలీసులకు తెలియదు. ఇంక రవీనాను చంపే ప్రయత్నంలో విజయ్‌ని కూడా చంపాలనుకోవటం ఏంటి మరి! మనీషాను చంపటం కమల్ పిచ్చితనాన్ని చూపించటానికేనా? చివర్లో అభయ్ తల్లి (ఇమాజినేషన్) సవతి తల్లి రవీనాలో లేదని- తన దగ్గరే వుందని చెప్పటంతో ఆమెని చంపటానికి బయదేరేముందు 'రవీనా'కి సారీ చెప్పమని విజయ్‌తో చెప్పటం స్కిజోఫ్రెనిక్ సెన్సాఫ్ హ్యూమరా? ఇందులో నటించటానికి అవకాశం వున్న పాత్రలు తక్కువ. 'మంచి' కమల్‌కి కూడా స్కోప్ లేదు. సవతి తల్లిగా కిట్టూ గిద్వానీ ఫరవాలేదు. ఇందులో హిందీ నటులు ఎక్కువ వుండడం విశేషం. (ఎందుకో) సైకో సినిమాల్లో వుండాల్సిన సంగీతం ఇందులో లేదు. తేలిపోయింది. స్క్రీన్‌ప్లేలో పస లేదు. మనీషా కొంతసేపే వున్నా 'నటించింది'. రవీనా టాండన్‌కి ఎక్కువ స్కోప్ లేదు. అభయ్ సినిమా ద్వారా ఏం చెప్పాలన్నదీ దర్శకుడు ఒక పట్టాన తేల్చుకోలేకపోయాడు. పిచ్చివాడిగా కమల్ నటించలేకపోవడానికి స్క్రీన్‌ప్లే కారణం. సినిమాలో స్పెషల్ ఎఫెక్ట్స్ బావున్నాయి. అయితే సినిమా వేగానికి సహకరించవు. 'పిచ్చి' సినిమాలు తీసేప్పుడు తెలివిగా వుండాలి. ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. క్రియేటివిటీ వుండాలి. అవన్నీ లేకపోతే సినిమాకే పిచ్చి పడుతుంది. ఇందులో అలాగే జరిగింది. దర్శకుడు, స్క్రిప్టు రైటర్ ఇద్దరూ ఫెయిలయ్యారు. ఓ సాధారణ పిచ్చి సినిమా తీసుకున్నారు. ఎంతో ఎక్స్‌పెక్టేషన్స్ వున్న 'అభయ్' విఫలమయ్యాడు.

\- సి.ఎస్

మనసు మర్మాన్ని మాటల్లో ఆత్రేయ ఎంత గొప్పగా చెప్పగలడో -బాలచందర్ అంతగొప్పగానూ తెరపై చూపించగలడు. దీనికి ఉదాహరణగా- గుప్పెడుమనసు, అంతులేనికథ, ఇదికథకాదు, ఆకలిరాజ్యం...ఇలా చెప్పడానికి చాలా సినిమాలే వున్నాయి. బాలచందర్‌తో పాటు ఆయన మనసెరిగిన ఆత్రేయ, గణేశ్‌పాత్రో, ఎం.ఎస్. విశ్వనాథన్... వీళ్లు కలిశారంటే ఓ గొప్ప సినిమా ప్రాణం పోసుకున్నట్టే. ఈ ఫ్లాష్‌బ్యాకంతా ఎందుకంటే- సినిమాని ఒక యజ్ఞంలా భావించే అతి కొద్దిమంది దర్శకుల్లో ఒకరైన బాలచందర్- తన ఇమేజిని పూర్తిగా తుడిచిపెట్టే 'పరవశం' లాంటి పరమ నాసిరకం సినిమాని-అదీ నూరవ సినిమాగా మీడియాలో ఢంకా బజాయించి- ఎలా, ఎందుకు తీశాడా అనేది అర్థం కాకనే!

బాలచందర్ సినిమాల్లో స్క్రీన్‌ప్లే చాలా పకడ్బందీగా వుంటుంది. కథని ఎమోషనల్ ఫోర్స్‌తో అర్థంగా చెప్పగల దిట్ట. ఇదంతా ఆయన వెనకటి సినిమాల సంగతి. ఈ సినిమా మాత్రం ఇందుకు పూర్తిగా మినహాయింపు. ప్రేక్షకుడు ఉస్సురనకుండా ఒక్క నిమిషం కుదురుగా కూర్చోవడం చాలా కష్టం. కారణం- రెండున్నర గంటల రీళ్లను సాగదీసేందుకు- ఎక్కడికక్కడ అర్థంపర్థం లేని సీన్లను అతికించుకుంటూపోయినట్టే వుంటుంది సినిమా అంతా. ఇంతకంటే దీన్ని సీరియల్‌గా విరగ్గొట్టి- ఏ చానెల్లోనో వారానికో ముక్క చూపించుకుంటే కాస్త పరువైనా దక్కేది. ఇంత అసందర్భమైన, అబ్సర్డ్ స్క్రీన్‌ప్లేను ఎందుకు పట్టుకుసాగదీశాడో అర్థం కాదు.

మరో సంగతి. బాలచందర్ సినిమాల్లో హీరోయిన్‌లు కేవలం కదిలే బొమ్మలు కావు. ఆ పాత్రలకి కాస్త రక్తమాంసాలుంటాయి. అవసరమైతే సంఘాన్ని, సంప్రదాయాల్నీ ఎదిరిస్తాయి. పోరాడే తెగింపూ, ధైర్యం కలిగివుంటాయి. సరిత, జయసుధ, జయప్రద, మాధవి...వీళ్ల సినీ కెరీర్‌ని మలుపు తిప్పిన గొప్ప కేరెక్టర్లు బాలచందర్ సృష్టే...కాని ఈ సినిమాలో ఇదేమీ కనిపించదు.

ఇక ఈ సినిమా ఆసాంతం ఓపిగ్గా చూశాక- కొద్ది సేపు జుట్టుపీక్కుంటే మనకు అర్థమయ్యే కథేమిటంటే-పెళ్లి, అపార్థం, విడాకులు, మళ్లీ కలవడం. ఇలాంటి 'శోభన్‌బాబు-అపార్థాల సంసారం' మార్కు కథలు చూసి చూసి బెంబేలెత్తివున్నారు తెలుగువాళ్లు. ఇంత అధ్వాన్నమైన బేస్‌లైన్‌ని ఎంచుకున్నది- మూడేళ్ల గ్యాప్ తర్వాత, నూరవ సినిమాగా తీసిన- బాలచందరేనా అన్నది పెద్ద ఆశ్చర్యార్థకం.

మొగుడి ప్రవర్తన నచ్చకుంటే విడిపోయే ందుకు స్త్రీకి పూర్తి హక్కువుంది. దాన్ని ఎవరూ కాదనలేరు. కాని నచ్చకపోవడానికి ఎదుటివైపు బలమైన కారణమంటూ ఒకటుండాలి కదా! కాని ఈ కథలో భార్యాభర్తలు విడిపోవడానికి ఏమాత్రం రీజనింగ్ కనబడదు.

మాధవన్ డాక్టర్. ఒకేఒక్క సిన్మాలో నటించి ఆడపిల్లలు ఎగబడేంత పాపులారిటీ తెచ్చుకున్న యాక్టర్ కూడా. వెంటపడే అమ్మాయిల బాధ పళ్లేక సిమ్రాన్‌ని ఇల్లాలిగా చేసుకుంటాడు. ఉన్నట్టుండి ఓ లండన్ అమ్మాయి పిల్లాడితో వచ్చి వాడికి తండ్రి మాధవనే అని బాంబులాంటి నిజాన్ని పేల్చడం కథలో పెద్ద ట్విస్టు. ఎప్పుడో కాలేజ్ డేస్‌లో జరిగిన ఆ తప్పును మాధవన్ కూడా నిజాయితీగా ఒప్పుకుంటాడు కూడా. కాని సిమ్రాన్ వెర్రి ఆవేశంతో రెచ్చి పోయి తాళినీ, కట్టుకున్న చీరనీ బజార్లోంచే

## బాలచందర్‌కి ఏమైంది?




మాధవన్ మొహాన కొట్టి వెళ్లిపోతుంది. ఇక్కడ సిమ్రాన్ ఆవేశానికి ఏమాత్రం అర్థం కనిపించదు. 'నేనొచ్చింది చూసెళ్దామనే తప్ప సెటిలైపోదామనని కాదు' అని ఆ వచ్చినావిడ చెబుతున్నా, 'జరిగింది ఎప్పుడో అయినా నా తప్పు తప్పే' అని మాధవన్ నిజాయితీగా ఒప్పుకున్నా- సిమ్రాన్ అంత హార్ష్‌గా రియాక్ట్ కావడం మూర్ఖత్వమే అనిపిస్తుంది. పోనీ విడిగా వుంటారా అంటే అదీ లేదు. ఆమెను ఒంటరిగా వుండలేని బేలగా చూపించాడు దర్శకుడు. భార్యాభర్తలుగా విడిపోయినా- ఇద్దరూ 'మంచి' ఫ్రెండ్స్‌గా మళ్లీ దగ్గరవుతారు.ఇద్దరిదీ ఎంత ఔదార్య మంటే-సిమ్రాన్‌కి వేరే పెళ్లి చేయాలని మాధవన్, అతడికి వేరే పెళ్లి చేయాలని సిమ్రాన్ ప్రయత్నాలు చేస్తారు. మళ్లీ ఒక్కటౌదామని ఇద్దరూ అనుకుంటేపోయేదానికి ఎందుకింత నాన్చుడు, అర్థంలేని ఔదార్యాలు అనిపిస్తుంది. ప్రధానకథలో డాన్స్‌మాస్టర్ లారెన్స్‌దో పిట్టకథ అతడి డాన్సంటే సిమ్రాన్‌కు చచ్చేంత ఇష్టం. అది చూసే మాధవన్- వారిద్దరికీ పెళ్లి చేయాలనుకుంటాడు. ఇవన్నీ తప్పిపోతాయని, చివరి రీల్లో హీరో, హీరోయిన్లు మళ్లీ ఒక్కటౌతారని ప్రేక్షకుడు ఊహించినట్టే జరుగుతుంది. విడిపోవడానికీ, కలవడానికీ మధ్య రెండున్నర గంటల సాగతీత...

ఈ సినిమాలో మరో దారుణమైన సంగతి- శరీరం రంగుమీద బాలచందర్ వేసిన క్రూడ్ జోక్... లారెన్స్, అతడి కుటుంబ సభ్యులందర్నీ నల్లవాళ్లుగా చూపించడం, ఎర్రరంగు పిల్ల అచ్చిరాదని మాటి మాటికీ చెప్పించడం... లారెన్స్ కారెక్టర్‌కి 'అందం' అని పేరుపెట్టడంలో పచ్చి వెటకారం కనిపిస్తుంది.

రహ్మాన్ ట్యూన్లలో ఆర్కెస్ట్రైజేషన్ శృతి మించింది. అయినా పాటల్లోని సాహిత్యం వినిపించకపోవడమే మేలేమో! 'మన్మథమాసం' పాట అరిగి, అరిగి, పాటంతా ఆ ఒక్కమాటే అయినట్టు వినిపించి సహనాన్ని పరీక్షిస్తుంది. చివరికి పెళ్లి సీన్లో వినిపించే క్లాసికల్ కమ్ వెస్టన్ బీట్‌కి రోబోల్లా ఆర్టిస్టుల డాన్సు కూడా డిటో... సినిమాకంతా లారెన్స్ మూడు నిమిషాల 'ఫ్యూజన్ డాన్స్' హైలైట్.

మాధవన్ ముఖం సినిమా అంతటా, అన్ని సన్ని వేశాల్లో ఒకే ప్రింటులా వుంటుంది. సన్నివేశానికి, ఎమోషన్స్‌కి తగ్గ వేరియేషన్ కనిపించదు. ఎమోషనల్ సీన్లలో సిమ్రాన్ అంతగా నటించాల్సిందికాదు. మెడనరాలు పెటీల్మని పేలిపోతాయా అన్నంత ఇదిగా ఉబ్బించి, ముక్కును ఎగజీత్తూ మాటల్ని విరిచేసే అభినయం బాలచందర్‌కే నచ్చివుంటుంది. సిమ్రాన్ ఎంతో కష్టపడ్డ ఈ సీన్లను మినహాయిస్తే ఆమె నటన ఫరవాలేదు.

ఈ సినిమాచూసి బయటపడుతుంటే గేటుదగ్గర ఓ ప్రేక్షకుడు విసిరిన ఓ కామెంట్ " బాలచందర్‌కి ఏమైంది?"-అని. అందరి ఫీలింగూ ఇదే.

దీనికి జవాబు చెప్పాల్సింది ఆయనే.

\- గోపి

ఈ సినిమాలో చెప్పుకోవడానికేమీ లేదు. కనీసం రాజేంద్ర ప్రసాద్ కామెడీ గురించి కూడా...ఆయనకే ప్రత్యేకమైన మేనరిజంతో, కామెడీతో ప్రేక్షకుల్ని థియేటర్లకి లాక్కొచ్చే సత్తా వున్న నటుడాయన. ఈ సినిమాలో అవేవీ మచ్చుకి కనిపించవు. పైగా ఆయన నటించిన కొన్ని సన్నివేశాలు పరమబోర్ కొట్టించేవిగా వున్నాయి. తాను అనుకున్నపని కానప్పుడల్లా -చిన్నపిల్లాళ్లు జడుసుకునేలా- బ్‌బ్‌బ్ వావావాఆఆఆ... అంటూ ఇంత పొడుగు రాగం తీస్తూ ఏడుపు లంఘించుకోవడం...ఏరకం మేనరిజమో తెలీదుకానీ- ఈ సినిమాతో ఆయనకి మిగిలేది ఇదేనని సింబాలిగ్గా అనుకోవచ్చేమో!

ఈ మధ్య 'రాయలసీమ' మార్కు హత్యలు, ముఠాల కథలు హిట్ అయ్యేసరికి సినిమాలకి కథలు రాసేవాళ్లకి ఆ పైత్యం బాగా ఆవహించింది. ఈ సినిమాకి కథా రచయితగా టైటిల్స్‌లో పేరు వేసుకున్నాయనకి (ఉదయరాజ్) కూడా ఇది అంటుకున్నట్టుంది. కథకి ఎక్కడా తలా, తోకా లేదు.

తలమంచి అనే ఊరిపెద్ద శేషాద్రి నాయుడు (రంగనాథ్)... ఆయనకి ఇద్దరు తమ్ముళ్లు. ఊఅంటే న...రి...కి పారేస్తాము ంటూ లావాటి కత్తులుచ్చుకొని ఎగబడుతుంటారు. ఊరంతటికీ ఆయన చెప్పిందే న్యాయం. లేదంటే చంపేస్తారు. ఇలాంటి తుక్కు ఎప్పుడు వదులుతుందో తెలుగుసినిమాలకి!

## కామెడికింగ్‌కి ఇదో ట్రాజెడీ...

శేషాద్రికి ఓ గారాల కూతురు (భావన). ఊళ్లోని ఆడపిల్లల్ని వెంటేసుకొని, ఊరి సందులు, గొందుల్లో ఎగిరే ఆ పిల్ల అన్నమానం నవ్వుతూనేవుంటుంది. సినిమా పేరుని జస్టిఫై చేయడానికే అలా-చేయిం చాడేమోగాని- ఆమెకు నవ్వడం వచ్చో లేదో చూసుకున్నట్టులేదు దర్శకుడు జ్యోతికుమార్. అలాంటి ఊళ్లోకి హిందీ మేష్టారి ఉద్యోగాన్ని వెతుక్కుంటూ వస్తాడు హీరో సుందరం . ఆ కాలేజీ పైన చెప్పిన ఆసాములదేననీ, పెద్దింటి అమ్మాయి అదే కాలేజీలో చదువుతుందనీ చెప్పక్కర్లేదేమో! పెద్దాయన పుట్టినరోజు ఫంక్షన్‌లో ఓ పాటపాడి, పాడుతూ డాన్సు చేసి- హిందీ మేష్టారు ఉద్యోగం దక్కించుకుంటాడు. అమ్మాయి తన మానాన తాను నవ్వుకుంటే- తన్ని చూసే లవ్వుతో నవ్విందని అనుకుంటాడు సుందరం. అదే భ్రమలో ఆమె వెంటపడతాడు. అది చూసిన పెద్దాయన- చేతనైతే నా కూతుర్తో 15 రోజుల్లో ఐలవ్యూ అనిపించు... లేదంటే నీ బాడీని పదహారు ముక్కలు చేస్తానని హుంకరిస్తాడు.

తనకిష్టమైన వాడిని పెళ్లి చేసుకుందన్న కోపంతో స్వంత చెల్లినే ఇంట్లోంచి వెళ్లగొట్టిన ఘనత అతగాడిది. అలాంటిది సుందరాన్ని ఏమీ అనకుండా- 15రోజుల పర్మిషన్ ఇవ్వడంలోని తలతిక్కతనం బొత్తిగా అర్థం కాదు.




హీరోయిన్ ప్రేమకోసం సుందరం నానా తంటాలు పడ్డం, నవ్వు నా మేనరిజం తప్ప నీమీద లవ్వుతో కాదని ఆమె ఛీకొట్టడం, అమ్మాయి తండ్రి డెడ్‌లైన్ దగ్గర పడేకొద్దీ భయంతో ఉడాయించేందుకు ట్రైచేయడం ... ఇలా సినిమా సా...గు...తూ పోతుంది.

ఇంట్లోంచి వెళ్లిపోయిన చెల్లెలుగా చివరి రీల్లో జయసుధ హఠాత్తుగా ఊడిపడుతుంది. కాని అప్పటికే సుందరం ఆమె కొడుకుగా చెప్పుకొని - శేషాద్రి ఇంట్లో మేనల్లుడి మర్యాదను పొందడం, జయసుధ రాకతో నిజం తెలిసి కొంత గందరగోళం, చివరికి కథ సుఖాంతమే కావడం... దీన్ని కథలో గొప్ప ట్విస్టనుకుంటే కథకుడి, దర్శకుడి పట్ల జాలిపడాల్సిందే.

అంతకంటే జాలిపడాల్సింది రాజేంద్ర ప్రసాద్‌ని చూసి...ఇలాంటి కథకి ఆయన ఎలా తలూపాడా అని!? రోజువారి జీవితంలో మనం చాలా కాజువల్‌గా మాట్లాడుకునే మాటలు, చేసే పనుల్ని- సన్నివేశాలుగా మలిచిన సినిమాలు (నువ్వు నాకు నచ్చావ్, నువ్వు నేను, నువ్వేకావాలి) ఈమధ్య జనాన్ని ఎంతగా ఆకట్టుకున్నాయో! అలాంటిది- రాజేంద్ర ప్రసాద్ సినిమా అంటే- వేరే చెప్పాలా? సీను సీనుకీ ఏదో కామెడీని ఎక్స్‌పెక్ట్ చేస్తారు అభిమానులు. కాని డైలాగుల్లోకానీ, సిట్యుయేషన్‌కు సంబంధించి కానీ ఒక్కటీ అలాంటి సీను లేదు.

ఎల్.బి. శ్రీరాం గొలుసుకట్టు డైలాగుల కామెడీ సెపరేట్ ట్రాక్‌లో నడుస్తుంది. మొదట్లో ఒకటి రెండు బిట్లు సరదాగానే వున్నా పోను పోనూ సహనానికి పరీక్షగానే వుంటాయి. బ్రహ్మానందం, ఎమ్మెస్‌లది చాలా రొటీన్... హీరోయిన్ భావనని మొదటి సిన్మాగా భావించి వదిలేయాల్సిందే. శ్రీలేఖ సంగీతం, ట్యూన్లు వినడానికి బాగున్నాయి. కథలో పసలేకున్నా- కేవలం డైలాగుల్లో సెటైర్, కామెడీతో సినిమాలు(నువ్వు నాకు నచ్చావ్) హిట్ కొడుతున్నాయ్. ఈ సంగతి మాటల రచయిత జలదంకి సుధాకర్ గమనిస్తే మంచిది. నిస్సారంగా వున్న ఈ సినిమాలో - దర్శకత్వం గురించి కూడా చెప్పుకోవడం దండగ.

సైడ్‌రోల్స్ (డాడీలో...) స్థాయికి దిగజారుతున్న కామెడీకింగ్ గారూ! కథ, కథనం చూసుకోకుండా వేషం దొరికింది కదాని వేసేస్తే...కెరీర్ కామెడీ ట్రాక్‌నుంచి పట్టాలు తప్పే ప్రమాదం వుందని గమనిస్తారా?

\- వంశీ

